# Manucharitra: Vyaktitva Vikāsam

A dissertation submitted to the University of Hyderabad

In partial fulfilment of the degree of

Master of Philosophy

In

Telugu

Researcher

Garikipati Gurajada

Department of Telugu

School of Humanities

University of Hyderabad

Hyderabad- 500046, Telangana, India

June - 2015

# మనుచరిత్ర : వ్యక్తిత్వ వికాసం

ఎం. ఫిల్ పట్టం కోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి

సమర్పించిన పరిశోధన వ్యాసం

పరిశోధకుడు

గరికిపాటి గురజాడ

తెలుగుశాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు- 500046

జూన్- 2015

# DECLARATION

I, **Garikipati Gurajada** hereby declare that this dissertation entitled **Manucharitra: Vyaktitva Vikāsam** submitted by me under the guidance and supervision of Dr. Pillalamarri Ramulu is a bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that this dissertation can be deposited in shodhganga / INFLIBNET.

Signature of the Student

Date: Name: Garikipati Gurajada

Registration No. 14HTHL12

# CERTIFICATE

This is to certify that the dissertation entitled **Manucharitra: Vyaktitva Vikāsam** submitted by **Mr. Garikipati Gurajada,** bearing Reg. No. 14HTHL12 in partial fulfilment of the requirements for the award of Master of Philosophy in Telugu is a bonafide work carried out by him under my supervision and guidance.

This dissertation has not been submitted previously in part or full to this or any other University or Institution for the award of any degree or diploma.

Dr. Pillalamarri Ramulu

(Research Supervisor)

Head

Department of Telugu

Dean

School of Humanities

తాము ఎవరో తెలుసుకునే క్రమంలో తమని తాము మర్చిపోయి, తమ జీవితసర్వస్వాన్ని

జ్ఞాన సముపార్జన కోసం అర్పించిన

భారతీయ తత్త్వవేత్తలకి

ఈ పరిశోధన అంకితం.

# i. కృతజ్ఞతలు

నా తప్పులని క్షమించి, పరిశోధనకి సంబంధించిన ప్రాథమికమైన విషయాలను సైతం నాతో చర్చించి, ఈ పరిశోధనవ్యాసాన్ని రాసే క్రమంలో నా భావాలకు పూర్తి స్వేచ్ఛ, పరిశోధన పట్ల నాకున్న దృక్కోణాన్ని సరైన దిశగా మరల్చి, ఈ పరిశోధనకి పర్యవేక్షకత్వం వహించిన నా గురువు డా. **పిల్లలమర్రి రాములు** గారికి సవినయంగా, సభక్తికంగా నమస్కారాలు, కృతజ్ఞతలు.

అయిదేళ్లుగా నాకు జీవిత పాఠాలు నేర్పిస్తూ, విశ్వవిద్యాలయంలో నా ప్రగతికి దోహదం చేసిన తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికీ, ఆచార్య శరత్ జ్యోత్స్నారాణిగారికీ నా నమస్సులు.

విద్యార్థిగా నేను మరింత పరిణతి చెందాలని ఎప్పుడూ తపించే గురువులు ఆచార్య గడ్డ అరుణకుమారిగారికీ, ఆచార్య రేమిళ్ళ వేంకటరామకృష్ణ శాస్త్రిగారికీ నా ప్రణతులు.

ఎప్పుడు కనిపించినా నన్ను పిలిచి, ‘ గురజాడా! ఎంతవరకు వచ్చింది పరిశోధన?’ అంటూ నా పరిశోధన గురించి నాతో ఓపికగా చర్చించే అధ్యాపకులు డా. దార్ల వెంకటేశ్వరరావుగారికీ, డా. పమ్మి పవన్ కుమార్‌గారికీ, డా. బాణాల భుజంగరెడ్డిగారికీ, డా. డి. విజయకుమారిగారికీ కృతజ్ఞతాపూర్వక నమస్సులు.

నాకు రెండేళ్ళు పాఠాలు చెప్పి, నేను బాగుండాలని మనసారా కోరుకునే ఆచార్య నడుపల్లి శ్రీరామరాజుగారికీ, డా. డి. విజయలక్ష్మిగారికీ నా కైదండలు.

చిన్నప్పటి నుంచి నా భవిష్యత్తు గురించి మా నాన్నతో చర్చిస్తూ ఈ విశ్వవిద్యాలయంలో చదివిస్తే బాగుంటుందని నాన్నకి సలహానిచ్చి, నాకు దిశానిర్దేశం చేసిన ఆచార్య బేతవోలు రామబ్రహ్మంగారికి నా నమోవాకాలు.

నాకు అయిదేళ్ళ క్రితం తెలుగు వ్యాకరణాన్ని, ఛందస్సుని ఎంతో ఆసక్తికరంగా బోధించి, వేరే శాఖకు మారినా నన్ను మర్చిపోని గురువు డా. అద్దంకి శ్రీనివాస్ గారికి ప్రత్యేక కైమోడ్పులు.

నాకు ఓర్పుని, సహనాన్ని అలవర్చి, నాలో ఉన్న లోపాలను ఎప్పటికప్పుడు సరిచేస్తూ, నిస్వార్థంగా జీవించడమే వ్యక్తిత్వ వికాసం అని తన జీవితం ద్వారా నాకు బోధించిన మా అమ్మ **గరికిపాటి శారద**కి ఎల్లప్పుడూ ఋణపడి ఉంటాను.

జన్మించిన క్షణం నుంచి తెలుగు మాటలే నాకు వినిపించేలా చేసి, తెలుగు భాషపై మక్కువ పెంచి, అతి చిన్న వయస్సులోనే వేమన, సుమతీ శతకాల్లోని పద్యాలు నా చేత కంఠస్థం చేయించి, నా వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్ది, ప్రాచీన సాహిత్యాన్ని ఆధునిక దృష్టితో చూడవచ్చుననే ప్రేరణను నాకు కలిగించి, '*మనుచరిత్ర : వ్యక్తిత్వ వికాసం*' అనే ఈ పరిశోధనవ్యాసానికి స్ఫూర్తిగా నిలిచిన నా సర్వస్వం మా నాన్న మహాసహస్రావధాని, ధారణాబ్రహ్మరాక్షసుడు **డా. గరికిపాటి నరసింహారావు** గారు. ఎన్ని జన్మలెత్తినా వారి ఋణాన్ని తీర్చుకోలేను.

తన అనుభవాలను నాతో పంచుకుని, మౌనంగా ఉండడంలో ఉండే గొప్పతనాన్ని నాకు నేర్పించిన మా అన్నయ్య గరికిపాటి శ్రీశ్రీకీ, నేను ఈ విశ్వవిద్యాలయానికి రావడానికి ప్రేరణగా నిలిచి, చదువులో నాకు స్ఫూర్తినందించి, నాపై నాకు విశ్వాసాన్ని పెంచి, ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చేసే దిశగా నన్ను ప్రోత్సహించి, నా నడవడిక ఎప్పుడూ తడబడకుండా చూస్తూ, నా మార్గాన్ని సరిచేస్తూ, ఎప్పుడూ నా ఎదుగుదలనే కాంక్షిస్తూ, నన్ను సొంత తమ్ముడిగా భావించే అన్నయ్య గంగిశెట్టి లక్ష్మీనారాయణకీ (పరిశోధక విద్యార్థి), నా బాధ్యతలను నాకు ఎప్పుడూ గుర్తుచేస్తూ, ఏడాది పాటు నాతో ఉండి, నన్ను ప్రోత్సహించి, పరిశోధనవ్యాసం రాసే క్రమంలో చక్కని సూచనలు, సలహాలు ఇచ్చి, ఈ పరిశోధనకి తుది మెరుగులు దిద్ది, తన విలువైన సమయాన్ని నా కోసం వెచ్చించిన అన్నయ్య మల్లిపూడి రవిచంద్రకీ హృదయపూర్వక కృతజ్ఞతలు.

వ్యక్తిత్వ వికాస కోణంలో ఒక చక్కటి పరిశోధన చేసి నాకు ధైర్యాన్ని ఇచ్చిన అన్నయ్య మల్లెగోడ గంగాప్రసాద్ చేసిన మేలు ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

వినూత్నమైన పరిశోధనలు చేస్తూ హైదరాబాదు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ కీర్తిని దశదిశలా వ్యాపింపజేస్తున్న ఎం. ఫిల్., పిహెచ్. డి. పరిశోధక మిత్రులని ఎప్పుడూ మరువలేను.

తెలుగు శాఖ కార్యాలయంలో పని చేసే సిబ్బంది భవానీశంకర్‌గారికీ, రాంబాబు అన్నయ్యకీ, గణేష్‌గారికీ, పుస్తకాల సేకరణలో సహకరించిన హైదరాబాదు విశ్వవిద్యాలయం గ్రంథాలయ సిబ్బందికీ నా కృతజ్ఞతలు.

ఎన్నో అనుభవాలను నాకు అందించిన హైదరాబాదు విశ్వవిద్యాలయానికీ, యాజమాన్యానికీ ప్రత్యేక ధన్యవాదాలు.

నా వ్యక్తిత్వాన్ని నిర్మించడంలో కీలకమైన పాత్ర పోషించిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ABVP)కీ, కార్యకర్తలకీ మనఃపూర్వకంగా ధన్యవాదాలు.

నా పరిశోధనకి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన వారందరికీ చివరిగా కృతజ్ఞతలు.

**గరికిపాటి గురజాడ**

# ii. సంకేతాలు: వివరణ

| | |
|---|---|
| *ఆది.* | = ఆది పర్వం |
| *ఆముక్త.* | = ఆముక్తమాల్యద |
| *కావ్య.* | = కావ్య పరిమళము |
| *కాశీ.* | = కాశీఖండం |
| *కుమార.* | = కుమారసంభవం |
| *గైర్వాణీ.* | = గైర్వాణీ విలాసః |
| *చమత్కార.* | = చమత్కార చంద్రిక |
| *చూ.* | = చూడండి |
| *ప్ర. స్క.* | = ప్రథమ స్కంధం |
| *భాగవతం.* | = శ్రీమదాంధ్రమహాభాగవతము |
| *భామినీ.* | = భామినీవిలాసం |
| *భారతము.* | = శ్రీమదాంధ్రమహాభారతము |
| *మను.* | = మనుచరిత్రము |
| *ముక్తా.* | = ముక్తాకలాపం |
| *విరాట.* | = విరాటపర్వం |
| *వేదాంత.* | = వేదాంత డిండిమస్తోత్రం |
| *వైజయంతీ.* | = వైజయంతీవిలాసం |

| | |
|---|---|
| *శ్లో.* | = శ్లోకం |
| *సుభా.* | = సుభాషిత రత్నావళి |

# iii. ముందుమాట

జీవితం కష్టసుఖాల సమాహారం. ప్రతి జీవి ఏదో ఒక లక్ష్యాన్ని నెరవేర్చడానికే జన్మిస్తాడు. కొంతమంది లక్ష్యం దిశగా అడుగులు వేస్తూ ఉంటారు. కొంతమంది మరికొన్ని జన్మలెత్తినా లక్ష్యాన్ని చేరుకోరు. మరికొంతమంది ఎప్పుడూ ఇహపరమైన వాంఛల్లో మునిగి తేలుతూ అసలు లక్ష్యాన్నే మర్చిపోతారు. ఇలా మనుషులు భిన్న రకాలు. ఒక్కొక్కరిది ఒక్కొక్క స్వభావం. సాంకేతికత ఎంతగా అభివృద్ధి చెందినా, మనిషి మనస్సుని పట్టుకునే యంత్రాన్ని ఎవరూ తయారు చేయలేకపోయారు. మనిషి మనస్సుపై ఎన్ని పరిశోధనలు జరిగినా ఇంకా అంతు చిక్కని విషయాలు ఎన్నో ఉండిపోయాయి. ఉండిపోతాయి.

పాశ్చాత్యులు మనిషి ప్రవర్తన ఆధారంగా వ్యక్తిత్వాలను అంచనా వేసేందుకు ఎన్నో విభజనలు చేశారు. కొత్త కొత్త సంప్రదాయాలకు ఆజ్యం పోశారు. అయితే, ఎవరూ పూర్తిగా విజయం సాధించలేదనే చెప్పాలి. ప్రవర్తనల ఆధారంగా వ్యక్తులను విభజించినా వ్యక్తిత్వాలు ఇన్ని రకాలు అని చెప్పడం అసాధ్యంగా కనిపిస్తుంది. ఈ విషయంపై మన భారతీయ దృక్కోణం చాలా భిన్నమైనది. భారతీయ తత్త్వవేత్తలు, ప్రతి వ్యక్తికి ఒక స్వభావం, వ్యక్తిత్వం ఉంటాయని గ్రహించి, ఏది ఉన్నతమైన వ్యక్తిత్వమో, ఏది కాదో మాత్రమే చెప్పారు. ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగి ఉండాలంటే ఎలా నడుచుకోవాలో వివరించారు, విశ్లేషించారు, ఆచరించి చూపించారు.

సాంకేతికత రాజ్యమేలుతున్న ఈ రోజుల్లో మనిషికి నైతికమైన విలువలు అందడం లేదు. విలువలను అందించవలసిన విద్యావ్యవస్థ సైతం అభివృద్ధి పేరిట కొత్త రూపును సంతరించుకుంది. మూలాలను విస్మరించి యాంత్రికంగా తయారయ్యింది. నేటి విద్యావ్యవస్థ ఓటమికి కుంగిపోని, గెలుపుకి పొంగిపోని తరాన్ని తయారుచేయడంలో విఫలమవుతోంది. ఈరోజు సమాజంలో జరుగుతున్న అత్యాచారాలకి, మోసాలకి, నేరాలకి ముఖ్యమైన కారణం నేటి విద్యావ్యవస్థే. విద్యార్థుల వ్యక్తిత్వాలను ఉన్నతంగా మలచవలసిన విద్యావ్యవస్థ సైతం సాంకేతికత మోజులో పడి కొట్టుకుపోతుండడంతో స్వార్థం రాజ్యమేలుతోంది. మనుషులు అమానుషంగా మారి వైరాలు పెంచుకుంటున్నారు. ఏ సమస్యనైనా ఎదురించగలిగే ధైర్యం మనుషుల్లో కొరవడుతోంది. మనుషులు

బలహీనులు అయిపోతున్నారు. మానసికంగా కుంగిపోతున్నారు. ఇటువంటి పరిస్థితులలో మనుషుల వ్యక్తిత్వాలు వికసించకపోతే మరిన్ని తరాలు మంటగలిసిపోతాయి.

ఈ సృష్టి ఒక Cycle లాంటిది. సమాజం, దాని స్థితిగతులు ఒక ఋతుచక్రంలా మారుతూ ఉంటాయి. విలువల్ని విస్మరించి సాంకేతికత మోజులో కొట్టుకుపోతున్న మనుష్య జాతికి క్రమంగా 'విలువలే మనిషికి ఆస్తి' అనే విషయం అనుభవానికి వచ్చింది. అభివృద్ధి పేరిట పట్టణాలకి పయనమైన ప్రజలు నెమ్మదిగా పల్లెటూళ్ళలో ఉండే ప్రశాంతతని కోరుకుంటున్నారు. నైతికమైన విలువల కోసం తపిస్తున్నారు. Personality Development, Managing Ability, Stress Management, Communication Skills అంటూ వ్యక్తిత్వాలను తిరిగి నిర్మించుకునే పనిలో నిమగ్నమైంది నేటి తరం. వాటి కోసం వేలకి వేలు వెచ్చిస్తోంది. అయితే కాస్త శ్రమిస్తే ఎటువంటి ఖర్చు లేకుండా వీటన్నింటినీ మన సాహిత్యం, మన సంస్కృతి, మన జీవన విధానం, మన తత్త్వశాస్త్రం మనకి అందిస్తాయి.

## పరిశోధనావశ్యకత

భారతీయ సాహిత్యం, మరీ ముఖ్యంగా ప్రాచీన తెలుగు సాహిత్యం విలువలకు నిలయాలు. వ్యక్తిత్వ వికాసం ఆ సాహిత్యంలో అంతర్భాగం. వ్యక్తిని శక్తిగా తీర్చిదిద్దగలిగే సత్తా ఆ సాహిత్యానికి ఉంది. ప్రాచీన తెలుగు సాహిత్యం సమస్యల ఊబిలో చిక్కుకుని ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్న నేటి తరానికి మానసిక వైద్యం చేయగలదు, వ్యక్తిత్వ వికాసాన్ని తిరిగి నేటి తరాలకు అందించగలదు. నేటి తరాలకే కాదు సరిగా అన్వయించుకోవాలే కానీ ఏ తరానికైనా ఆ సాహిత్యం దిశానిర్దేశం చేయగలదు. అటువంటి ప్రాచీన సాహిత్యంపై వ్యక్తిత్వ వికాసం కోణంలో చాలా తక్కువ పరిశోధనలు జరిగాయి. ముఖ్యంగా ప్రబంధాలను వ్యక్తిత్వ వికాస కోణంలో, సామాజిక దృష్టితో పరిశీలించవలసిన అవసరం ఎంతైనా ఉంది. వ్యక్తిత్వ వికాస కోణంలో పరిశీలించినప్పుడు తక్కిన ప్రబంధాల కంటే అల్లసాని పెద్దన రచించిన *మనుచరిత్ర* చాలా ప్రత్యేకంగా కనిపిస్తుంది.

నేను సేకరించిన సమాచారం (*నిత్యానందరావు, వెలుదండ. 2013: 121,122*) మేరకు *మనుచరిత్ర*పై వ్యక్తిత్వ వికాస కోణంలో ఎటువంటి పరిశోధన జరగలేదు. *మనుచరిత్ర*లో వర్ణనల గురించి, *మనుచరిత్ర*లో చిత్రించబడిన సమాజం గురించి కొన్ని పరిశోధనలు జరిగాయి.

*మనుచరిత్ర*లో రసనిర్ణయాలపై, ధ్వనిపై కొంత అధ్యయనం జరిగింది. కానీ వ్యక్తిత్వ వికాసం కోణంలో *మనుచరిత్ర*పై పరిశోధనలు జరగలేదు. అందుకే ఈ కావ్యాన్ని వ్యక్తిత్వ వికాస కోణంలో పరిశీలించాలని సంకల్పించాను. ఈ మధ్య సుప్రసిద్ధ దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో 'ఓకే బంగారం' అనే చలన చిత్రం విడుదలయ్యింది. ఆ సినిమాలో *మనుచరిత్ర* ప్రస్తావన కనిపిస్తుంది. ఆ సినిమా సహజీవనం పట్ల యువత దృక్పథం గురించి, ఒకే వ్యక్తికి అంకితమై ఉండడంలో ఉండే గొప్పతనం గురించి చర్చిస్తుంది. చివరికి వివాహ వ్యవస్థలో ఉండే గొప్పతనాన్ని ఋజువు చేస్తుంది. ఎన్నో ఏళ్ల క్రితం రాసిన *మనుచరిత్ర* ఈనాడు అత్యంత చర్చనీయాంశాలైన సహజీవనం, వివాహేతర సంబంధాల గురించి, వాటి పర్యవసానాల గురించి చర్చించింది. ఇటువంటి ఎన్నో విషయాలు *మనుచరిత్ర*ని ఆధునిక కాలానికి అన్వయించాలనే ప్రేరణని నాకు కలుగజేశాయి.

## అధ్యాయాల విభజన

*మనుచరిత్ర*లో ఉన్న వ్యక్తిత్వ వికాస అంశాలను స్పృశించి, ఆవిష్కరించే క్రమంలో '*మనుచరిత్ర : వ్యక్తిత్వ వికాసం*' అనే ఈ పరిశోధన వ్యాసాన్ని నాలుగు అధ్యాయాలుగా విభజించడం జరిగింది.

1. *మనుచరిత్ర* : ప్రత్యేకత
2. వ్యక్తిత్వ వికాసం : సైద్ధాంతిక నేపథ్యం
3. ప్రాచీన తెలుగు సాహిత్యం: వ్యక్తిత్వ వికాసం
4. *మనుచరిత్ర* : వ్యక్తిత్వ వికాసం

## పరిశోధన లక్ష్యం

తెలుగు ప్రబంధాలపై చాలా మందికి కొన్ని దురభిప్రాయాలు ఉన్నాయి. అవి కేవలం శృంగారపూరితాలని తేలికగా కొట్టిపాడేసిన వారు చాలా మంది ఉన్నారు. వాటిపై నెలకొన్న

ఇటువంటి దురభిప్రాయాలను తొలగించి వాటిలో ఉన్న సందేశాన్ని, విలువల్ని తిరిగి అందించడం ఈ పరిశోధన లక్ష్యం. ప్రాచీన తెలుగు సాహిత్యంపై ఇటువంటి కోణంలో మరిన్ని పరిశోధనలకు ఆహ్వానం పలకడమే ఈ పరిశోధన ఆశయం.

ముందుమాటని ముగించే ముందు ఒక చిన్న మాట. వ్యక్తిత్వ వికాసంపై దేశ విదేశాల్లో ఎన్నో అద్భుతమైన పరిశోధనలు జరిగాయి, ఎన్నో సిద్ధాంతాలు ఆవిష్కృతమయ్యాయి. వాటిని కాదనడం ఈ పరిశోధన ఉద్దేశ్యం కాదు. వాటిని గౌరవిస్తూనే, వ్యక్తిత్వ వికాసం కోసం మరింత భిన్నంగా కృషి చేసి నైతికమైన విలువల్ని మనుషులకి అందించడంలో భారతీయ సంస్కృతి, సాహిత్యం, తత్త్వశాస్త్రం ఏనాడో కృషి చేశాయని, వ్యక్తిత్వ వికాసం భారతీయ జీవన విధానంలో ఒక అంతర్భాగం అని గుర్తుచేయడం మాత్రమే ఈ పరిశోధన ఉద్దేశ్యం.

వ్యక్తిత్వ వికాసం కోసం ఈనాడు మనం ఇతరుల ముందు అర్రులు చాచాల్సిన అవసరం లేదు. యావత్ప్రపంచం మనవైపు చూస్తున్న ఈ తరుణంలో, మనం మన సాహిత్యాన్ని మరింతగా ఆస్వాదించి, ఆచరించడం ముఖ్యం. భారత దేశం, భారతీయ సాహిత్యం, భారతీయ తత్త్వశాస్త్రం వ్యక్తిత్వ వికాసానికి చిరునామాలుగా ప్రపంచపాఠంపై సువర్ణాక్షరాలతో లిఖించుకోదగినవి.

# విషయ సూచిక

పుటసంఖ్య

i. కృతజ్ఞతలు

ii. సంకేతాలు: వివరణ

iii. ముందుమాట

## అధ్యాయం – 1

## మనుచరిత్ర : ప్రత్యేకత (1– 25)

1.1. పరిచయం 01

1.2. కావ్యపరిచయం 01

1.3. కవి పరిచయం 03

1.4. పెద్దన కృతులు 05

1.5. మనుచరిత్ర: కథాసంగ్రహం 07

1.6. మార్కండేయ పురాణం : మనుచరిత్ర – వ్యత్యాసం 13

**1.7. మనుచరిత్రలో పాత్రలు : వ్యక్తిత్వ వికాసం** 15

1.7.1. ప్రవరుడు 16

1.7.2. సోమిదమ్మ 17

1.7.3. సిద్ధుడు 19

1.7.4. వరూథిని 19

1.7.5. మాయాప్రవరుడు 21

1.7.6. స్వరోచి 21

1.7.7. ఇందీవరాక్షుడు 22

1.7.8. బ్రహ్మమిత్రుడు 23

1.7.9. మనోరమ 23

## అధ్యాయం – 2

## వ్యక్తిత్వ వికాసం : సైద్ధాంతిక నేపథ్యం (26 – 47)

2.1. వ్యక్తిత్వ వికాసం: పరిచయం, నిర్వచనం 26

**2.2. పాశ్చాత్యుల అభిప్రాయాలు** 27

2.2.1. హిప్పోక్రేటిస్ వర్గీకరణ 28

2.2.2. సోక్రటీస్ 29

2.2.3. సెయింట్ ఆగస్టీన్ 29

2.2.4. సిగ్మండ్ ఫ్రాయిడ్ 29

2.2.5. స్పెంజర్ వర్గీకరణ 31

**2.3. భారతీయుల అభిప్రాయాలు** 31

2.3.1. స్వామి వివేకానంద 33

2.3.2. అరవిందుడు 33

2.3.3. రమణ మహర్షి 34

2.3.4. పరమహంస యోగానంద 35

2.3.5. జిడ్డు కృష్ణమూర్తి 35

2.4. సంస్కృత సాహిత్యం : వ్యక్తిత్వ వికాసం 38

## అధ్యాయం – 3

## ప్రాచీన తెలుగు సాహిత్యం : వ్యక్తిత్వ వికాసం (48 – 66)

3.1. పరిచయం 48

3.2. సత్యభాషణం 50

3.3. మానసికమైన ఒత్తిడి – కారణాలు – పరిష్కారం 52

3.4. భారతీయ విద్యావిధానం 54

3.5. స్పర్థ 56

3.6. ప్రతిభకు పట్టం 57

3.7. ఆలోచనాధోరణి 58

3.8. నిర్వహణ సామర్థ్యం 59

3.9. చతుర్విధ పురుషార్థాలు – ప్రాధాన్యం 61

3.10. ఆత్మసంతృప్తి 62

3.11. సమగ్ర వ్యక్తిత్వం 63

## అధ్యాయం – 4

## మనుచరిత్ర : వ్యక్తిత్వ వికాసం (67 - 113)


4.1. పరిచయం 67

4.2. ప్రవరుడి నేపథ్యం – వ్యక్తిత్వం 68

4.3. అతిథిసేవ 73

4.4. ప్రవరుడి హిమాలయ సందర్శనం 76

4.5. వరూథినీ ప్రవరాఖ్యుల సంవాదం 82

4.6. వరూథిని విరహం 94

4.7. మాయాప్రవరుడి ఆగమనం 96

4.8. స్వరోచి వేట, మనోరమని రక్షించడం 102

4.9. మనోరమ, కళావతి, విభావసుల వృత్తాంతం 103

4.10. ఇందీవరాక్షుడు, బ్రహ్మమిత్రుల వృత్తాంతం 106

4.11. కళావతి, విభావసులకి వ్యాధి నుంచి విముక్తి 107

4.12. కళావతి వృత్తాంతం 108

4.13. హంస, చక్రవాక పక్షుల సంభాషణ 110

4.14. హరిణాల సంభాషణ 111

4.15. స్వారోచిష మనువు పరిపాలన 112

5. ముగింపు (114 - 116)

6. ఉపయుక్త గ్రంథ సూచి (117 – 119)

# అధ్యాయం – 1

# మనుచరిత్ర – ప్రత్యేకత

## 1.1. పరిచయం

ప్రాచీన తెలుగు సాహిత్యం విలువలకు నిలయం. ఆ సాహిత్యంలో నేటి సమాజానికి ఉపయోగపడే ఎన్నో అంశాలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రబంధాలు మన నిత్య జీవితానికి గొప్ప సందేశాన్ని ఇస్తాయి. వ్యక్తిత్వ వికాసం గురించి ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా మన సాహిత్యం అంతర్లీనంగా బోధిస్తూనే ఉంది.

ప్రబంధాలు శృంగార పూరితాలు అని తేలికగా కొట్టిపారేస్తే వాటి సారం నేటి తరానికి అందే అవకాశం లేదు. అందుకే వాటిని ఒక భిన్నమైన దృష్టితో చూడాల్సిన అవసరం ఉంది. వ్యక్తిత్వ వికాస కోణంలో ప్రాచీన కావ్యాలను పరిశీలించినప్పుడు తక్కిన ప్రబంధాల కంటే అల్లసాని పెద్దన రచించిన *మనుచరిత్ర* మరింత ప్రత్యేకంగా కనిపిస్తుంది. *మనుచరిత్ర* లేని ఈ పరిశోధన లేదు. వ్యక్తిత్వ వికాస కోణం నుంచి పరిశీలించినప్పుడు మిగిలిన ప్రబంధాల్లో కంటే *మనుచరిత్ర*లో ఉన్న విశేషాంశాల గురించి, *మనుచరిత్ర*లో ఉన్న పాత్రల గురించి, కవి అల్లసాని పెద్దన గురించిన ప్రస్తావన ఈ అధ్యాయంలో ఉంటుంది. మొత్తంగా చెప్పాలంటే ఈ పరిశోధనకి *మనుచరిత్ర*నే ఎంచుకోవడానికి గల కారణాలు, *మనుచరిత్ర* ప్రత్యేకత గురించిన చర్చ ఈ అధ్యాయంలో జరుగుతుంది.

## 1.2. కావ్యపరిచయం

ప్రబంధ యుగంగా ప్రసిద్ధి గాంచిన శ్రీకృష్ణదేవరాయల కాలంలో అల్లసాని పెద్దనచే రచింపబడి, శ్రీకృష్ణదేవరాయలకి అంకితమీయబడిన గొప్ప ప్రబంధం *మనుచరిత్ర.* ఈ మహాకావ్యం తెలుగు పంచకావ్యాల్లో మొదటిగా ప్రసిద్ధి గాంచింది. ఈ కావ్యాన్ని రాసి తనకి అంకితం ఇవ్వవలసినదిగా శ్రీకృష్ణదేవరాయలే స్వయంగా అల్లసాని పెద్దనను కోరినట్టు *మనుచరిత్ర* ప్రారంభంలో పీఠికలో సప్తసంతానములలో...(*మను. 1: 14*) అనే పద్యంలో ఉంది. ఈ కింది పద్యం

కూడా ఆ సందర్భంలో చెప్పిందే. *మనుచరిత్ర*నే రాయలు ఎందుకు రచించమన్నారో ఈ పద్యంలో వివరించాడు పెద్దన.

క. మనువులలో స్వారోచిష
మనుసంభవ మరయ రససమంచితకథలన్
విన నింపు కలిధ్వంసక
మనఘ భవచ్ఛతురత రచన కనుకూలంబున్. (*మను. 1: 16*)

శ్రీకృష్ణదేవరాయల కాలంలో తెలుగు సాహిత్యానికే తలమానికమైనటువంటి ప్రబంధాలు వెలువడ్డాయి. ఆ కాలానికి ముందు కొన్ని రచనలు వచ్చినా వాటిలో ప్రబంధానికి ఉండాల్సిన అన్ని లక్షణాలు లేకపోవడం వల్ల వాటిని ప్రబంధాలుగా మన పండితులు పరిగణించలేదు. ఆ లోటును భర్తీ చేస్తూ ప్రబంధ లక్షణాలు సంపూర్ణంగా కలిగిన మొట్ట మొదటి ప్రబంధంగా *మనుచరిత్ర* వెలసింది.

తెలుగు సాహిత్యపరంపరలో ఇతిహాస, పురాణాలు, దేశి కావ్యాలు, కథాకావ్యాలు ఇలా సాగిన ధోరణి అల్లసాని పెద్దనతో కావ్యవసంతంగా పరిణమించింది. ప్రాచీన సాహిత్య ప్రక్రియలన్నీ ఒక ఎత్తైతే ప్రాచీన ప్రబంధ సాహిత్యం ఒక ఎత్తు. ప్రాచీన ప్రబంధాలను ఒక భిన్నమైన దృష్టితో చూడాల్సిన అవసరం ఉంది. పైపైన చదివితే అంతరార్థం ఆవిష్కృతమవ్వదు. అటువంటి ఒక భిన్నమైన దృష్టితో ప్రాచీన కావ్యాలను పరిశీలించినప్పుడు *మనుచరిత్ర* మరింత భిన్నంగా కనిపిస్తుంది. ముఖ్యంగా వ్యక్తిత్వ వికాస కోణంలో చూసినప్పుడు *మనుచరిత్ర* తక్కిన ప్రబంధాల కంటే చాలా ప్రత్యేకంగా కనిపిస్తుంది. *మనుచరిత్ర* మన భారతీయ సంస్కృతికి ప్రతిబింబం. మనుషి జీవితం ఎలా ఉండాలో ప్రతికాత్మకంగా నిర్దేశించిన కావ్యం *మనుచరిత్ర*. అతిథి అభ్యాగతులను ఆదుకోవడం, గురుశిష్యుల ప్రేమానుబంధం, తల్లిదండ్రుల పట్ల పిల్లలకి ఉండాల్సిన బాధ్యత మొదలైన విషయాలను గురించి అల్లసాని పెద్దన *మనుచరిత్ర* ద్వారా ప్రపంచానికి తెలియజేశారు.

మనోనిగ్రహం మనిషికి ఎంత అవసరమో *మనుచరిత్ర* ద్వారా పెద్దన వివరించారు. హాయిగా, సజావుగా నడిచిపోయే సగటు మనిషి జీవితం ఒక్కసారిగా ఒడుదిడుకులకు లోనైతే, మనిషి ప్రవర్తన ఎలా ఉంటుందో *మనుచరిత్ర*లో కళ్ళకు కట్టినట్టు చూపించారు పెద్దన. మనషి ఆకర్షణలకు లోనై మనోనిగ్రహాన్ని కోల్పోకూడదు అనే గొప్ప విషయాన్ని పెద్దన మనుచరిత్రలో వివరించారు. మనోనిగ్రహం కలిగి ఉంటే జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా చివరికి శుభం కలుగుతుందనే

విషయాన్ని పెద్దన మనుచరిత్ర ద్వారా తెలియజేశారు. ఈ అంశాలన్నీ వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేసేవే.

*మనుచరిత్ర*లో వస్త్వైక్యం కనిపించదు. కథ ఒక చోట ప్రారంభమై మరెక్కడో ముగుస్తుంది. కానీ, ప్రతి ఆశ్వాసంలోని కథ అంతర్లీనంగా ఎన్నో వ్యక్తిత్వ వికాస అంశాలను స్పృశిస్తుంటుంది. తక్కిన ప్రబంధాల కథ కంటే చాలా విభిన్నంగా, వైవిధ్యంగా ఉండే ఒక కథను మార్కండేయ పురాణం నుంచి తీసుకుని అల్లసాని పెద్దన జిగి బిగి కలిగిన అల్లికతో కావ్యాన్ని రసవంతంగా ఆవిష్కరించారు.

## 1.3. కవి పరిచయం

అల్లసాని పెద్దన (క్రీ. శ. 1470 – 1540) శ్రీకృష్ణదేవరాయల ఆస్థానకవి. అష్టదిగ్గజాలలో అగ్రగణ్యుడు. అల్లసాని పెద్దన రచించిన *మనుచరిత్ర*లో ఆయన గురించి ఆయన ఏం చెప్పుకోలేదు. కానీ, అన్నూరు శాసనం ఆధారంగా పెద్దన ఇంటి పేరు అల్లసాని వారని, అతనిది వశిష్ఠ గోత్రమని, ఆశ్వతాయన సూత్రం, ఋగ్వేదం, నందవరీక స్మార్త నియోగి అని తెలుస్తోంది (*దామోదరనాయుడు, గార్లపాటి. 2012: 9*).

“ఇది శ్రీమదాంధ్రకవితాపితామహ సర్వతో ముఖాంక పంకజాక్షి పాదాంబుజాధీన సమాన సేందిందిర నందవరపుర వంశోత్తంస శఠకోపతాపస ప్రసాదసమాసాదిత చతుర్విధకవి తామతల్లి కాల్లసాని చొక్కయామాత్యపుత్ర పెద్దనార్య ప్రణీతంబయిన స్వారోచిషమనుసంభవంబను మహాప్రబంధంబునందు..” అంటూ ఆశ్వాసాంత గద్యల్లో పేర్కొనడాన్ని బట్టి పెద్దన తండ్రి పేరు చొక్కనామాత్యుడని, గురువు శఠగోపయతి అని, పెద్దనకి ఆంధ్రకవితాపితామహుడనే బిరుదు కలదని తెలుస్తోంది. ఆ బిరుదు పెద్దనకి ఎలా వచ్చింది? దాని అర్థమేమిటి? అనే విషయమై విశ్వనాథ సత్యనారాయణ గారు చేసిన వ్యాఖ్య ఇక్కడ ఉపకరిస్తుంది.

“పెద్దన్న గారికి ఆంధ్ర కవితాపితామహుడని బిరుదు. పెద్దన్న కంటే పూర్వులు తెలుగులో చాలా మంది కలరు. కవిత్రయము, నాచన సోమన్న, శ్రీనాథుడు, పోతన్న మొదలైన మహానుభావులు చాలా మంది కలరు. కవిత్రయంలో నొకడైన ఎఱ్ఱాప్రగ్గడకు ప్రబంధ పరమేశ్వరుఁడన్న బిరుదు కలదు. ఇట్టి విషయంలో పెద్దన్న గారికి ఆంధ్ర కవితాపితామహుడన్న బిరుద మెట్లు వచ్చినదో, ఎట్లు చెల్లుఁబడియైనదో, విచారించవలసిన విషయము.

పెద్దన్న వలె చక్కని మధురమైన పద్యరచన చేయగల కవి యాంధ్ర సారస్వతమున మఱియొకడుండడు. మన సారస్వతములోనున్న మహా కవులందఱి విషయంలో వారి వారి శైలి వారి

వారి ప్రత్యేకత అని చెప్పవచ్చును, కాని పెద్దన్న గారి విషయంలో నీ ప్రత్యేకత యందొక వైలక్షణ్యమున్నది. ఆ విజయనగర సామ్రాజ్య సూక్ష్మభోగ పరమ మాధుర్యలక్షణ మా శైలి యందున్నది. ఇది యనుభవైక వేద్యము. శ్రీనాథుడు దీనికి మార్గదర్శిగా కనిపించును. కాని యీ లక్షణము శ్రీనాథునియందు పరాకాష్ఠ పొందలేదు. పెద్దన్న గారియందు పొందినది. అందుచేత నతడాంధ్ర కవితాపితామహుడు. పితామహుడనగా తాత కాదు బ్రహ్మ"(*కావ్య. 1978: 3*).

పెద్దన తన గురువు గురించి మనుచరిత్రలో ఇలా చెప్పుకున్నాడు.

క. కొలుతున్ మద్గురు విద్యా
నిలయున్ గరుణాకటాక్ష నిబిడజ్యోత్స్నా
దళితాశ్రిత జనదురిత
చ్ఛలగాఢధ్వాంతసమితి శఠకోపయతిన్. (*మను. 1 – 6*)

శ్రీకృష్ణదేవరాయలు అల్లసాని పెద్దనను ఆంధ్ర కవితాపితామహుడిగా కీర్తించడమే కాక, *మనుచరిత్ర*ను రచించమని కోరిన సందర్భంలో పెద్దన రచనలు శిరీషకుసుమపేశల సుధామయోక్తులతో నిండి ఉంటాయని, పెద్దన అసమానాలైన పురాణ, ఆగమ, ఇతిహాసాల్లోగల కథలన్నీ జ్ఞప్తికి కలవాడని కీర్తించాడు. ఆ సర్వజ్ఞత్వానికి *మనుచరిత్ర* తార్కాణంగా నిలుస్తుంది. అల్లసాని వారి అల్లిక జిగి బిగి అని ప్రతితి. జిగి అంటే కాంతి. బిగి అంటే పటుత్వం. ఆయన రచనాశైలి అనితర సాధ్యం.

అల్లసాని పెద్దన గురించి వేటూరి ప్రభాకరశాస్త్రిగారు 'మనుచరిత్రమున'కు రాసిన పీఠికలో చక్కటి విమర్శ చేశారు. పెద్దన కవిత్వాన్ని కీర్తిస్తూ ఆయన రాసిన పద్యాలు చిరస్మరణీయాలు.

ఉ. కూర్చిన కూర్పులా! స్వరస గుంభనముల్, కవితా ప్రసారమా
తేర్చిన తేనె! యంచు వినుతింప బ్రబంధము సంతరించిలో
కార్చితుడైన పెద్దన మహాకవి సత్కవితావిలాసముం
గూర్చి విమర్శ సల్ప నొనగూడునె యొక్కని కల్పబుద్ధికిన్. (*మను. పుట: xxvi*)

ఉ. ముద్దుల మూట గట్టునుడి పొంకమునందును మేల్మికూరుపుం
బద్దెపు బింకమందు, రసబంధమునందుఁ, గథా ప్రకారముం
దిద్దెడు తీర్పునందు గడి దేరినమా కవితాపితామహుం
బెద్దన నాంధ్రపుంగయితఁ బెద్ద ననారాతముం దలంచెదన్. (*మను. పుట: xxvii*)

## 1.4. పెద్దన కృతులు

పెద్దన రచనగా మనకు లభిస్తున్నది *మనుచరిత్ర* మాత్రమే. అయితే, లాక్షణికులు కొందరు ఉదాహరించిన కొన్ని పద్యాల ఆధారంగా పెద్దన *హరికథాసారము* అనే గ్రంథాన్ని కూడా రాసినట్టు తెలుస్తోంది. కస్తూరి రంగకవి తన ఆనందరంగరాట్ఛందంలో *హరికథాసారం* గురించి కొన్ని పద్యాల్లో ప్రస్తావించారు. *హరికథాసారం* ఎక్కడో కనుమరుగై ఉండాలి. మనకి లభిస్తున్న ఆధారాల ప్రకారం *హరికథాసారం* అనే రచన అల్లసాని పెద్దన గారిదే అని స్పష్టమవుతోంది. ఈ కింది పద్యం పెద్దన పద్యంగా కస్తూరి రంగకవి రచించిన *ఆనందరంగరాట్ఛందం*లో పేర్కొనబడింది.

క. అంబరము పగుల నార్చి ప్ర
లంబాసురుఁ డాగ్రహము వెలయగదిసినవే
ళం బలరాముఁడు చేముస
లంబున వానితలద్రుంచె లావు మెఱయఁగన్. (*మను. పుట:xi*)

పెద్దన గారి పేరు మీద కొన్ని చాటువులు ప్రచారంలో ఉన్నాయి. ఏ సందర్భంలో అన్నాడో తెలియదు కానీ, ఈ కింది పద్యం పెద్దన చాటువుగా మిక్కిలి ప్రసిద్ధం.

చ. నిరుపహతిస్థలంబు రమణీప్రియదూతిక తెచ్చియిచ్చు క
ప్పురవిడె మాత్మకింపయిన భోజనముయ్యెల మంచమొప్పుత
ప్పరయు రసజ్ఞులూహ తెలియంగల లేఖక పాఠకోత్తముల్
దొరికినఁ గాక యూరక కృతుల్ రచియింపు మనంగ శక్యమే. (*మను. పుట : x*)

కవిత్వం రాయడానికి ఏం అవసరమో తెలియజేస్తూ పెద్దన ఈ పద్యం చెప్పారు. కవిత్వం అనేది ఎప్పుడు పడితే అప్పుడు, ఎక్కడ పడితే అక్కడ చెప్పేది కాదని, రసజ్ఞత చాలా ముఖ్యమని పెద్దన గారి అభిప్రాయం. ఇది ఆనాటి కవుల ఆలోచనావిధానానికి అద్దం పడుతుంది.

"ఇది గాక కృష్ణరాయలు స్వర్గస్థుడైన పిదప నాతని నిర్యాణమును గూర్చి సీస పద్య శతక మొకటి రచించె ననియుఁ దామా పద్యశతకము నొకచోఁ జూచియుంటి మనియు మిత్రులొకరు నుడువుచున్నారు; కాని యది లభించినది కాదు" (*మనుచరిత్రము. పుట: xi*). ఈ కింది పద్యం మాత్రం వాడుకలో ఉంది.

సీ. ఎదురైనచోఁదన మదకరీంద్రము నిల్పి కేలూఁత యొసఁగి యెక్కించుకొనియె
కోకట గ్రామాద్య నేకాగ్రహారంబు లడిగిన సీమలయందునిచ్చె
మనుచరిత్రం బందుకొను వేళఁ బురమేఁగఁ బల్లకిఁ దనకేలఁ బట్టి యెత్తె
బిరుదైన కవిగండపెండేరమున కీవె తగుదని తానె పాదమునఁ దొడగె
గీ. 'ఆంధ్ర కవితాపితామహ అల్లసాని
పెద్దన కవీంద్ర' యని నన్ను బిలుచునట్టి
కృష్ణరాయలతో దివి కేఁగలేక
బ్రదికి యున్నాఁడ జీవచ్ఛవంబనగుచు. (*మను. పుట: xi*)

శ్రీకృష్ణరాయల నిర్యాణానంతరం కన్నడ రాజ్యంపైకి గజపతి రాజు దండెత్తి వచ్చినప్పుడు, "రాయరావుతు గండరాచయేనుగు వచ్చి..."(*మను. పుట: xi*) పద్యం చెప్పాడని ప్రతీతి. "సమరక్షోణిని కృష్ణరాయల భుజాశాతాసిచే..." (*దామోదరనాయుడు, గార్లపాటి. 2012: 15*) అనే పద్యం చాటుపద్య మణిమంజరిలో పెద్దన చాటువుగా పేర్కొనబడింది.

"రంతుల్ మానుము కుక్కుటాధమ.." (*దామోదరనాయుడు, గార్లపాటి. 2012: 19*) అనే చాటుపద్యం శ్రీకృష్ణదేవరాయలు అడిగితే ఒక సందర్భంలో పెద్దన చెప్పారని ప్రసిద్ధి.

ఇక శ్రీకృష్ణదేవరాయల భువనవిజయసభలో ఒక రోజు సంస్కృతాంధ్ర భాషల్లో సమానంగా కవిత్వం చెప్పగలిగినవారి కాలికి గండపెండేరాన్ని తొడుగుతానని ప్రకటించినప్పుడు ఎవరూ ముందుకి రాకపోతే రాయలవారు "ముద్దుగ గండపెండియరమున్ గొనుడంచు బహూకరింపగా..." అన్నప్పుడు పెద్దన "పూతమెరుంగులుం బసరుపూపబెడంగులు జూపునట్టివా కైతలు?..."

(*మను. పుట: viii*) అంటూ చెప్పిన ఉత్పలమాలిక జగద్విఖ్యాతం. ఆ మాలిక చదివాక శ్రీకృష్ణదేవరాయలు తాను స్వయంగా గొప్ప కవి అయ్యుండి పెద్దన కాలికి గండపెండేరం తొడిగిన సంఘటన తెలుగు సాహిత్య చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది.

## 1.5. మనుచరిత్ర : కథాసంగ్రహం

*మనుచరిత్ర* ఆరు ఆశ్వాసాల ప్రబంధం. *మనుచరిత్ర* స్వారోచిషమనువు పుట్టుకను గురించి చెప్పే కావ్యం. అయితే స్వారోచిష మనువు పుట్టడానికి ముందు జరిగిన సంఘటనల సమాహారంగా *మనుచరిత్ర* కనిపిస్తుంది. *మనుచరిత్ర*లోని కథ సుప్రసిద్ధం.

'ఆర్యావర్త దేశంలో వరుణానది ఉంది. ఆ నదీతీరంలో అరుణాస్పదపురమనే పట్టణం ఉంది. అది ఆకాశాన్ని అంటే అద్భుతమైన సౌధాలతో భూదేవి కంఠహారంలా ప్రకాశిస్తూ ఉంటుంది. ఆ ఊళ్ళో విప్రులు వేదశాస్త్ర జ్ఞానంలో బ్రాహ్మని మించినవారు. అక్కడి ప్రజలందరూ ప్రతిభావంతులు, భాగ్యవంతులు. అక్కడ పుట్టిన చిగురుకొమ్మ కూడా చేవ కలిగి ఉంటుంది. ఆ ఊళ్ళో ప్రవరుడు అనే పేరుగల ఒక బ్రాహ్మణుడు ఉన్నాడు. అతని భార్య సాక్షాత్తు అన్నపూర్ణాదేవి. ఏ సమయంలో అతిథి వచ్చినా శ్రద్ధగా, ఓపికగా ఏ లోటు లేకుండా భోజనాలు పెడుతుంది. అతిథి, అభ్యాగతులకు వారి గృహం ఎప్పుడూ స్వాగతం పలుకుతూ ఉంటుంది.

ప్రవరుడికి తీర్థయాత్రలంటే అమితమైన ఆసక్తి. అయితే, తనకి ఉన్న బాధ్యతల వల్ల, వాటిని విస్మరించడం ఇష్టం లేక ఎక్కడికీ వెళ్ళలేకపోతాడు. ప్రవరుడు తీర్థయాత్రలు చేసి వచ్చిన వారిని ఇంటికి ఆహ్వానించి, వారికి సేవ చేసి యాత్రావిశేషాలు తెలుసుకుంటూ ఉంటాడు. తనకున్న ఆసక్తిని మాత్రం మనస్సులోనే దాచుకుంటాడు.

ఒక రోజు మధ్యాహ్నం ప్రవరుడి ఇంటికి ఒక సిద్ధుడు వస్తాడు. ప్రవరుడు ఆ సిద్ధుడికి అతిథి మర్యాదలన్నీ చేసి భోజనం పెడతాడు. భోజనం అయ్యాక ఆ సిద్ధుడిని యాత్రావిశేషాలు అడిగి తెలుసుకుంటాడు. ఆ సిద్ధుడు తాను చూసిన ప్రదేశాలన్నింటి వివరాలు, విశేషాలు ప్రవరుడితో పంచుకుంటాడు. తాను నాలుగు దిక్కులా ఉన్న పుణ్య క్షేత్రాలన్నీ దర్శించానని ప్రవరుడితో చెబుతాడు. అప్పుడు ప్రవరుడు 'తమరు ఇంత చిన్న వయస్సులో అన్ని ప్రదేశాలు ఎలా దర్శించగాలిగారు?' అని ప్రశ్నిస్తాడు. అప్పుడు సిద్ధుడు ఈశ్వరుని అనుగ్రహం వల్ల తాను పొందిన పాదలేపనం గురించి ప్రవరుడికి చెబుతాడు. ఆ పాదలేపనం ప్రభావంతో ఎక్కడికైనా వాయువేగంతో వెళ్లవచ్చునని సిద్ధుడు చెబుతాడు. అప్పుడు ప్రవరుడు తన మనస్సులో ఇంతకాలం ఉన్న కోరికను

బయటపెడతాడు. తనకి తీర్థయాత్రల పట్ల ఉన్న ఆసక్తి గురించి సిద్ధుడికి చెప్పి, తనకి కూడా కొన్ని క్షేత్రాలను దర్శించే భాగ్యాన్ని ప్రసాదించమని ప్రవరుడు కోరతాడు.

సిద్ధుడు ప్రవరుడు చేసిన అతిథి సేవకి మెచ్చి తన సంచిలో ఉన్న ఒక దంతపుబరిణె తీసి అందులో ఉన్న పసరు ప్రవరుడి కాళ్ళకు పూస్తాడు. ప్రవరుడు ఆ పాదలేపనం ప్రభావంతో హిమాలయాలను చూడాలని కోరుకుని అక్కడికి చేరుకుంటాడు. అక్కడ ఎత్తైన శిఖరాల పైనుంచి జారి పడుతున్న జలపాతాలను తిలకిస్తాడు. నరనారాయణులనే ఋషుల సంచారం చేత పావనం చేయబడ్డ బదరీ వనాల్లో నడుస్తాడు. అలకానది తుంపరలతో చిగిర్చిన కదంబ వృక్షాల మొగ్గలనాశ్రయించిన గండుతుమ్మెదల ఝంకారాలు వింటాడు. భగీరథుడు తపస్సు చేసిన చోటు చూస్తాడు. పార్వతి శివుణ్ణి భర్తగా పొందేందుకు తపస్సు చేసిన ప్రదేశాన్ని చూస్తాడు. కుమార స్వామి జన్మించిన రెల్లు దుబ్బుల ప్రాంతాన్ని చూస్తాడు. హిమాలయ శిఖరాల అందాలను ఆశ్వాదించాడు. అలా తిరిగిన తర్వాత ఎంత చూసినా తనివితీరని ఈ అందాలను తిరిగి రేపు చూద్దాం అని భావించి ప్రవరుడు తిరిగి వెళ్ళబోతాడు. అయితే, అక్కడి మంచు ప్రభావం చేత అతడి పాదాలకున్న పాదలేపనం కరిగిపోతుంది. ప్రవరుడు అక్కడే చిక్కుకుపోతాడు.

ప్రవరుడు తిరిగి ఆలోచనలో పడతాడు. అనవసరంగా ఇంట్లో ఉండక ఇంత దూరం వచ్చాను. రాక రాక హిమాలయాలకేరావాలా? విధి ఎంత బలీయమైనది? భగవంతుడు నన్ను ఈ కొత్త చోట విడిచి వెళ్ళిపోయాడే! ఇక్కడ నుంచి ఇంటికి వెళ్ళడం ఎలా? నాకోసం నా తల్లిదండ్రులు నిరీక్షిస్తుంటారు. నా భార్య నా రాక కోసం ఎదురుచూస్తుంటుంది. అతిథి అభ్యాగతులు ఏమైపోయారో? శిష్యులంతా ఏమైపోయారో?' అంటూ బాధపడతాడు. ఇంటికి వెళ్ళే మార్గం కోసం వెతుకుడం ప్రారంభిస్తాడు.

అలా తిరుగుతున్న ప్రవరుడికి ఒక లోయ కనిపిస్తుంది. ఆవైపు నుంచి గంధర్వగానం వినిపిస్తుంది. అక్కడ ఏదైనా ఆశ్రమం ఉండవచ్చునని భావించి ప్రవరుడు అక్కడికి వెళ్తాడు. అక్కడ ఒక మెట్లదారి కనిపిస్తుంది. ఆ మెట్లు దిగి వెళ్తే చక్కని చెట్లు, తీగలు, పళ్ళు, పూలతో ఒప్పారుతున్న పచ్చలు పొదిగిన ఒక కుటీరం కనిపిస్తుంది. ఆ కుటీరం లోపల మెరుపుతీగ లాంటి శరీరం, తుమ్మెద రెక్కల లాంటి కురులు, చంద్రబింబం వంటి ముఖంగల ఒక దివ్యస్త్రీ కనిపిస్తుంది. ఆమె తన మణిమయమైన కుటీరంలో ఒక తిన్నె మీద కూర్చొని వీణ వాయిస్తూ ఉంటుంది.

ప్రవరాఖ్యుడిని చూడగానే ఆమెకు మోహం కలిగుతుంది. ప్రవరుడికి ఇంత అందం ఎలా వచ్చిందో? ఈ అందగాడు కనుక నన్ను పరిగ్రహిస్తే అంతకంటే కావలసింది ఏమీ లేదు

అనుకుంటుంది. ఆమె అతడి అందానికి మంత్రముగ్ధురాలైపోతుంది. అప్పుడు ప్రవరుడు, 'సుందరీ! ఎవరు నీవు? భయం లేకుండా ఈ వనభూమిలో ఇలా ఒంటరిగా తిరుగుతున్నావు. నేను ఒక బ్రాహ్మణుడను. నా పేరు ప్రవరుడు. ఈ ప్రాంతానికి వచ్చి దారి తప్పి తిరుగుతున్నాను. మా ఊరు వెళ్ళే మార్గం చెప్పి పుణ్యం కట్టుకో' అని అడుగుతాడు.

వరూథిని తన పేరు చెప్పి, హొయలు ఒలకబోస్తూ చిరునవ్వుతో ఇలా అంటుంది 'ఇంతింత కళ్ళు పెట్టుకుని దారి ఎవరిని అడగాలో తెలియదా? అమ్మాయిలతో మాట్లాడడానికి ఇదొక సాకు. నీకు నిజంగానే దారి తెలియదా?' అని అడుగుతుంది. 'మేము అప్సరసలం. లక్ష్మీదేవి తోబుట్టువులం. గానవిద్యలో, కామశాస్త్రంలో నిష్ణాతులం. ఘృతాచి, తిలోత్తమ, హరిణి, హేమ, రంభ మొదలైన వారు నాకు ప్రాణసఖులు. నీవు మా ప్రాంతానికి విచ్చేసిన అతిథివి. నా మణిమయ భవనంలోకి వచ్చి మా ఆతిథ్యం స్వీకరించు' అని పలుకుతుంది.

అప్పుడు ప్రవరుడు, ' ఓ సుకుమారి! నీ ఆతిథ్యం నేను స్వీకరించినట్టే భావించు. కానీ, నేనిక్కడ ఎక్కువసేపు ఉండలేను. నాకు ఇంటి వద్ద చాలా బాధ్యతలు ఉన్నాయి. నన్ను క్షమించు. నేను త్వరగా ఇల్లు చేరే మార్గం చెప్పు. మీవంటి దేవతాస్త్రీలకు చాలా మహిమలుంటాయి కదా. ఎలాగైనా సరే నేను ఇంటికి వెళ్ళే ఉపాయం ఉంటే చెప్పు' అని అడుగుతాడు.

వరూథిని కాస్త చిరాకుపడి, ఊరు ఊరు అంటావు. ఊళ్ళో ఏముంది? నేను నిన్ను ఇష్టపడుతున్నాను. నన్ను స్వీకరించి సంతోషపెడతావో లేక విరహావస్థలో వదిలి వెళ్ళిపోతావో నీ ఇష్టం' అంటూ మనస్సులో మాట బయట పెడుతుంది.

అప్పుడు ప్రవరుడు, ' నీవంటి దేవతాస్త్రీలు ఇలా కోరవచ్చునా? నాకు ఒక కుటుంబం ఉంది. నా భార్య నా కోసం ఎదురుచూస్తూ ఉంటుంది. దయచేసి నేను ఇంటికి వెళ్ళే మార్గం చెప్పు. నేను ఇంటికి చేరకపోతే అన్ని ధర్మాలు చెడిపోతాయి' అని అంటాడు.

వరూథిని, 'ఓ అందగాడా! ఇలాంటి నట్టనడి యౌవనంలో నువ్వు యజ్ఞాలు, యాగాలు అంటూ కూర్చుంటే ఎలా? మీరు ఎన్ని మహాయజ్ఞాలు చేసినా చివరికి స్వర్గంలో మావంటి అప్సరసలతో సుఖించాల్సిందే కదా. స్వర్గంలో ఉండే భోగ వస్తువులన్నీ ఇక్కడే ఉన్నాయి. ఆ ఆనందాన్ని ఇక్కడే అనుభవించు. ఇలాంటి అవకాశం రావాలంటే ఎన్ని జన్మలెత్తాలి? ఉన్న పళంగా సశరీర స్వర్గసుఖాన్ని పొందే అవకాశం వదులుకొని ఉన్న శరీరాన్ని ఉపవాసాలతో క్రుశింపజేయకు. 'ఆనందమే బ్రహ్మ (ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్)' అని నువ్వు నీ వేదంలో చదువుకోలేదా? దాని అంతరార్థం ఏంటో ఆలోచించు' అంటూ వాదిస్తుంది.

అప్పుడు ప్రవరుడు, 'నీవు కామశాస్త్ర ఉపాధ్యాయినిలా మాట్లాడుతున్నావు. ఇలాంటి పాండిత్యం నీ దగ్గరే చూస్తున్నాను. మోక్షాన్ని బోధించే వేదాంత సూత్రాలకు మీ సంప్రదాయంలో చెప్పుకొనే అర్థాలు ఇలాగే ఉంటాయి కాబోలు. ఈ శరీరం, శరీర సుఖాలు అశాశ్వతాలు' అంటూ హితబోధ చేస్తాడు.

మన్మథావేశంలో ఉన్న వరూథినికి ఏం చెప్పాలో తెలియదు. ఆ తాపానికి తట్టుకోలేక ఆమె ప్రవరుడిని కౌగిలించుకుంటుంది. ప్రవరుడు తోసేస్తాడు. మళ్ళీ ఇద్దరూ వాదించుకుంటారు. వరూథిని ఎంత భ్రమపెట్టినా ప్రవరుడు ధర్మమార్గాన్ని మాత్రం వీడడు. వరూథిని ప్రవరుడిని ఒప్పించడానికి శతవిధాల ప్రయత్నిస్తుంది. ప్రవరుడు మాత్రం లొంగడు.

అప్పుడు ప్రవరుడు వేరే మార్గం తోచక అగ్నిదేవుడిని ప్రార్థిస్తాడు. 'ఓ అగ్నిదేవా! నేను దానజపాగ్నిహోత్ర పరతంత్రుడినే అయితే, పరస్త్రీ, పరుల ధనం పట్ల ఆసక్తి లేని వాడినే అయితే నువ్వు నన్ను సూర్యాస్తమయం లోపల ఇంటికి చేర్చు' అని అగ్నిని ప్రార్థిస్తాడు. అగ్ని అతడి ప్రార్థనకి స్పందించి ప్రవరుడిని క్షేమంగా ఇంటికి చేరుస్తాడు. వరూథిని భరించలేని విరహబాధలో మునిగిపోతుంది. ప్రవరుడు తన ముందు నుంచి వెళ్ళిపోయినా, ఆమెకి ఇంకా ఆ ముగ్ధ మనోహర రూపం తన కళ్ళ ముందే ఉన్నట్టు అనిపిస్తుంది. ప్రవరుడు మళ్ళీ ఎక్కడైనా కనిపిస్తాడేమోనని వరూథిని ఆ ప్రాంతమంతా కలియతిరుగుతుంది.

ఎంత వెతికినా ప్రవరుడు కనిపించకపోయేసరికి వరూథిని విరహ తాపంతో రగిలిపోయింది. మనుష్య స్త్రీలకైతే ఇటువంటి విరహం నుంచి విముక్తి పొందడం కోసం చనిపోవడానికైనా అవకాశం ఉంది. దేవతాస్త్రీలకు ఆ అవకాశం లేదు. చెలికత్తెలు ఎంత నచ్చజెప్పినా వరూథిని ప్రవరుడిని మాత్రం మర్చిపోలేకపోతుంది. వరూథిని ప్రవరుడినే తలుచుకుంటూ నిద్రాహారాలు మానేస్తుంది. చెలికత్తెలు వరూథినిని ఇంటికి తీసుకువెళ్తారు. ఆమెకు చెలికత్తెలు రకరకాల ఉపచారాలు చేస్తారు. వరూథిని మాత్రం ప్రవరుడినే తలుచుకుంటూ కాలం గడుపసాగింది.

అదే సమయంలో ఒక గంధర్వుడు ఆ వనానికి వస్తాడు. వాడు ఇంతకుముందే వరూథిని మోహించినవాడు. కానీ, వరూథిని అతడిని తిరస్కరించింది. ఆ గంధర్వుడికి ప్రవరుడి కథంతా తెలిస్తుంది. వరూథినిని ఎలాగైనా దక్కించుకోవాలనే కోరికతో సరైన సమయం కోసం ఎదురుచూసి, తనకున్న కామరూపధారణ శక్తితో ప్రవరుడి రూపం ధరించి, వరూథిని తిరిగే వనంలోకి ప్రవేశిస్తాడు. మయాప్రవరుడు కనిపించగానే వరూథిని మనస్సు పులకించిపోతుంది. నడక తొట్రుపడింది. కళ్ళలో నీరు నిండింది. ఆమె అతడి వద్దకు వెళ్లి గద్గద స్వరంతో, 'ఓ ప్రవరాఖ్యా! నీ మొండి పట్టుదల మాని

నన్ను ఏలుకో. నేను ఈ విరహవేదనకి తాళలేకపోతున్నాను. నన్ను నీదానిని చేసుకో' అంటూ ప్రాధేయపడుతుంది.

మయాప్రవరుడు సజ్జనుడిలా నటిస్తూ 'ఓ సుందరీ! నాకున్న బాధ్యతలను విస్మరించడం ఇష్టం లేక, నా తల్లిదండ్రులు, నా భార్య కనిపించలేదనే మనస్తాపంతో నిన్ను తిరస్కరించానే కానీ వేరే ఉద్దేశ్యంతో కాదు. ఇక్కడి నుంచి వెళ్ళే మార్గం ఎలాగో తెలియడం లేదు. ఈ జీవితం ఎలాగో వృథానే. ఇంతమాత్రం దానికి నువ్వు ఇంత ప్రాధేయపడుతున్నావు కనుక నీ కోరికని ఇంక కాదనలేకపోతున్నాను. ఈ జీవితం మరొకరికి ఆనందాన్ని కలిగిస్తే నాకు అదే చాలు. నా జన్మ ధన్యం. అయితే ఒక షరతు. మా దేశంలో ఆచారం ప్రకారం సంభోగ సమయంలో నువ్వు కళ్ళు మూసుకోవాలి. కళ్ళు తెరిస్తే పాపం. ఈ షరతుకి నువ్వు ఒప్పుకుంటే సరే. లేదంటే నా దారి నేను చూసుకుంటాను' అని చెబుతాడు. వరూథిని ముఖం విప్పారింది. 'నువ్వు ఎలా చెప్తే అలాగే వింటాను' అని మాయప్రవరుడు పెట్టిన షరతుకి ఒప్పుకుంటుంది.

మాయాప్రవరుడు వరూథిని చాలా కాలం యథేచ్ఛగా సుఖించారు. కొన్నాళ్ళకు వరూథిని గర్భం దాల్చింది. గంధర్వుడికి ఆమె మీద మోజు తీరిపోతుంది. పైగా తాను ఇంకా ఇక్కడే ఉంటే గుట్టు రట్టయ్యే ప్రమాదముంది. దివ్యకాంత కదా, శాపం ఇచ్చినా ఇస్తుంది అని భావించి మయాప్రవరుడు వెళ్ళిపోవాలని నిర్ణయించుకుంటాడు. ఒక రోజు తనకి పాదలేపనం పూసిన సిద్ధుడు ఇక్కడికి వచ్చాడని, తన నివాసం ఎలా ఉందో చక్కదిద్దుకుని వస్తానని చెప్పి, వరూథినిని గంధర్వుడు ఏదో ఒక రకంగా ఒప్పించి అక్కడి నుంచి వెళ్ళిపోతాడు.

వరూథినికి నెలలు నిండాయి. ఒక శుభముహూర్తంలో తేజోశాలి అయిన ఒక బాలుడికి జన్మనిచ్చింది. మునులు ఆ బాలుడికి స్వరోచి అని నామకరణం చేశారు. స్వరోచి అన్ని విద్యలు నేర్చుకొని, మంధర పర్వతం మీద విశ్వకర్మ నిర్మించిన నగరంలో ఉండి, ఆటవికుల సామ్రాజ్యాన్ని ఏలసాగాడు. ఒక రోజు స్వరోచి వేటకు వెళ్తాడు. కాసేపటికి వేట చాలించి, అడవిలో సేదతీరుతుండగా ఎవరో రక్షించమని అరుస్తున్నట్టు వినిపిస్తుంది. అంతలోనే ఒక స్త్రీ పరిగెత్తుకుంటూ వచ్చి ఆయన ముందు నిలిచి, తనను రక్షించమని రాజును వేడుకుంటుంది. అప్పుడు స్వరోచి తన కథ ఏంటో చెప్పమని అడుగుతాడు. నీకు వచ్చిన ప్రమాదం ఏంటని అడుగుతాడు. ఆమె తనని మూడు రోజుల నుంచి ఒక రాక్షసుడు తనని వెంబడిస్తున్నాడని చెబుతుంది.

'నేను విద్యాధర రాజు కుమార్తెను. నా పేరు మనోరమ. పారుడనే ఋషి కూతురు కళావతి, మందారుడి కూతురైన విభావసి నాకు చెలికత్తెలు. ఒక రోజు నేను వాళ్ళిద్దరితో కలిసి వెండికొండ

మీద పూలు కోసుకుంటున్నప్పుడు ఓ గుహలో తపస్సు చేసుకుంటున్న ఒక ఋషిని చూశాం. బాల్యచాపల్యం వల్ల నేను జుట్టుతో నిండిపోయిన ఆయన ముఖాన్ని తాకాను. దాంతో మునికి ధ్యాన భంగమైంది. ఆయన కళ్ళు తెరిచి నన్ను విపరీతమైన క్రోధంతో తిట్టేశాడు. నన్ను నిష్కారణంగా వేధించావు కనుక ఒక రాక్షసుడి బారిన పడతావు. వాడు కూడా నిన్ను ఇలాగే వేధిస్తాడని శపించాడు. నన్ను కొడుతున్న మునిని అడ్డుకున్నందుకు నా చెలికత్తెలను క్షయరోగులు కమ్మని శపించాడు'.

ఆ శాపం ఫలితంగానే మూడు రోజుల నుండి ఈ రాక్షసుడు నన్ను తరుముతున్నాడు. 'రాజా! నేను నీకు అస్త్రహృదయం అనే విద్యను నేర్పిస్తాను. దానితో శత్రువులనందరినీ జయించవచ్చు. ఇది నేర్చుకొని ఆ రాక్షసుడి బారినుంచి నన్ను రక్షించు' అని వేడుకుంటుంది. రాజు ఘోరమైన యుద్ధం చేసి ఆ రాక్షసుడిని జయిస్తాడు. కానీ, శరీరాన్ని త్యజిస్తూనే ఆ రాక్షసుడు సర్వాంగ సుందరమైన ఒక గంధర్వుడి రూపం దాలుస్తాడు. అది చూసి స్వరోచి ఆశ్చర్యపోతాడు.

అప్పుడు ఆ గంధర్వుడు, ' ఓ రాజా! నేను ఇందీవరాక్షుడనే గంధర్వుడను. నీ తల్లి వరూథినికి సోదరుడను. ఒక ముని శాపం వల్ల నరమాంసం తినే రాక్షసుడినై నా సొంత కూతురైన మనోరమను చంపడానికి సిద్ధపడ్డాను. నీ పుణ్యమా అని నాకు ఆ రాక్షస జన్మ నుంచి విముక్తి లభించింది' అని పలుకుతాడు. అప్పుడు స్వరోచి పూర్తి కథ చెప్పమని అడగగా ఇందీవరాక్షుడు చెప్పడం ప్రారంభించాడు. ' నా తండ్రి నలనాభుడనే గంధర్వుడు. నేను బ్రహ్మమిత్రుడనే ఆయుర్వేద గురువు దగ్గర విద్య నేర్చుకునేందుకు వెళ్ళాను. నట, విట, గాయక, గణికా జనాలతో తిరిగే నీవంటి వారికి నేను విద్య నేర్పనని ఆ గురువు నన్ను దుర్భాషలాడి పంపేశాడు. నేను మయావేషంలో శిష్యసమూహంలో చేరి ఎనిమిది నెలల్లో ఆయుర్వేద విద్యను నేర్చుకున్నాను. అది తెలుసుకున్న బ్రహ్మమిత్రుడు ఆగ్రహించి రాక్షసుడివి అవుతావని శపించాడు. అయితే, క్షమించమని ప్రార్థిస్తే, 'నీ కూతురిని వెంబడిస్తుంటే ఒక రాజు బాణాల వల్ల తిరిగి నీ రూపాన్ని పొందుతావు' అని సవరణ చేశాడు. అలాగే జరిగింది.

నువ్వు నాకు చేసిన ఉపకారానికి కృతజ్ఞతగా నా బిడ్డ మనోరమను, నేను నేర్చిన ఆయుర్వేద విద్యను నీకు ఇస్తాను. స్వీకరించు' అని కోరతాడు. స్వరోచి అందుకు అంగీకరిస్తాడు. స్వరోచి మనోరమల వివాహం వైభవంగా జరిగింది. వివాహం అయిన తర్వాత తొలిరాత్రి రోజు మనోరమ దిగులుగా ఉండడం చూసి స్వరోచి కారణం అడుగుతాడు. అప్పుడు మనోరమ తన చెలికత్తెలు క్షయవ్యాధితో బాధపడుతుంటే తాను ఆనందంగా ఎలా ఉండగలను? అని బాధపడుతుంది. అప్పుడు రాజు తన చెలికత్తెలను చూపించమని మనోరమను అడుగుతాడు. తనకి తెలిసిన ఆయుర్వేద

వైద్యంతో స్వరోచి వారి వ్యాధిని నయం చేస్తాడు. కళావతి, విభావసి తమ తమ కథలను రాజుకి చెప్పి వాళ్ళ కోరిక మేరకు వాళ్ళను పెళ్లి చేసుకుని వారి విద్యలను సైతం నేర్చుకుంటాడు. స్వరోచి ముగ్గురితోనూ హాయిగా చాలా కాలం సంసారం చేస్తాడు. ముగ్గరు కొడుకులు పుట్టాక వారికి మూడు పట్టణాలను అప్పగిస్తాడు.

స్వరోచి మరొకసారి వేటకు వెళ్ళినప్పుడు ఒక అడవి పందిని వేటాడబోతాడు. అప్పుడు ఒక లేడి అడ్డుకుని మనుష్య భాషలో, 'ఓ రాజా! దాన్ని చంపితే నీకు ఏం వస్తుంది. నన్ను చంపు' అంటుంది. ఆశ్చర్యపోవడం స్వరోచి వంతవుతుంది. 'ఎందుకు చావాలనుకుంటున్నావ్'? అని స్వరోచి అడిగిన ప్రశ్నకి జవాబుగా ఆ లేడి 'కోరుకున్న వారు దక్కనప్పుడు మరణమే శరణ్యం' అని చెబుతుంది. అప్పుడు స్వరోచి నువ్వు ఎవరిని ప్రేమించావో చెప్పమని అడుగుతాడు. 'నేను మనసుపడింది నీ మీదే' అని చెబుతుంది. రాజు, 'నీవు లేడివి. నేను మనిషిని. ఇదెలా సాధ్యపడుతుంది?' అని అడుగుతాడు. తనని ఒకసారి కౌగిలించుకోమని ఆ లేడి అడుగుతుంది. రాజు అలాగే చేస్తాడు. వెంటనే ఆ లేడి ఆ క్షణమే అసాధారణమైన సౌందర్యంగల వనదేవతగా మారిపోతుంది. 'ఓ రాజా! నీ వల్ల మనువును సంతానంగా పొందమని దేవతలు నన్ను కోరారు' అని ఆ వనదేవత స్వరోచికి చెబుతుంది. స్వరోచి అందుకు అంగీకరిస్తాడు. వారికి పుట్టిన కుమారుడే స్వారోచిష మనువు. స్వారోచిషుడు విష్ణువు గురించి తపస్సు చేస్తాడు. దేవుడు ప్రత్యక్షమై వరం కోరుకోమంటే, ఎల్లప్పుడూ నీ చెంతనే ఉండిపోయేలా దీవించమని కోరుకుంటాడు. అప్పుడు నారాయణుడు ముందు కొంతకాలం రెండవ మనువై లోకాన్ని ధర్మబద్ధంగా పాలించమని, తర్వాత కొంత కాలానికి ముక్తి తథ్యం అని చెబుతాడు.

స్వారోచిష మనువు పాలనలో ప్రజలు ఆయురారోగ్య ఐశ్వర్యాది సకల సుఖాలతో హాయిగా, ధర్మబద్ధంగా జీవిస్తారు'.

## 1.6. మార్కండేయ పురాణం : మనుచరిత్ర – వ్యత్యాసం

*మనుచరిత్ర* కథకు మూలం *మార్కండేయపురాణం.* మారన తెలుగు చేసిన *మార్కండేయపురాణంలో* *మనుచరిత్ర* 150 పద్యాల్లో ఉంది. అల్లసాని పెద్దన సంస్కృతాంధ్ర *మార్కండేయపురాణా*లను అనుసరించి ప్రబంధోచితమైన మార్పులు చేసి 667 పద్యగద్యాల్లో రచించాడు.

పురాణానికి, కావ్యానికి చాలా తేడా ఉంటుంది. అందుకే పురాణాలని మిత్రసమ్మతాలని, కావ్యాలను కాంతాసమ్మతాలని అంటారు. పురాణాల్లో కథ ఒక పంథాలో సాగిపోతూ ఉంటుంది. కావ్యాల్లో కథ అలా ఉండదు. కొంత నాటకీయత తోడవుతుంది. వర్ణనలు పెరుగుతాయి. మొత్తం మీద కావ్యం పాఠకుడికి ఒక చిత్రం చూసిన భావనను కలుగజేస్తుంది. కావ్యంలో కథ రక్తి కట్టించడం కోసం కవులు కథలో అక్కడక్కడా స్వల్పమైన మార్పులు చేస్తుంటారు. అల్లసాని పెద్దన కూడా *మనుచరిత్ర*లో అటువంటి మార్పులే కొన్ని చేశారు. మూల విధేయంగానే రచన సాగినప్పటికీ, కేవలం కావ్యానికి కావలసిన స్వల్పమైన మార్పులు మాత్రమే పెద్దన చేశారు.

అల్లసాని పెద్దన సంస్కృతాంధ్ర మార్కండేయపురాణాలు రెండు క్షుణ్ణంగా అర్థం చేసుకుని *మనుచరిత్ర* కావ్యాన్ని రచించారు. సంస్కృతాంధ్ర మార్కండేయ పురాణాలు ప్రవరుని వయస్సు గురించి కానీ, వైవాహిక, కౌటుంబిక విషయాల గురించి గానీ ప్రస్తావించలేదు. కానీ, పెద్దన ఆ విషయాలను ఈ కింది పద్యంలో స్పృశించారు.

ఉ. యౌవనమందు యజ్వయు ధనాఢ్యుఁడునై కమనీయ కౌతుక
శ్రీవిధిఁ గూఁకటుల్ గొలిచి చేసిన కూరిమిసోమిదమ్మ సౌ
ఖ్యావహయై భజింప సుఖులై తలిదండ్రులుగూడి దేవియున్
దేవరవోలెనుండి యిలు దీర్పఁగఁ గాఁపుర మొప్పు వానికిన్. (*మను. 1: 53*)

పై పద్యంలో ప్రవరుడు చిన్న వయస్సులోనే యజ్ఞం చేసి ధనవంతుడై, ఇష్టసఖియైన తన భార్యని, పార్వతీపరమేశ్వరుల వంటి తల్లిదండ్రులని, క్షేమంగా చూసుకుంటూ ఉండేవాడని పెద్దన వర్ణించారు. ఇలా చెప్పడం వల్ల ప్రవరుడికి గృహకృత్యాల గురించి ఏ చింత లేదని, తన కాలమంతా ధర్మరక్షణకై వెచ్చించవచ్చని పెద్దన ధ్వనింపజేశాడు.

ప్రవరుడి వైరాగ్యం గురించి పెద్దన అక్కడక్కడా ప్రస్తావించడం కనిపిస్తుంది. అలా చెప్పి ప్రవరుడి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాడు పెద్దన. తర్వాత కథలో వరూథిని ప్రవేశించాక ప్రవరుడు ఇంద్రియ నిగ్రహాన్ని కలిగి ఉండడానికి అతనికి ఉన్న వైరాగ్యం, ధర్మనిష్ఠ కారణాలని చిత్రించడంలో పెద్దన నేర్పు కనిపిస్తుంది. ఈ చిన్న మార్పు చాలా సమంజసంగా అనిపిస్తుంది.

ఇక *మనుచరిత్ర*లో అత్యంత కీలకమైన ఘట్టం వరూథినీప్రవరుల వృత్తాంతం. ఈ సందర్భంలో పెద్దన చేసిన వర్ణనలు ఈ ఘట్టానికి మరింత అందాన్ని తెచ్చిపెట్టాయి. కేవలం ఒక

కథలా చెప్పుకుంటూ వెళ్ళిపోకుండా వరూథిని, ప్రవరుల పాత్రలకు తుది మెరుగులు దిద్ది, ఔచిత్యం దెబ్బ తినకుండా పెద్దన కథను నడిపించిన తీరు పాఠకులను కట్టి పడేస్తుంది. ఈ ఘట్టంలో వరూథినీ ప్రవరుల చతుర సంభాషణలు, కల్పనలు అన్నీ పెద్దన స్వకపోల కల్పితాలనే చెప్పాలి. తన జిగిబిగి కలిగిన రచనాశైలితో పెద్దన ఈ ఘట్టాన్ని రసరమ్యంగా తీర్చిదిద్దాడు.

స్వరోచి వేటకు వెళ్ళే ఘట్టంలో చేసిన వర్ణనలు కూడా పెద్దన స్వకపోల కల్పితాలే. అరణ్య వర్ణన, రాక్షసుడి స్వరూప వర్ణన మొదలైన చోట్ల పెద్దన తన వర్ణనాకౌశలాన్ని ప్రదర్శించారు.

మూలంలో, ఇందీవరాక్షుడు స్వరోచికి మనోరమని ఇచ్చి వివాహం చేయాలని నిశ్చయించుకున్న సందర్భంలోనే మనోరమ స్వరోచిని అడిగి తన చెలికత్తెలను క్షయవ్యాధి బారి నుంచి రక్షింపజేసిందని ఉంది. పెద్దన ఈ సంఘటన స్వరోచి మనోరామల వివాహం అయ్యాక తొలిరాత్రి రోజు జరిగిందని *మనుచరిత్ర*లో మార్పు చేశారు.

కావ్యంగా *మనుచరిత్ర*ను మలిచే క్రమంలో అక్కడక్కడా ఔచిత్యం దెబ్బ తినకుండా చేసిన మార్పులే తప్ప పెద్దన మూల విధేయంగానే *మనుచరిత్ర*ను రచించాడు. నిజానికి ఒక పురాణంలో ఉన్న ఒక కథను తీసుకుని కావ్యంగా మలచాలంటే ఆ మాత్రం మార్పులు చేయడం అవసరమే. చివరిగా పెద్దన మార్కండేయ పురాణంలో ఉన్న ఒక కథను తీసుకొని, స్వల్పమైన మార్పులు చేసి, అనితరసాధ్యమైన శైలిలో ఒక రసరమ్యమైన కావ్యంగా *మనుచరిత్ర*ను నిర్మించడంలో కృతకృత్యుడయ్యాడని చెప్పాలి. అందుకే నేటికీ *మనుచరిత్ర* గొప్ప ప్రబంధంగా ప్రజల గుండెల్లో నిలిచిపోయింది.

## 1.7. మనుచరిత్రలో పాత్రలు : వ్యక్తిత్వ వికాసం

*మార్కండేయ పురాణం*లో ఉన్న ఒక కథ ఆధారంగా పెద్దన *మనుచరిత్ర*ను రచించాడు. *మార్కండేయ పురాణం*లో ఉన్న పాత్రల్లో ఎటువంటి మార్పులు చేయలేదు. అయితే, పెద్దన తనదైన శైలిలో *మనుచరిత్రని* రసరమ్యమైన కావ్యంగా తీర్చిదిద్దే క్రమంలో, ప్రతి పాత్రని మరింత శ్రద్ధగా మలిచాడు. తన వర్ణనకౌశలంతో పెద్దన పాత్రల ఔన్నత్యాన్ని మరింత పెంచాడు. తన కావ్యం సమాజానికి ఒక చక్కటి సందేశాన్నిస్తూనే, పాఠకులకు దిశానిర్దేశం చేయాలని పెద్దన తపించాడు. ప్రవరుడి పాత్రతో మొదలుకొని ప్రతి పాత్ర వ్యక్తిత్వం వికసించే దిశగా తోడ్పడేవి.

ఒక దేశం గొప్పతనం ఆ దేశంలో ఉండే పౌరులపై ఆధారపడి ఉంటుంది. అదే విధంగా, మనుచరిత్ర కావ్యంలో వ్యక్తిత్వ వికాసం అంతర్లీనమైన భాగమే అయినా, కావ్యంలో ఉండే పాత్రల

వల్లే కావ్యానికి ఆ సార్థకత చేకూరింది. పెద్దన ఆ పాత్రలను మలిచిన తీరు *మనుచరిత్ర*ని వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే కావ్యంగా నిలిపింది.

నిజానికి ప్రతి వ్యక్తి తనని తాను *మనుచరిత్ర*లో పాత్రలతో పోల్చుకోవచ్చు. రకరకాల సందర్భాల్లో రకరకాల వ్యక్తులు రకరకాలుగా ప్రవర్తించడం *మనుచరిత్ర*లో కనిపిస్తుంది. అచ్చంగా చెప్పాలంటే, *మనుచరిత్ర* మన నిత్యజీవితానికి ప్రతిబింబం. *మనుచరిత్ర*లో పెద్దన చేసిన పాత్ర చిత్రణ ఒక సజీవ సృష్టి. *మనుచరిత్ర*లో పాత్రలు అంత సజీవంగా ఉంటాయి కాబట్టే 'మనుచరిత్ర మన చరిత్రే' అన్నారు ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు.

*మనుచరిత్ర*లో చాలా పాత్రలు ఉన్నాయి. అయితే, వ్యక్తిత్వ వికాస కోణంలో మాత్రమే ఆ పాత్రలను ఇక్కడ పరిశీలించడం జరుగుతుంది.

## 1.7.1. ప్రవరుడు

సంస్కృతంలో ద్విజాతిప్రవరుడు అని ఉన్న ఈ పాత్రను, పెద్దన మాత్రం మారన మార్కండేయపురాణాన్ని అనుసరించి ప్రవరుడు అని కొనసాగించాడు. ద్విజాతిప్రవరుడు అంటే బ్రాహ్మణ శ్రేష్ఠుడు అని అర్థం. ప్రవరుడి గురించి పెద్దన చెప్పిన ఈ పద్యం మనుచరిత్రలో అత్యంత ప్రాచుర్యం పొందిన పద్యాల్లో ఒకటి.

ఉ. ఆపురిఁ బాయకుండు మకరాంకశశాంక మనోజ్ఞమూర్తి భా
షాపరశేషభోగి వివిధాధ్వర నిర్మల ధర్మ కర్మ దీ
క్షా పరతంత్రుఁ డంబురుహగర్భ కులాభరణం బనారతా
ధ్యాపన తత్పరుండు ప్రవరాఖ్యుఁ డలేఖ్య తనూవిలాసుఁడై. (*మను. 1 :51*)

ఇది ప్రవరుని పాత్రను *మనుచరిత్ర*లో పెద్దన పాఠకులకు పరిచయం చేసిన తీరు. ఈ పద్యం నిజానికి ప్రవరుని వృత్తి గురించి, గొప్పతనాన్ని గురించి చెప్పేదే అయినా, కాస్త నిశితంగా పరిశీలిస్తే గొప్ప సందేశం ధ్వనిస్తుంది.

ప్రవరుడిని భాషాపరశేషభోగిగా, వివిధాధ్వరనిర్మలధర్మకర్మ దీక్షాపరతంత్రుడిగా, అనారతాధ్యాపన తత్పరుడిగా పెద్దన చిత్రించాడు. 'శేషభోగి' అంటే ఆదిశేషువు. ప్రవరుడు భాష

విషయంలో మరో ఆదిశేషువని పెద్దన ఉద్దేశ్యం. పాముకి రెండు నాలుకలుంటే, ఆదిశేషువుకి రెండువేల నాలుకలుంటాయి. అంటే ప్రవరుడు గొప్ప వాక్చాతుర్యం, మాటతీరు కలవాడని అర్థం.

'వివిధాధ్వరనిర్మలధర్మకర్మ దీక్షాపరతంత్రుడు' అంటే పలు రకాలైన యజ్ఞాలు, పుణ్యకార్యాలు దీక్షగా చేసేవాడు అని అర్థం. ప్రవరుడు క్రమశిక్షణ, పట్టుదల కలవాడు. ఒక మంచి పనిని తలపెడితే దాన్ని దీక్షగా భావించి పూర్తి చేస్తాడని, ధర్మానికి కట్టుబడి జీవిస్తాడని పెద్దన ఉద్దేశ్యం.

'అనారతాధ్యాపన తత్పరుడు' అంటే ఎల్లప్పుడూ వేదాధ్యయనం చేయడంలో ఆసక్తి కలవాడని అర్థం. అంటే జ్ఞాన సముపార్జన పట్ల ఆసక్తి కలవాడని స్పష్టమవుతోంది.

యావద్భారతీయ సంస్కృతికీ, జీవన విధానానికి ఈ పద్యం ప్రతిబింబంగా నిలుస్తుంది. ఒక వ్యక్తి ఆదర్శవంతమైన జీవితాన్ని జీవించాలంటే చక్కటి మాటతీరు కలిగి ఉండాలి, ధర్మానికి కట్టుబడి ఉంటూ మంచి పనులు చేయాలి, నిత్యం జ్ఞానసముపార్జన, విద్యాధ్యయనం పట్ల ఆసక్తి, జిజ్ఞాస కలిగి ఉండాలి అని పెద్దన చెప్పకనే చెప్పారు.

చివరిదైనా చిన్నది కాని మాట. 'ఆపురిఁ బాయకుండు' అంటే ఆ ఊరిని విడిచి ఉండడని అర్థం. ఎన్ని మంచి పనులు చేసి ఎంత కీర్తిని సంపాదించినా, ఎంత జ్ఞానాన్ని పొందినా తిరిగి నీ దేశానికి, నీ గ్రామానికి ఆ జ్ఞానాన్ని అందించాలి. నువ్వు ఎదిగిన ప్రాంతాన్ని మర్చిపోకూడదు అనే భావం ఆ పదంలో ధ్వనిస్తోంది. పైచదువుల పేరు మీద విదేశాలకు వెళ్లి అక్కడే స్థిరపడిపోతున్న యువతకి ఈ పద్యం ఒక గుణపాఠం.

మొదటి పద్యంలోనే ప్రవరుడి పాత్రను ఇంత ఆదర్శవంతంగా చిత్రించాడు పెద్దన. ఈ పద్యం ప్రవరుడిని పరిచయం చేసేది మాత్రమే. కావ్యంలో కథ నడిచేకొద్దీ పెద్దన ఆ పాత్రను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దాడు. నిజానికి వ్యక్తిత్వం వికసించడానికి ప్రవరుడి పాత్ర ఒక్కటి చాలు. అందుకు ప్రవరుడి పాత్రను పెద్దన తీర్చిదిద్దిన విధానమే నిదర్శనం.

## 1.7.2. సోమిదమ్మ

ప్రవరుడి భార్య సోమిదమ్మ. అంటే సోమయాజి భార్య అని అర్థం. కేవలం ఒకే ఒక్క తేటగీతి పద్యంలో సోమిదమ్మను వర్ణిస్తాడు పెద్దన. కానీ, ఆ చిన్న పద్యం ఎంతో గొప్ప సందేశాన్నిస్తుంది. ఒకే ఒక్క పద్యంలో ఒక గొప్ప పాత్ర ఔన్నత్యాన్ని చెప్పడం పెద్దనకే చెల్లింది. నిజానికి ఈ పాత్ర లేకపోతే ప్రవరుడు యజ్ఞాలు, యాగాలు చేయలేడు. దానధర్మాలు చేయలేడు. సంసార సాగరాన్ని ఈదలేడు.

ప్రవరుడు చేసే ప్రతి మంచి పని వెనుక సోమిదమ్మ పాత్ర ఉంది. ప్రవరుడు ధర్మమార్గాన్ని వీడకపోవడానికి ఆమే కారణం. ప్రవరుడి వ్యక్తిత్వం ప్రకాశించడానికి సోమిదమ్మే హేతువు.

సోమిదమ్మ ప్రవరుడి పట్ల ఎంత అంకితభావంతో మెలగకపోతే ప్రవరుడు అపురూపసౌందర్యవతి అయిన వరూథినిని తిరస్కరిస్తాడు? సోమిదమ్మ పాత్రని పెద్దన పెద్దగా వర్ణించకపోయినా అంతర్లీనంగా ప్రవరుడి వ్యక్తిత్వాన్ని నిర్మించడంలో అమెది కీలకమైన పాత్ర అని చెప్పకనే చెప్పాడు.

తే. వండ నలయదు వేవురు వచ్చిరేని
నన్నపూర్ణకు నుద్దియౌనతని గృహిణి
నతిథు లేతేర నడికి రేయైనఁ బెట్టు
వలయు భోజ్యంబు లింట నవ్వారి గాఁగ. (*మను. 1 – 56*)

ప్రవరుని భార్య సాక్షాత్తు అన్నపూర్ణాదేవి వంటిది. ఇక్కడ అన్నపూర్ణ అనడం సార్థకం. కాశిలో అన్నపూర్ణ వ్యాసుడికి, అతడి శిష్యులకి భోజనం పెట్టిన సన్నివేశాన్ని శ్రీనాథుడు భీమేశ్వర పురాణంలో చాలా గొప్పగా వర్ణించాడు. అందుకే అతిథులకు కడుపు నిండా భోజనం పెట్టిన స్త్రీలను అన్నపూర్ణతో పోలుస్తారు.

సోమిదమ్మ వెయ్యి మంది అతిథులు ఇంటికి వచ్చినా అలిసిపోకుండా వంట చేసి పెడుతుంది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఏ సమయంలో అతిథి వచ్చినా అన్నం పెట్టేది. అంటే ప్రవరుని ఇంట్లో నిత్యం అన్నదాన సంతర్పణ జరుగుతూ ఉంటుంది.

ఇది చాలా గొప్ప ఆచారం. నిజానికి ఆచారాలు అంటే గుడ్డి నమ్మకాలు కాదు. ఒక జాతి సంస్కృతికి పట్టుగొమ్మలు. సోమిదమ్మ ఆనాటి గృహిణులకు ప్రతినిధి. ప్రతి ఇంట్లోనూ ఇలా అతిథులను ఆదరిస్తే పేదరికం ఎక్కడ ఉంటుంది? అందుకే 'అక్కడ పుట్టిన చిగురు కొమ్మైన చేవ' అని పెద్దన మరో పద్యంలో అన్నారు. మనిషి స్వార్థాన్ని విడనాడి సమాజాన్ని ప్రేమించే స్థాయికి చేరుకోవడమే వ్యక్తిత్వ వికాసం. ఇవాళ ఎవ్వరికీ పక్కవారి జీవితంతో సంబంధం ఉండడం లేదు. తాను హాయిగా జీవిస్తే చాలు అని ప్రతి ఒక్కరూ భావిస్తున్నారు. పై పద్యంలో 'అతిథులు' అన్నారే కాని ఏ కులమో, మతమో చెప్పలేదు. అంటరానితనం నేటికీ బలంగా ప్రబలుతున్న ఈ సమాజంలో మనిషి తనకి తోటివారికి మధ్య ఎన్నో గోడలు నిర్మించుకుని అందరికీ దూరామైపోతున్నాడు. ఆ దశ

నుంచి అందరినీ నిస్వార్థంగా ప్రేమించే దశకి చేరుకోవడమే అసలైన వ్యక్తిత్వం. సోమిదమ్మ పాత్రని పెద్దన చిత్రించిన తీరు ఈ కాలం మనుషులకి ఆదర్శంగా నిలుస్తుంది.

## 1.7.3. సిద్ధుడు

*మనుచరిత్ర* మొత్తం కావ్యానికి సిద్ధుడి పాత్ర వల్లే బీజం ఏర్పడింది. ఇది చిన్న పాత్రే అయినా చాలా కీలకమైన పాత్ర. తీర్థయాత్రలు చేస్తూ ఉండే ఈ సిద్ధుడు ఒక రోజు ప్రవరుడి ఊరికి వస్తాడు. ప్రవరుడి ఆహ్వానం మేరకు అతడి ఇంటికి వెళ్లి వారి ఆతిథ్యం స్వీకరిస్తాడు. సిద్ధుడు గొప్ప లోకజ్ఞానం కలవాడు. ప్రవరుడి ఆతిథ్యానికి మెచ్చి గృహస్థు గొప్పతనాన్ని కొనియాడతాడు. ప్రవరుడికి పాదలేపనం పూసి తీర్థయాత్రలు చేసేందుకు సహకరిస్తాడు. ఒక గృహస్థుడి వల్ల సమాజానికి ఎంత మేలు జరుగుతుందో ప్రవరుడికి వివరిస్తాడు. ఆయన మాటలు నేటికీ అనుసరణీయం. వ్యక్తిత్వం వికసించడానికి సిద్ధుడి మాటలు ప్రేరణగా నిలుస్తాయి.

## 1.7.4. వరూథిని

ప్రవరుడి వ్యక్తిత్వం గొప్పదే అయినా ఆయన మనోనిగ్రహానికి పరీక్ష పెట్టింది వరూథిని పాత్రే. అనుభవానికి వస్తే కాని కొన్ని సందర్భాల్లో మనిషి ఎలా ప్రవర్తిస్తాడో చెప్పలేం.

వరూథిని పరిచయం అయ్యేనాటికే ప్రవరుడు గొప్పవాడైనప్పటికీ అతడి మనోనిగ్రహానికి పరీక్ష పెట్టి ప్రవరుడి పాత్రకి మరింత ఔన్నత్యాన్ని సంతరింపజేసింది వరూథిని పాత్రే. వరూథిని పాత్ర ఈరోజు ప్రతి మనిషి ఎదుర్కొనే వ్యామోహాలకి ప్రతిక. ధర్మమార్గంలో నడిచేవారికి జీవితంలో ఇలాంటి పాత్రలే ఎదురయ్యి పరీక్ష పెడుతుంటాయి. వరూథిని చక్కటి మాటకారి. తన మాటలతో ప్రవరుడిని బుట్టలో వేసుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తుంది. గొప్ప మనోనిగ్రహం కల ప్రవరుడి వంటి వారు తప్ప మరెవరైనా సరే వరూథిని మాటలకు మాయలో పడపోకుండా ఉండలేరు. సగటు మనిషి నిత్య జీవితంలో ఎదురయ్యే ఆకర్షణలు మనిషిని ఎంతగా మభ్య పెడతాయో వరూథిని పాత్ర ద్వారా అర్థం చేసుకోవచ్చు.

మూలంలో ఉన్న దానికంటే వైవిధ్యంగా వరూథిని పాత్రను పెద్దన తీర్చిదిద్దాడనడంలో ఏ సందేహం లేదు. ప్రవరుడి ధర్మనిష్ఠకి వరూథిని పాత్ర అగ్నిపరీక్ష వంటిది. పరీక్ష పెడితేనే ఎవరి గొప్పతనం ఎంతో తెలిసేది. మాటల్లో అందరూ మంచివాళ్ళే, మనోనిగ్రహం కలవారే. కానీ ఆచరణకి వచ్చేసరికి చాలా మంది పట్టు తప్పుతారు. తన మాటకారితనంతో, అందంతో, ప్రేమతో వరూథిని

ప్రవరుడిని చాలా మభ్య పెడుతుంది. కానీ స్వతఃసిద్ధంగా ధర్మనిష్ఠ కలవాడు కాబట్టీ, వైరాగ్యం కలవాడు కాబట్టే అగ్నిపరీక్షకి తట్టుకొని ప్రవరుడు నిలబడ్డాడు.

*మనుచరిత్ర* మొత్తానికి అత్యంత ఆకర్షణీయమైనది, కీలకమైనది వరూథిని పాత్ర.

ఉ. ఇంతలు కన్నులుండఁ దెరు వెవ్వరి వేఁడెదు భూసురేంద్ర యే
కాంతమునందు నున్న జవరాండ్ర నెపంబిడి పల్కరించులా
గింతయు కాక నీ వెఱుఁగవే మును వచ్చిన త్రోవ చెప్పు నీ
కింత భయంబు లే కడుగ నెల్లిద మైతిమి మాట లేటికిన్. (*మను. 2 – 41*)

ప్రవరుడు వరూథినిని ఇంటికి వెళ్ళే మార్గం అడిగినప్పుడు వరూథిని ప్రవరునితో ఇలా పలుకుతుంది. 'ఓ విప్రుడా! ఒంటరిగా ఉండే అమ్మాయిలను పలకరించాలనే ఉద్దేశ్యం లేకపోతే చారడేసి కన్నులు పెట్టుకొని ఇతరులను దారి అడుగుతావెందుకు? నిజంగా నీకు దారి తెలియదా? నీకు నేనంత చులకనగా కనిపిస్తున్నానా?' అని పలుకుతుంది.

ఇలా మాట్లాడడంలో ఆమె ప్రవరుడిని మభ్య పెట్టాలని చూస్తోందన్నది స్పష్టం. ఆ కోరికని సూటిగా చెప్పకుండా పరోక్షంగా ధ్వనింపజేసింది. నిత్యజీవితంలో మనిషికి ఎదురయ్యే ఆకర్షణలు అలాగే ఉంటాయి. అనితరసాధ్యమైన తన శైలితో పెద్దన ఈ ఘట్టాన్ని చాలా నాటకీయంగా మలిచాడు. ఇక్కడ ప్రవరుడు ధర్మానికి కట్టుబడాలా? మనస్సు మాట వినాలా? అన్న ప్రశ్న ఉత్పన్నమైనప్పుడు ధర్మానికే కట్టుబడతాడు.

మొత్తం *మనుచరిత్ర*లో అత్యంత రసవత్తరమైన ఘట్టమిది. వరూథినీప్రవరుల సంవాదం ప్రవరుడి ధర్మనిష్ఠకి పరీక్ష. ఆ ఒక్క ఘట్టాన్ని అర్థం చేసుకుంటే చాలు మనిషిని ఆకర్షణలు ఎలా మభ్య పెడతాయో అర్థమవుతుంది.

ప్రవరుడి పాత్ర ఔన్నత్యాన్ని పెంచడానికి పెద్దన వరూథిని పాత్రకి మరిన్ని సొబగులద్ది పాఠకులను సైతం సందిగ్ధావస్థలో పడేస్తాడు. నిజానికి వరూథిని పాత్ర మనిషి జీవితంలో ఎదురయ్యే అందమైన ఆకర్షణలకు ప్రతిరూపం. వరూథిని లేకపోతే *మనుచరిత్ర* లేదు.

## 1.7.5. మాయాప్రవరుడు

మాయాప్రవరుడి అసలు పేరు కలి. ఇతడొక గంధర్వుడు. వరూథినిపై మనసుపడి ఆమె తిరస్కరిస్తే అవకాశం కోసం ఎదురు చూసి మాయాప్రవరుడి రూపంలో వచ్చి ఆమెను పొందుతాడు. తత్ఫలితంగానే స్వరోచి జన్మిస్తాడు. జీవితంలో మనిషి ఇలా ఉండకూడదు అని చెప్పడానికి ఈ పాత్ర ఉపయోగపడుతుంది. చిత్రాల్లో ప్రతినాయకుడి పాత్ర ఎందుకుంటుంది? మనిషి ఎలా ఉండకూడదో చెప్పేందుకు. సాధారణంగా ప్రతి వ్యక్తి జీవితంలో ఇలాంటి పాత్రలు ఎదురవుతుంటాయి. స్వరోచి పుట్టడానికి భౌతికంగా మయాప్రవరుడే కారణం.

జీవితంలో మాయలు మయాప్రవరుడిలాగే ఉంటాయి. పైకి అన్నీ మనకి అనుకూలంగా జరుగుతునట్టే అనిపిస్తున్నా లోపల ఏదో మాయ ఉంటుంది. ఆధునిక సమాజంలో జరిగే మోసాలన్నీ ఇలాగే ఉంటాయి. పైకి మంచివారిగా నటిస్తూ మోసం చేసేవారు కోకొల్లలు. మోసం చేసేవాడిదే కాదు, మోసపోయే వాడిది కూడా తప్పే. కాలంతో పాటు మనిషి కూడా తనని తాను ఆధునీకీకరించుకోవాలి. ధర్మానికి కట్టుబడి ఉంటూనే మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలి.

ప్రవరుడిని ఎలాగైనా పొందాలనే తపన వరూథినికి బలహీనతగా మారింది. అదే మాయప్రవరుడి బలమయ్యింది. మన బలహీనతలు ఎదుటివారికి ఎప్పుడూ బలం కాకూడదు. వరూథిని బలహీనతని అద్దం పెట్టుకుని మాయాప్రవరుడు ఆమెను వశం చేసుకోగలిగాడు. సరైన వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవాలంటే మన బలహీనతలను చంపుకోవడం చాలా అవసరం.

## 1.7.6. స్వరోచి

భౌతికంగా స్వరోచి పుట్టుకకి మాయాప్రవరుడు(గంధర్వుడు) కారణమైనా, ప్రవరుడి తేజస్సుతో, అంత చక్కటి వ్యక్తిత్వంతోనే స్వరోచి జన్మించాడు. అయితే, ప్రవరుడిలా ఏకపత్నీవ్రతుడు కాడు. మనోరమ, కళావతి, విభావాసి, వనదేవతలను వివాహమాడతాడు. స్వరోచి గొప్ప రాజు. విశ్వకర్మ నిర్మించిన పట్టణాన్ని రాజధానిగా చేసుకొని చక్కటి పరిపాలన చేస్తాడు.

ఒక రోజు స్వరోచి వేటకి వెళ్తాడు. కొంతసేపటికి అలిసిపోయి విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో ఒక ఆర్తనాదం వినిపిస్తే, ఆమె(మనోరమ) కథను తెలుసుకొని ఆమెను రాక్షసుడి బారి నుంచి రక్షిస్తాడు. రాక్షస రూపంలో ఉన్న ఇందీవరాక్షుడికి విముక్తి కల్పిస్తాడు. అతడి కోరిక మేరకు మనోరమను వివాహమాడతాడు.

తాను వేటకి వచ్చినప్పటికీ ఎవరో దీనురాలు, ముక్కు, మొహం తెలియని ఒక అమ్మాయి రక్షించమని అర్థిస్తే తన ప్రాణాన్ని లెక్కచేయకుండా పోరాడి ఆమెను కాపాడిన మనసున్న మారాజు స్వరోచి. ఇంతకంటే ఉన్నతమైన వ్యక్తిత్వం ఇంకెక్కడ ఉంటుంది? ఎవరో వచ్చి కాపాడతారు, మనకెందుకులే లేనిపోని కష్టాలు? అని తమ దారిన తాము పోయేవాళ్ళు ఎంతోమంది ఉన్నారు. స్వరోచి అలా అనుకోలేదు. ఆ అమ్మాయిని కాపాడడం తన బాధ్యతగా భావించాడు.

నేటి సమాజంలో మన కళ్ళ ముందే ఎన్నో ఘోరాలు జరిగిపోతున్నా పట్టించుకోకుండా వెళ్లిపోయేవాళ్ళు స్వరోచి పాత్రను చూసి ఎంతో నేర్చుకోవాలి. 'ఎవరికీ వారే యమునా తీరే' అన్నట్టుంటే సమాజాన్ని ఎవరు పట్టించుకుంటారు? నలుగురూ కలిసిన కుటుంబమే సమాజం. ఒకరికొకరు వెన్నుదన్నుగా ఉంటేనే 'వసుధైక కుటుంబకం' అన్న భారతీయ భావనకు సార్థకత చేకూరుతుంది.

భయంతో, చేతగానితనంతో తన వరకు సమస్య వచ్చే వరకూ పోరాడని దౌర్భాగ్యులు దేశంలో ఉన్నంతకాలం ఏ దేశానికైనా దుఃస్థితి తప్పదు. *మనుచరిత్ర*లో రాక్షసుడు మనోరమను వెంబడిస్తే, ఇప్పుడు రాక్షస ప్రవృత్తి కలిగిన మనుషులు స్త్రీలపై దాడులు చేస్తున్నారు. అదే మగతనమని మురిసిపోతున్నారు. ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని సంపాదించాలంటే మనిషికి ధైర్యం, తెగింపు కూడా చాలా అవసరం.

స్వరోచికి హంస, చక్రవాకాలు, లేడి తన భోగలాలసత్వం గురించి విమర్శించినా వైరాగ్యం కలుగదు. కలిగినా అది ఆ క్షణానికే పరిమితమవుతుంది. మనలో చాలామందికి ఇలాంటి వైరాగ్యం అప్పుడప్పుడూ కలిగినా మళ్ళీ సంసార సుఖం కోసం పరితపిస్తుంటాం. స్వరోచి ఈ విషయంలో ఆధునిక మానవుడి ఆలోచనావిధానానికి ప్రతినిధిగా కనిపిస్తాడు.

## 1.7.7. ఇందీవరాక్షుడు

ఇందీవరాక్షుడు నలనాభుడనే గంధర్వరాజు కుమారుడు. మనోరమకి తండ్రి. తాను వరూథినికి సోదరుడనని ఒక చోట చెబుతాడు. అయితే ఈ విషయం మూలంలో లేదు. ఇందీవరాక్షుడు బ్రహ్మమిత్రుడనే గురువు ఆయుర్వేద విద్యను బోధించడానికి తిరస్కరిస్తే రహస్యంగా మారువేషంలో ఆ విద్యను గ్రహిస్తాడు. అది తప్పని చెప్పిన గురువుని ధిక్కరించి శాపాన్ని పొందుతాడు. రాక్షసుడిగా మారి తన కూతుర్ని తానే వెంబడిస్తాడు.

ఇందీవరక్షుడు గొప్ప విద్యాగ్రహణాభిలాషి. అక్కడి వరకూ అతడి నుంచి నేర్చుకోవాల్సింది చాలానే ఉంది. అయితే రహస్యంగా విద్యని అభ్యసించడం, గురువుని ధిక్కరించడం హేయమైన చర్యలు కావు. అవసరమైతే గురువుని సంతోషపెట్టో లేకపోతే ఆకట్టుకునో ఆ విద్యని అభ్యసించి ఉంటే బావుండేది. అలా చేయలేదు కనుకే చేసిన తప్పుకి శిక్ష అనుభవించక తప్పలేదు. గురువుని నిందించేవారికి, అగౌరవపరిచేవారికి ఈ పాత్ర ఒక గుణపాఠం వంటిది.

## 1.7.8. బ్రహ్మమిత్రుడు

బ్రహ్మమిత్రుడు ఒక గురువు. ఆయుర్వేద విద్యను నేర్పిస్తుంటాడు. ఆ విద్యను అభ్యసించడానికి వచ్చిన ఇందీవరాక్షుడిని తిరస్కరిస్తాడు. జ్ఞానాన్ని సంపాదించుకోవడం ప్రతి ఒక్కరి హక్కు. దాన్ని తిరస్కరించే అధికారం ఎవరికీ లేదు. కేవలం ఇందీవరాక్షుడు గంధర్వుడని, రాజని అతడికి విద్య నేర్పించనని చెబుతాడు. ఏ విద్యయైనా సరే అది ఒకరి సొత్తు కాదు. పైగా నలుగురికీ సమానంగా విద్యని అభ్యసించే గురువే ఇలా చేయడం తక్కిన విద్యార్థులపై పడి వారు కూడా భవిష్యత్తులో అలాగే చేస్తారు. ఒక విద్యార్థి మనస్సుని గురువు నడవడిక, ప్రవర్తన ఎంతగానో ప్రభావితం చేస్తాయి. అందుకే గురువు తన నడవడికపై తాను ముందుగా శ్రద్ధ వహించాలి.

ఒక వర్గం వారికో, తనకిష్టమైన వారికో పాఠం చెప్పి తక్కిన వారికి చెప్పకపోవడం సమంజసంగా అనిపించదు. బ్రహ్మమిత్రుడు ఇందీవరాక్షుడిని తిరస్కరించడం వల్లే అతడికి రహస్యంగా విద్యనభ్యసించాలనే దుర్బుద్ధి కలిగింది. బ్రహ్మమిత్రుడు ఇందీవరాక్షుడికి విద్యని అభ్యసించే అవకాశం ఇచ్చి ఉంటే అతడికి గురువుపట్ల భక్తి భావం పెంపోదేది. మతాలు, కులాలు, వర్గాల పేరు మీద విద్యార్థులను విద్యకు దూరం చేసే ఉపాధ్యాయులకు ఇప్పటికైనా మారాలి. జ్ఞానాన్ని అందరికీ సమానంగా అందించాలి. బ్రహ్మమిత్రుడి పాత్రని పెద్దన విమర్శించకపోవడం ఒక లోపమని చెప్పక తప్పదు.

## 1.7.9. మనోరమ

మనోరమ ఇందీవరాక్షుడి కూతురు. ఒక ఋషి శాపం వల్ల ఒక రాక్షసుడు ఆమెను వెంబడిస్తుంటాడు. అతడి బారి నుంచి స్వరోచి ఆమెను రక్షిస్తాడు. తర్వాత ఆ రాక్షసుడు తన తండ్రే అని తెలుస్తుంది. ఇందీవరాక్షుడు(తండ్రి) సంతోషించి ఆమెను స్వరోచికిచ్చి పెళ్లి చేస్తాడు. తనతో పాటే తన చెలికత్తెలైన కళావతి, విభావాసికి క్షయ వ్యాధి వస్తుందని అదే ఋషి శపిస్తాడు. తనకి

స్వరోచితో వివాహం కాగానే కేవలం తన సుఖం తాను చూసుకోకుండా తన చెలికత్తెల రోగాన్ని సైతం మాన్పమని స్వరోచిని అడిగి వారికి విముక్తి కలిగిస్తుంది. వారు తమను కాపాడిన స్వరోచినే వివాహం చేసుకోమని అడుగుతారు. మనోరమ పెద్ద మనస్సుతో అందుకు అంగీకరిస్తుంది. తన చెలికత్తెలను తనతో సమానంగా చూసుకుంటుంది. ఇది చాలా గొప్ప విషయం.

ఈ విధంగా ప్రతి పాత్రని తనదైన శైలిలో పెద్దన గొప్పగా తీర్చిదిద్దాడు. ఆ పాత్రలను అలా తీర్చిదిద్దడం వెనుక పెద్దన వ్యక్తిత్వం దర్శనమిస్తోంది. *మనుచరిత్ర* కావ్యంలోని కథను మార్కండేయ పురాణం నుంచి తీసుకున్నా, పాత్ర చిత్రణలో పెద్దన ముద్ర కనిపిస్తుంది. అక్కడక్కడా చేసిన మార్పులు, వర్ణనలు *మనుచరిత్ర*ను మరింత రసవంతంగా ఆవిష్కరించాయి.

వరూథినీప్రవరాఖ్యుల సంవాద ఘట్టాన్ని పెద్దన రక్తి కట్టించిన తీరు అద్భుతం, అనితరసాధ్యం. కథలో కావాలని మార్పులు చేసినా తాప్పేమీ లేదు. ప్రవరుడు వరూథినికి లొంగినట్టు చూపించవచ్చు. కానీ పెద్దన ప్రవరుడి పాత్రని మరింత ధర్మనిష్ఠ కలవాడిగా చూపించాడు. కాసేపు వరూథిని వైపు, మరి కాసేపు ప్రవరుడి వైపు వాదిస్తూ పాఠకులను సందిగ్ధంలోకి నెడతాడు. ఎందుకంటే జీవితం అలాగే ఉంటుంది. ఆకర్షణలు మనిషిని తీవ్రమైన భ్రమకి లోనుచేస్తాయి. వాటి నుంచి బయటపడడం అంతకంటే తీవ్రమైన వైరాగ్యం ఉన్నవాడికే సాధ్యం. మనిషికి ధర్మాధర్మ విచక్షణ చాలా అవసరం. చివరికి ధర్మమే జయిస్తుందని, ధర్మానికి కట్టుబడితే ఆలస్యమైనా క్షేమంగా కష్టాలనుంచి బయటపడతామని పెద్దన నిరూపించారు.

తన కావ్యం ఎక్కడా ఎవరినీ చెడుదోవ పట్టించకుండా పెద్దన శ్రద్ధ తీసుకున్నాడు. ఇంటి బాధ్యత పెద్ద కొడుకు తీసుకున్నట్టే సమాజం బాధ్యత ఆంధ్ర కవితాపితామహుడైన పెద్దన తీసుకున్నాడు. ఇంటి పెద్దగా వ్యవహరించాడు. పెద్దన ఈ కావ్యం రాయడం వెనుక వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడం ముఖ్యోద్దేశ్యం కాకపోవచ్చు. కానీ, అంతర్లీనంగా వ్యక్తిత్వ వికాసానికి ఈ కావ్యం ఎంతగానో దోహదపడుతుంది. *మనుచరిత్ర*లో ఏదో ఒక సంఘటనలో ప్రతి వ్యక్తి తనని తాను పోల్చుకుంటాడు. అలా ఆ కావ్యాన్ని మలచడంలో పెద్దన అవిరళమైన కృషి చేశాడు.

పెద్దన తన వర్ణనకౌశలంతో మూలకథకి అదనపు సొబగులద్ది *మనుచరిత్ర*ను సగటు వ్యక్తి జీవితంలో ఎదురయ్యే వివిధ సంఘటనల సమాహారంగా అత్యంత హృద్యంగా ఆవిష్కరించాడు. నిజానికి ఒక రచన చేసేటప్పుడు కవి ప్రతి పాత్రలోనూ పరకాయ ప్రవేశం చేస్తాడు. అలా చేస్తేనే పాత్ర చిత్రణ సహజంగా ఉంటుంది. కానీ చివరికి ఎలాంటి ముగింపు ఇస్తున్నాడనేది చాలా ముఖ్యం. దాన్ని బట్టే కవి మనస్తత్వాన్ని, వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవచ్చు.

తన రచన కాబట్టి కవి కావ్యానికి ఎలాంటి ముగింపైనా ఇవ్వవచ్చు. అయితే పెద్దన బాధ్యతగల కవి. పెద్దరికం ఆయన పేరులోనే ఉంది. అందుకే *మనుచరిత్ర*ను ధర్మపక్షాన నిలబెట్టాడు. ఇంత గొప్ప కావ్యాన్ని రచించి తాను ధర్మపక్షపాతినని లోకానికి చాటిచెప్పాడు. తదనంతర కవులకు మార్గదర్శిగా నిలిచిపోయాడు. *మనుచరిత్ర* కావ్యం ద్వారా వ్యక్తిత్వాలు వికసించేందుకు బీజం వేశాడు.

# అధ్యాయం – 2

# వ్యక్తిత్వ వికాసం– సైద్ధాంతిక నేపథ్యం

## 2.1. వ్యక్తిత్వ వికాసం: పరిచయం

తన గురించి తాను ఆలోచించుకోవడం స్వార్థం. పదిమంది గురించి ఆలోచిస్తూ వారి మంచి కోరుకోవడం పరమార్థం. స్వార్థాన్ని విడనాడి పరమార్థాన్ని చేరుకునే క్రమంలో మనిషి మనస్సు పొందే వికాసమే 'వ్యక్తిత్వ వికాసం(Personality Development)'. అయితే, ఈ క్రమంలో వ్యక్తి తన జీవితాన్ని కోల్పోకూడదు. తన జీవితాన్ని కోల్పోకుండా ఇతరుల మంచి కోరుకోవడం అన్నమాట.

శ్లో॥ సమష్టి వ్యష్టి రూపౌ ద్వౌ పదార్థౌ సర్వ సమ్మతౌ
సమష్టిరీస్వరౌ, వ్యష్టిర్జీవో వేదాంత డిండిమః (*వేదాంత. 1993: 5*)

అంటూ ఆదిశంకరాచార్యుల వారు ఇదే భావనని '*వేదాంత డిండిమం*'లో వ్యక్తం చేశారు. వ్యష్టి జీవుడు, సమష్టి దేవుడు. ఈ పరిణామంలో మనిషి మనస్సు సంకుచితత్వాన్ని విడనాడి విశాల దృక్పథాన్ని అలవర్చుకుంటుంది. వ్యక్తిత్వం వికసించినప్పుడే, 'మానవత్వం కలవాడే మనిషి' అన్న మాటకి సార్థకత.

వికసించడం అనే పదాన్ని మనం సాధారణంగా పువ్వుల విషయంలో వాడతాం. 'పువ్వు వికసించింది' అంటాం. నిజానికి మొగ్గ వికసించి పువ్వుగా మారుతుంది. మొగ్గగా ఉన్నప్పుడు అది ముడుచుకుని ఉంటుంది. మనిషి మనస్సు కూడా సంకుచిత భావంతో నిండి ఉన్నప్పుడు మొగ్గ లాగే ఉంటుంది. మొగ్గ వికసించి పువ్వుగా మారి పరిమళాన్ని వెదజల్లినట్టు, మనస్సు కూడా వికసించి విశాల భావంతో సువిశాల విశ్వాన్ని అక్కున చేర్చుకోవాలి. అలా భావించడమే వ్యక్తిత్వం వికసించేందుకు మనిషి వేసుకునే పునాది.

వ్యక్తిత్వం వికసించడానికి మరికొన్ని అంశాలు దోహదపడతాయి. సంభాషణ నైపుణ్యం (Communication Skills), నాయకత్వ లక్షణాలు (Leadership

Qualities), నిర్వహణ సామర్థ్యం (Managing Ability) వంటివి వాటిలో ముఖ్యమైనవి. సంభాషించడం అంటే దబాయించడం కాదు, గుబాళించేలా మాట్లాడడం. నాయకత్వం అంటే అజమాయిషీ చలాయింపు కాదు, నలుగురినీ ముందుండి నడిపించగలిగే నేర్పు.

వీటన్నిటినీ నేర్పించడానికి ఇవాళ శిక్షణ కేంద్రాలు పెట్టి, మూడు నెలల శిక్షణ, మూడు వేల భక్షణ చేస్తున్నారు. దానికి బదులు నాలుగు తెలుగు పుస్తకాలు చదివి అర్థం చేసుకుని, అన్వయించుకుని, ఆచరిస్తే అద్భుతమైన మార్పు మనలో వస్తుంది. వ్యక్తి వికాసమే వ్యక్తిత్వ వికాసం. వ్యక్తిగా ఎదగడం వ్యక్తిత్వ వికాసం.

"An individual's personality is the sum of total of person's qualities, characteristics, attitudes and quirks, psychological traits, beliefs and motives which make up his identity. Personality Development therefore means an improvement in all spheres of individual's life". (www.wisdomtimes.com). ఇది Wisdom Times వ్యక్తిత్వ వికాసానికి ఇచ్చిన నిర్వచనం. అంటే రకరకాల విభాగాల్లో, కోణాల్లో వ్యక్తి పొందే వ్యక్తిగత అభివృద్ధే వ్యక్తిత్వ వికాసం.

అలాంటి వ్యక్తిత్వం వికసించడానికి దోహదపడే అంశాలను స్పృశించాలన్నా, వాటి గురించి చర్చించాలన్నా, ముందుగా వ్యక్తిత్వ వికాసం గురించి పాశ్చాత్యులు, భారతీయులు పేర్కొన్న అభిప్రాయాలను పరిశీలించాలి.

## 2.2. పాశ్చాత్యుల అభిప్రాయాలు

వ్యక్తిత్వ వికాసం గురించి ఎంతో మంది పాశ్చాత్యులు పరిశోధన చేశారు. అయితే వ్యక్తిత్వ వికాసం మన భారతీయ జీవన విధానంలో, భారతీయ సాహిత్యంలో ఉందని ఋజువు చేయడం ఈ పరిశోధన ప్రధాన లక్ష్యం కాబట్టి, కొంత మంది పాశ్చాత్యుల అభిప్రాయాల గురించి మాత్రమే ఇక్కడ ప్రస్తావించడం జరుగుతుంది. క్రీ.పూ 460 ప్రాంతంలోనే హిప్పోక్రేటిస్ వ్యక్తుల ప్రవర్తనలను అంచనా వేశాడు. ఆ అంచనా ఆధారంగా వారిని ఈ కింది విధంగా విభజించాడు.

### 2.2.1. హిప్పోక్రేటిస్ (Hippocrates) వర్గీకరణ

హిప్పోక్రేటిస్ వ్యక్తుల చిత్త ప్రవృత్తులను నాలుగు రకాలుగా విభజించాడు. వీటినే ఆంగ్లంలో Four Temperaments అంటారు.

1. Sanguine (Optimistic leader- like)

2. Choleric (Bad tempered or irritable)

3. Melancholic (analytical and quiet)

4. Phlegmatic (relaxed and peaceful)

తను చేసిన పరిశోధన ఆధారంగా, హిప్పోక్రేటిస్ విభజించాడు. హిప్పోక్రేటిస్ అశావాదులను, కలుపుగోలు మనస్తత్త్వం కలవారిని మొదటి విభాగంలోనూ, ఉద్విగ్నత, అసహనం, అహంకారం ఎక్కువగా కలవారిని రెండవ విభాగంలోనూ, అనుమానాస్పద ధోరణితో ఉంటూ ప్రతికూలంగా పరిస్థితులను ఊహించుకునేవారిని మూడవ విభాగంలోనూ, ఎప్పుడూ తమలో తాము మాట్లాడుకునేవారిని, ప్రశాంతతని కోరుకునేవారిని నాల్గవ విభాగంలోనూ చేర్చాడు.

అప్పటి కాలానికి హిప్పోక్రేటిస్ వ్యక్తుల ప్రవర్తనలను అంచనా వేయగలిగినప్పటికీ, ఆ వర్గీకరణ ఈ కాలానికి పూర్తిగా వర్తించకపోవచ్చు. సమాజం మారుతున్న కొద్దీ వ్యక్తుల ప్రవర్తనలో మార్పులు చోటు చేసుకోవడమే అందుకు కారణం. అయితే, అన్ని కాలాలకీ వర్తించగలిగే సిద్ధాంతాలను రూపొందించడం కష్టంతో కూడుకున్న పని. పైగా వ్యక్తులను వారి ప్రవర్తనల ఆధారంగా విభజించడం అసాధ్యం. ఎందుకంటే ఈ ప్రపంచంలో ఉన్న ప్రతి వ్యక్తిది ఒక భిన్నమైన స్వభావం, భిన్నమైన ప్రవర్తన.

హిప్పోక్రేటిస్ తర్వాత కాలంలో ఎంతో మంది మనోవిజ్ఞానశాస్త్రంపై అద్భుతమైన పరిశోధనలు చేశారు. ప్రత్యేకించి వ్యక్తిత్వ వికాసంపై సిద్ధాంతాలను రూపొందించకపోయినా, మనిషి మనస్సుని, దాని ఆలోచేనలని అంచనా వేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అటువంటి మనోవిజ్ఞాన శాస్త్రవేత్తల్లో ముఖ్యులు సోక్రటీస్, ప్లేటో, సెయింట్ ఆగస్టీన్ వంటివారు.

## 2.2.2. సోక్రటీస్ (469 – 399 B.C)

మనిషిలో ఉండే అచేతనమైన వ్యవస్థ గురించి పరిశోధించిన వారిలో సోక్రటీస్ ముఖ్యుడు. జ్ఞానం అంతర్గతంగా, నిగూఢంగా ఉంటుందని, దాన్ని చైతన్య మానసిక స్థితిలోకి తీసుకురావచ్చునని తెలియజేశాడు. "The only true Wisdom is in knowing you know nothing" (*www.brainyquote.com*) అన్న అతడి మాటలు చూస్తే ఎంత జ్ఞానాన్ని సంపాదించినా అది తక్కువే అవుతుందని స్పష్టమవుతోంది. జ్ఞాన సముపార్జన పట్ల అనంతమైన ఆసక్తిని కలిగి ఉండడం వ్యక్తిత్వ వికాసానికి చాలా అవసరం అని అతని బోధనలు స్పష్టం చేస్తున్నాయి.

## 2.2.3. సెయింట్ ఆగస్టీన్ (354 – 430 A.D)

ఆగస్టీన్ అంతః పరీక్షణ, అంతః పరిశీలన పద్ధతుల ద్వారా మానసిక ప్రకార్యాలను గుర్తించాడు. తదనంతర కాలంలో మనోవిజ్ఞాన శాస్త్రంలో భిన్న వాదాలు, సంప్రదాయాలు వచ్చాయి.

"Do you wish to be great? Then begin by being. Do you desire to construct a vast and lofty fabric? Think first about the foundations of humility. The higher your structure is to be, the deeper must be its foundation" (*www.brainyquote.com*). మనిషి గొప్పవాడు అవ్వాలంటే, ఉన్నతంగా ఉండాలంటే వినయం చాలా అవసరమని అగస్టీన్ చెబుతున్నాడు. 'ఎంత ఎత్తుకి ఎదగాలనుకుంటున్నావో అంత బలమైన పునాది వేసుకో, ఎంత ఎదిగినా ఒదిగి ఉండడం ముఖ్యం' అనే విషయాన్ని ఇతడి మాటలు గుర్తుచేస్తున్నాయి.

## 2.2.4. సిగ్మండ్ ఫ్రాయిడ్ (Sigmund Freud)

సిగ్మండ్ ఫ్రాయిడ్ 'మనోవిశ్లేషణ సిద్ధాంతానికి'(Psycho Analysis) ఆద్యుడు. మానవుని మస్తిష్కాన్ని 'చేతన', 'అచేతన' వ్యవస్థలుగా విభజించి, ఆ మేధపై జరుగుతున్న పరిశోధనను కొత్త పుంతలు తొక్కించాడు. మానవుని ప్రవర్తన, అతడి ఆలోచనల వెనకున్న ప్రేరణను, ఇతర కారణాలను బహిర్గతం చేస్తూ అతడి పరిశోధన ఒక వినూత్న మార్గంలో సాగింది. Id, ego, super–ego అనేవి

మనిషి మనస్సులో పరిస్థితులకు అనుగుణంగా ఏర్పడే వివిధ భావ ప్రకంపనలుగా భావించి, వాటి ఆధారంగా మనిషి ప్రవర్తనను ఫ్రాయిడ్ అంచనా వేశాడు.

ఫ్రాయిడ్ పరిశోధన ముఖ్యంగా సమాజంలోని నిబంధనలు మానవుని ప్రవర్తనపై, అతడి సహజ, అతీంద్రియ శక్తులపై చూపించే ప్రభావం గురించి చర్చించింది. చిన్నతనంలో జరిగే సంఘటనలు, ఎదిగిన తర్వాత మనిషి మనస్సుపై చూపించే ప్రభావం గురించిన చర్చే ఎక్కువగా ఇతడి విశ్లేషణలో కనిపిస్తుంది.

"A Man should not strive to eliminate his complexes but to get into accord with them: they are legitimately what directs his conduct in the World" (*www.brainyquote.com*) అన్న అతడి మాటలు ఇక్కడ గుర్తుచేసుకోవాలి. మనిషి తన జీవితంలో ఎదురయ్యే సంక్లిష్టతలను ఎదుర్కొని అనుభవాలను పొందడం ఎంతో కీలకమని, అవి భవిష్యత్తులో అతడి ప్రవర్తనపై ప్రభావం చూపగలవని ఫ్రాయిడ్ అభిప్రాయం. ఈ అభిప్రాయం వ్యక్తిత్వం వికసించడానికి దోహదం చేసే అంశం.

జర్మన్ శాస్త్రజ్ఞుడైన Ernest kretschmer (క్రెష్మర్) మనిషి శరీర నిర్మాణాన్ని బట్టి వ్యక్తులను పిసర కాయులు, క్రీడా కాయులు, ప్రాంశు కాయులు అంటూ మూడు రకాలుగా విభజించాడు. అయితే, అమెరికన్ శాస్త్రజ్ఞుడైన W.H. Sheldon (షెల్డన్) ఒక అడుగు ముందుకు వేసి, వ్యక్తులను స్థూల కాయులు, మధ్యమ కాయులు, లంబ శరీరాకృతులు అంటూ మూడు రకాలుగా విభజించడమే కాకుండా ఒక వ్యక్తి ఒకే రకానికి చెందనక్కర్లేదని, మూడు లక్షణాలూ కలిగి ఉండవచ్చునని పేర్కొన్నాడు. యూంగ్ వర్గీకరణ ప్రకారం బహిర్వర్తనులు, అంతర్వర్తనులు, ఉభయవర్తనులు అని మూడు రకాలు. విశ్లేషణాత్మక మనోవిజ్ఞాన శాస్త్రం(Analytical Psychology) అనే కొత్త వాదం ఇతడి సృష్టే.

## 2.2.5. స్పెంజర్ వర్గీకరణ

స్పెంజర్ వర్గీకరణ వీరందరికంటే భిన్నంగా ఉంది. వ్యక్తి జీవితంలో ప్రాధాన్యం ఇచ్చే 'విలువల' ఆధారంగా 'స్పెంజర్' (Spanger) వ్యక్తులందరినీ సైద్ధాంతికమైన విలువలు కలవారు, ఆర్థికమైన విలువలు కలవారు, సాంఘికమైన విలువలు కలవారు, రాజకీయమైన విలువలు కలవారు, మత పరమైన విలువలు కలవారు, సౌందర్యారాధనపు విలువలు కలవారు అంటూ ఆరు రకాలుగా విభజించాడు. స్పెంజర్ వర్గీకరణ చాలా ఆసక్తికరంగా అనిపిస్తుంది.

ఒక వ్యక్తి ప్రవర్తన సాధారణంగా అతడికి అలవడిన విలువలపై ఆధారపడి ఉంటుంది. అయితే, ఆ వ్యక్తి అటువంటి విలువల్ని విస్మరించినప్పుడు వేర్వేరు అనుభవాలు ఎదురవుతుంటాయి. ఆ అనుభవాల్లో మంచివి కొన్ని, చెడ్డవి కొన్ని. వాటి ఆధారంగా వ్యక్తి ఆ విలువలను ఆచరించడంలో మార్పులు, చేర్పులు చేసుకుంటుంటాడు. నిజానికి ఎన్ని విభజనలు చేసినా విభజనలకు చిక్కని మనస్తత్వాలు కొన్ని కనిపిస్తుంటాయి. ఒక్కొక్క మనిషిది ఒక్కొక్క రకమైన స్వభావం. 'లోకో భిన్న రుచిః' అని అందుకే అన్నారు.

## 2.3. భారతీయుల అభిప్రాయాలు

ప్రపంచంలో భారత దేశానిది ఒక ప్రత్యేక స్థానం. కేవలం భారతీయ జీవన విధానంతో యావత్ప్రపంచాన్ని మంత్రముగ్ధుల్ని చేసి అయస్కాంతంలా అందరి దృష్టినీ తన వైపు తిప్పుకోగలిగిన దేశం భారత దేశం.

అటువంటి గడ్డపై జన్మించిన ఎంతో మంది మహనీయులు వారి వ్యక్తిత్వాల ద్వారా ప్రపంచమంతటికీ ఆదర్శవంతులుగా నిలిచారు. ఎంతో మంది భారతీయ తత్త్వవేత్తలు వ్యక్తిత్వ వికాసానికి  దోహదపడే దిశగా ఎంతో కృషి చేశారు. నిజానికి భారతీయతలో, భారతీయ జీవన విధానంలో వ్యక్తిత్వ వికాసం ఒక అంతర్లీనమైన భాగం.

భారతీయుల ప్రాచీన వైద్య విధానం ఆయుర్వేదం. చరకుడు తన ఆయుర్వేద గ్రంథంలో వ్యక్తిత్వాన్ని ప్రకృతిలో ఉన్న పంచభూతాల ఆధారంగా వివరించాడు. అ పంచభూతాల సమ్మేళనం

వల్ల జరిగే హెచ్చు తగ్గుల ఆధారంగా మనిషి వ్యక్తిత్వంలోనూ మార్పులుంటాయని ఆయన తెలిపారు. వాత, పిత్త, కఫముల ద్వారా  వ్యక్తుల ప్రవర్తనలు రకరకాలుగా ఉంటాయని పేర్కొన్నాడు.

ఆదిశంకరాచార్యులతో మొదలుకొని నేటితరం మనస్తత్వ శాస్త్రవేత్తల వరకూ ఎంతో మంది భారతీయులు వ్యక్తిత్వ వికాసం గురించి వారి వారి బోధనల్లో పేర్కొన్నారు. అ తర్వాత మరెంతోమంది వ్యక్తిత్వం వికసించే దిశగా ఎన్నో  బోధనలు చేశారు. ప్రత్యేకించి సిద్ధాంతాలను రూపొందించకపోయినా, వారి వారి బోధనల ద్వారా, ప్రవచనాల ద్వారా, వారి జీవనవిధానం ద్వారా సమాజాన్ని చైతన్యపరిచేందుకు కృషి చేశారు. వారి మార్గాలు వేరైనా, లక్ష్యాలు దాదాపుగా ఒక్కటే. భారతీయ తత్త్వశాస్త్రంలో వ్యక్తిత్వ వికాసం ఒక కీలకమైన అంతర్భాగం అని నిరూపించడమే. ప్రతి వ్యక్తి ఒక శక్తిగా ఎదిగితేనే సమాజం చైతన్యవంతమవుతుంది. 'Change begins from within', 'Charity begins at home' వంటి సూక్తులు అందుకే పుట్టాయి.

మార్పు మనలో నుంచి రావాలి. ముందు మనం ఆచరించడం మొదలుపెడితే అది సహజంగానే మరి కొంతమందికి స్ఫూర్తినిస్తుంది. అందుకే ఎంతోమంది భారతీయ తత్త్వజ్ఞులు, మహాపురుషులు, గొప్ప వ్యక్తిత్వం కలవారు, జీవితంలో ఉన్నతమైన స్థాయికి ఎదిగినవారు వారి వారి దైనందిన జీవితాల్లో వారు ఆచరించిన విషయాలనే మనకి బోధించారు. భారత దేశంలో ఎంతో మంది గొప్పవారు పుట్టారు. ఉన్నతమైన వ్యక్తిత్వాలతో ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారు. అయితే వారందరికంటే మన భారతీయ తత్త్వవేత్తలది ఒక భిన్నమైన పంథా. వ్యక్తిత్వ వికాసం మన తత్త్వవేత్తల బోధనలలో అంతర్లీనంగా ఎప్పుడూ ధ్వనిస్తూనే ఉంటుంది. వ్యక్తులను, వారి ప్రవర్తనలను మన తత్త్వవేత్తలు ఇన్ని రకాలుగా ఉంటారని విభజించలేదు. ఏది మంచి మార్గమో, ఏది చెడు మార్గమో చెప్పి, మంచి మార్గంలో నడిస్తే వ్యక్తిత్వం వికసిస్తుందని చెప్పారు. భారతీయ తత్త్వవేత్తలు పాశ్చాత్యులకంటే చాలా భిన్నం. అటువంటి గొప్ప తత్త్వవేత్తల్లో స్వామి వివేకానంద మొదటి వరుసలో ఉంటారు.

### 2.3.1. స్వామి వివేకానంద

వివేకానందుడు శ్రీరామకృష్ణ పరమహంసకి శిష్యుడే అయినా, వివేకానందుడు ఆకర్షించినంతగా ప్రపంచాన్ని మరే తత్త్వవేత్త ఆకర్షించలేదనడం అతిశయోక్తి కాదేమో. వ్యక్తిత్వ వికాసానికి నిలువెత్తు నిదర్శనం వివేకానందుడు. తన వ్యక్తిత్వంతో యావత్ప్రపంచాన్ని సంభ్రమాశ్చర్యాలకు లోను చేసిన మహాపురుషుడు. భారతీయతకు ప్రతినిధిగా, భారతీయుల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మేధావి వివేకానంద. కేవలం ఆయన సూక్తులు చదివితే చాలు, అవి ఒక వ్యక్తి ఆలోచన విధానంలో గొప్ప మార్పును తీసుకురాగలవు.

"We are responsible for what we are and whatever we wish ourselves to be, we have the power to make ourselves. If what we are now has been the result of our own past actions, it certainly follows that whatever we wish to be in future can be produced by our present actions; so we have to know how to act" (*www.brainyquote.com*).

మనం ఇవాళ ఇలా ఉన్నామంటే దానికి కారణం మనమే. రేపు ఎలా ఉండాలో నిర్ణయించుకోవాల్సిందీ మనమే. మన జీవితం మన చేతుల్లోనే ఉంది. ఇవాళ మనం ఇలా ఉండడానికి గతంలో మనం చేసిన పనులు కారణమైతే, రేపు ఎలా ఉండాలో నిర్ణయించేది నేటి చర్యలే. కాబట్టి, మనం ఎలా నడుచుకోవాలో, ఎలా ప్రవర్తించాలో మనమే నిర్ణయించుకోవాలి. మన జీవితాన్ని మనమే ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలి. ఇటువంటి ఎన్నో సూక్తులు ఆయన బోధనల్లో మనకు కనిపిస్తాయి.

### 2.3.2. అరవిందుడు

అరవిందుడు గొప్ప తత్త్వవేత్త, గొప్ప ఆధ్యాత్మిక గురువు. ఆయన మాటలు వ్యక్తిత్వంపై సూటిగా ప్రభావాన్ని చూపిస్తాయి. "Life is Life–whether in a Cat, or Dog or Man. There is no difference there between a Cat and a Man. The idea of

difference is a Human conception or a Man's advantage" (*www.brainyquote.com*). 'జీవులందరూ సమానం. ఒక జంతువుకి, ఒక మనిషికి ఏ తేడా లేదు. తేడా అనేది మానవుని కల్పన'.

సర్వజీవ సమానత్వం గురించి అరవిందుడు ప్రస్తావించాడు. అన్ని జీవులు మనతో సమానం అని తెలిశాక విభేదాలు ఎందుకు వస్తాయి? అన్ని జీవుల్నీ ప్రేమించాలి అనే భావాన తప్పకుండా కలుగుతుంది. ఈ సృష్టిలో ప్రతి జీవినీ ప్రేమించే దిశగా మనిషి మనస్సు ఎదిగితే, ఎవరూ ఎవరికీ హాని తలపెట్టరు. అదే నిజమైన వ్యక్తిత్వం. ఇటువంటి వ్యక్తిత్వ వికాస సంబంధిత విషయాలు ఎన్నో అతడి బోధనల్లో కనిపిస్తాయి.

## 2.3.3. రమణ మహర్షి

రమణ మహర్షి ఒక మహా యోగి. తానెవరో తెలుసుకునే క్రమంలో, తన్మయత్వం చెంది తనని తాను మర్చిపోయిన మహాతపస్వి ఆయన. రమణ మహర్షి గారి '*నేనెవరు?*' అనే పుస్తకాన్ని చదివితే జీవితం ఒక భిన్నమైన కోణంలో ఆవిష్కృతం అవుతుంది. జీవితం యొక్క అంతిమ లక్ష్యాన్ని ఆ పుస్తకం ఉద్బోధిస్తుంది.

Ego గురించి ఆయన అన్న మాటలు ఎన్నో ప్రశ్నలకి సమాధానంగా కనిపిస్తాయి.

"All bad qualities centre round the ego. When the ego is gone, Realisation results by itself. There are neither good nor bad qualities in the self. The self is free from all qualities. Qualities pertain to the mind only" (*www.brainyquote.com*). అదే విషయం గురించి చెబుతూ రమణ మహర్షి "Our own self-realization is the greatest service we can render the world" (*www.brainyquote.com*) అంటారు. 'అన్ని చెడు లక్షణాలు 'అహం' చుట్టూ తిరుగుతూ ఉంటాయి. 'అహం' నశిస్తే మనిషిలో సహజంగానే పరివర్తన కలుగుతుంది'.

'నిజానికి మంచి, చెడు రెండూ మన ఆలోచనల పర్యవసానంగా ఏర్పడినవే. అవి మనలో నిక్షిప్తమై ఉన్నవి కావు. మన తప్పుని మనం తెలుసుకోవడమే ప్రపంచానికి మనం చేసే గొప్ప సేవ' అని ఆయన అభిప్రాయపడ్డారు.

### 2.3.4. పరమహంస యోగానంద

19వ శతాబ్దంలో జన్మించిన గొప్ప తత్త్వజ్ఞుల్లో పరమహంస యోగానంద ఒకరు. వారు రాసిన '*Autobiography of a Yogi*' అనే పుస్తకం ఎంతోమంది జీవితాల్లో వెలుగును నింపింది. మనోనిగ్రహం గురించి ఆయన చెప్పిన ఒక సూక్తిని ఇక్కడ గుర్తుచేసుకోవాలి.

"You may control a mad Elephant; You may shut the mouth of the Bear and the Tiger; Ride the Lion and play with the Cobra; You may wander through the Universe incognito; Make vassals of the God; Be ever youthful; But, control of the Mind is better and more difficult" (*www.brainyquote.com*).

'మనం ఒక ఏనుగుని లొంగదీసుకోవచ్చు, పులి నోరు మూయించవచ్చు, సింహంపై స్వారి చేయవచ్చు, త్రాచు పాముతో ఆడుకోవచ్చు, అనంతమైన సృష్టిలో తిరగాడవచ్చు, భగావంతుడికి సేవకుడిగా మారవచ్చు, నిత్య యౌవనాన్ని కలిగియుండవచ్చు, కానీ అంతకంటే ముఖ్యమైనది, ఉన్నతమైనది, కష్టమైనది మనోనిగ్రహం'. '*మనుచరిత్ర*'లో మనోనిగ్రహమే కీలకాంశం.

### 2.3.5. జిడ్డు కృష్ణమూర్తి

జిడ్డు కృష్ణమూర్తి గారి తత్త్వం బాగా లోతైనది. ఎన్నో సార్లు చదివితే తప్ప అర్థం కాదు. కానీ అర్థమైతే అదొక గొప్ప అనుభూతినిస్తుంది. తత్త్వంతో పాటు తర్కం వీరి బోధనలలో కనిపిస్తుంది.

యావత్భారతీయ తత్త్వశాస్త్రం మొత్తం తర్కాన్ని ఆధారంగా చేసుకున్నదే అయినప్పటికీ, వీరి బోధనలలో అది బాగా స్పష్టంగా గోచరిస్తుంది.

జీవితంలో ఎదురయ్యే ఎన్నో సమస్యలకు పరిష్కారాలు దొరక్క మనం చాలా ఒత్తిడికి లోనవుతుంటాం. ఈ విషయమై ఆయన చెప్పిన మాటలు మనల్ని ఆలోచింపజేస్తాయి.

"If we can really understand the problem, the answer will come out of it, because the answer is not separate from the problem" (*www.brainyquote.com*). 'సమస్యకి పరిష్కారం సమస్యలోనే ఉంది. ఎందుకంటే, సమస్య, పరిష్కారం రెండూ వేర్వేరు కాదు'.

మనలో చాలామంది ఏదైనా సమస్య ఎదురైతే దాని గురించి గంటల తరబడి చర్చిస్తారు. కానీ, చర్య తీసుకోరు. మనలో చాలామందికి చర్చ మీదున్న ఆసక్తి చర్య మీద ఉండదు.

జ్ఞాన సముపార్జన ఒక నిరంతరమైన, నిర్విరామమైన ప్రక్రియ అంటారు కృష్ణమూర్తి గారు.

"There is no end to Education. It is not that you read a book, pass an examination and finish with Education. The whole of Life, from the moment you are born to the moment you die, is a process of Learning" (*www.brainyquote.com*).

జ్ఞానాన్ని సంపాదించడం అంటే ఒక పుస్తకాన్ని చదివి, పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం కాదు. పుట్టిన దగ్గర నుంచి మరణించేవరకు ఆ ప్రక్రియ కొనసాగవలసిందే. ఇటువంటి విషయాలెన్నో వారి బోధనల్లో కనిపిస్తాయి.

ఇలా ఎంతోమంది తత్త్వవేత్తలు వ్యక్తిత్వం వికసించే దిశగా కృషి చేశారు. తత్త్వవేత్తలే కాకుండా ఎంతోమంది మహానుభావులు వారి జీవన విధానం ద్వారా వ్యక్తిత్వ వికాసాన్ని గురించి బోధించారు.

నేటి కాలంలో వ్యక్తిత్వ వికాసానికి నిర్వచనం మారిపోయింది. కేవలం విజయం సాధించడమే గొప్పతనం అన్నట్టు ఈ సమాజాన్ని చిత్రిస్తున్నారు. గొప్ప వ్యక్తి అంటే ఎన్నో విజయాలు

సాధించినవాడు అంటున్నారు. విజయాలనే పట్టించుకునే ఈ సమాజంలో ప్రతి వ్యక్తి నెగ్గుకురాలేకపోతున్నాడు. మొదటి స్థానంలో ఉంటేనే గొప్ప, మిగతా వారంతా పనికి రానివారన్నట్టు తయారయ్యింది పరిస్థితి. ఇది భారతీయతకి పూర్తిగా వ్యతిరేకం. గెలుపోటములు జీవితంలో భాగం మాత్రమే. జీవితం అంటే జీవించడమే, గెలవడం లేదా ఓడిపోవడం కాదు. ఆ దిశగా ఈ సమాజాన్ని తిరిగి నడిపించకపోతే మరిన్ని బలవన్మరణాలు తప్పవు. అలా నడిపించగలిగే సత్తా భారతీయ సాహిత్యానికి ఉంది.

ఆ సాహిత్యపు విలువల్ని నేటి తరానికి బోధిస్తే వారి వ్యక్తిత్వాలను వారే తీర్చిదిద్దుకుంటారు. భారతీయ విలువలు మనిషిని పోరాడవద్దని చెప్పవు. జీవితం అనే యుద్ధంలో పోరాడేందుకు కావలసిన ధైర్యాన్ని ఇస్తాయి.

భారతీయ సంస్కృతి, భారతీయ విలువలు, భారతీయ తత్త్వ శాస్త్రం, భారతీయ సాహిత్యం మనిషి వ్యక్తిత్వం వికసించే దిశగా ఎనలేని కృషి చేశాయి, చేస్తూనే ఉన్నాయి. అది ఋజువు చేయడమే ఈ పరిశోధన యొక్క ముఖ్యోద్దేశ్యం. భారతీయతలో, భారతీయ జీవన విధానంలో, భారతీయ సాహిత్యంలో, ముఖ్యంగా ప్రాచీన తెలుగు సాహిత్యంలో వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే అంశాలను వెలికితీసి, భారతీయ తాత్త్విక చింతన నేపథ్యంతో ఆవిష్కరించడమే.

మనోవిశ్లేషణ సిద్ధాంతానికి ఆద్యుడైన సిగ్మండ్ ఫ్రాయిడ్ చెప్పిన మాటలు ఈ పరిశోధనకి ప్రేరణ. ఈ సందర్భంలో వాటిని గుర్తుచేసుకోవాలి. ఆ మాటలే ఈ పరిశోధనకి కర్త, కర్మ, క్రియ.

"Everywhere I go, I find that a Poet has been there before me" (*www.brainyquote.com*).

'నేను ఏ కొత్త విషయాన్ని చెప్పాలని ప్రయత్నించినా నాకన్నా ముందే ఒక కవి అదే విషయం గురించి ప్రస్తావించడం నాకు కనిపించింది' అంటాడు ఫ్రాయిడ్. ఒక తత్త్వవేత్త కంటే కవి ఎప్పుడూ ఒక అడుగు ముందుంటాడు. దీన్నే మనవాళ్ళు "రవి గాంచనిచో కవి గాంచునే కదా" అన్నారు. కవికి ఉండే దూరదృష్టి అలాంటిది. అటువంటి కవులు మన భారతీయ సాహిత్యంలో ఎంతోమంది ఉన్నారు. ముఖ్యంగా సంస్కృత సాహిత్యంలో ఎన్నో శ్లోకాలు వ్యక్తిత్వం వికసించడానికి తోడ్పడతాయి.

## 2.4. సంస్కృత సాహిత్యం : వ్యక్తిత్వ వికాసం

సంస్కృత భాష, సాహిత్యం ఎన్నో భాషలకు మూలం, ఎన్నో సంస్కృతులకు ప్రతిబింబం. విభిన్నమైన రచనలు ఆ సాహిత్యంలో ఉన్నాయి. భారతీయత ఆ సాహిత్యంలో స్పష్టంగా కనిపిస్తుంది. వ్యక్తిత్వాన్ని వికసింపజేసే దిశగా ఎన్నో సంస్కృత కావ్యాలు, వాటిలోని కథలు తోడ్పడతాయి. అనంతమైన ఆ సాహిత్యంలో కొన్ని శ్లోకాలను ఇక్కడ ఉదాహరించి వాటిలోని వ్యక్తిత్వ వికాస సంబంధిత విషయాలను ఇక్కడ చర్చించడం జరుగుతుంది.

శ్లో ‖ వస్త్రేణ వపుషా వాచా / విద్యయా వినయేనచ

వకారైః పంచభిర్యుక్తః / నరో భవతి పూజితః (*గైర్వాణీ. 2007: 32*)

వకారంతో మొదలయ్యే అయిదు లక్షణాలు సంపాదించుకోగలిగితే మనిషిని అందరూ గౌరవిస్తారు. అవి వస్త్రధారణ, వపుః (హావభావాలు), వాక్కు, విద్య, వినయం అనేవి. ఈ అయిదు మన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తాయి.

'వస్త్రేణ'- మన వృత్తిని బట్టి మన వేషం ఉండాలి. విద్యార్థికో వేషం, విద్యర్థినులకో వేషం, ఉపాధ్యాయునికో వేషం, ఇలా ఒక్కొకరికి ఒక్కొక్క వేషం ఉంటుంది. ఇవాళ ఇంటర్వ్యూలకి వెళ్ళే వారికి వస్త్రధారణ ఎంతో కీలకం. దానికి కూడా మార్కులు ఉంటాయి. సభ్య సమాజంలో ఎక్కడికి వెళ్ళినా మన వస్త్రధారణ మన గౌరవాన్ని నిలబెడుతుంది.

'వపుః'- అంటే శరీర భాష. ఇది ఆంగ్లంలో 'Body Language' అన్న పదానికి సమానార్థకం. దీన్నే నాటక పరిభాషలో 'హావభావాలు' అంటాం. మనం ఉన్న ప్రదేశాన్ని బట్టి మన శరీర భాష ఉండాలి. ఇంటర్వ్యూకి వెళ్ళినప్పుడు కాలు మీద కాలు వేసుకొని కూర్చోకూడదు. పాఠం నేర్పిన గురువు ముందు వెకిలి చేష్టలు చేయకూడదు. అంటే మన హావభావాలు ఇతరులను ఇబ్బంది పెట్టకూడదు. మన శరీర భాషపైనే ఇతరులు మనల్ని గౌరవించే తీరు ఆధారపడి ఉంటుంది.

'వాక్కు'(Communication skills)- మాటతీరు బాగుంటే మనుషులంతా స్నేహితులే అవుతారు. ఎక్కడ ఎలా మాట్లాడాలో తెలియాలి. దీన్నే సందర్భోచితంగా మాట్లాడడం అంటారు.

సమయస్ఫూర్తి మనిషికి చాలా అవసరం. ఎదుటి వారిలో ఏదైనా లోపం ఉంటే ఆ వ్యక్తికి మాత్రమే చెప్పాలి. మంచి గుణం ఏదైనా ఉంటే నలుగురి ముందు చెప్పాలి. 'మంచి ఉంటే మైకులో చెప్పాలి; చెడుంటే చెవిలో చెప్పాలి' అని కొత్త సామెత. గొప్ప వ్యక్తిత్వం కలిగి ఉండాలంటే చక్కటి మాటతీరు తప్పనిసరిగా ఉండాలి.

'విద్య'– ఈ రోజుల్లో ఏ ఉద్యోగానికైనా దానికి కావాల్సిన విద్యార్హతలు ఉండాలి. దానితో పాటే ఆ రంగానికి సంబంధించిన పరిజ్ఞానం కూడా ఉండాలి. విద్యార్హతలతో పాటు ఉద్యోగానికి తగిన యోగ్యత కూడా కలిగి ఉండాలి. ఎన్ని ఉన్నా విద్య లేకపోతే రాణించలేం.

'వినయం'– ఇది చివరిదైనా చిన్నది కానిది. జీవితంలో ఎంత ఎత్తుకి ఎదిగినా ఒదిగి ఉండడం ముఖ్యం. 'మౌనంగానే ఎదగమని మొక్క నీకు చెబుతుంది; ఎదిగే కొద్దీ ఒదగమని అర్థమందులో ఉంది' అంటూ ఒక చలనచిత్ర గీతం సైతం మనిషికి వినయం ఎంత అవసరమో చెప్పకనే చెప్పింది. 'ఎక్కడ నెగ్గాలో కాదు; ఎక్కడ తగ్గాలో తెలిసినవాడే  గొప్ప వాడు' అనే మాట కూడా అందుకే వచ్చింది.

ఈ అయిదు వకారాలు 'విజయం' అనే దేహంలో పంచప్రాణాల వంటివి. వ్యక్తిత్వం వికసించడానికి కావాల్సిన ప్రాథమిక గుణాలన్నింటినీ ఒకే శ్లోకం బోధిస్తోంది. అది భారతీయ సాహిత్యం యొక్క గొప్పతనం.

ఇదివరలో ఎప్పుడో ఉద్యోగాల్లో ఉండగా ఏర్పడే ప్రేమలు, ఆకర్షణలు ఇప్పుడు చదువుకునే రోజుల్లోనే ఏర్పడుతున్నాయి. అందులోనూ నవయౌవనంలోనే(టీనేజ్) ఏర్పడడం, ఈ మధ్య పాఠశాల స్థాయికి కూడా పాకడం మనం చూస్తున్నాం. అటు యిటు కాని వయస్సులో, తెలిసీ తెలియని తనం వల్ల ఏర్పడే ఆకర్షణనే ప్రేమ అని భ్రమపడుతున్నారు.

ఈ ఆకర్షణల గురించి ఒక సంస్కృత కవి చమత్కారంగా ఇలా చెప్పాడు.

శ్లో ॥ యాం చింతయామి సతతం సామయి విరక్తా
సాప్యన్య మిచ్ఛతి జనో సజనోఽ న్య సక్తః
అస్మత్కృతేచ పరిశుష్యతి కాచిదన్యా
ధిక్ తాంచ తంచ మదనంచ ఇమాంచ మంచ. (*చమత్కార. 2010. శ్లో: 58*)

'నేనొక అమ్మాయిని చూసి ఇష్టపడ్డాను. కాని ఆమెకు నేనంటే ఇష్టం లేదు. ఆమె వేరెవరినో ఇష్టపడుతోంది. అతనికి ఆ అమ్మాయి అంటే ఇష్టం లేదు. అసలు నా కోసం మా మేనమామ కూతురు వెర్రి తాపత్రయం పడుతోంది. ఆ అమ్మాయంటే నాకు ఇష్టం లేదు. మొత్తం మీద ఏం అర్థమౌతోందంటే నేను ప్రేమించిన అమ్మాయి పనికిమాలిందే. ఆమె ప్రేమించేవాడు పనికిమలినవాడే. వాడు ప్రేమించిన అమ్మాయి అంతే. నేనూ పనికిమాలినవాడినే. మా మేనమామ కూతురు కూడా అంతే. అసలు ఇంతమందిని ఈ పిచ్చి భావాలకు లోను చేసిన  మన్మథుడు మా అందరికంటే పనికిమాలినవాడు' అని అర్థం.

ఎంత చక్కగా చెప్పాడీ కవి! తెలిసీ తెలియని వయస్సులో ఏర్పడేది ఆకర్షణే కానీ ప్రేమ కాదు. ఈ ఆకర్షణ కూడా ప్రధానంగా అందానికి సంబంధించినది.

శ్లో ॥ కిమప్యస్తి స్వభావేన / సుందరం వాప్య సుందరం

యదేవ రోచతే యస్మై / భవేత్ తత్ తస్య సుందరం. (*ముక్తా. 2000. శ్లో: 6*)

సహజంగా సృష్టిలో ఏ వస్తువు అందంగా ఉందని కానీ, లేదని కానీ చెప్పలేం. మనకి నచ్చింది మనకి అందంగా కనపడుతుంది. అందువల్ల మన దృష్టి మార్చుకుంటే ప్రపంచమంతా అందంగానే కనపడుతుంది. చదువుకునే వయస్సులో చదువు మీద ఇష్టం పెంచుకుంటే ఆ చదువు, ఆ జ్ఞానం, ఆ తెలివి అన్నీ అందంగానే కనపడతాయి. చదువు పూర్తయ్యాక రూపం కంటే, ఆదాయం కంటే, గుణానికి, శీలానికి ప్రాధాన్యమిచ్చి జీవిత భాగస్వామిని ఎంచుకోగలిగితే జీవితమంతా అందంగానే ఉంటుంది.

పై శ్లోకంలో కవి ఏదో చమత్కారంగా చెప్పినప్పటికీ ఈ రోజు ఈ ప్రేమలు, ఆకర్షణలు యువతను వేధిస్తున్న ప్రధానమైన సమస్యలు. వీటికి అనేకానేక కారణాలు. సినిమా, ప్రచార, ప్రసార మాధ్యమాల ప్రభావం యువత పై బాగా ఉంది. సినిమాల్లో తమని తాము ఊహించుకోవడం ప్రేక్షకులకి బాగా అలవాటు. అందువల్ల యువత నిజ జీవితం కూడా అలానే ఉంటుందనుకుని ప్రేమల్లో పడిపోతున్నారు. ఈ ప్రేమల్లో నిజాయితీ ఉండడం లేదు. ప్రేమించడం తప్పు కాదు. కాని

పరిపక్వత లేని వయస్సులో ఇవి మొదలవుతుండడంతో అవి దుష్ఫలితాలకు దారి తీస్తున్నాయి. ఆ ప్రేమలు విఫలమయితే ఆత్మహత్యలకి పాల్పడుతున్నారు. జీవితంలో ఎదురయ్యే కష్టాలను ఎదుర్కొనే ధైర్యం వారికి ఏ మార్గంలోనూ అందడం లేదు.

నైతికమైన విలువలు ఈ తరానికి అందకపోతే వారి వ్యక్తిత్వం వికసించే అవకాశమే లేదు. మన సాహిత్యం నైతికమైన విలువలకు నిలయం.ఎంతసేపు ర్యాంకుల పేరు చెప్పి పిల్లల్ని రుబ్బేయకపోతే, వారి వ్యక్తిత్వాలు వికసించేలా నాలుగు కావ్యాలను పరిచయం చేస్తే వారి జీవితాలను చక్కదిద్దుకునే ధైర్యం వస్తుంది. అయితే, వారికి కావ్యాలను చెప్పే విధానం చాలా ముఖ్యం.

నేటి సమాజాన్ని దృష్టిలో పెట్టుకుని దానికి తగ్గ అన్వయం చేస్తూ చెప్పాలి. ఈ జ్ఞానం ప్రాథమిక స్థాయిలోనే వారికి అందితే ఎదిగే కొద్దీ మరింత పరిణతి కనబరుస్తారు. వారి ఆలోచనల్లో పరిపక్వత కనిపిస్తుంది.

వ్యక్తిత్వం వికసించడానికి ఎన్నో విషయాలు దోహదపడతాయి. గొప్ప వ్యక్తిత్వం సంపాదించాలంటే చాలా మంచి లక్షణాలు అలవర్చుకోవాలి. దుర్గుణాలను విడిచిపెట్టాలి. క్రమశిక్షణ, ఇంద్రియ నిగ్రహం, మనో నిగ్రహం, విద్య, వినయం, తెలివి తేటలు, సమయస్ఫూర్తి వంటి వాటిని ఒంటబట్టించుకోవాలి. వీటన్నిటి కలయికే సంపూర్ణ వ్యక్తిత్వం.

జీవితంలో కొన్ని విషయాల్లో ఎంతకీ సంతృప్తి లభించదు. ఆ కోరికలను సంతృప్తి పరిచిన కొద్దీ ఇంకా పెరుగుతుంటాయి. కాబట్టి వాటి విషయంలో మెత్తబడవద్దని, కచ్చితంగా వ్యవహరించమని ప్రాచీన సుభాషితం తెలియజేస్తోంది.

శ్లో ॥ ఉద్యోగం కలహః కండూః /ద్యూతం మద్యం పరస్త్రియః

ఆహారో మైథునం నిద్ర / సేవనాత్తు వివర్ధతే. (*చమత్కార. 2010. శ్లో: 32*)

మొండి ప్రయత్నం, దెబ్బలాట, దురద, పేకాట, మద్యపానం, వ్యభిచారం, చిల్లర తిళ్ళు, కామ వాంఛ, నిద్ర బద్ధకం. ఈ తొమ్మిది ఎంత తీర్చినా మళ్ళీ పెరుగుతూనే ఉంటాయి.వీటిలో మొండి ప్రయత్నం, దెబ్బలాట, పేకాట, మద్యపానం, పరస్త్రీ వ్యామోహం, కామ వాంఛ, నిద్ర గురించి ఇవాళ ఎక్కువగా చెప్పుకోవాలి.

ఇందులో మొదటిది ఉద్యోగం. ఈ మాట ఎవరి దగ్గరో పని చేయడం అనే అర్థంలో స్థిరపడింది. కానీ, ఉద్యోగం అంటే ప్రయత్నం అని నైఘంటుకార్థం. అందుకే, భారతంలో సంధి కోసం జరిగిన ప్రయత్నాలన్నింటినీ కలిపి ఉద్యోగ పర్వంగా గుది గుచ్చారు.

ప్రయత్నం చేయడం మంచిదే కానీ ఒక పని అవ్వదని తెలిసి కూడా మళ్ళీ మళ్ళీ మొండి ప్రయత్నాలు చేయడం మంచిది కాదు. అది ఉన్న శక్తిని కూడా పోగొట్టి నిర్వీర్యుణ్ణి చేస్తుంది. అలాగే కలహం కూడా. ఈ దెబ్బలాట వాదులాట కావచ్చు. నిజంగానే కొట్టుకోవడమూ కావచ్చు. ఇవి కూడా పెంచుకునే కొద్దీ పెరుగుతాయి.

తర్వాతది పేకాట. ఓడినా మానబుద్ధి కాదు. గెలిచినా మానబుద్ధి కాదు. గెలుస్తూ ఉన్నంతసేపు అదృష్టం కలిసి వస్తోందని ఇంకా ఆడాలనిపిస్తుంది. ఓడిపోతే పోయిన సొమ్ము రాబట్టుకోవడానికి పట్టుదలగా ఆడాలనిపిస్తుంది. అందుకే దాన్ని వ్యసనం అన్నారు. ఈ రోజుల్లో కేవలం పేకాటే కాదు, క్రికెట్ బెట్టింగ్ కూడా అలాంటిదే. ఇటువంటి వ్యసనాలు ఇప్పుడు చాలానే ఉన్నాయి.

తర్వాతది మద్యపానం. ఏదైనా వ్యసనంగా మారకముందే వదిలించుకోవాలి. ఏది లేకపోయినా హాయిగా జీవించగలగాలి. 'అది నా బలహీనత. నేను మార్చుకోలేను' అంటే కష్టం. మన బలహీనతలేంటో మనకి తెలియడం చాలా గొప్ప విషయం. చాలా మందికి తెలియక ఇబ్బంది పడుతుంటారు. ఏదైనా మనకి బలం చేకూర్చాలే తప్ప బలహీనతగా మారకూడదు. మన మనస్సుని మనం తప్ప వేరెవ్వరూ నియంత్రించలేరు. కాబట్టి మనల్ని మనమే సమాధానపరుచుకోవాలి.

తర్వాతది కామవాంఛ. ఎంతమందితో తిరిగినా, ఇంకా కొత్త అందాల మీద వాంఛ కలుగుతూనే ఉంటుంది. ఈ రోజు ఆడవాళ్ళపై జరిగే అత్యాచారాలకు ఇదే కారణం. పెళ్ళయ్యాక వెంటనే విడాకులు తీసుకోవడానికి కూడా ఇది ఒక ముఖ్యమైన కారణం. దీనికి తోడు మద్యపానం వల్ల కూడా ఎన్నో కాపురాలు కూలిపోతున్నాయి. పరపురుషుల పట్ల, పరస్త్రీల పట్ల వ్యామోహం పెంచుకోవడం, వివాహేతర సంబంధాలను పెంచుకోవడం, పెళ్ళికి ముందు సహజీవనం పేరిట వెర్రి సంబంధాలు పెట్టుకోవడం, ఇవన్నీ భవిష్యత్తులో హాని కలిగించేవే. శీలం వ్యక్తిత్వంలో కీలకమైనది. అందుకే ఆంగ్లంలో 'Character is lost everything is lost' అనే మాట వచ్చింది.

చివరిది నిద్ర. ఇది నేటి తరంలో చాలా మందికి భయంకరమైన వ్యసనంగా మారింది. ఈనాటి తరానికి ఆలస్యంగా పడుకోవడం, ఆలస్యంగా లేవడం, గంటల కొద్దీ నిద్రపోవడం అలవాటుగా మారిపోయాయి. దీని వల్ల రోజులో ఎన్నో పనులు వాయిదా పడిపోతాయి. క్రమశిక్షణ దెబ్బ తినడానికి ముఖ్యమైన కారణం ఇదే. అసలు 'snooze' అనే మీట బద్ధకస్తుల కోసం కనిపెట్టినదే. క్రమశిక్షణ లేకపోవడం వల్లే మన దేశం ఇవాళ చాలా రంగాల్లో వెనకబడిపోయింది.

ధన సంపాదనే పరమావధిగా భావిస్తున్న ఈ కాలం వారికి ధనాన్ని మించిన ధనం ఒకటుందని భర్తృహరి ఉపదేశిస్తున్నాడు.

శ్లో. హర్తుర్యాతి న గోచరం కిమపి శం పుష్ణాతి యత్సర్వదా

పృర్థిభ్యః ప్రతిపాద్యమానమనిశం ప్రాప్నోతి వృద్ధిం పరాం

కల్పాన్తేష్వపి న ప్రయాతి నిధనం విద్యాఖ్యమన్తర్ధనం

యేషాం తాన్ప్రతి మానముఙ్ఝత నృపాః కస్తైస్సహ స్పర్ధతే. (*సుభా. 2013: 35*)

అన్ని ధనాల్లోనూ విద్యాధనం గొప్పది. విద్యను దొంగలు హరింపలేరు. ఇచ్చిన కొద్దీ వృద్ధి చెందుతుంది. ప్రళయ కాలంలో కూడా నశించదు. విద్యాధనం ఉన్న వారికి ఎంతటి ధనవంతులైనా తల వంచాల్సిందే. ధనవంతులందరికీ దొంగల భయం తప్పదు. విద్యాధనవంతులైన పండితులకి ఆ భయం లేదు. ధనం ఎక్కువగా ఉంటే ఆదాయపు పన్ను రూపంలో ప్రభుత్వం పట్టుకుపోతుంది. ఎంత ఎక్కువగా చదువుకున్నా ఆ జ్ఞానం వ్యక్తి సొంతమే తప్ప ఏ ప్రభుత్వమూ తీసుకుపోదు.

ఎక్కడ ధనం ఉంటే అక్కడ ప్రశాంతత ఉండదు. సంపాదించిన డబ్బుతో పొలం కొంటే ఆదాయం తక్కువ, స్వాధీనం కాదేమోనని భయం. ఇళ్ళు ఎక్కువ ఉంటే అద్దెకి ఉండే వాళ్ళతో తలనొప్పి. స్థలాలు ఉంటే ఎవరు ఆక్రమిస్తారోనని ఆందోళన. బంగారం పెట్టుకుంటే ప్రాణానికే ప్రమాదం. ఈ రకంగా ధనం పెద్ద శిరోభారంగా పరిణమిస్తుంది. అదే చదువైతే ఎన్ని పట్టాలున్నా ఎంత జ్ఞానమున్నా గౌరవం పెరుగుతుంది కానీ తరగదు.

వీటన్నిటికీ మించిన ఒక ఆశ్చర్యకరమైన ప్రయోజనం విద్య వల్ల మాత్రమే కలుగుతుంది. కూర్చొని తింటే కొండలంత ఆస్తులైనా తరిగిపోతాయి. కానీ కూర్చొని పదిమంది విద్యార్థులకు చదువు

చెబితే ఆ జ్ఞానం తరగకపోగా పెరుగుతుంది. అందువల్ల వివేకవంతులు విద్యాధనానికి ఇచ్చిన ప్రాధాన్యం మామూలు ధనానికి ఇవ్వరు.

ధనం శాశ్వతమనుకొని దాన్ని కూడబెట్టేవారికి ఈ శ్లోకం ఒక గుణపాఠం. భారతంలో యక్షప్రశ్నల ఘట్టంలో ధర్మరాజుని యక్షుడు 'ఈ ప్రపంచంలో అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏంటి?' అని అడిగినప్పుడు ధర్మరాజు చెప్పిన సమాధానం అంతకంటే ఆశ్చర్యానికి గురి చేస్తుంది. 'మన కళ్ళ ముందే ఇంతమంది జన్మించి, మరణిస్తుంటే తాను మాత్రం శాశ్వతమనుకొని మనిషి డబ్బు కూడబెడుతుంటాడే! ఇంతకంటే ఆశ్చర్యకరమైన విషయం మరొకటి ఉందా!' అంటూ ధర్మరాజు ఇచ్చిన సమాధానం ప్రత్యక్షర సత్యం.

ఒక దేశాన్ని పరిపాలించినా, ఒక సంస్థ నడిపించినా, ఒక సంసారం ఒబ్బిడిగా నిర్వహించుకోవలన్నా అది నిర్వాహకుడిపై ఆధారపడి ఉంటుంది.

ఇప్పుడు యువతలో కొరవడుతున్నది నిర్వహణ సామర్థ్యమే (Managing Ability) ఇది వ్యక్తిత్వ వికాసంలో ఒక కీలకమైన భాగం. ఈరోజు ఈ నిర్వహణ తెలియకే అందరూ కంగారు పడిపోతున్నారు. కొన్ని విలువలకి కట్టుబడితే నిర్వహణ కష్టమేం కాదు. నిర్వాహణ ఎలా ఉండాలో ఒక ప్రాచీన శ్లోకం మనకి ఆనాడే తెలియజేసింది.

శ్లో ॥ ప్రసాదో నిష్ఫలో యస్య / కోపస్యాపి నిరర్థకః

నతం రాజాన మిచ్ఛం / ప్రజాః షండమివ స్త్రియః (*ముక్తా. 2000. శ్లో: 14*)

'రాజు ఎవరినైనా అనుగ్రహించినా, ఎవరిపైనైనా ఆగ్రహించినా వెంటనే దాని ఫలితం కనపడాలి. అలా కానప్పుడు స్త్రీలు నపుంసకుని చూసి మొహం తిప్పుకున్నట్లే ప్రజలు ఆ రాజు గురించి చులకనగా మాట్లాడుకుంటారు'.

ఈనాడు కొందరు ప్రభుత్వ నాయకులు ఉదారంగా వాగ్దానాలు చేస్తున్నారు. కానీ ఆ పనులకి సొమ్ము మాత్రం కేటాయించరు. కొందరు కేటాయించి చెక్కులు ఇస్తారు. అవి చెల్లవు. ఇలా రెండు మూడు సార్లు జరిగే సరికి ప్రజలకి ఆయా ప్రభుత్వాల మీద నమ్మకం పోతుంది.

ఇదే విషయం సంస్థలు నిర్వహించేవారికి, సగటు జీవితం గడిపే సంసారికి సైతం వర్తిస్తుంది. సంస్థలు నిర్వహించేవారు ఉద్యోగుల మెప్పు కోసం ఏదో మాట్లాడి తర్వాత ఆ మాటలు చేతల్లో నిరూపించలేకపోతే ఉద్యోగులు మరోసారి నమ్మరు.

అన్నింటికంటే ముఖ్యమైనవి తల్లిదండ్రులు పిల్లలకి చేసే వాగ్దానాలు. ఇచ్చిన మాట ఎంత చిన్నదైనా దాన్ని నిలబెట్టుకుని తీరాలి. లేకపోతే అసలు మాట ఇవ్వకుండా ఉండడం మంచిది. బండి కొంటాను అంటే కొనాలి. సినిమాకి తీసుకు వెళ్తాను అంటే తీసుకెళ్ళాలి. అది వారి వ్యక్తిత్వం పై తీవ్రమైన ప్రభావం చూపిస్తుంది. మనం ఎలా ఉంటే మన పిల్లలు అలాగే ఉండాలనుకుంటారు. అందుకే వాళ్ళు ఎలా ఉండాలని మనం కోరుకుంటున్నామో అలా మనం ఉండి చూపించాలి. మనం మాట మీద నిలబడితే వాళ్ళు కూడా దాన్ని ఆదర్శంగా తీసుకుని  భవిష్యత్తులో అలాగే ఉండేందుకు ప్రయత్నిస్తారు. అలాగే తప్పు చేస్తే మరీ కటువుగా కాకపోయినా శిక్షించాలి. అప్పుడే వారికి తప్పు చేయడంలో ఉండే తప్పేంటో తెలుస్తుంది.

మన భారతీయ కవులు అన్నిచోట్లా అన్నీ స్పష్టంగా చెప్పలేదు. కాస్త లోతుగా ఆలోచిస్తే ఒకొక్కరికి ఒక్కొక్క అర్థం ధ్వనిస్తుంది. ఎన్నో శ్లోకాలను నేటి జీవితానికి మనం అన్వయించుకోవచ్చు.

'లోనారసి' అంటే అదే. కేవలం కథ పరంగా భావాన్ని చదువుకుంటే పోతే, కథ మాత్రమే అర్థమవుతుంది. కానీ, తీక్ష్ణ దృష్టితో చూడాల్సిన అవసరం ఉంది. అలా చూస్తే నేటి సమాజంలో మనం ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు మన భారతీయ సాహిత్యంలో పరిష్కారాలు కనిపిస్తాయి.

కాళిదాసు రచించిన '*కుమార సంభవం*'లోని ఈ శ్లోకం అటువంటిదే.

శ్లో. పదం తుషార స్రుతి ధౌత రక్తం యస్మిన్న దృష్ట్వాఽ పి హత ద్విపానామ్

విదన్తి మార్గం నఖరన్ధ్రముక్తైః ర్ముక్తాఫలైః కేసరిణాం కిరాతాః (*కుమార. ప్ర. స.: 6*)

'హిమాలయాల్లో సింహాలని వేటాడే బోయవాళ్ళు సింహాలని, ఏనుగుల్ని చంపి రక్తంతో నిండిన వాటి అడుగుజాడలను బట్టి గుర్తిస్తున్నారట. ఆ అడుగుజాడలని అనుసరిస్తున్నారట. కొంత దూరం వెళ్ళే సరికి, అక్కడున్న మంచుకి వాటి అడుగుజాడలు చెరిగిపోయాయట. అయితే,

ఏనుగులను వేటాడిన సింహాల గోళ్ళలో ఏనుగు కుంభ స్థలంలో ఉండే ముత్యాలు ఇరుక్కున్నాయట. అవి ఆ మంచు ప్రభావం చేత జారి అక్కడక్కడ పడ్డాయట. వాటిని అనుసరించి కిరాతులు వెళ్తున్నారట'. ఎంత గొప్ప భావన!

ఇది బయటకి కనిపించే అర్థం. బాగా పరిశీలిస్తే మరొక అద్భుతమైన అర్థం కనిపిస్తుంది. కిరాతులు రక్తంతో నిండిన సింహాల అడుగుజాడలు చెరిగిపోతే నిరుత్సాహపడలేదు. తెలివి ఉపయోగించి మరొక మార్గాన్ని కనుక్కొన్నారు. జీవితం కూడా అంతే ఒక మార్గం మూసుకుపోతే మరొకటి తెరుచుకుంటుంది. కాస్త సహనం, తెలివి తేటలు అవసరం. అంతే. ఒక దారి మూసుకుపోగానే దిగులుపడిపోకూడదు. పైగా అనుకున్న పని పూర్తయ్యేవరకు వెనుదిరగకూడదు. 'ధీరుల్ విఘ్న నిహన్య మానులగుచున్ ధృత్యున్నతోత్సాహులై ప్రారబ్ధార్థములుజ్జగింపరు సుమీ ప్రజ్ఞా నిధుల్ కావునన్' అంటూ మన సుభాషితం కూడా అదే బోధిస్తోంది.

మరొక విషయం ఏమిటంటే చెరిగిపోయిన మార్గం రక్తపు మరకల మార్గం. తెరుచుకున్న మార్గం ముత్యాల మార్గం. మనం ఓర్పుతో ఎదురు చూస్తే మన కోసం జీవితంలో ముత్యాల మార్గాలెన్నో ఎదురుచుస్తుంటాయి అనే గొప్ప భావం ఈ శ్లోకంలో ధ్వనిస్తుంది.

కేవలం భావం, తాత్పర్యం తెలుసుకుంటే ఏం ఉపయోగం? మన జీవితాలకి ఏదో రకంగా మన సాహిత్యం మేలు చేకూర్చాలి. సగటు మనిషికి జీవితమనే సముద్రాన్ని ఈదగలిగే ధైర్యాన్ని ప్రసాదించాలి. యావత్భారతీయ సాహిత్యం ఆ దిశగానే కృషి చేసింది. మన సాహిత్యం ఎవరికి ఏది కావాలో అదే ఇస్తుంది. ఎవరు ఏ దృష్టితో చూస్తే అలానే కనిపిస్తుంది. వ్యక్తిత్వం వికసించడానికి కేవలం భారతీయ సాహిత్యం చాలు. కానీ, మన కావ్యాలు చెప్పే విధంగా చెప్తే, చదివే విధంగా చదివితే మనసుల్ని రంజింపజేస్తాయి. కావ్యాలు, భార్య మనతో ఎంత చనువుగా ఉంటుందో, అంత చనువుగా ఉంటూ సందేశాన్ని అందిస్తాయి. అందుకే కావ్యాలని 'కాంతా సమ్మతాలు' అన్నారు. వాటిని చదివి, అర్థం చేసుకుని, అన్వయించుకుని, ఆచరిస్తే ప్రతి ఒక్కరి జీవితంలో గొప్ప మార్పు వస్తుంది.

మన కావ్యాలు నిత్యజీవితంలో మనిషి ఎదుర్కొనే ఎన్నో సవాళ్ళకు సమాధానాలు ఇస్తాయి. సమస్యలకు పరిష్కారాలను సూచిస్తాయి. కష్టాలను ఎదుర్కొనే ధైర్యాన్నిస్తాయి. అన్నింటినీ మించి

వ్యక్తిని శక్తిగా తయారుచేస్తాయి. వ్యక్తిత్వం వికసించడానికి ఎంతగానో దోహద పడతాయి. భారతీయ సాహిత్యం యొక్క ప్రత్యేకత అదే. ఈ రోజు ప్రపంచమంతా మన సంస్కృతీ సంప్రదాయాలకు శిరస్సు వంచి నమస్కరించేది ఆ ప్రత్యేకతకే. మన సంస్కృతీ సంప్రదాయాలను, మన సాహిత్యపు విలువలను ప్రపంచానికి చాటి చెప్పే ముందు మనం వాటి గొప్పతనాన్ని తెలుసుకుని ఆచరించాలి. చర్చ కన్నా చర్య ముఖ్యం. ఆచరణ లేకపోతే ఎంతటి సాహిత్యమైనా వ్యర్థమే.

వ్యక్తిత్వ వికాసం కోసం ఈనాడు మనం ఇతరుల ముందు అర్రులు చాచాల్సిన అవసరం లేదు. భారతీయ సాహిత్యంలో వ్యక్తిత్వ వికాసం ఒక అంతర్లీనమైన భాగం. యావత్ప్రపంచం మనవైపు చూస్తున్న ఈ తరుణంలో, మనం మన సాహిత్యాన్ని మరింతగా ఆస్వాదించి, ఆచరించడం ముఖ్యం. భారత దేశం, భారతీయ సాహిత్యం, భారతీయ తత్త్వశాస్త్రం వ్యక్తిత్వ వికాసానికి చిరునామాలుగా ప్రపంచపాఠంపై సువర్ణాక్షరాలతో లిఖించుకోదగినవి.

# అధ్యాయం – 3

# ప్రాచీన తెలుగు సాహిత్యం : వ్యక్తిత్వ వికాసం

## 3.1. పరిచయం

మొదటి అధ్యాయంలో ఈ పరిశోధనకి మూలమైన *మనుచరిత్ర* గురించి, రెండవ అధ్యాయంలో వ్యక్తిత్వ వికాసానికి ఉన్న సైద్ధాంతిక నేపథ్యం గురించిన చర్చ జరిగింది. రెండవ అధ్యాయంలోనే సంస్కృత సాహిత్యంలో కొన్ని శ్లోకాలను వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడేవిగా పేర్కొనడం జరిగింది. ఈ అధ్యాయంలో ప్రాచీన తెలుగు సాహిత్యంలో ఉన్న వ్యక్తిత్వ వికాసం గురించిన చర్చ ఉంటుంది. అయితే, ప్రాచీన తెలుగు సాహిత్యం ఎంతో విస్తారమైనది. ఏ దృష్టితో ఆ సాహిత్యాన్ని పరిశీలిస్తే ఆ రూపంలో దర్శనమిస్తుంది. ప్రాచీన తెలుగు సాహిత్యం ఒక అక్షయ పాత్ర. వెతికిన కొద్దీ అందులో వ్యక్తిత్వ వికాస అంశాలు దొరుకుతూనే ఉంటాయి. అన్ని పద్యాలనూ ఇక్కడ చర్చించడం అసాధ్యం. కేవలం ప్రాచీన తెలుగు సాహిత్యంలో వ్యక్తిత్వ వికాసాన్ని బోధించే పద్యాలు చాలా ఉన్నాయని చెప్పడం మాత్రమే ఈ అధ్యాయం ఉద్దేశ్యం. కాబట్టి కొన్ని పద్యాలను మాత్రమే ఇక్కడ పరిశీలించడం జరుగుతుంది.

యావత్ప్రపంచ సాహిత్యంలో భారతీయ సాహిత్యానికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. అందులో తెలుగు సాహిత్యం మరింత ప్రత్యేకమైనది. ఎంతో మంది కవులు ఎన్నో ప్రక్రియల ద్వారా మన సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. అడుగడుగునా వైవిధ్యంతో తెలుగు సాహిత్యం మిగతా భాషల సాహిత్యం కంటే ఎంతో విభిన్నంగా కనిపిస్తుంది.

నన్నయతో మొదల్కొని నేటి కవుల వరకూ అందరూ వివిధ ప్రక్రియాల్లో ఎన్నో రచనలు చేశారు. మార్గాలు వేరైనా ప్రతి ఒక్కరూ సమాజానికి ఏదో ఒక రకంగా మంచి చేయడానికే రచనలు చేశారు.

వ్యక్తిత్వ వికాసానికి భారతీయ సాహిత్యం చిరునామా అయితే, మన తెలుగు సాహిత్యం యావద్భారతీయ సాహిత్యానికే తలమానికమైనటువంటిది. వ్యక్తిత్వం వికసించే దిశగా మన

సాహిత్యం ఎంతగానో తోడ్పడుతుంది. ముఖ్యంగా మన ప్రాచీన సాహిత్యం, మన ప్రాచీన కావ్యాలు వ్యక్తిత్వ వికాసంపైనే ఎక్కువగా దృష్టి సారించాయి. కొన్ని కావ్యాల్లో అది ప్రత్యక్షంగా కనిపిస్తే, కొన్నింటిలో అది పరోక్షంగా ధ్వనిస్తుంది

మన ప్రాచీన ప్రబంధాలు పూర్తిగా శృంగార పరమైనవేనని, అశ్లీలమైనవి అని నేటి కాలంలో చాలా మంది భావిస్తున్నారు. ఆ అభిప్రాయం సరైనది కాదు. ఆ కాలానికి అంతర్జాలం వంటి ప్రచార, ప్రసార మాధ్యమాలు లేవు కాబట్టి యువతకి శృంగారం గురించి తెలిసే అవకాశం లేకపోయింది. అందుకే మన ప్రాచీన ప్రబంధాల్లో కొన్ని వర్ణనల్లో అలాంటి విషయాల ప్రస్తావన చేశారు మన కవులు. వాటిని ఈ కాలానికి అన్వయించుకుంటే ఎబ్బెట్టుగానే అనిపిస్తాయి. మన దేవాలయాల మీద బొమ్మలు ఆ ఉద్దేశ్యంతోనే చెక్కబడ్డాయి. అప్పట్లో పెళ్ళైన కొత్తలో దంపతులు తీర్థయాత్రలు చేసేవారు కాబట్టి వారు గోపురంపైనున్న ఆ బొమ్మలను చూసి గ్రహించవలసిన విషయాలను గ్రహిస్తారని వాటిని అలా చెక్కారు. ఆనాటి కాలానికి Sex Education అదే. అంతే కానీ అవి బూతు బొమ్మలు కావు.

మన భారతీయ సంస్కృతి, భారతీయ సాహిత్యంలో ఏం చేసినా దాని వెనుక ఒక బలమైన కారణం ఉంటుంది. దాన్ని మనం అర్థం చేసుకోవాలి. వక్ర దృష్టితో చుసేవారికి అన్నీ వంకరగానే కనపడతాయి. మన కావ్యాలని కూడా వక్ర దృష్టితో చూడకూడదు. ఈ కాలం వారికి పద్య సాహిత్యం చదవడానికి కష్టంగా అనిపించినా, ఇష్టంతో చదివితే వ్యక్తిత్వ వికాసానికి ప్రాచీన సాహిత్యం ఎంతగానో దోహదపడుతుంది. ప్రాచీన సాహిత్యం 'నారికేళ పాకం' వంటిది. కాస్త శ్రమిస్తే గొప్ప జ్ఞానాన్ని పొందగలుగుతాం. ఈ రోజుల్లో మనం ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలను మన కవులు దూర దృష్టితో ముందే ఊహించి వాటికి పరిష్కారాలను వారి రచనల్లో సూచించారు.

కవిత్రయ భారతం మొదల్కొని ప్రాచీన సాహిత్యంలో ఎన్నో కావ్యాల్లో వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేసే అంశాల గురించి విస్తారమైన చర్చ కనిపిస్తుంది.

వ్యక్తిత్వ వికాసం అనేది ఏదో ఒక రంగంలో మనిషి ప్రగతిని సూచించేది కాదు. రకరకాల కోణాల్లో మనిషి సాధించే అభివృద్ధి వ్యక్తిత్వ వికాసం. తనలో ఉన్న చిన్నపాటి లోపాలను సైతం సవరించుకొని సంపూర్ణమైన వ్యక్తిగా మనిషి ఎదగడమే వ్యక్తిత్వ వికాసం (*చూ. 2.1*). మన తెలుగు

పద్యాల్లో ఒక వ్యక్తి సంపూర్ణంగా ఎదగడానికి ఏవి అవసరమో చెప్పడమే కాకుండా, వ్యక్తి ఎదుగుదలకు ఉన్న అడ్డంకులను, వాటి మూలాలను వివరించి పరిష్కారాలు సైతం సూచించారు మన ప్రాచీన తెలుగు కవులు.

## 3.2. సత్యభాషణం

వ్యక్తిత్వ నిర్మాణంలో సత్యభాషణం చాలా ముఖ్యమైనది. 'సత్యం' చాలా గొప్పది, కఠినమైనది. సత్యానికి కట్టుబడి ఉండడం వల్ల ముందు కొన్ని కష్టాలు వచ్చినా, అంతిమంగా విజయం తప్పక వరిస్తుంది. సత్యం ఎంత గొప్పదో ఈ కింది పద్యం వివరిస్తుంది.

చ. నుతజలపూరితంబు లగు నూతులు నూఱిటికంటె సూనృత
వ్రత! యొక బావి మేలు; మరి బావులు నూఱిటికంటె నొక్కస
త్క్రతువది మేలు; తత్క్రతుశతంబునకంటె సుతుండు మేలు; త
త్సుత శతకంబుకంటె నొక సూనృతవాక్యము మేలు సూడఁగన్ (*భారతం. ఆది. 4:94*).

ఆదికవి నన్నయ రచించిన *ఆంధ్ర మహాభారతం*లోని ఈ పద్యం ఎంతో గొప్ప సందేశాన్ని ఇస్తుంది. 'మంచినీటితో నిండిన చేదుడు బావులు నూరిటి కంటే ఒక దిగుడుబావి మేలు; కాగా, బావులు నూరిటి కంటే ఒక మహాయజ్ఞం మేలు; అటువంటి నూరు మహాయజ్ఞాలు కంటే ఒక పుత్రుడు మేలు; అట్టి పుత్రులు నూరుమంది కంటే ఒక సత్యవాక్యం మంచిది'.

సత్యం మాట్లాడడంలో ఉండే గొప్పతనం గురించి నన్నయ పై పద్యంలో చెప్పాడు. ఈ ఒక్కటే కదా అనుకుంటూ మనం రోజూ కొన్ని వందల అబద్ధాలు చెప్పేస్తుంటాం. వాటి వల్ల జరిగే నష్టం పెద్దగా ఏం లేదు అనుకుంటాం. కానీ, అది ఇతరుల ప్రవర్తనను ప్రభావితం చేస్తుందని గ్రహించం. మన చుట్టూ ఉండేవారు కూడా అందరూ చేసేదే కదా అని వాళ్ళు కూడా చాలా తేలికగా అబద్ధాలు చెప్పేస్తుంటారు. ఇలా అబద్ధాలు చెప్పడం ముఖ్యంగా పిల్లల్ని, యువతరాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది.

చిన్న చిన్న అబద్ధాలే అలవాటుగా మారి, ఎప్పుడూ సత్యాన్ని బయటకు రానివ్వవు. మనం నిజం మాట్లాడేది అవతల వారి మెప్పు కోసం కాదు, మన ఆత్మ సంతృప్తి కోసం అనే విషయాన్ని గ్రహించడం చాలా ముఖ్యం. ఎన్ని కష్టాలు ఎదురైనా హరిశ్చంద్రుడు తన జీవితం మొత్తం సత్యాన్ని విడవలేదు. అందుకే 'సత్యం' హరిశ్చంద్రుడి ఇంటిపేరుగా స్థిరపడిపోయింది. తన జీవితం మొత్తం గాంధీగారు సత్యం మాట్లాడడంలో ఉండే సంతృప్తి గురించే బోధించారు.

సత్యమార్గంలో నడిచేవారికి ముందు కష్టాలు తప్పవు. అబద్ధాలు అప్పటికి హాయిగా అనిపించినా దీర్ఘకాలికంగా తీవ్రమైన దుష్ప్రభావాన్ని చూపిస్తాయి. కానీ, అంతిమంగా జయించేది సత్యమే. సత్యాన్ని నమ్ముకుని వారి దైనందిన జీవితాల్లో ఆచరించిన వారి గురించి మనం నేటికీ మాట్లాడుకుంటున్నామంటే సత్యం మాట్లాడడంలో ఉండే సంతృప్తి ఏంటో అర్థం అవుతూనే ఉంది. ఎప్పుడూ సత్యాన్నే నమ్ముకునే వారి వ్యక్తిత్వాలు చిరకాలం నిలిచిపోతాయన్న విషయం కూడా స్పష్టమవుతోంది. మనం కూడా మన నిత్యజీవితంలో నిజాలే మాట్లాడితే అది అలవాటుగా మారుతుంది. మన చుట్టూ ఉన్నవారికి సైతం స్ఫూర్తిని కలిగిస్తుంది.

నేటితరం ఆ ఒక్క రోజు ఆనందంగా ఉండడం కోసం ఏదైనా చేయవచ్చు అనే భావనలో ఉన్నారు. ఆనందంగా ఉండడం తప్పు కాదు. హరిశ్చంద్రుడు ఒక్క రోజు కోసమే బతికి ఉంటే, అప్పటి తాత్కాలికమైన సుఖాన్నే కోరుకుని ఉంటే, ఇవాళ ఇంతమందికి స్ఫూర్తిగా నిలిచేవాడా? మనం నిజాలే మాట్లాడడం వల్ల నేటి యువతరం సత్యం మాట్లాడడంలో ఉండే సంతృప్తి గురించి, గొప్పతనాన్ని గురించి ఆలోచిస్తారు.

'ఈ కాలంలో మంచికి రోజుల్లేవు', 'సత్యం మాట్లాడితే బ్రతకలేం' అని మనలో చాలా మంది అంటుంటారు. మంచికి రోజులు ఉన్నాయో లేదో నిర్ణయించేది ఎవరు? మనమే. మనుషులు స్వతఃసిద్ధంగా బద్ధకస్తులు. వారికున్న బద్ధకాన్ని సమూహానికి మప్పేసి సంతృప్తి పడుతుంటారు. వారి చేతగానితనాన్ని పరిస్థితులు బాలేవు అంటూ, సమాజంపై తోసేసి సమర్ధించుకుంటూ ఉంటారు. అందరూ సత్యమే మాట్లాడితే మంచికి రోజులు ఎందుకుండవు? మనుషులకి మాట్లాడడంలో, వాదించడంలో ఉండే ఆసక్తి ఆచరించడంలో ఉండదు. ఉపన్యాసాలు ఇవ్వడానికి మాత్రం అందరూ తయారైపోతారు. 'ఆ! మనం ఒక్కరం చేస్తే ఈ సమాజం మారుతుందా?' అంటూ చేతులు దులిపేసుకుంటే ఈ సమాజం ఇలాగే ఉంటుంది. మనం ఆచరించడం అనేది మన సంతృప్తికి

సంబంధించిన విషయం. 'సత్యమేవ జయతే' అని జాతీయ చిహ్నంపైనైతే రాసుకున్నాం కానీ, మనమే సమష్టిగా సత్యాన్ని ఓడిపోయేలా చేస్తున్నాం. ఇది భారతీయతకి గొడ్డలిపెట్టు.

ఎప్పటికైనా సరే సత్యమార్గంలో నడిస్తేనే ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని సాధించగలుగుతాం. మనం చేసే తప్పులకి వ్యవస్థని నిందించడం సరి కాదు. వ్యవస్థ అంటే మనుషులందరూ కలిసిందే. ఏ దేశమైనా గొప్పది ఎలా అవుతుంది? ఆ దేశ పౌరులు గొప్పవారైనప్పుడే. అందుకే సత్యమార్గంలో నడిచి ప్రతి ఒక్కరు వారి వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలి. అప్పుడే మన మువ్వన్నెల జెండా సగర్వంగా భారత దేశపు కీర్తి పతాకమై రెపరెపలాడుతుంది. గుంటూరు శేషేంద్రశర్మ గారన్నట్టు 'ఒక దేశపు జెండాకి ఉండే పొగరు' మన జెండాలో కనిపిస్తుంది. అప్పుడే 'సత్యమేవ జయతే' అన్న మాటకి సార్థకత.

## 3.3. మానసికమైన ఒత్తిడి – కారణాలు – పరిష్కారం

*ఆంధ్రమహాభారతం* విరాట పర్వంలో తిక్కన రచించిన ఈ కింది పద్యం నేడు ఎన్నో కీలకమైన ప్రశ్నలకు సమాధానంగా కనిపిస్తుంది, ముఖ్యంగా మానసికంగా మనుషులను వేధిస్తున్న కొన్ని కీలకమైన సమస్యలకు మూలాలు ఎక్కడున్నాయో వివరిస్తుంది, పరిష్కారాన్ని సైతం సూచిస్తుంది.

శా. సింగం బాఁకటితో గుహాంతరమునం జేడ్పాటుమై నుండి మా
తంగస్ఫూర్జిత యూథ దర్శన సముద్యత్క్రోధమై వచ్చునో
జం గాంతార నివాసఖిన్నమతి న స్మత్సేనపై వీఁడె వ
చ్చెం గుంతీసుత మధ్యముండు సమర స్థేమాభి రామాకృతిన్. *(భారతం. విరాట. 4:95)*

'పన్నెండేళ్ళ వనవాసం, రెండేళ్ళ అజ్ఞాత వాసం పూర్తయ్యాక అర్జునుడు, ఆకలితో గుహలో ఉన్న సింహం తానున్న గుహ ముందు ఏనుగుల గుంపు కనిపిస్తే ఒక్కసారిగా ఎలా దూకుతుందో, అలా కౌరవసేనపైకి దూకాడు' అని ఈ పద్యంలో తిక్కన గారు అర్జునుడి ప్రతాపం గురించి వర్ణించారు.

లోతుగా పరిశీలించి, ఈ కాలానికి ఈ పద్యాన్ని అన్వయిస్తే, నేటి యువతరం ప్రవర్తన వెనుక ఉన్న కారణాలు కనిపిస్తాయి. పాఠశాలలో చేర్చింది మొదలు సుమారుగా పద్నాలుగేళ్ళు పిల్లల్ని ర్యాంకులు సాధించడమే లక్ష్యంగా పెంచి, వాళ్ళని రోజంతా చదువు పేరు మీద రుబ్బేయడం ఈ రోజుల్లో సర్వ సాధారణమైపోయింది. వారికి చదువు తప్ప వేరే లోకం తెలియనట్టుగా పెంచేసరికి వారు ఒత్తిడికి గురవుతున్నారు. ఈ విద్యావిధానం వారి ప్రవర్తనపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తోంది. ఆ ఒత్తిడిని తట్టుకోలేక వారిలో పైశాచిక ధోరణి ప్రబలుతోంది. ఈనాడు ముఖ్యంగా విద్యార్థి లోకంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్న Ragging వంటి వాటికి ఈ పైశాచిక ధోరణే ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

నైతికమైన విలువలను పిల్లలకు బోధించడంలో ఈనాటి విద్యావిధానం సఫలీకృతం కాలేకపోతోందన్నది కాదనలేని సత్యం. సాధారణంగా వ్యవస్థతో పాటే విద్యావిధానం కూడా ఆధునీకీకరించబడుతుంది. అది అనివార్యం. కానీ, నైతికమైన విలువలు ఈతరానికి అందించడంతో పాటు ఒత్తిడి లేని విద్యా విధానాన్ని ప్రవేశపెట్టకపోతే పరిస్థితి మరింత విషమిస్తుంది. పిల్లల ప్రవర్తనని చాలా జాగ్రత్తగా మలచాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, గురువులపై ఉంది. మార్కుల పేరు చెప్పి పిల్లల్ని మూర్ఖులుగా తయారు చేయకూడదు. గెలుపోటములు రెండింటినీ సమానంగా తీసుకోగలిగేలా పిల్లల్ని తీర్చిదిద్దాలి. అప్పుడే జీవితంలో ఎన్ని ఒడుదిడుకులు ఎదురైనా వారి ఆలోచనలు వారిని పక్కదోవ పట్టనియ్యవు. ఏది చేయాలో ఏది చేయకూడదో నిర్ణయించుకునే విచక్షణాజ్ఞానం వారి నడవడికను ఎప్పటికప్పుడు సరిచేస్తుంటుంది.

ప్రాథమిక విద్యలో వ్యక్తిత్వ వికసాన్ని పెంపొందించే మన కావ్యాలనీ, వాటిలోని పద్యాలని ఎక్కువగా బోధిస్తే, జీవితంలో ఒక్కొక్క సంఘటన ఎదురవుతుంటే మస్తిష్కం ఒక్కొక్క పద్యాన్ని ఉటంకిస్తూ ఊరటనిస్తుంది, దిశానిర్దేశం చేస్తుంది. పిల్లల్ని చిన్నప్పటినించి జైల్లో పెట్టినట్టు చదువు పేరు చెప్పి బంధించేస్తే, డిగ్రీ చదివే సమయానికి ఒక్కసారిగా అంత స్వేచ్ఛను చూసేసరికి, వారి ప్రవర్తనలో వింత మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రత్యక్షంగా చెప్పకపోయినా పరోక్షంగా తిక్కన నేటి సమస్యకి మూలాలు ఎక్కడున్నాయో పైపద్యంలో చెప్పారు. సరిగ్గా అన్వయించుకోవాలే కానీ ప్రాచీన తెలుగు సాహిత్యంలో ఎన్నో పద్యాలు నేటి సమాజంలో కీలకమైన సమస్యలకు పరిష్కారాలుగా కనిపిస్తాయి.

## 3.4. భారతీయ విద్యావిధానం

భారతీయ విద్యావిధానం చాలా ప్రత్యేకమైనది, భిన్నమైనది. ఇప్పుడున్న విద్యావిధానం భారతీయతను చాటే పద్ధతిలో సాగడం లేదు. అందుకే, విద్యావిధానం ఎలా ఉండాలో పోతన *భాగవతం*లో ఒక చక్కటి పద్యంలో వివరించారు. విద్యావిధానం బావుంటేనే వ్యక్తిత్వాలు వికసించేది. విద్యావిధానంలో నాణ్యత లోపిస్తే అది విద్యార్థుల వ్యక్తిత్వాలపై, ప్రవర్తనపై, నడవడికపై మొత్తం జీవితంపై ప్రభావం చూపిస్తుంది.

ఉ. క్షోణితలంబునెన్నుదురు సోకగ మ్రొక్కి నుతింతు సైకత
శ్రోణికి చంచరీకచయ సుందరవేణికి రక్షితామర
శ్రేణికి తోయజాతభవచిత్త వశీకరణైక వాణికిన్
వాణికి నక్షదామ శుక వారిజ పుస్తక రమ్యపాణికిన్. (*భాగవతం. ప్ర. స్క: 6*)

ఈ పద్యం సుప్రసిద్ధం. నిజానికి ఈ పద్యం కేవలం వర్ణనగా అనిపిస్తుంది. బమ్మెర పోతన సరస్వతీ దేవిని చాలా గొప్పగా వర్ణించారు. అయితే, ఈ పద్యం చివరి పాదంలో సరస్వతీ దేవి నాలుగు హస్తాలలోనూ పుస్తకం, పద్మం, చిలుక, అక్షమాల ఉంటాయని పేర్కొనబడింది.

ఈ వర్ణన ఇప్పటి సరస్వతీదేవి రూపానికి భిన్నంగా ఉంది. పుస్తకం, అక్షమాల ఇప్పటికీ కనిపిస్తూ ఉన్నా, పద్మం, చిలుక మాయమైపోయాయి. వాటి స్థానంలో ఇప్పుడు వీణ కనిపిస్తుంది. 'ఏం ఉంటే ఏముందిలే' అని వదిలేయాల్సిన చిన్న విషయం కాదిది. పోతన గారి పద్యంలో ఉన్న నాలుగు చిహ్నాలు మామూలువి కావు. అవి చతుర్విధ పురుషార్థాలకీ ప్రతికలు. పుస్తకం ధర్మానికి ప్రతిక. పుస్తకాల ద్వారానే మనం అనేక ధర్మాలు తెలుసుకోగలుగుతాం. పద్మం అర్థానికి ప్రతిక. పద్మం నుంచే లక్ష్మీదేవి జన్మించింది. చిలుక కామానికి సంకేతం. మన్మథుని వాహనం చిలుక. అక్షమాల జ్ఞానానికి చిహ్నం. కేవలం జ్ఞానం ద్వారానే మోక్షం సిద్ధిస్తుంది. కాబట్టి, అక్షమాల మోక్షానికి సంకేతం. జపతపాదులు మోక్షం వైపు నడిపిస్తాయి. ఈ నాలుగు చిహ్నాలను సరస్వతీదేవి ధరిస్తోంది. అంటే, విద్య ద్వారా ధర్మ, అర్థ, కామ, మోక్షాలను సాధించాలని ప్రతికాత్మకంగా తెలియజేస్తోంది ఈ పద్యం.

ఆ మూర్తికి ఉదయం విద్యార్థినీ విద్యార్థులు నమస్కరించినప్పుడు ఆ చిహ్నాలు విద్యాలక్ష్యాలను గుర్తుచేస్తుంటాయి. అటువంటి రూపంలో ఇప్పుడు మార్పు ఎందుకు వచ్చిందో తెలియడం లేదు.

రూపం ఎలా ఉన్నా కొంపలు ములిగిపోయే ప్రమాదమైతే లేదు కానీ, ఆ స్ఫూర్తి దెబ్బతిందని మాత్రం చెప్పవచ్చు.

తెలుగునాట కొత్తగా బడిలో చేరిన విద్యార్థులు పుస్తకం పట్టగానే మొదటి పుటలోనే అమ్మ, ఆవు, ఇల్లు, ఈశ్వరుడు అనే నాలుగు మాటలు బొమ్మలతో సహా కనిపిస్తాయి. ఈ నాలుగు పదాలు కేవలం అక్షరాలు నేర్పించడానికి పెట్టినవి కావు. ఈ నాలుగు మాటలు చతుర్విధ పురుషార్థాలకు సంకేతాలు. అమ్మ ధర్మానికి ప్రతిక, సమస్త ధర్మాలను మనిషికి బోధించే ప్రథమ గురువు తల్లి. ఆవు అర్థానికి ప్రతిక. గోవులను సంపదగా భావించడం వల్లే దానధర్మాలు, క్రయ విక్రయాలు జరుగుతున్నాయి. ఈనాడు పాడి పరిశ్రమలు కూడా ఉన్నాయి. ఇల్లు కామానికి సంకేతం. సమస్త కామనలకు మూలం సంసారం. ఆ సంసారానికి ఆధారభూతమైంది ఇల్లే. ఈశ్వరుడు మోక్షానికి సంకేతం. పోతన పేర్కొన్న  పురుషార్థాలైన ధర్మ, అర్ధ, కామ, మోక్షాలు నాలుగూ మన విద్యావిధానంలో ప్రారంభ దశలోనే కనిపిస్తాయి.

ప్రాచ్య, అప్రాచ్య దేశాల మధ్య భావ సంఘర్షణ ఎప్పుడూ ఉంది. భౌతిక జీవనానికి ప్రాధాన్యం ఇచ్చే పాశ్చాత్య ఆలోచనావిధానం ఎప్పుడూ మనకు వ్యతిరేకంగానే ఉంటూ వచ్చింది. వెలుగులారిపోయే పడమటి దిశ నుంచి వెలుగులను ఉదయింపజేసే దిశలో ఉన్న మనం ఆలోచనలను స్వీకరించవలసిన పనే లేదు. అలా స్వీకరించడం ప్రమాదం కూడా.

ఈ విషయం నిరూపించడానికి ప్రాథమిక విద్యావిధానంలో ఉన్న ఒక ఉదాహరణ చాలు. ఒకటవ తరగతి తెలుగు వాచకంలో మొదటి పుటలో అమ్మ, ఆవు, ఇల్లు, ఈశ్వరుడు అనే పదాలు కనిపిస్తాయి. అదే స్థాయిలో ఉండవలసిన ఇంగ్లీష్ మీడియం LKG పుస్తకం ఇందుకు భిన్నమైన సంస్కృతిని బోధిస్తోంది. A for APPLE, B for BAT, C for CAT, D for DOG అనే మాటలు కనిపిస్తాయి. Apple అంటే ముందు తిండి గురించి చెబుతుంది. కొత్తగా చదువుకోవడానికి వచ్చిన పసిపిల్లాడికి తిండి గురించి చెప్పడానికి, భక్తిగా అమ్మకి నమస్కరించడానికి ఎంతో తేడా ఉంది. Bat అంటే ఆటలకు ప్రతిక. మొదటే ఆటల ప్రస్తావన అంత సమంజసంగా అనిపించదు. తర్వాత Cat, Dog. ఏదో పరిచయం ఉన్న జంతువుల పేర్లు చెబుతున్నామనే భావనే తప్ప వాటి ద్వారా పిల్లలకు ఉన్నతమైన విలువలను నేర్పిద్దామన్న ధ్యాసే లేదు. వాటి నుంచి పిల్లలు ఏం నేర్చుకోగలరు? ప్రాథమిక దశలో పిల్లల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే విధానం మన భారతీయుల సొంతం. అందునా తెలుగు విద్యావిధానం మరింత ఉన్నతమైనది. అందుకే ప్రాథమిక విద్య మాతృభాషలో జరగాలి.

'సత్యం వద' అనేది మన సూక్తులలో ప్రధానమైనది. హరిశ్చంద్రుడు, ధర్మరాజు మొదలైన సత్యమూర్తుల కథలను తల్లిదండ్రులు మనకి బోధించేవారు. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. LKG పుస్తకంలో 'Johnny Johnny yes papa' అనే చిన్న పాటని పిల్లల చేత కంఠస్థం చేయిస్తున్నారు. అబద్ధాలు చెప్పడం పెద్ద తప్పేమీ కాదని, వాటిని సరదాగా తీసుకోవాలని ఆ పాట బోధిస్తుంది. ఇటువంటి పాఠాలు పిల్లల మనస్సుల్లో విషబీజాలు నాటుతాయి. అందుకే, చిన్నతనంలోనే పిల్లల్ని దగ్గర కూర్చోబెట్టుకుని వేమన, సుమతి... మొదలైన నీతి శతకాల్లోని పద్యాలను నేర్పించాలి. అవి బాధ్యత గల యువతరంగా వారిని తీర్చిదిద్దుతాయి. నేటి యువతే రేపటి భవిత.

## 3.5. స్పర్థ

'స్పర్థయా వర్ధతే విద్యా' అని ప్రసిద్ధి. పోటి వల్ల విద్య బాగా వృద్ధి చెందుతుంది. ఆ పోటీని మనిషి ఎలా తీసుకోవాలో ఈ కింది పద్యం వివరిస్తుంది.

ఉ. కంటికి నిద్రవచ్చునె? సుఖంబగునే రతికేళి? జిహ్వకున్
వంటక మించునే? యితర వైభవముల్ పదివేలు మానసం
బంటునె? మానుషంబుగల యట్టి మనుష్యున కెట్టివానికిన్
గంటకుఁడైన శాత్రువు డొకండు తనంతటివాఁడు గల్గినన్. (*కాశీ. 1: 108*)

'మనిషికి తనంతటివాడిని చూడగానే ఈర్ష్య, అసూయలు కలుగుతాయి. అవతలి వాడిని చూస్తే ముల్లుతో గుచ్చినట్టు ఉంటుంది. ముల్లు గుచ్చుకున్నప్పుడే ఆ బాధ ఉంటుంది. కానీ, శత్రువు ఉన్నాడనే భావన నిత్యం బాధిస్తూనే ఉంటుంది. ఆ ఆలోచన మనస్సులో ఉన్నంత కాలం నిద్ర రాదు, శృంగారమంటే కూడా ఆసక్తి కలగదు, పదార్థాల రుచి తెలియదు, ఎన్ని వైభవాలున్నా అవి ఆనందాన్ని కలిగించవు'.

పై పద్యంలో శత్రువు అనే పదం వాడారు. మన లాంటి ప్రతిభ ఉన్నవాడు మనకి శత్రువులాగే కనిపిస్తాడు. అందుకే ఆ పదం వాడారు. ఒకరు ఉన్న రంగంలోకి ఎవరైనా వచ్చి వారికి పోటీ ఇచ్చినప్పుడు, వారిని మించిపోతున్నప్పుడు మనుషులు సాధారణంగా ఓర్చుకోలేరు. ఇది చాలా నీచమైన వ్యక్తిత్వం. అందరూ బాగుండాలని కోరుకునేవారిదే ఉన్నతమైన వ్యక్తిత్వం. తోటి వ్యక్తిని

చూసి ఈర్ష్య పడడం ప్రారంభిస్తే వారు మనకి శత్రువే అవుతారు. ఇతరులని పోటీగా తీసుకోవడంలో ఎటువంటి తప్పు లేదు. అది ఇద్దరి ఎదుగుదలకీ మంచిది. కానీ ఆ పోటీ ఈర్ష్యగా మారితేనే ప్రమాదం.

ఈ తరం యువతలో ఎక్కువమంది అవతలివారిని తొక్కేసి వారు ఎదగాలనుకుంటున్నారు. ఇది చాలా నీచమైన ప్రవృత్తి. మనతో పాటే నలుగురూ ఎదగాలని అందరూ కోరుకోవాలి. మనిషికి స్వార్థం ఉండకూడదు. మనలో చాలా మంది గొప్ప వాళ్ళను తమ వాళ్ళు అని చెప్పుకోవడానికి ఇష్టపడతారు. అవసరమైతే లేని పోని బంధుత్వాలు కలిపేస్తారు. అదే సొంత వాళ్ళు ఎదిగితే తట్టుకోలేరు.

తనకి మాత్రమే మొదటి ర్యాంక్ రావాలి, మరెవ్వరికీ రాకూడదు అని ఎవరూ అనుకోకూడదు. వ్యక్తిగా ఎదగాలంటే ర్యాంకులు ముఖ్యం కాదు. సహృదయత కలిగి ఉండడం ముఖ్యం. మనకున్న ప్రతిభని నలుగురికీ నేర్పించే మనస్తత్వం కలిగి ఉండాలి. అప్పుడే వ్యక్తిత్వం వికసిస్తుంది.

మనిషి ఎలా ఉండాలో కొన్ని పద్యాలు చెబితే, ఎలా ఉండకూడదో చెప్పేవి మరి కొన్ని. పైపద్యం రెండవ కోవకి చెందింది.

## 3.6. ప్రతిభకు పట్టం

ప్రతిభ కలిగినవాడు ఎక్కడైనా జీవించగలడు. తన ప్రతిభ మీద మనిషికి నమ్మకం ఉంటే అవకాశాలు మనిషి వెంటే వస్తాయనే విషయాన్ని ఈ కింది పద్యం వివరిస్తుంది.

చ. వనజభవుండు కోపమున వాహనమైన మరాళభర్తకున్
వనజవనీవిహారకల నంబు దొలంగఁగఁ జేయుఁగాని గుం
భనమున దుగ్ధజీవన విభాగ విధాన నిరూఢనైపుణీ
జనితమహాయశో విభవసారము హంసకు మాన్పఁ జాలునే. (*లక్ష్మణ కవి, ఏనుగు. 2013: 38*)

'బ్రహ్మకు హంస మీద కోపం వచ్చినా సరోవరంలో తిరగనివ్వకుండా చేయగాలాడేమో కానీ, పాలను, నీళ్ళను వేరు చేయగల తన ప్రతిభను తనకు దూరం చేయలేడు కదా'.

విద్యార్థికి విద్య సహజసిద్ధమైన ఆభరణం. దానిని ఎవరూ అపహరించలేరు. ఒకరి ప్రతిభను వారి నుంచి దూరం చేయడం అసాధ్యం. ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక విభిన్నమైన ప్రతిభ ఉంటుంది.

అది ఎల్లప్పుడూ వారితోనే ఉంటుంది. ప్రతి ఒక్కరు తమలో ఉన్న ప్రతిభను గుర్తించి, దానికి సాన పెట్టాలి. ఇక్కడ విద్య అనడంలో కేవలం చదువు అని మాత్రమే కాదు. ప్రతిభకి ఎన్నో రూపాలున్నాయి.

ఈరోజుల్లో, పిల్లల్ని వారి భవిష్యత్తు గురించి వారిని నిర్ణయించుకోనివ్వకుండా తల్లిదండ్రులే వారి అభిప్రాయాలను పిల్లలపై రుద్దేస్తున్నారు. ఏ దారి మంచిదో చెప్పడం మంచిదే. కానీ, అంతిమ నిర్ణయం పిల్లలకే వదిలేయాలి. ఎందుకంటే, ఆ దారిలో ప్రయాణించవలసినది వారే. ఇష్టం లేని మార్గం ఎంచుకుంటే మనస్సు పెట్టలేరు. అందుకే కేవలం ఇంజనీరింగ్, మెడిసిన్ చేయాలి అంటూ మనమే నిర్ణయించకుండా వారిలో ఉండే ప్రతిభను గుర్తించి ఆ దిశగా వారిని ప్రోత్సహించాలి. అలా చేస్తే ఎప్పటికైనా విజయం తథ్యం. 'న రత్నమన్విష్యతి' అని ప్రాచీన సూక్తి. ప్రతిభ మన దగ్గర ఉన్నంతకాలం అవకాశాలు మనల్ని వెతుక్కుంటూ వస్తాయి.

అవకాశాల కోసం ఒకరి కాళ్ళు పట్టుకోవాల్సిన అవసరం ప్రతిభ ఉన్నవారికి ఉండదు. మనకి ప్రతిభ ఉన్నంతకాలం ఎక్కడైనా, ఎలాగైనా జీవించవచ్చు.

## 3.7. ఆలోచనాధోరణి

మనిషి ఆలోచనాధోరణి అతడి వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తుంది. ఆ ఆలోచనాధోరణే ఎన్నో సమస్యలను తెచ్చిపెట్టగలదు, చాలా సమస్యలను పరిష్కరించగలదు.

ఉ. కాకులు రావిపండ్లుఁ దిని క్రక్క శిలామయ దేవమందిరా
నీకములందు రావులు జనించును సజ్జన చిత్తవృత్తి య
వ్యాకులలీల ఱాతిగుడివంటిది లోకమున వేశ్యలుం
గాకులవంటివార లటుగానఁ బ్రమాదము చేరనిచ్చినన్. (*వైజయంతీ. 2: 98*)

'కాకులు రావిపళ్ళను గుడి గోడపై పెట్టుకుని తినేటప్పుడు కొన్ని గింజలు ఆ గోడల బీటల్లో ఇరుక్కుంటాయి. తర్వాత చిన్న వర్షపు చినుకు దానికి తగలగానే ఆ చిన్న గింజ పెద్ద రావి చెట్టుగా మారి గోడను చీల్చేస్తుంది. సజ్జనుల మనస్సు రాతిగుడి వంటిది. వేశ్యలు కాకుల వంటి వారు. చిన్న విషపు బీజం మనస్సులో చేరిందంటే అది మొత్తం జీవితాన్ని కుదిపేస్తుంది'.

ఈ పద్యంలో వేశ్యల గురించి చెప్పినప్పటికీ మొత్తంగా చూసుకుంటే, ఒక చెడ్డ ఆలోచన తాలుకా బీజం మనస్సులో పడిందంటే అది క్రమంగా పెరిగి మనస్సుని ఎలా తొలిచేస్తుందో కవి

వివరిస్తున్నాడు . ఆ చిన్న ఆలోచన ఎన్నో దుష్పరిణామాలకు దారి తీస్తుంది. అందుకే ఒక చెడుకోరిక మనస్సులో  పడినవెంటనే దాన్ని తొలగించేయాలి.

ఇదే అన్వయం మంచి ఆలోచనకి కూడా వర్తిస్తుంది. ఒక చిన్న మంచి ఆలోచన ఎంతో మార్పును తీసుకురాగలదు. మంచి చేయాలి అనే తపన చిన్నదే. ఆ తపనలోంచే శక్తి ఉత్పన్నమై, గొప్ప మార్పును తీసుకువస్తుంది. ఎంత గొప్ప పనికైనా బీజం ఒక చిన్న ఆలోచన మాత్రమే.

ఇద్దరు వ్యక్తుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణ రెండు దేశాలకి ముప్పుగా మారిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అలాగే, కేవలం ఒక వ్యక్తి మెదడులో మెదిలిన చిన్న మంచి ఆలోచన యావత్ప్రపంచాన్ని ప్రభావితం చేసిన సంఘటనలు కూడా ఎన్నో ఉన్నాయి. వ్యక్తిగా నిలదక్కుకోవాలంటే చెడు కోరికలకు కళ్ళెం వేస్తూ, మంచి ఆలోచనలను ఆచరణలో పెట్టాలి. అప్పుడే వ్యక్తిత్వం వికసిస్తుంది. 'ఒక సిరా చుక్క లక్ష మెదళ్ళకు కదలిక' అన్న కాళోజీ వారి మాటలకు అర్థం అదే. ఒక ఆలోచన కూడా సిరా చుక్క వంటిదే. అది కొన్ని లక్షల మెదళ్ళలో కదలిక తీసుకురాగలదు. మన ఆలోచన వల్ల నలుగురికీ మంచి జరగాలని ఆశించడమే వ్యక్తిత్వం వికసించే దిశగా మనం వేయాల్సిన తొలి అడుగు.

## 3.8. నిర్వహణ సామర్థ్యం

Managing Ability వ్యక్తిత్వ వికాసంలో అత్యంత కీలకమైన విషయం. కేవలం సరైన నిర్వహణ లేకే ఇవాళ మనుషులు సమస్యలతో సతమతమవుతున్నారు. చిన్నపాటి మార్పులు చేసుకుంటే ఎటువంటి సమస్యనైనా పరిష్కరించగలిగే నేర్పు మనిషి సొంతమవుతుంది.

ఉ. రాజగృహంబుకంటె నభిరామముగా నిలుగట్టఁ గూడ దే
యోజ నృపాలుఁ డాకృతికి; నొప్పగు వేషము లాచరించు నే
యోజ విహారముల్ సలుప; నుల్లమునం గడు వేడ్క సేయు నే
యోజ విదగ్ధుఁ డై పలుకు; నొద్దులకుం దగ దట్లు సేయఁగన్. (*భారతం. విరాట: 1 : 123*).

'రాజుగారి భవనం కంటే రాజోద్యోగి ఇల్లు అందంగా ఉండకూడదు. రాజుగారితో సమానంగా దర్పం ప్రదర్శించేలా ఉద్యోగి వస్త్రధారణ చెయ్యకూడదు. రాజుగారు విహరించే ప్రదేశాల్లో

తానూ విహరించాలని ఉబలాట పడకూడదు. రాజు మాటల్లో కనబడే లౌక్యం, తెలివితేటలు ఉద్యోగి మాటల్లో ఉండవలసిన అవసరం లేదు'.

పాండవుల పురోహితుడైన ధౌమ్యుడు పంచపాండవులకు ఉద్యోగిధర్మాలు బోధిస్తూ చెప్పిన మాటలివి. సంస్థ యజమాని ఇంటి కంటే సంస్థలో పని చేసే ఉద్యోగి ఇల్లు కొంచెం తక్కువ స్థాయిలోనే ఉండడం మంచిది. సొంత ఆస్తులతో కట్టుకున్నదే అయినా అది చూడగానే యజమాని మనస్సులో అసూయతో పాటు, అనుమానం కూడా పుట్టే అవకాశం ఉంది. వేషం కూడా అంతే. ఆధునికంగా ధరించే సూటు, బూటు వంటి వాటిల్లో కూడా యజమాని కంటే ఒక్క రవ్వ తక్కువ అందంగా కనిపించడమే మంచిది. యజమాని దంపతులు ఏదైనా విహారయాత్రకు పిలిచినా వారితో వెళ్ళకూడదు. ఒక వేళ, తెలియక వెళ్ళినా వారు ప్రథమ శ్రేణిలో ప్రయాణం చేస్తే ఉద్యోగి కొంచెం తక్కువ శ్రేణిలో ప్రయాణించాలి. లేకపోతే అపార్థాలు పెరిగే అవకాశం ఉంది.

చివరిదైనా చిన్నది కాని మాట– యజమాని ముందు, ముందు వెనుక ఆలోచించకుండా తన భావాలు వ్యక్తం చేయడం, అధికారి ముందు అనవసరంగా అధికంగా మాట్లాడడం చేయకూడదు. ఆ మాటల్లోంచే ఉద్యోగి బలహీనతలు కనిపెట్టి అదును చూసి యజమానులు ఆడిస్తారు. వివాదస్పద విషయాల్లో ముందు అధికారి అభిప్రాయం తెలుసుకొని దానికి అనుగుణంగా మాట్లాడడం మంచిది.

అయితే, తిక్కన నాటి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని రాసిన పద్యమిది. ఈ పద్యాన్ని నేటి కాలానికి అన్వయించడంలో చిన్నపాటి మార్పులు చేసుకోవాలి. ప్రపంచం తనను తాను ఆధునీకీకరించుకుంటున్న కొద్దీ మనిషి ఆలోచనావిధానంలో కొత్త మార్పులు రావడం సహజం. ఈ కాలంలో మనుషులు ఎవరి కోసమైనా సరే తమ individualityని కోల్పోడానికి సిద్ధంగా లేరు. ఉద్యోగిని చూసి యజమాని అసూయ పడితే అది యజమాని తప్పు. ఉద్యోగి ఎంత బాగా పని చేస్తున్నాడన్నదే యజమానికి ముఖ్యం. అతడి వ్యక్తిగత విషయాలు యజమానికి అనవసరం. అయితే మాట విషయంలో మాత్రం యజమాని అభిప్రాయం తెలుసుకున్నాక మన అభిప్రాయాన్ని వ్యక్తం చేయడమే మంచిది. మన అవసరానికి తగినట్టు ఔచిత్యంతో, లౌక్యంగా ఉద్యోగాన్ని నెట్టుకురావడం ముఖ్యం. ఎటువంటి పరిస్థితిలోనైనా వ్యక్తిత్వాలను దిగాజార్చుకోవలసిన అవసరం లేదు. దీన్నే ఇప్పుడు Attitude అంటున్నారు. అది ఉండడం మంచిదే. అయితే పెద్ద వాళ్ళ దగ్గర వినయంగా ఉండడం కూడా చాల అవసరం. అలా చేస్తేనే మనం పెద్దవాళ్ళమయ్యాక మనకి గౌరవం దక్కుతుంది.

## 3.9. చతుర్విధ పురుషార్థాలు – ప్రాధాన్యం

చ. మలయపుగాలి రేలు వనమాలివిమానపతాక ఘల్లుమం
చులియఁ, బసిండి మువ్వగమినొక్కొకమాటుఁ గదల్ప, నుల్కిమి
న్నలము తదీయ హేమవరణాంచలచంపక శాఖలందుఁ బ
క్షులు రొద సేయ వేగె నని కూడుదు రల్కలు దీఱి దంపతుల్. (*ఆముక్త. 1 : 74*)

'అర్ధరాత్రి మలయ పర్వతం నుంచి ఒక గాలి వీచింది. ఆ గాలికి అక్కడే గుడి ధ్వజస్తంభానికి ఉన్న మువ్వలు మోగాయి. ఆ చప్పుడుకి గుడి గోడని ఆనుకుని ఉన్న చెట్టుపైనున్న పక్షులు తెల్లవారిందనుకుని భ్రమపడి, లేచి వేటకి బయలుదేరాయి. ఆ పక్షుల రెక్కల చప్పుడుకి పక్కనే ఉన్న ఒక ఇంట్లోని దంపతులు అలకలు వీడి కలిసారు'. ఆముక్తమాల్యదలో విలుపుత్తూరు నగర వర్ణన చేసే సందర్భంలో శ్రీకృష్ణదేవరాయలు రాసిన పద్యం ఇది. ఇది కేవలం వర్ణన పద్యమే అయినా, తీక్ష్ణదృష్టితో పరిశీలిస్తే కొన్ని ఆసక్తికరమైన విషయాలు కనిపిస్తాయి.

గాలి వీయడం ధర్మ పురుషార్థానికి ప్రతిక. గాలి సహజంగా వీచింది. పక్షులు వేటకి బయలుదేరడం అర్ధ పురుషార్థం. వేట సంపాదనకి సంబంధించిన విషయం. దంపతులు కలవడం కామ పురుషార్థం. గుడి ధ్వజస్తంభానికి ఉన్న మువ్వలు మోగడం మోక్ష పురుషార్థం. పైగా గాలి సహజంగా వీచింది, మువ్వలు కూడా గాలికి మోగాయి. రెండు భ్రమలు కావు. కానీ, పక్షులు తెల్లవారిందనుకొని, భ్రమపడి, లేచి, వేటకి వెళ్ళాయి. దంపతులు కూడా తెల్లవారిందనుకుని భ్రమపడి, కోపాన్ని వీడి కలిశారు. అంటే అర్ధ, కామాలు మనల్ని భ్రమలో పడేస్తాయి. ధర్మ, మోక్షాలు వాటి నుంచి బయటపడేస్తాయి. పురుషార్థాలు నాలుగింటినీ ఒకే పద్యంలో బంధించిన గొప్ప కవి శ్రీకృష్ణదేవరాయలు.

ప్రతి వ్యక్తి తన జీవితంలో గాలి వీచినంత సహజంగా తన పనిని తాను చేయడం ముఖ్యం. ఫలితాన్ని గురించి కంగారు పడి లేని పోనీ ఒత్తిడిని కొనితెచ్చుకోకూడదు. నిజాయితీగా తన పని తాను చేస్తే ఫలితాలను ఆ ప్రయత్నమే సాధించుకుంటుంది. ఫలితం గురించిన చింత మనకి లేనప్పుడు అది ఎటువంటిదైనా మనం తేలికగా తీసుకోగలుగుతాం. ఫలితం అనుకూలంగా వచ్చినా, ప్రతికూలంగా వచ్చినా ఒకేలా తీసుకోవడం అలవాటైతే జీవితంలో ఎటువంటి కష్టాన్నైనా మనిషి ఎదుర్కోగలుగుతాడు. ఇంత చక్కటి సందేశం ఈ పద్యంలో అంతర్లీనంగా ధ్వనిస్తుంది.

## 3.10. ఆత్మసంతృప్తి

మనిషికి ఏ గుణం ఉన్నా, లేకపోయినా ఆత్మసంతృప్తి చాలా అవసరం. ఉన్నదాంతో ఆనందంగా జీవించగలిగినవాడు యావత్ప్రపంచాన్ని జయించినట్టే. సంతృప్తిగా బతకడంలో ఉండే గొప్పతనాన్ని ఈ కింది పద్యం వివరిస్తుంది.

మ. ఇచటన్ లేవు కిరాత బాణములు, లేదిచ్చోట దావానలం
బిచటన్ లేవు భయంకర ధ్వనులు, లేవిచ్చోట నుచ్చుల్ వలల్
యుచితస్థానమిదే యటంచు హరిణంబూహించి చేరెన్ శశిన్
యచటన్ బ్రహ్మ విధించె నంచెరుగ దాహో రాహుదంతక్షతుల్.(*భామినీ. 1980*)

ఒక అరణ్యంలో తిరుగుతున్న లేడికి ఒక పున్నమినాడు నిండు చందమామను చూడగానే చిత్రమైన ఆలోచన కలిగిందట. 'చంద్రమండలం ఎంత బాగుందో! అక్కడ కిరాతులు బాణాలు వేయరు. భయంకరమైన కార్చిచ్చులు ఉండవు. పులుల గాండ్రింపులు, సింహా గర్జనలు ఉండవు. ఉచ్చులు, వలలు పన్నే వారెవరూ ఉండరు. హాయిగా, చల్లగా, తెల్లగా, విశాలంగా కనిపిస్తోంది ఆ ప్రాంతం. ఏ దేవుడైనా నాయందు దయ ఉంచి అక్కడ దిగబెట్టేస్తే బాగుండు' అనుకుంది. వెంటనే మృగధరుడు అని పేరున్న శివుడు దానిపై జాలి పడి దాన్ని అక్కడ దించేశాడు.

అక్కడికి వెళ్ళాక దానికి అసలు పరిస్థితి అర్థమైంది. మేయడానికి గుప్పెడు గడ్డిపరకలు కూడా లేవు. ఎలా బతకడం? అయినా చల్లగా, తెల్లగా, విశాలంగా ఉంది కదా అని కాసేపు ఆ లేడి అక్కడే విహరించింది. ఆ రోజు చంద్రగ్రహణం. ఆ విషయం దానికేం తెలుసు? క్రమక్రమంగా చంద్రుణ్ణి రాహువు కమ్మేస్తున్నాడు. లేడి కూడా చంద్రుడితో పాటు ప్రమాదంలో పడిపోయింది. అప్పుడు దానికి జ్ఞానోదయం అయ్యింది. ఇంతకంటే అరణ్యమే నయం. ప్రమాదాలు ఎన్ని ఉన్నాయో, తప్పించుకునే అవకాశాలు కూడా అన్నే ఉన్నాయి. బంగారంలాంటి అడవిని వదిలేసి ఆ రాతిగుట్ట మీదకి రావాలని కోరుకోవడం ఎంత తప్పో దానికి తెలిసివచ్చింది.

ఈ చిన్న కథ జరిగిందా? లేదా? అసలు నిజంగా సాధ్యమేనా? వంటి ప్రశ్నలను పక్కన పెట్టి, సారాంశాన్ని గ్రహించడం ముఖ్యం. ఈ పద్యాన్ని ఇప్పటి జీవితానికి అన్వయించుకుంటే గొప్ప

సందేశాన్ని ఇస్తుంది. మనలో చాలామంది ఇతరులను చూసి, ఇతరుల వైభావాల్ని, డబ్బుని, కీర్తి ప్రతిష్ఠల్ని చూసి అసూయ పడుతుంటారు. మనం కూడా వారిలా ఉంటే బాగుండు అనుకుంటారు. కానీ ఎవరికి ఉండాల్సిన కష్టాలు వారికి ఉంటాయి. భగవంతుడు ఎవరికీ అన్నీ ఇవ్వడు. ప్రతి ఒక్కరికీ ఏదో ఒక లోటు పెడతాడు. డబ్బున్న వారికి మనశ్శాంతి ఉండదు, ఆనందం ఉండదు. కొంత మంది ప్రతిభ ఉన్నవారికి అదృష్టం కలిసిరాదు. ఇలా ప్రతి ఒక్కరికీ ఏదో ఒక లోటు ఉంటుంది. జీవితం అంటే అదే. కానీ, మనుషులకి పక్కవారి మీద ఆసక్తి ఎక్కువ. వాళ్ళలా మనం ఉంటే చాలా బాగుండు అనుకుంటారు. కానీ, వారి కష్టాలు వారివి. 'దూరపు కొండల నునుపు' అనే మాట అందుకే వచ్చింది. దూరం నుంచి చూస్తే ఏ కొండైనా చాలా అందంగా కనిపిస్తుంది. కానీ దగ్గరకెళ్ళి చూస్తే దాని నిజ స్వరూపం అర్థమవుతుంది. పక్కవారి జీవితం చూసి అసూయ పడడం కూడా అలాంటిదే. దూరం నుంచి చూస్తే అందరి జీవితాలు బావుంటాయి. కానీ, వారి స్థానంలో మనం ఉంటే అర్థమవుతుంది వాళ్ళ కష్టాలేంటో. అందుకే ప్రతి మనిషికీ సంతృప్తి చాలా అవసరం. ప్రతి ఒక్కరూ ఉన్నదాంతో హాయిగా జీవించగలగాలి. అదే జీవితానికి అసలు సిసలైన పరమార్థం.

## 3.11. సమగ్ర వ్యక్తిత్వం

వ్యక్తిత్వం వికసించడానికి భర్తృహరి రచించిన *సుభాషిత రత్నావళిలో* *నీతి శతకంలోని* పద్యాలు ఎంతగానో ఉపయోగపడతాయి. వ్యక్తిత్వ వికాసం అనేది కేవలం ఒక రంగానికి సంబంధించినది కాదు. అది రకరకాల కోణాల్లో వ్యక్తి సాధించే అభివృద్ధి. సంపూర్ణమైన వ్యక్తిత్వం మనిషికి కావాలంటే ఎలా ఉండాలో ఈ పద్యం చెబుతుంది. అసలు మొత్తం వ్యక్తిత్వ వికాసానికి ఈ ఒక్క పద్యం చాలు.

ఉ. ఆపదలందు ధైర్యగుణ, మంచిత సంపదలందుఁ దాల్మియున్,
భూప సభాంతరాళమునఁ బుష్కలవాక్చతురత్వ, మాజి బా
హాపటుశక్తియున్, యశమునం దనురక్తియు, విద్యయందు వాం
ఛాపరివృద్ధియున్, బ్రకృతి సిద్ధగుణంబులు సజ్జనాళికిన్.(*లక్ష్మణ కవి, ఏనుగు. 2013: 76*).

సజ్జనుడికి ప్రకృతి సిద్ధంగా కొన్ని గుణాలుంటాయని కవి చెబుతున్నాడు. మంచి వ్యక్తిగా ఎదగాలనుకునే వారు కింద పేర్కొన్న గుణాలను అలవర్చుకుంటే చాలు.

'ఆపద వచ్చినప్పుడు ధైర్యంగా ఉండడం, ఐశ్వర్యం వచ్చినప్పుడు ఓర్పు, సభలో ఉన్నప్పుడు వాక్పాటవం, యుద్ధంలో శౌర్యం చూపించడం, కీర్తి యందు ఆసక్తి, వేదశాస్త్రాభ్యాసమునందు చింత– ఇవి మహాత్ములకి స్వభావ గుణాలు'.

మనలో చాలా మంది ఆపద వస్తే చాలు కంగారు పడిపోతారు, డీలా పడిపోతారు. కానీ అలాంటి పరిస్థితిలో ధైర్యం, తెగింపు చాలా అవసరం. మరీ మెతకగా ఉంటే జీవితంలో ముందుకి సాగలేం. లోకం మనం వంగితే వంచుతుంది, వంచితే వంగుతుంది. మనం ధైర్యంగా ఉంటే ఎలాంటి ఆపదనైనా ఎదుర్కోగలం. మన మీద మనకి నమ్మకం ఉండడం ముఖ్యం.

అలాగే, ఐశ్వర్యం వచ్చినప్పుడు ఓర్పు చాలా అవసరం. మనం ఎంత కష్టపడితే ఈ స్థాయికి చేరుకున్నామో మర్చిపోకూడదు. కష్టాల్లో ఉన్నప్పుడు మనల్ని ఆదుకున్నవారి పట్ల కృతజ్ఞతాభావంతో ఉండాలి. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలి. అప్పుడే డబ్బు నిలుస్తుంది. పొగరు చూపిస్తే కష్టాలు తప్పవు. ముఖ్యంగా మన దగ్గర డబ్బు ఉందనే మదం మనకి అసలు ఉండకూడదు. దానధర్మాలు చేస్తూ నలుగురినీ ఆదుకోవాలి. మనతో పాటే అందరూ ఎదగాలని కోరుకోవాలి. 'వసుధైక కుటుంబకం' అన్న భారతీయ భావనకు కట్టుబడి ఉండాలి. ఈ ప్రపంచం అంతా మన కుటుంబం అని మనం భావిస్తే ఎవరి మధ్య వ్యత్యాసం ఉండదు.

అవకాశం వచ్చినప్పుడు మన సత్తా ఏంటో చూపించాలి. ఎక్కడ మాట్లాడే అవకాశం వచ్చినా చక్కగా ఇతరులకు స్ఫూర్తినిచ్చేలా మాట్లాడాలి. Stage fear అని చెప్పి ఇవాళ ఎంతో మంది అందరి ముందు మాట్లాడానికి భయపడుతున్నారు. మాట్లాడుతూ ఉంటే భయం అదే పోతుంది. వ్యక్తిత్వం వికసించాలంటే వాక్చాతుర్యం తప్పని సరి. ఈ రోజుల్లో Communication skills చాలా ముఖ్యం. అవి లేకుండా ఉద్యోగం రావడం సైతం అసాధ్యం.

జీవితంలో ఏదో ఒక సందర్భంలో ప్రతి మనిషి పోరాడవలిసిన పరిస్థితి ఏర్పడుతుంది. అప్పుడు చేతగాని వాడిలా చేతులు ముడుచుకుని కూర్చోకూడదు. యుద్ధరంగంలో ఉన్నప్పుడు అర్జునుడు కూడా ఇంత హింస అవసరమా? అని సంశయంలో పడతాడు. అప్పుడు కృష్ణుడు ధైర్యం చెప్పి కర్తవ్య బోధ చేశాడు. ఈ కాలంలో ఉగ్రవాదాన్ని ఎదిరించడం కూడా అలాంటిదే. అహింసామార్గం అన్నిసార్లు సరైనది కాదు. అనివార్యమైనప్పుడు యుద్ధంలో పోరాడి గెలిచి చూపించాలి.

కీర్తి అంటే ఆసక్తి ఉండాలి. అలా అని వ్యామోహం పనికిరాదు. ఎదగాలనే పట్టుదల మనిషికి చాలా అవసరం. అలాగే కొత్త విషయాలు తెలుసుకోవాలనే జిజ్ఞాస ప్రతి ఒక్కరికీ ఉండాలి. అప్పుడే

ఎదుగుదల సాధ్యం. విద్య ఎటువంటిదైనా నేర్చుకోవాలనే తపన ప్రతి ఒక్కరిలో ఉండాలి. ఆ తపనే వ్యక్తిత్వం వికసించడానికి మనం పెట్టే పెట్టుబడి.

మన ప్రాచీన తెలుగు సాహిత్యంలో ఇటువంటి పద్యాలు ఎన్నో ఉన్నాయి. 'సృష్టిలో ఏ లోపం లేదు. మనం చూసే దృష్టిలోనే లోపం ఉంది'. ఈ ప్రపంచం మనం ఎలా చూస్తే అలా కనిపిస్తుంది. మన ప్రాచీన తెలుగు సాహిత్యం కూడా అంతే. ఆ సాహిత్యాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా ఆనాటి సమాజాన్ని, అప్పటి పరిస్థితులను అర్థం చేసుకోవాలి. మన ప్రబంధాలన్నీ శృంగారపూరితాలని తేలికగా కొట్టి పారేయడం సరి కాదు. ఆనాటి కళలకి, సంస్కృతికీ, సంప్రదాయాలకి, అన్నింటినీ మించి నైతికపు విలువలకి నిలయాలు మన ప్రాచీన ప్రబంధాలు.

ప్రాచీన సాహిత్యంలో నైతికపు విలువల్ని బోధించే పద్యాలు ఎన్నో ఉన్నాయి. వాటిలో కొన్ని సూటిగా విలువల్ని బోధించేవైతే, మరికొన్ని సంక్షిప్తంగా బోధించేవి, ఇంకొన్ని అంతర్లీనంగా బోధించేవి. ఇవి కాకుండా మన ప్రాచీన సాహిత్యంలో ఎన్నో వర్ణన పద్యాలు ఉన్నాయి. ప్రతి పద్యానికి ప్రతిపదార్థం, తాత్పర్యం, భావం తెలుసుకుని, కావ్యంలోని కథని అర్థంచేసుకోగానే సరిపోదు. దాన్ని అన్వయించుకోవాలి. మన జీవితానికి ఆ సాహిత్యం ఏ రకంగా ఉపయోగపడుతుందో ఆలోచించాలి. ఒక సినిమా చూసి ఊరికే మర్చిపోతామా? ఒక కథ విన్నాక దాన్ని పెడచెవిన పెడతామా? మనం ఎంత వద్దనుకున్నా వాటి ప్రభావం మనపై తప్పకుండా ఉంటుంది. ప్రాచీన సాహిత్యం కూడా అంతే. ఆ సాహిత్యాన్ని నేటి జీవితానికి అన్వయించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

వర్ణన పద్యాలను తేలికగా విడిచిపెట్టేయకూడదు. పైన పేర్కొన్నట్టు పోతన గారి 'క్షోణి తలంబు...' అన్న పద్యాన్ని కేవలం వర్ణన పద్యంగా విడిచిపెట్టేస్తే ఒరిగేదేముంది? కథ పరంగా అర్థం ఒక్కటే. కానీ, మనుషులవి వేర్వేరు స్వభావాలు, వేర్వేరు అనుభవాలు, వేర్వేరు దృక్కోణాలు, వేర్వేరు పంథాలు. అందుకే ఒక్కొక్క పద్యం ఒక్కొక్కరికి ఒక్కోలా కనిపిస్తుంది. ఒకే సూర్యోదయం ఒక్కొక్క కవికి ఒక్కోలా అనిపిస్తున్నప్పుడు, ఒకే పద్యం ఒక్కొక్కరికి ఒక్కోలా అనిపించడంలో, అర్థమవ్వడంలో ఆశ్చర్యమేముంది? ఆ భావన సమాజానికి ఏ రకంగానూ హాని కలిగించనప్పుడు ఎటువంటి ఇబ్బంది ఉండదు. వర్ణనల్లో కొన్ని వస్తువులను, కొన్ని ప్రకృతి రూపాలను, కొందరు వ్యక్తులను ప్రతికలుగా (symbolic) తీసుకుని కవులు వర్ణిస్తుంటారు. వాటిని కేవలం వర్ణనలుగా వదిలేస్తే కష్టం. సూక్ష్మదృష్టితో పరిశీలిస్తే అంతర్లీనంగా గొప్ప అర్థాలు ధ్వనిస్తాయి. ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని

ఇటువంటి దృష్టితో చూడడం వల్ల ఆ సాహిత్యం, పాఠకులను హత్తుకోవడమే కాకుండా ఆలోచింపజేస్తుంది.

ఈ రోజు మన నిత్య జీవితాల్లో మనం ఎదుర్కొనే ఎన్నో సమస్యలకు పరిష్కారాలు మన సాహిత్యంలో ఉన్నాయి. ప్రపంచమంతా మనవైపు చూస్తుంటే మనం మన సాహిత్యాన్ని, విలువల్ని విస్మరించడం సరి కాదు. అయితే, కాలం మారుతున్నకొద్దీ సమాజంలో, ప్రజల జీవన విధానంలో మార్పులు రావడం సహజం. మన సాహిత్యంలో మనకి ఉపయోగపడే అంశాలను అన్వయించుకుని, తక్కిన వాటిని అప్పటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని విస్మరించాలి. అప్పటి విషయాలు కొన్ని ఈ కాలానికి దోషాల్లాన్నే కనిపిస్తాయి. వాటిని అవహేళన చేస్తూ, విమర్శిస్తూ అమృతతుల్యమైన సాహిత్యాన్ని నేలపాలు చేసుకోకూడదు. అర్థం చేసుకొని, అన్వయించుకుంటే సగటు మనిషి జీవితమనే యుద్ధంలో పోరాడడానికి కావలసిన ధైర్యాన్ని మన సాహిత్యం ఇస్తుంది, వ్యక్తిత్వాల్ని వికసింపజేస్తుంది. ఎన్నో వేలు వృథా చేసినా ఒక Coaching Centre, ఒక Counselling Centre చేయలేని మనోవైద్యం మన సాహిత్యం ఏ ఖర్చూ లేకుండా తేలికగా చేసిపెడుతుంది. మనం చేయవలిసిందల్లా ఆ సాహిత్యాన్ని అర్థం చేసుకుని, అన్వయించుకుని ఆచరించడమే. వ్యక్తిత్వ వికాసం మన సాహిత్యంలో అంతర్లీనమైన ఒక భాగం.

# అధ్యాయం – 4

# మనుచరిత్ర : వ్యక్తిత్వ వికాసం

## 4.1. పరిచయం

వ్యక్తిత్వ వికాసం *మనుచరిత్ర*లో అంతర్లీనమైన ఒక భాగం. ఈ అధ్యాయంలో *మనుచరిత్ర*లో కథ పరంగా, సాహిత్య పరంగా ఉన్న వ్యక్తిత్వ వికాస అంశాలను చర్చించడం జరుగుతుంది. *మనుచరిత్ర*లో 667 పద్యగద్యాలు ఉన్నాయి. అయితే, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే అంశాలను స్పృశించే పద్యాలను మాత్రమే ఈ అధ్యాయంలో పరిశీలించడం జరుగుతుంది. వ్యక్తిత్వ వికాసం గురించి 2.1లో నిర్వచించడం జరిగింది. అదే అధ్యాయంలో వ్యక్తిత్వ వికాసంపై ప్రముఖుల అభిప్రాయలును కూడా ప్రస్తావించడం జరిగింది. ఈ అధ్యాయంలో *మనుచరిత్ర*లోని కథను, సాహిత్యాన్ని ఆయా నిర్వచనాలకు అన్వయం చేయడం జరుగుతుంది.

అల్లసాని పెద్దన *మనుచరిత్ర*ను వ్యక్తిత్వ వికాసం కోసం రాసి ఉండక పోవచ్చు. కానీ, తదనంతర కాలంలో వ్యక్తిత్వ వికాసం (Personality Development)పై పరిశోధనలు జరిగి రకరకాల సిద్ధాంతాలు, అభిప్రాయలు వెల్లడయ్యాక, ఆ కోణంలో *మనుచరిత్ర*ను చూసినప్పుడు ఆధునికులు చెప్పిన ఎన్నో వ్యక్తిత్వ వికాస సంబంధిత విషయాలును పెద్దన ఆ కాలంలోనే ప్రస్తావించినట్టు స్పష్టమవుతుంది. ఎందుకంటే కవులు క్రాంతదర్శులు. ఒక వంద ఏళ్ళు ముందుకి చూడగలరు. అందుకే సిగ్మండ్ ఫ్రాయిడ్ 'ఎప్పుడూ కవి ఒక తత్త్వవేత్త కంటే ఒక అడుగు ముందే ఉంటాడు' అన్నాడు (*చూ. 2.3.5*).

"An individual's personality is the sum of total of person's qualities, characteristics, attitudes and quirks, psychological traits, beliefs and motives which make up his identity. Personality Development therefore means an improvement in all spheres of individual's life" (*చూ. 2.1*). ఈ నిర్వచనమే ఈ అధ్యాయానికి భూమిక. వ్యక్తిత్వ వికాసం అంటే విజయాలు సాధించడం కాదు.

అది అన్ని రంగాల్లో వ్యక్తి నిరంతరం చెందే అభివృద్ధి. దీన్ని బట్టి చూస్తే, 'Personality Development అంటే All- round Development'గా స్పష్టమవుతుంది.

## 4. 2. ప్రవరుడి నేపథ్యం – వ్యక్తిత్వం

ఆర్యావర్త దేశంలో వరుణానది ఒడ్డున అరుణాస్పదపురం అనే పట్టణం ఉండేది. ఆ పట్టణాన్ని వర్ణిస్తూ పెద్దన చెప్పిన పద్యం పౌరులు గొప్పవారైతే, అందరికీ ఉన్నతమైన వ్యక్తిత్వం ఉంటే ఆ ప్రాంతం గొప్పగా ఉంటుందనే విషయాన్ని స్పష్టం చేస్తుంది.

సీ. అచటి విప్రులు మెచ్చరఖిల విద్యాప్రౌఢి / ముదిమది దప్పిన మొదటి వేల్పు
నచటి రాజులు బంటు నంపి భార్గవు నైన / బింకానఁ బిలిపింతు రంకమునకు
నచటి మేటి కిరాటులలకాధిపతి నైన / మును సంచి మొద లిచ్చి మనుప దక్షు
లచటి నాలవజాతి హలముఖాత్త విభూతి / నాది భిక్షువు భైక్ష మైనమాన్పు
తే. నచటి వెలయాండ్రు రంభాదులైన నొరయఁ
గాసె కొంగున వారించి కడపఁ గలరు
నాట్య రేఖాకళాధురంధుర నిరూఢి
నచటఁ బుట్టిన చిగురుఁ గొమ్మైనఁ జేవ. (*మను. 1: 50*)

అరుణాస్పదపురంలో ఉండే బ్రాహ్మణులు సకల విద్యల్లో ఆరితేరి, తల పండిన బ్రహ్మను సైతం మెచ్చరు. అంటే విద్యాధ్యయనంలో వారు బ్రహ్మను సైతం మించిపోయారని భావం. అక్కడ ఉండే రాజులు తమ భటులను పంపి పరశురాముడినైనా తమ వద్దకి పిలిపించుకుంటారు. అంటే భటులకే పరశురాముడిని బంధించి తెచ్చే పరాక్రమం ఉంటే రాజుల సంగతి ప్రత్యేకంగా చెప్పాలా? అక్కడి కోమట్లు కుబేరుడిని సైతం మూల ధనం ఇచ్చి రక్షించుకోగలరు. అక్కడి శూద్రులు తమ నాగలి మొనతో ఆర్జించిన సంపదతో ఆది భిక్షువుకి సైతం భిక్షం ఎత్తుకోవలసిన అవసరం లేకుండా చేయగలరు. అక్కడి వేశ్యలు నాట్యం మొదలైన కళలందు రంభాది అప్సరసలకు సైతం సవాలు విసరగలరు. అక్కడ పుట్టిన చిగురు కొమ్మైనా చేవ కలిగి ఉంటుంది.

అరుణాస్పదపురం సంపద కలిగిన పట్టణం అని చెప్పడానికి పెద్దన కొంత కవిత్వాన్ని జోడించి ఇలా వర్ణించాడు. 'అక్కడ పుట్టిన చిగురు కొమ్మైన చేవ' అని అనడంలో రెండు ఉద్దేశ్యాలు ఉన్నాయి.

ఒకటి – 'శ్రీకృష్ణదేవరాయలు విజయనగరము నుండి పాలించినా ఎక్కువగా పెనుగొండలో ఉండేవారు. అక్కడ చిగురు చెట్లు ఉండేవి. ఇక్కడ చిగురు అంటే లేత అని అర్థం కాదు. ఆ చెట్టు చాలా పెళుసు. ములగ చెట్టు వంటిది. అచటి చిగురు చెట్టైనా మంచి చేవ గలది. విరిచినా విరగదని అర్థం' (*కావ్య పరిమళం. 1978: 7*).

"కొమ్మయనగా స్త్రీ గావున చిగురు గొమ్మయను దానికి అచ్చట పుట్టిన చిన్న పిల్లలు (బాలికలు కూడ) నాట్య విద్య యందు చేవగలిగి యుందురను అర్థ విశేషమును గూడ చెప్పుకొనవచ్చును" (*దుర్గయ్య, పల్లా. 1980: 25*).

రెండు – చిగురు చెట్లకు ఉండే కొమ్మలే చేవ కలిగి ఉన్నాయంటే, ఇక అక్కడ ఉండే ప్రజల సంగతి వేరే చెప్పలా? ప్రతి ఒక్కరు ఉన్నతమైన వ్యక్తిత్వం, ఆత్మాభిమానం కలవారు అని కూడా ధ్వనిస్తుంది. ప్రవరుడిని పరిచయం చేసే ముందు ఆ ఊరికి ఉన్న ప్రత్యేకతను, గొప్పతనాన్ని వర్ణించడం ద్వారా, ప్రవరుడే కాదు అక్కడి ప్రజలందరూ అంతే అనే భావనని పెద్దన స్ఫురింపజేశాడు. అక్కడి ప్రజలందరు కూడా చక్కటి వ్యక్తిత్వం కలవారని స్పష్టమవుతోంది. కాబట్టి ఒక ప్రాంతం గొప్పది అంటే అర్థం ఏమిటి? అక్కడి ప్రజలు గొప్పవారని అర్థం. గొప్పతనం మట్టిలో ఉండదు. మనుషులలోఉంటుంది.

*మనుచరిత్ర*లో ప్రధాన పాత్ర అయిన ప్రవరుడిని పరిచయం చేస్తూ పెద్దన చెప్పిన "ఆపురి బాయకుండు..." అనే పద్యంలోని వ్యక్తిత్వ వికాస అంశాల గురించి 1.7.1లో చర్చించడం జరిగింది. అదే సందర్భంలో పెద్దన రాసిన ఈ కింది పద్యం మూలంలో లేకపోయినా చాలా సమంజసంగా అనిపిస్తుంది. ఈ పద్యం ప్రవరుడి మనోనిగ్రహం వెనుక ఉన్న కారణాలను కథలో ముందే ప్రస్తావిస్తుంది. భవిష్యత్కథను సూచిస్తుంది.

ఆ. వాని చక్కఁదనము వైరాగ్యమునఁ జేసి
కాంక్ష సేయు జార కామినులకు
భోగబాహ్యమయ్యెఁ బూచిన సంపంగె
పొలుపు మధుకరాంగనలకుఁ బోలె. (*మను. 1: 52*)

'వికసించిన సంపంగె పువ్వు వికాసాన్ని ఆడ తుమ్మెదలు అనుభవించలేనట్లు, విషయ వాంఛ లేని ప్రవరుడి చక్కదనం జారకామినులకు దక్కనిదే అయ్యింది'. ప్రవరుడికి వైరాగ్యం ఉందని పెద్దన వర్ణించారు. అయితే, వివాహం ఎందుకు చేసుకున్నాడనే ప్రశ్న ఉదయించక మానదు. వైరాగ్యం అనేది బలవంతంగా తెచ్చిపెట్టుకునేది కాదు. ప్రవరుడు గృహస్థ మార్గంలో దాన్ని సంపాదించే ప్రయత్నంలో ఉన్నాడు. అన్నింటినీ మించి ఉన్నదాంతో సంతృప్తిగా ఉన్నాడు. ఇక్కడ వైరాగ్యం అంటే ఉన్నదానికంటే కొత్తగా వేరే ఏదీ ప్రవరుడు ఆశించడని అర్థం.

ప్రవరుడికి తన తల్లిదండ్రులు, భార్య సహకరిస్తూ ఉండగా, ధర్మకార్యాలు చేస్తూ కాలం గడిపేస్తున్నాడు. ప్రవరుడు ఎంత వైరాగ్యం ఉన్నా సంసారాన్ని విడవలేదు. సంసారం ఒట్టి మాయ అని అతడికి తెలుసు. కానీ ఎన్నడూ తన బాధ్యతలను విస్మరించలేదు. ప్రవరుడిది అంత గొప్ప వ్యక్తిత్వం కాబట్టే ఎంత మంది భ్రమ పెట్టినా ఎవ్వరికీ లొంగలేదు.

సాధారణంగా జీవితంలో ఉన్నతమైన స్థానానికి చేరుకున్నాక మనలో చాలా మంది ఏవో ఆకర్షణలకు లోనై, వాటి మాయలో పడి ఎన్నో తప్పులు చేస్తారు. అప్పటివరకు గడించిన కీర్తిని సర్వనాశనం చేసుకుంటారు. వ్యక్తిత్వాన్ని కోల్పోతారు. వ్యక్తిత్వాన్ని కోల్పోతే సర్వం కోల్పోయినట్టే. 'Character is lost; everything is lost' అనే ఆంగ్ల సూక్తి కూడా అదే చెబుతుంది. అందుకే ఎంత ఎదిగినా ఒదిగి ఉండడం చాలా ముఖ్యం. గొప్పవాళ్లం అవ్వడం గొప్ప కాదు. ఆ గొప్పతనాన్ని నిలుపోగలగడం గొప్ప.

'మనం ఇవాళ ఇలా ఉన్నామంటే దానికి కారణం మనమే. రేపు ఎలా ఉండాలో నిర్ణయించుకోవాల్సిందీ మనమే. మన జీవితం మన చేతుల్లోనే ఉంది. ఇవాళ మనం ఇలా ఉండడానికి గతంలో మనం చేసిన పనులు కారణమైతే, రేపు ఎలా ఉండాలో నిర్ణయించేది నేటి చర్యలే. కాబట్టి, మనం ఎలా నడుచుకోవాలో, ఎలా ప్రవర్తించాలో మనమే నిర్ణయించుకోవాలి. మన జీవితాన్ని మనమే ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలి'. ఇదే విషయాన్ని వివేకానందుడు ఒక సూక్తిగా చెప్పారు. (చూ. 2. 3. 1).

"We are responsible for what we are and whatever we wish ourselves to be, we have the power to make ourselves. If what we are now has been the result of our own past actions, it certainly follows that whatever we wish to be in future can be produced by our present actions; so we have to know how to act" (*www.brainyquote.com*).

ప్రవరుడికి విషయవాంఛల పట్ల ఆసక్తి లేదని, అతడికి వైరాగ్యం ఉందని చెప్పడంలో పెద్దన భవిష్యత్తులో ప్రవరుడు ఎలా ఉండబోతున్నడో సూచిస్తున్నాడు.

పువ్వులు తుమ్మెదలను ఆకర్షిస్తాయి. అంతే కానీ తుమ్మెదలు పువ్వులను ఆకర్షించవు. ప్రతిభావంతులు పువ్వుల వంటి వారు. ఆకర్షణలనే తుమ్మెదలు ప్రతిభావంతులనే పువ్వుల చుట్టూ తిరుగుతుంటాయి. ఆకర్షణలకు ప్రతిభావంతులు లొంగకూడదు. ఉన్నతమైన వ్యక్తిత్వాలను కలిగి ఉండాలంటే ఆకర్షణలకు ఆకర్షితులవ్వకూడదు.

ప్రవరుడిని వికసించిన సంపంగెతో పోల్చాడు పెద్దన. అంటే అతడి వ్యక్తిత్వం ఎప్పుడో వికసించింది. సాధారణంగా సంపంగె పువ్వుల వద్దకు వచ్చిన తుమ్మెదలు విపరీతమైన మత్తుకి వెనుదిరిగి వెళ్ళిపోతాయి. ప్రవరుడి వ్యక్తిత్వం ఎంతగా వికసించిందంటే, ఎటువంటి ఆకర్షణలు అతడి దరి చేరలేవు. తుమ్మెదలు ఎన్ని పువ్వులను ఆఘ్రాణించగలిగినా సంపంగె పువ్వుల వద్దకు రాలేవు. అలాగే ప్రవరుడి వంటి ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన వారిని ఆకర్షణలు ఏమీ చేయలేవు. ఇంత గొప్ప అర్థాన్ని ఒక ఆటవెలదిలో బంధించాడు పెద్దన. అదే సందర్భంలో ప్రవరుడి గొప్పతనాన్ని వర్ణిస్తూ పెద్దన మరొక చక్కటి పద్యం చెప్పాడు.

శా. శీలంబున్ గులమున్ శమంబు దమమున్ జెల్వంబు లేఁబ్రాయమున్
బోలన్ జూచి యితండె పాత్రుఁడని యే భూపాలుఁడీ వచ్చినన్
సాలగ్రామము మున్నుగాఁ గొనఁడు మాన్య క్షేత్రముల్ పెక్కు చం
దాలన్ బండు నొకప్పుడున్ దఱుఁగ దింటన్ బాఁడియున్ బంటయున్. (*మను. 1: 56*)

'ప్రవరుడి యోగ్యత చూసి రాజులు రకరకాల దానాలను, బహుమానాలను ఇవ్వడానికి సిద్ధపడేవారు. అతడు ప్రతిగ్రహం పాపం కలిగిస్తుందని నిర్దోషమైన సాలగ్రామాన్ని కూడా

స్వీకరించడు. అయినా మాన్యపు భూములు ఎప్పుడూ పండుతూ ఉండడం వల్ల ప్రవరుడి ఇంట్లో పాడి పంటలకు కొరత లేదు'.

ప్రవరుడు ఎప్పుడూ దానం చేయడమే తప్ప దానం పుచ్చుకోడు. ఏ దోషం లేని సాలగ్రామాన్ని సైతం దానంగా స్వీకరించడు. అంటే ప్రవరుడు గొప్ప ఆత్మాభిమానం కలవాడని స్పష్టమవుతోంది. ప్రవరుడిది ఇచ్చే చెయ్యే తప్ప పుచ్చుకునే చెయ్యి కాదు. కేవలం వాళ్ల భూముల్లో పండిన పంటల ద్వారా వచ్చిన సంపదనే ప్రవరుడు దానధర్మాలకు వినియోగించేవాడు. దీన్ని బట్టి అతడికి డబ్బు పట్ల కానీ, కొత్త కొత్త సంపదల పట్ల కానీ ఆసక్తి లేదనే విషయం స్పష్టమవుతోంది. ప్రవరుడు ఉన్నదాంతో సంతృప్తిగా జీవనం సాగిస్తునాడు అని అర్థమవుతోంది.

మనలో చాలా మందికి ఉన్న అవలక్షణం ఇదే. ఉన్నదాంతో సంతృప్తి పడకుండా కొత్త సంపదల కోసం ఆశపడుతుంటాం. డబ్బు కొత్త సమస్యలను తెచ్చిపెడుతుందని గ్రహించం. ఆ క్రమంలో మన వ్యక్తిత్వాన్ని సైతం పణంగా పెడుతుంటాం. ఈ పద్యంలో ప్రవరుడు దానం పుచ్చుకోడు అని చెప్పడంలో అర్థం అదేదో తప్పు అని కాదు. అతడు గొప్ప ఆత్మాభిమానం కలవాడని సూచితం. తనకున్న సంపదతోనే ఎన్నో దానాలు చేస్తున్నాడని అర్థం.

మనిషికి అత్యాశ లేకపోతే డబ్బుని ఎందుకు కూడబెట్టుకుంటాడు? అందుకే, మనిషి కొత్త సంపదలకు ఆశ పడకుండా ఉన్నదాంతో సంతృప్తిగా జీవిస్తూనే కుదిరినంత దానం చేస్తుండాలి. ఒక వ్యక్తి ఈ సమాజానికి చేసే మేలు అదే. మనిషి ఆశపడడం అంటూ మొదలుపెడితే ఆ ఆశకు హద్దులుండవు. ప్రపంచం మొత్తం కోనేయాలనిపిస్తుంది. ఆశ పడడం తప్పు కాదు. అది అత్యాశగా మారితేనే ప్రమాదం. ఎప్పుడైతే మనిషి ఆశ పడడం మానేసి సంతృప్తిగా జీవిస్తాడో అప్పుడు ఆనందం అతడి వెంటే ఉంటుంది.

మనిషి జీవితంలో ఏమి చేసినా చివరికి కోరుకునేది ఆనందాన్నే. 'ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్" అని వేదం ఎప్పుడో ఘోషించింది. ఇవ్వడంలో ఉండే తృప్తి, తద్వారా కలిగే ఆనందం అనిర్వచనీయం. ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని సాధించడం అంటే నలుగురికీ ఉపయోగపడడమే అనే విషయాన్ని అందరూ గ్రహించాలి.

పై పద్యంలో 'ప్రవరుడి యోగ్యత, శీలం, గొప్పతనం చూసి రాజులే స్వయంగా ఎన్నో కానుకలు ఇవ్వడానికి సిద్ధపడేవారు' అని పెద్దన పేర్కొన్నారు. అంటే ప్రతిభను వెతుక్కుంటూ పురస్కారాలు, గౌరవాలు వాటంతట అవే వస్తాయి. వాటి వెంట మనం పడకూడదని తెలుస్తోంది. వ్యక్తిగా ఎదగాలంటే ఇది చాలా ముఖ్యం. వ్యక్తిత్వాన్ని తాకట్టుపెట్టి, ఆత్మాభిమానాన్ని చంపుకుని

ప్రతిభావంతులు గౌరవాల వెంట, పురస్కారాల వెంట పడకూడదు. మనిషి ఉన్నతంగా బతకాలి అనే గొప్ప సందేశాన్ని ఈ పద్యం ద్వారా పెద్దన ఇచ్చారు.

## 4.3. అతిథిసేవ

*మనుచరిత్ర*లో పెద్దన చాలా చోట్ల అతిథి సేవ గురించి ప్రస్తావించడం కనిపిస్తుంది. ఒక గృహస్థుకి అతిథి సేవ చాలా ముఖ్యం. ఆ సేవ చేయడంలో ఉండే గొప్పతనాన్ని గురించి పెద్దన ఇలా వర్ణించాడు.

ఉ. వానిది భాగ్యవైభవము వానికి పుణ్యవిశేష మెమ్మెయిన్
వాని దవంధ్యజీవనము వానిది జన్మము వేఱు సేయ కె
వ్వాని గృహాంతరంబున భవాదృశ యోగిజనంబు పావన
స్నాన విధాన్న పానముల సంతసమందుచుఁబోవు నిచ్చలున్. (*మను. 1: 63*)

'ఓ యోగీశ్వరా! మీ వంటి పెద్దలు ఎవరి ఇంట్లో అయితే సొంత బంధువులాగా ఆతిథ్యం స్వీకరించి తృప్తి పొందుతారో, ఆ గృహస్థుడు భాగ్యవంతుడు, పుణ్యవంతుడు అవుతాడు. అటువంటి గృహస్థుదే సార్థకమైన జీవనం, సార్థక జన్మ అవుతుంది'. ఒక సిద్ధుడు ప్రవరుడి ఇంటికి అతిథిగా విచ్చేసినప్పుడు ప్రవరుడు పలికిన మాటలివి.

ప్రతి వ్యక్తి జీవితంలో అతిథిసేవ ఒక భాగం. అతిథుల్ని గౌరవించుకోవడం మన సంప్రదాయం. అతిథిని గౌరవించినప్పుడే ఆ అతిథికి మన మంచితనం, మన ఇంటి గొప్పతనం, మన దేశం ఔన్నత్యం అర్థమవుతాయి. అతిథిని మన ఇంట్లోవాడిగా భావించాలి. అలా భావించి అతడికి సేవలు చేయాలి. ఆ విధంగా అతడిని సంతృప్తి పరిచిన కుటుంబం ఆయురారోగ్యైశ్వర్యాలతో సుఖంగా వర్ధిల్లుతుంది. అదే విషయాన్ని పెద్దన పై పద్యంలో ప్రస్తావించారు.

ప్రతి వ్యక్తి అతిథుల్ని ప్రవరుడిలానే గౌరవిస్తే అసలు మన దేశంలో పేదరికం అనే మాటే ఉండదు. ప్రతి ఇద్దరి మధ్య సుహృద్భావం పెరుగుతుంది. సంఘంలో సామరస్య భావన పెంపొందుతుంది. ఇదే విషయాన్ని ఇవాళ ప్రభుత్వం Incredible India పేరిట 'అతిథి దేవో భవ' అనే ఉపశీర్షికతో ప్రచారం చేస్తోంది. దేశవిదేశాల నుంచి మన దేశానికి విచ్చేసిన అతిథుల్ని మనం ఎలా గౌరవించుకోవాలో లఘుచిత్రాల ద్వారా మనకి నేర్పించాల్సిన దుఃస్థితి ఏర్పడింది.

భారతదేశం భిన్న సంస్కృతుల సమ్మేళనం. ఎన్నో సంప్రదాయాలకు పుట్టినిల్లు. కళలకు కాణాచి. యావత్ప్రపంచం మన సంస్కృతికి పాదాభివందనం చేస్తుంటే, మన మట్టి వాసనకి మంత్రముగ్ధులవుతుంటే మన దేశానికి వచ్చే అతిథుల్ని అగౌరవిస్తూ మనల్ని మనం దిగజార్చుకుంటున్నాం. వంద కోట్ల మంది భారతీయులు కలిసిందే ఈ అఖండ భారతావని. ప్రతి ఒక్కరి వ్యక్తిత్వం బాగుంటేనే దేశం ఉన్నతంగా కనిపిస్తుంది. అందుకే అతిథిసేవ ప్రతి వ్యక్తి జీవితంలో ఒక భాగమైపోవాలి అని పెద్దన హితవు పలికాడు. అతిథిసేవ అంటే మనల్ని మనం గౌరవించుకోవడమే. మనం ఒకరిని గౌరవిస్తేనే వారు మనల్ని గౌరవించేది. వ్యక్తిగా ఎదగాలంటే అతిథిసేవ తప్పనిసరి.

ప్రవరుడి ఇంటికి వచ్చిన సిద్ధుడు అతిథిసేవకి అంకితమైన గృహస్థు గొప్పతనాన్ని గురించి చెప్పిన మాటలు చిరస్మరణీయాలు. ఈ తరంలో ప్రతి ఒక్కరూ ఎల్లప్పుడూ స్మరించుకోదగిన పద్యం ఇది.

సీ. కెలఁకుల నున్న తంగేటి జున్ను గృహమేధి / యజమానుఁ డంకస్థితార్థపేటి
పండిన పెరటికల్పకము వాస్తవ్యుండు/ దొడ్డిఁబెట్టిన వేల్పుగిడ్డి కాఁపు
కడ లేని యమృతంపు నడబావి సంసారి / సవిధ మేరునగంబు భవనభర్త
మరుదేశ పథమధ్యమప్రప కులపతి / యాఁకటి కొదవు సస్యము కుటుంబి
తే. బధిర పంగ్వంధ భిక్షుక బ్రహ్మచారి
జటి పరివ్రాజకాతిథి క్షపణకావ
ధూత కాపాలి కాద్యనాథులకుఁ గాన
భూసురోత్తమ గార్హస్థ్యమునకు సరియె. (*మను. 1: 66*).

'చెవిటి, కుంటి, గుడ్డి, అడుక్కునేవారు, సన్యాసులు, అతిథులు, దిగంబరులు, అనాథలు... మొదలైన వారందరికీ గృహస్థే రక్షకుడు. ఇటువంటి వారందరికీ గృహస్థు తంగెడు చెట్టుకి ఉన్న తేనెపట్టు వంటివాడు, యజమాని ఒళ్లో ఉన్న ధనపుపెట్టె వంటివాడు, దొడ్లో ఉన్న కల్పవృక్షం వంటివాడు, పెరట్లో ఉంచిన కామధేనువు వంటివాడు, నిండుగా ఉన్న బావి వంటివాడు, సమీపంలో ఉన్న మేరుపర్వతం వంటివాడు, నీరు లేని ప్రదేశంలో దారి మధ్యలో ఉన్న చలిపందిరి వంటివాడు, ఆకలి వేళకు ఉపయోగపడే పైరు వంటివాడు'.

దీన్ని బట్టి అతిథిసేవ అనేది కేవలం ఒక సేవ మాత్రమే కాదని, గృహస్థు బాధ్యతల్లో అత్యంత కీలకమైనదని స్పష్టమవుతోంది. అంటే ఎవరికి ఏ కష్టం వచ్చినా గృహస్థు వారిని ఆదుకోవాలి. అది అతడి ప్రాథమిక బాధ్యత. అతిథులకు సేవ చేయడం, అభాగ్యులను ఆదుకోవడం అనే వాటిని ప్రతి గృహస్థు బాధ్యతలుగా భావిస్తే, అసలు ఎక్కడైనా పేదరికం కనిపిస్తుందా? ఆత్మవిశ్వాసం కొరవడి ఆత్మహత్యలు సంభవిస్తాయా? ఈ దేశంలో ప్రతి ఒక్కరూ అతిథులను గౌరవిస్తే దారిద్ర్యపు రేఖ సైతం కనుమరుగైపోదా?

ఒక వ్యక్తి జీవించేది తన కోసం, తన కుటుంబం కోసమే కాదని, సమాజం అనే ఉమ్మడి కుటుంబం కోసమని, కుటుంబంలోని ప్రతి వ్యక్తి బాధ్యతల విషయంలో ఇంటికి పెద్దకొడుకు వంటి వాడని పెద్దన ఉద్బోధిస్తున్నాడు. కన్న బిడ్డలను Baby Care Centreలలో పడేసే తల్లిదండ్రులు, తల్లిదండ్రులను Old Age Homeలో పడేసే పిల్లలు ఉన్న అత్యాధునిక సమాజానికి అతిథిసేవలో ఉండే గొప్పతనం ఏమి అర్థమవుతుంది? వ్యక్తిత్వాన్ని నిర్మించుకునే క్రమంలో కూర్చున్న చెట్టునే నరికేసుకుంటోంది నేటితరం.

అడుగడుగునా వ్యక్తిత్వాన్ని దిగజార్చుకుంటూ అమానుషత్వంగా ప్రవర్తిస్తోంది మనుష్య జాతి. 'మానవత్వం కలవాడే మనిషి' అన్న ప్రాథమిక సత్యాన్ని విస్మరించి, సాంకేతిక అభివృద్ధి పేరిట మానవ సంబంధాలను మంట కలిపేస్తోంది ఈతరం. దీనికంతటికీ మూలం స్వార్థం. వ్యక్తిత్వం వికసించడం అంటే గొప్ప గొప్ప విజయాలను సాధించడం కాదు. విలువల్ని విస్మరించకపోవడం, బాధ్యతలను గుర్తెరగడం, నలుగురి మంచికి తోడ్పడడం.

మనిషి మనస్సులో మెదిలే ప్రతి చెడు ఆలోచనకి స్వార్థమే హేతువు. 'అన్ని చెడు లక్షణాలు 'అహం' చుట్టూ తిరుగుతూ ఉంటాయి. 'అహం' నశిస్తే మనిషిలో సహజంగానే పరివర్తన కలుగుతుంది' అంటూ అదే విషయాన్ని రమణ మహర్షి వివరించారు.

"All bad qualities centre round the ego. When the ego is gone, Realisation results by itself. There are neither good nor bad qualities in the self. The self is free from all qualities. Qualities pertain to the mind only" (*www.brainyqoute.com*) (*చూ 2.3.3*).

నేను, నాది అనే భావన నుంచి మనం, మనది అని భావించే స్థితికి మనిషి చేరుకోవడమే నిజమైన వ్యక్తిత్వ వికాసం. అటువంటి కలుపుగోలు ఆలోచనలు మనిషికి కలిగినప్పుడే అతడు అందరినీ ప్రేమిస్తాడు. ప్రతి జీవిని తనతో సమానంగా గౌరవిస్తాడు. ఆ చైతన్యం మనిషిలో

కలగాలంటే అది సాహిత్యం వల్లే సాధ్యమవుతుంది. ఇటువంటి పద్యాలు మనిషిలో నిద్రాణమై ఉన్న మానవత్వాన్ని తట్టి లేపుతాయి. సమాజాన్ని ప్రేమించే దిశగా మనిషిని నడిపిస్తాయి. అతిథిసేవ చేయడంలో ఉండే ఆత్మసంతృప్తి మరెందులోనూ లేదని తెలియజేస్తాయి. ప్రథమాశ్వాసంలోనే "తీర్థవాసు లేతెంచినారని విన్న..."(*మను. 1: 57*) మొదలైన పద్యాలు సైతం అతిథిని ఎలా గౌరవించాలో తెలియజేస్తాయి.

## 4.4. ప్రవరుడి హిమాలయ సందర్శనం

సిద్ధుడు పూసిన పాదలేపనం మహిమతో ప్రవరుడు హిమాలయాలను చూడాలని నిశ్చయించుకుంటాడు. అక్కడి అందాలను ఆస్వాదించాక, తిరిగి ఇంటికి వెళ్లి మళ్ళీ వద్దామని అనుకుంటాడు. కానీ అక్కడున్న మంచుకి అతడి కాళ్ళకున్న పాదలేపనం కరిగిపోతుంది.

మ. అతఁడట్లౌషధహీనుఁడై నిజపురీ యాత్రా మిళత్కౌతుకో
ద్ధతిఁ బోవన్ సపదిస్ఫుటార్తిఁ జరణద్వంద్వంబు రాకుండినన్
మతిఁ జింతించుచు నవ్విధం బెఱిఁగి హా నన్నిట్లు దైవంబ తె
చ్చితె యీ ఘోరవన ప్రదేశమునకున్ సిద్ధాపదేశంబునన్. (*మను. 2: 14*)

ఈ పద్యంలో "హా నన్నిట్లు దైవంబ తెచ్చితె యీ ఘోరవన ప్రదేశమునకున్ సిద్ధాపదేశంబునన్", ఈ మాటని గమనించాలి. నిజానికి సిద్ధుడు పాదలేపనం పూయగానే ప్రవరుడే ఒక్క క్షణమైనా ఆలోచించకుండా హిమాలయాలకు వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు. కానీ, పాదలేపనం కరిగిపోయేసరికి దేవుడు తనని హిమాలయాలకు తెచ్చి వదిలేశాడు అని మాట మార్చాడు. ప్రవరుడు దైవభక్తి కలవాడే. అయితే, అతడు ఇక్కడ ఒక సగటు మనిషికి ప్రతినిధి. మనలో చాలామంది పరిస్థితులు మనకి అనుకూలంగా ఉన్నప్పుడు ఒకలాగా, ప్రతికూలంగా ఉన్నప్పుడు మరొకలాగా ప్రవర్తిస్తుంటాం. ఇక్కడ కూడా ప్రవరుడు అలాగే ప్రవర్తించాడు. హిమాలయాలకు రావాలనేది ప్రవరుడి నిర్ణయమే. దాని పర్యవసానాలు ఎటువంటివైనా అనుభవించాల్సిందే. అయితే ప్రవరుడు ధర్మపక్షపాతి కనుక అతడిని అగ్ని దేవుడు ఇంటికి చేరుస్తాడు. అది ఇప్పటికి అప్రస్తుతం. కానీ, ఏ భక్తీ లేని వారు కూడా సాధారణంగా క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడు దేవుడి మీదకి నెట్టేస్తారు. సుఖాల్లో ఉన్నప్పుడు గుర్తురాని దైవం కష్టం రాగానే గుర్తొస్తుంది. మనిషి ఎటువంటి పరిస్థితినైనా

ఎదుర్కొనే ధైర్యాన్ని అలవర్చుకోవడం వ్యక్తిత్వ నిర్మాణంలో చాలా కీలకం. కష్టాలను, సుఖాలను ఒకే విధంగా తీసుకునే స్థితికి మనిషి చేరుకోవాలి.

జీవితం శుభాశుభాల మిశ్రమం. చిన్న చిన్న సమస్యలను ఎదుర్కోలేక ఆత్మహత్యలు చేసుకోవడం ఇవాళ చాలా మందికి ఒక అలవాటుగా మారిపోయింది. బతికి సాధించుకోవాల్సింది పోయి చిన్నపాటి కష్టాలకే చేతులెత్తేసే స్థితికి మనుషుల మనస్తత్వాలు దిగజారిపోయాయి. నిజానికి ఏ కష్టం వచ్చినా పోరాడడం మనుషులకి సహజసిద్ధంగా ఉండే గుణం. కానీ, రాను రాను మనుషులు మానసికంగా కృంగిపోతున్నారు. ఇటువంటి పరిస్థితి నుంచి మనుష్య జాతిని కాపాడగలిగేది సాహిత్యం మాత్రమే. *మనుచరిత్ర* కావ్యం ఈ క్లిష్ట పరిస్థితిలో మనిషికి మానసిక వైద్యం చేయగలదు. ఈ కావ్యంలో ఎన్నో పద్యాలు వ్యక్తిత్వం వికసించే దిశగా వ్యక్తిని నడిపించగలవు.

పాదలేపనం కరిగిపోయిన సందర్భంలో ప్రవరుడు ఎందుకు హిమాలయాలకు వచ్చాను? అని బాధపడతాడు.

క. ఎక్కడి యరుణాస్పదపుర
మెక్కడి తుహినాద్రి క్రొవ్వి యే రాఁదగునే
యక్కట మును సను దెంచిన
దిక్కిది యని యెఱుఁగ వెడలు తెరు వెయ్యదియో. (*మను. 2: 15*)

'అరుణాస్పదపురం ఎక్కడ? హిమాలయాలు ఎక్కడ? పొగరు కాకపోతే ఇంత దూరం రావడం ఎందుకు? తిరిగి వెళ్ళడానికి వచ్చిన దారి కూడా గుర్తులేదు' అంటూ చేసిన తప్పుకు బాధపడతాడు ప్రవరుడు.

అనాలోచితంగా కంగారుపడి తీసుకునే నిర్ణయాల ఫలితం ఎలా ఉంటుందో పెద్దన ఈ పద్యం ద్వారా చెబుతున్నాడు. సాధారణంగా చాలా మంది ఆలోచించకుండా నిర్ణయాలు తీసుకుని తర్వాత బాధపడుతుంటారు. అలా బాధ పడే బదులు నిర్ణయం తీసుకునే ముందు ఒక్క క్షణం ఆలోచించి అడుగేస్తే మంచి నిర్ణయం తీసుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఆ ఆలోచన మనిషి మనస్సును ప్రభావితం చేసి ఆ నిర్ణయం తాలుకా పర్యవసానాలను ఒక సారి బేరీజు వేస్తుంది. మనిషి ఎప్పుడు ప్రశాంతంగా ఆలోచించినా మంచి నిర్ణయాలే తీసుకుంటాడు. ఇదే విషయాన్ని ఈ మధ్య సినీగేయ రచయిత 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి 'చేసేదేదో చేసేముందే ఆలోచిస్తే తప్పుందా?' అంటూ ఒక చలనచిత్రానికి పాటగా రాశాడు.

'దూరపు కొండల నునుపు' అని తెలుగులో ఒక సామెత ఉంది. ప్రవరుడు ఎప్పుడూ తీర్థయాత్రలు చేయలేదు కాబట్టి దేశం తిరిగి చూడడంలో తప్పు లేదు. కానీ ఇప్పటికీ కొంతమంది అదే పనిగా దేశమంతా చూసినా మళ్ళీ మళ్ళీ చూస్తూ ఉంటారు. ఏదో ఆనందం, ప్రశాంతత పొందవచ్చు అనుకుంటూ ఉంటారు. కానీ ఆనందం, ప్రశాంతత అనేవి మనిషి మనస్సులోనే ఉంటాయి. ప్రాంతాల్లో కాదు అని గ్రహించరు. మనిషికి సంతృప్తి చాలా ముఖ్యం. సంతృప్తిగా ఉన్న మనిషి ఇంట్లో  ఆనందం, ప్రశాంతత కొలువుంటాయి.

ఈ మధ్య ఉత్తరాంచల్ ప్రాంతంలో వచ్చిన వరదలకి సైతం విపరీతంగా తీర్థయాత్రలు చేసే వాళ్ళే కారణం. దేవుడు సర్వాంతర్యామి. ఎక్కడైనా ఉంటాడు. మన వీధి చివర ఉండే గుడిలోనూ ఉంటాడు, పుణ్యక్షేత్రాల్లోనూ ఉంటాడు. అన్నింటినీ మించి జీవుల మనస్సులో కొలువుంటాడు. మన భావనలోనే తేడా ఉంది. అదే పనిగా యాత్రికులు వెళ్ళడం వల్లే అక్కడ రోడ్లు వెడల్పు చేయాల్సివచ్చింది. యాత్రికుల సౌకర్యార్థం భవనాలు నిర్మించాల్సివచ్చింది. వీటి కోసం చెట్లను కొట్టేయాల్సివచ్చింది. ప్రకృతిలో సమతౌల్యం లోపించి వరదలు ఆ ప్రాంతాన్ని ముంచేసి కొన్ని వందల ప్రాణాలను బలిగొన్నాయి.

కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ భగవంతుడిని నమ్మేవారికి మనోధైర్యం వరంగా సిద్ధిస్తుంది. ప్రతి కష్టానికీ ఏదో ఒక ప్రాంతానికి వెళ్లి దేవుడికి మొక్కాల్సిన పని లేదు. మన ఆలోచనావిధానంలో, ప్రవర్తనలో, ప్రయత్నంలో చిన్న పాటి మార్పులు చేసుకొని స్వశక్తిని నమ్ముకుంటే సరిపోతుంది. మన భారతీయ తత్త్వశాస్త్రం, సనాతన ధర్మం సైతం అదే విషయాన్ని బలపరుస్తాయి. 'దేవుడు నీలోనే ఉన్నాడు. నిన్ను నువ్వు నమ్ముకో' అనే విషయాన్ని ముక్తకంఠంతో బోధిస్తుంటాయి.

తొందరపాటు నిర్ణయాలు తీసుకొని అది సమస్యగా పరిణమించాక దేవుడిపై భారం వేసే కంటే కాస్త ప్రశాంతంగా ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవడం శ్రేయస్కరం. మన జీవితం ఎప్పుడూ మన చేతిలోనే ఉంది, ఉంటుంది. ప్రవరుడు నిత్యం భగవంతుడిని ఆరాధిస్తూ, మంచి పనులు చేస్తూ ఉంటాడు కాబట్టే తర్వాత కథలో అగ్ని దేవుడు అతడిని ఆదుకుంటాడు. ప్రవరుడు ఈ విషయంలో మినహాయింపే అయినా, అంత దైవభక్తుడికి సైతం అనాలోచితంగా తీసుకున్న నిర్ణయం వల్ల సమస్యలు తప్పలేదు. పై రెండు పద్యాలు ఆచితూచి నిర్ణయం తీసుకోవడం ఎంత ముఖ్యమో చెప్పడమే కాకుండా కష్టసుఖాల్లో మనిషి ఎల్లప్పుడూ దేవుడిని ఆరాధిస్తే చాలా సమస్యలకి పరిష్కారం దొరుకుతుందనే విషయాన్ని పరోక్షంగా చెబుతున్నాయి.

మ. అకలంకౌషధ సత్త్వమున్ దెలియ మాయాద్వారకావంతికా
శీ కురుక్షేత్ర గయా ప్రయాగములు నే సేవింప కుద్దండ గం
డక వేదండ వరాహ వాహరిపు ఖడ్గ వ్యాఘ్ర మిమ్మంచుఁ గొం
డకు రాఁజెల్లునె బుద్ధిజాడ్య జనితోన్మాదుల్ గదా శ్రోత్రియుల్. (*మను. 2: 16*)

'సిద్ధుడు ఇచ్చిన పాదలేపనం మహిమ వల్ల భయంకరమైన క్రూరమృగాలు సంచరించే ఈ మంచు కొండలకి రాకపోతే, గయ, వారణాసి, ప్రయాగ వంటి క్షేత్రాలకి వెళ్తే సరిపోయేది కదా. ఇటువంటి ప్రదేశానికి ఎందుకు వచ్చినట్టు? కేవల వైదికులైన నావంటి వారు బుద్ధి మాంద్యం వల్ల ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటారు' అని ప్రవరుడు భావించాడు.

ఈ పద్యం కూడా అనాలోచితంగా తీసుకునే నిర్ణయాల పర్యవసానాల గురించే మాట్లాడుతుంది. అయితే, చివరి పాదంలో "బుద్ధిజాడ్యజనితోన్మాదుల్ గదా శ్రోత్రియుల్" అన్న మాట గమనించవలసినది. "వేదము పఠించిన వారికి బుద్ధి వికాసం ఉండదు. కాళిదాసు విక్రమోర్వశీయమున "వేదాభ్యాసజడః" అనెను. కేవల పఠనము ప్రతిభాదాయకముకాదనుట" (*మను. 2001: 97*).

శ్రోత్రియులంటే బ్రాహ్మణులు. పూర్వ కాలంలో వేద పఠనం వారి వృత్తి. వేదాల్లో లేని విషయం లేదు. అయితే కేవలం చదువుతూ ఉండడం వల్ల బుద్ధి వికాసం చెందదు. అర్థం అవగతమైతేనే బుద్ధి వికాసం చెందుతుంది. అందుకే పెద్దన "బుద్ధిజాడ్యజనితోన్మాదుల్ గదా శ్రోత్రియుల్" అన్నాడు. దీన్ని బట్టి కేవలం కంఠస్థం చేయడం వల్ల ఏ లాభం ఉండదనే విషయం స్పష్టమవుతోంది.

ఈ రోజు ర్యాంకులు తెప్పించడమే లక్ష్యంగా విద్యార్థులకు పాఠాలను అర్థమయ్యేలా చెప్పకుండా ముఖ్యమైన ప్రశ్నలు చెప్పి వాటినే బట్టీ పట్టించి తప్పుదోవ పట్టిస్తున్న ఉపాధ్యాయులకు, అటువంటి విద్యావిధానాన్ని సమర్థిస్తున్న తల్లిదండ్రులకు ఈ పద్యం వర్తిస్తుంది. ఇలా బట్టీ పట్టించడం వల్ల బుద్ధి వికసించదు. అర్థం కాని చదువు వ్యర్థం. విద్యార్థి చదివింది అర్థం చేసుకుని సొంతంగా రాయాలే తప్ప ఉన్నది ఉన్నట్టు రాయడం సరి కాదు. అలాంటి విద్యావ్యవస్థకి స్వస్తి పలకకపోతే నేటి యువతరం వ్యక్తిత్వం వికసించడం అసాధ్యం.

ఈ పద్యంలో మరొక ముఖ్యమైన విషయం గమనించాలి. ప్రవరుడు తాను చేసిన తప్పుని సమూహానికి మప్పుతున్నాడు. హిమాలయాలకి రావడం పూర్తిగా ప్రవరుడు అనాలోచితంగా తీసుకున్న నిర్ణయం. అది అతడి వ్యక్తిగతమైన తప్పిదం. ఈ విషయంలో దేవుడు కానీ తక్కిన

బ్రాహ్మణులు కానీ చేసింది ఏమి లేదు. అందరు బ్రాహ్మణులూ అలాగే చేస్తారని చెప్పలేం. నేటి మన ఆలోచనావిధానంలో ఇదొక పెద్ద లోపం. మనలో చాలా మంది ఒకరు చేసిన తప్పుకి మొత్తం సమూహాన్ని నిందిస్తూ ఉంటాం. అదేవిధంగా ఒక తప్పుకి సమూహంలో ప్రతి ఒక్కరినీ నిందించడం కూడా తప్పే. అందరూ ఆ తప్పు చేసినా ఒకరిద్దరు చేయకపోతే వాళ్ళకి ఆ తప్పుతో ఏ సంబంధం ఉండదు. ఇటువంటి ఆలోచనావిధానానికి స్వస్తి పలకాల్సిందే. అందులోనూ ఈ పద్యాన్ని ఈ కాలానికి అన్వయిస్తే, ఇప్పటి కాలంలో ఒక కులం వారిది ఫలానా వృత్తి అని చెప్పడానికి వీల్లేదు. మనుషుల ఆలోచనావిధానంలో ఎదుగుదల లేకపోతే వ్యక్తిగా ఎదగడమూ అసాధ్యమే.

ఈ పద్యంలో మరొక ముఖ్యమైన విషయాన్ని గమనించాలి. తాను సుఖంగా ఉన్నప్పుడు హిమాలయాలు ప్రవరుడికి చాలా అందంగా కనిపించాయి. అదే హిమాలయ ప్రాంతం కష్టం వచ్చేసరికి క్రూరమృగాలు సంచరించే అరణ్యంలా కనిపించింది. ఈ పద్యం ద్వారా పెద్దన సుఖదుఃఖాల్లో మనిషి ప్రవర్తన, ఆలోచనావిధానం ఏ విధంగా ఉంటాయో వివరిస్తున్నాడు. అంటే మనం ఆనందంగా ఉన్నప్పుడు మన చుట్టూ ఉన్న ప్రపంచం అంతా చాలా అందంగా, హాయిగా అనిపిస్తుంది. మనకి బాధ, కష్టం కలిగినప్పుడు అదే లోకం చాలా అందవికారంగా, భయంకరంగా కనిపిస్తుంది. దీన్ని బట్టి ఆనందం, విచారం అనేవి మన మనస్సులోని భావనలే తప్ప మరెక్కడా ఉండేవి కావనేది స్పష్టమవుతోంది. మనం ఆనందంగా, సంతృప్తిగా ఉండాలనుకుంటే ఎక్కడైనా ఉండగలం. అంతా మన మనస్సులోనే ఉంది. ఈ దిశగా మనుషులు ఆలోచించగలిగితే ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని నిర్మించుకునే దిశగా అడుగులు వేసినట్టే.

సీ. నను నిముసంబు గానక యున్న నూరెల్ల / నరయు మజ్జనకుఁ డెంతడలు నొక్కొ
యెపుడు సంధ్యలయందు నిలు వెళ్ళనీక న / న్నోమెడు తల్లి యెంతొఱలు నొక్కొ
యనుకూలవతి నాదు మనసులో వర్తించు / కులకాంత మది నెంత కుందునొక్కొ
కెడఁ దోడునీడలై క్రీడించు సచ్ఛాత్రు / లింతకు నెంత చింతింతురొక్కొ

తే. యతిథి సంతర్పణంబు లేమయ్యె నొక్కొ
యగ్ను లేమయ్యెనొక్కొ నిత్యంబులైన
కృత్యములఁ బాపి దైవంబ కినుక నిట్లు
పాఱవైచితి మిన్నులు పడ్డ చోట. (*మను. 2: 17*)

ప్రవరుడికి ఆ సమయంలో, తన బాగోగులు ఎల్లప్పుడూ కోరుకునే తల్లిదండ్రులు గుర్తొచ్చారు. తన గురించే అనుక్షణం ఆలోచించే తన భార్య, ఎప్పుడూ తనతోనే ఉండే శిష్యులు గుర్తొచ్చారు. అన్నింటికంటే ఆశ్చర్యకరమైన విషయం, ఈ పద్యంలో ముఖ్యంగా గమనించవలసిన విషయం "యతిథి సంతర్పణంబు లేమయ్యెనొక్కొ" అన్న మాట.

ప్రవరుడికి అంత కష్టం ఎదురైనప్పుడు బంధాలు, బంధుత్వాలు గుర్తురావడంలో ఆశ్చర్యం ఏమి లేదు. కానీ జీవితంలో అత్యంత క్లిష్టమైన పరిస్థితిలో కూడా అతడికి అతిథి సంతర్పణ గుర్తుకొచ్చింది. ఇది చాలా గొప్ప విషయం. సమాజ సేవ అనేది ఏదో వీలు చిక్కినప్పుడు చేసే పని అని, పేరు కోసమో, కీర్తి కోసమో చేసేది అని ప్రవరుడు భావించలేదు. సమాజ సేవని తానొక బాధ్యతగా భావించాడు. ప్రవరుడి దైనందిన జీవితంలో అతిథిసేవ ఒక భాగం. ఈ విషయాన్ని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలి. అతిథిసేవను గృహస్థు ధర్మాల్లో ఒకటిగా పెద్దన మొదటి ఆశ్వాసంలో వర్ణించాడు. అతిథిసేవ చేయడంలో ఉండే సంతృప్తిని గురించి కూడా చెప్పాడు. ఇప్పుడు అతిథిసేవ మనిషి జీవితంలో ఎంతగా మమేకం అయిపోవాలో చెబుతున్నాడు. కావ్యంలో కథ ముందుకి నడుస్తున్న కొద్దీ ప్రవరుడి పాత్రను మరింత ఉన్నతంగా, ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నాడు పెద్దన.

ప్రవరుడు ఆ క్షణంలో అతిథిసేవను గుర్తుచేసుకున్నాడు అని చెప్పడం పాఠకుల మనస్సులపై గొప్పగా ప్రభావితం చేస్తుంది. పైగా ప్రవరుడు తాను తన బాధ్యతల నుంచి దూరం అయినందుకు చింతిస్తున్నాడు. 'హమ్మయ్య! పని తప్పింది' అని తప్పించుకోవట్లేదు. అంటే ప్రవరుడు నిత్యం తాను చేసే ధర్మకార్యాలను హృదయపూర్వకంగా, ఇష్టంతో చేస్తున్నాడు, తన పనిని ప్రేమిస్తున్నాడన్నది స్పష్టం. అతడికి పనియే దైవం. పెద్దన ప్రవరుడి పాత్ర ద్వారా, ఎన్ని కష్టాలు వచ్చినా స్వధర్మనిర్వహణ చాలా ముఖ్యమని చెబుతున్నాడు. మనిషి ఎలాంటి క్లిష్ట పరిస్థితిలోనైనా బాధ్యతలను విస్మరించకూడదని కర్తవ్యబోధ చేస్తున్నాడు. ప్రతి వ్యక్తి తన బాధ్యతలను విస్మరించకుండా, సమాజసేవను సైతం ఆ బాధ్యతల్లో ఒకటిగా భావిస్తూ ధర్మబద్ధంగా జీవిస్తే ఆ ధర్మమే అతడిని కాపాడుతుంది. 'ధర్మో రక్షతి రక్షితః' అని ఆర్యోక్తి. వ్యక్తిత్వం వికసించడం అంటే ఉన్నతమైన భావాలను కలిగి ఉండడం, విలువలకి కట్టుబడి ఉండడమే. ఆ విలువలే మనిషికి ఆస్తి.

స్వధర్మనిర్వహణ మనిషికి ఎంత ముఖ్యమో పెద్దన మరో పద్యంలో కూడా చెబుతున్నాడు. ప్రవరుడికి వరూథిని తారసపడ్డాక వారిద్దరి మధ్య వాగ్వాదం జరుగుతున్న సందర్భంలోనిది ఈ కింది పద్యం.

ఉ. వేలిమియున్ సురార్చనయు విప్రసపర్యయుఁ జిక్కె భుక్తికిన్
వేళ యతిక్రమించె జననీజనకుల్ కదువృద్ధి లాఁకటన్
సొలుచుఁ జింతతో నెదురు సూచుచు నుండుదు రాహితాగ్ని నే
దూలు సమస్తధర్మములుఁ దొయ్యలి నేఁ డిలు సేరకుండినన్. (*మను. 2: 53*)

పై పద్యం ప్రవరుడికి స్వధర్మనిర్వహణ పట్ల ఉన్న శ్రద్ధని తెలియజేయడమే కాకుండా, అతడికి పెళ్ళి అయ్యాక కూడా తల్లిదండ్రుల మీద ఉన్న ప్రేమాతిశాయాన్ని తెలియజేస్తుంది. ఈ తరంలో ఎక్కువ శాతం మంది పిల్లలు ఎదిగిన తర్వాత తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదు. కానీ ప్రవరుడు పెళ్ళి అయ్యాక కూడా వారికి సేవ చేస్తూనే ఉన్నాడు. అందుకే ప్రవరుడి వ్యక్తిత్వం నేటికీ ఆదర్శంగా నిలిచిపోయింది.. పైన "నను నిముసంబు..." (*మను. 2: 17*) అన్న పద్యం ప్రవరుడు దారి తెలియక భయపడుతున్నప్పుడు చెప్పింది. కానీ ఈ పద్యం వరూథిని పరిచయం అయిన తర్వాత వస్తుంది. అప్పటికి ప్రవరుడికి భయమే కాదు ఎదురుగా ఒక గొప్ప ఆకర్షణ కూడా ఉంది. అయినా ప్రవరుడి మనస్సు చలించదు. పరిస్థితులు మారినా ప్రవరుడి మనస్సు మాత్రం నిశ్చలంగా ఉంది. ప్రవరుడి వ్యక్తిత్వం అంత ఉన్నతమైంది.

## 4.5. వరూథినీ ప్రవరాఖ్యుల సంవాదం

హిమాలయాల్లో ఇంటికి వెళ్ళే మార్గం కోసం అన్వేషిస్తున్న ప్రవరుడికి ఒక ఇల్లు కనిపిస్తుంది. కథలో ప్రధానమైన మలుపు ఇదే.

క. మృగమద సౌరభ విభవ
ద్విగుణిత ఘనసారసాంద్ర వీటీగంధ
స్థగి తేతర పరిమళ మై
మగువ పొలుపుఁ దెలుపునొక్క మారుత మొలసెన్. (*మను. 2: 24*)

'ప్రవరుడు దారి వెతుకుతూ ఉండగా ఒక ఇల్లు కనపడుతుంది. దాన్ని చూసి ప్రవరుడు ఆశ్రమం అనుకున్నాడు. కానీ అక్కడ నుంచి కస్తూరి, పచ్చ కర్పూరం మొదలైన పరిమళద్రవ్యాలు కలిపిన తమ్మవాసన ఇతర పరిమళాలను కప్పివేయగా, జవరాలి జాడ తెలిపే ఒక గాలి వీచింది. ఇటువంటి వాసన ఎక్కడ నుంచి వస్తుంది? ఒక మహాభోగవతియైన స్త్రీ ఉన్న చోట నుంచి వస్తుంది'.

ప్రవరుడికి ఆ విషయం తెలుసునని, అయినా అక్కడికి వెళ్ళడానికి రెండు కారణాలు ఉన్నాయని విశ్వనాథ సత్యనారాయణ భావించారు. "ఒకటి– తనకు దారి చెప్పెడి దిక్కు మరియొకటి లేదు. రెండు– అతడట్టి సౌందర్యములు, భోగములు, సంగీతములు నన్నియు నెఱిగినవాడు. అతనికి వ్యామోహం లేదు. అందుచేత వెళ్ళినాడు" (*కావ్య. 1978: 20*).

ఈ పద్యంతో పెద్దన ప్రవరుడి పాత్రని మరింత ఉన్నతమైన స్థాయికి తీసుకెళ్ళాడు. గొప్ప మనోనిగ్రహం ఉంటే తప్ప ఆ ప్రాంతంలో ఒక మహాభోగవతియైన స్త్రీ ఉంటుందని తెలిసి ఏ వ్యక్తి అటు వెళ్ళడు. అతడికి వ్యామోహం ఉంటే ఎలాగూ వెళ్తాడు. కానీ ప్రవరుడు వెళ్ళింది వ్యామోహంతో కాదు, తన మనోనిగ్రహంపై తనకున్న అపారమైన విశ్వాసంతో. ప్రవరుడు పాత్రని పెద్దన చెక్కిన తీరు నేటికీ ఎంతోమందికి ఆదర్శంగా నిలిచిపోయింది. ఈ పద్యం, అదే సందర్భంలో "అతడావాత పరంపరా..."(*మను. 2: 25*) అంటూ పెద్దన రచించిన మరో పద్యం మొత్తం *మనుచరిత్ర*లో అత్యంత కీలకమైన, ఆసక్తికరమైన ఘటానికి నాందీశ్లోకం వంటివి. కథను మలుపు తిప్పేవి ఈ రెండు పద్యాలే.

మ. మునుమున్ పుట్టెడు కొంకులౌల్యము నిడన్ మోదంబు విస్తీర్ణతన్
జొనుపన్ గోర్కులు గ్రేళ్ళుద్రిప్ప మదిమెచ్చుల్ ఔప్ప లల్లార్చన
త్యనుషంగస్థితి ఱిచ్చపాటొసఁగ నొయ్యారంబునన్ జంద్రికల్
దనుకన్ జూచె లతాంగి భూసురుఁ బ్రఫుల్ల న్నేత్ర పద్మంబులన్. (*మను. 2: 30*)

వరూథిని పాత్రను పెద్దన చిత్రించిన తీరుకి ఈ పద్యం ఒక నిదర్శనం. ఒక కోరిక మనస్సులో మెదిలాక అది క్రమంగా ఎలా పరిణామం చెందుతుందో ఈ పద్యం వివరిస్తుంది. వరూథినికి ప్రవరుడిని చూడగానే మనస్సులో కోరిక జనించింది. అది క్రమక్రమంగా పరిణామం చెందుతోంది. అయితే, వరూథిని తనకి కలిగిన కోరిక ధర్మబద్ధమైనదో కాదో ఆలోచించలేదు. అతడికి పెళ్ళి అయ్యిందో లేదో అడగలేదు. తర్వాత వారి సంభాషణలో భాగంగా ఆ విషయం తెలుస్తుంది. అయినా వరూథిని ప్రవరుడిని మభ్య పెడుతుంది. అతడిని పొందడానికి శతవిధాల ప్రయత్నిస్తుంది.

ఈ రోజు చాలా మంది ఆకర్షణలకి లోబడి ఆ ఆకర్షణ ధర్మబద్ధమైనదో కాదో ఆలోచించడం లేదు. నేటికాలం ప్రేమలు అలాగే ఉన్నాయి. పరిణతి చెందని వయస్సులో ఏర్పడే ప్రేమల్లో పరిపక్వత లోపిస్తోంది. అవి ఇరువురినీ లక్ష్యంపై దృష్టి సారించనివ్వకుండా పెడదోవ పట్టిస్తున్నాయి. విద్యార్థుల చదువు ఈ ప్రేమల వల్ల సక్రమంగా సాగడం లేదు.

ఈ పద్యంలో పెద్దన వరూథిని మానసిక స్థితిని చిత్రించిన తీరు నేటి తరం ప్రేమికుల మానసిక స్థితికి అద్దం పడుతుంది. ఆకర్షణ మన ముందు ఉన్నాక సాధారణంగా మనస్సు మన మాట వినదు. ఇటువంటి పరిస్థితిలోనే మనిషికి మనోనిగ్రహం అవసరం. ఇటువంటి పరిస్థితి మనిషి వ్యక్తిత్వానికి పరీక్ష వంటిది. ఆ క్షణం మనిషి తీసుకునే నిర్ణయం అతడి భవిష్యత్తును నిర్దేశిస్తుంది. ఆ క్షణం తడబడితే జీవితమంతా తడబడాల్సిందే.

వరూథినీప్రవరుల సంవాద ఘట్టంలో పెద్దన రచించిన పద్యాలు ఒక ఆకర్షణ మనిషి ముందు ఉన్నప్పుడు అతడి మనస్సులో మెదిలే ఆలోచనలను అచ్చంగా ప్రతిబింబిస్తాయి. రెండు పాత్రల్లోనూ కలిగే భావప్రకంపనలను పాఠకుల ముందు ఆవిష్కరించాడు పెద్దన. రెండు భిన్నమైన వ్యక్తిత్వాలను మన ముందు ఉంచి రెండు వైపులా వాదిస్తూ ఏది సరైనదో నిర్ణయించుకోమని మన విచక్షణాజ్ఞానానికి వదిలేస్తాడు పెద్దన. అంతిమంగా ప్రవరుడిని సమ్మతించి పెద్దన తన వ్యక్తిత్వాన్ని చాటుకుంటాడు.

ఉ. అండజయాన నీవొసఁగు నట్టి సపర్యలు మాకు వచ్చె నిం
దుండఁగ రాదు పోవలయు నూరికి నింటికి నిప్పు డేను రా
కుండ నొకండు వచ్చి మరియొండునె భక్తియ చాలు సత్క్రియా
కాండముఁ దీర్ప వేగ సనఁ గావలయున్ గరుణింపు నాపయిన్. (*మను. 2: 48*)

వరూథిని ప్రవరుడిని తన ఆతిథ్యం స్వీకరించమని అడుగుతుంది. కేవలం ఆతిథ్యం స్వీకరించినంత మాత్రాన ఏమి నష్టం లేదు. కానీ ప్రవరుడు తిరస్కరిస్తాడు. తాను వచ్చింది దారి అడగడానికి మాత్రమే. అతను గొప్ప లోకజ్ఞానం కలవాడు కాబట్టి లోపలికి వెళ్తే లేనిపోని సమస్యలు వస్తాయని ఊహించి ఉంటాడు. చాలామంది తమ జీవితాల్లో ఇటువంటి పరిస్థితులు ఎదురయినప్పుడు తప్పటడుగులు వేసి తడబడతారు. ఏదైనా ఆకర్షణ, కోరిక కలిగినప్పుడు దాన్ని ఆదిలోనే తుంచివేస్తే ఎటువంటి ఇబ్బంది ఉండదు. 'ఆ! మాట్లాడితే ఏమవుతుంది? లోపలికి వెళ్లి ఒక పది నిమిషాలు కూర్చుంటే ఏమవుతుంది?' అనుకుంటే కష్టం. విశ్వామిత్రుడంతటి వాడికే కుదరని మనోనిగ్రహం, అటువంటి ఇంటి లోపలికి వెళ్ళాక ఎవరికైనా కుదురుతుందా?

అందుకే ప్రవరుడు వరూథినిని ఆదిలోనే తిరస్కరించాడు. పైగా ఇంటికి వెళ్ళే మార్గం కనుక్కోవడం అతడి ప్రస్తుత లక్ష్యం. మధ్యలో ఎన్ని అడ్డంకులు వచ్చినా అనుకున్న పనిని మర్చిపోకూడదు. ఇదే విషయం రామాయణంలో కూడా కనిపిస్తుంది. హనుమంతుడు సీతాదేవి జాడ

వెతకడం కోసం వెళ్తున్నప్పుడు మైనాకుడు తన ఆతిథ్యం స్వీకరించమని అడిగినప్పుడు హనుమంతుడు సున్నితంగానే తిరస్కరిస్తాడు. తానొక అత్యవసరమైన పని మీద వెళ్తున్నానని చెప్పి వెళ్ళిపోతాడు.

ప్రవరుడు ఆ సమయంలో వరూథినిని తిరస్కరించకపోతే లోపలికి వెళ్ళాక పరిస్థితి మరింత క్లిష్టంగా తయారయ్యేది.

ఉ. ఎక్కడి యూరు కాల్ నిలవకింటికిc బోయెద నంచుc బల్కెదీ
వక్కట మీ కుటీర నిలయంబులకున్ సరిరాక పోయె నే
యిక్కడ రత్నకందరము లిక్కడ నందన చందనోత్కరం
బిక్కడ గాంగ సైకతము లిక్కడి యీ లవలీనికుంజముల్. (*మను. 2: 50*)

వరూథిని ప్రవరుడిని ఎంత ఆకట్టుకోవాలని ప్రయత్నించినా ప్రవరుడు మాత్రం తన ఊరికి వెళ్ళే మార్గం చెప్పమని పట్టుబడతాడు. అప్పుడు వరూథిని ఈ విధంగా పలుకుతుంది 'ఊరికే ఊరు ఊరు అని కలవరిస్తావెందుకు? ఇక్కడి మణికందరములు, గంధపుతోటలు, ఇక్కడి గంగానదీసైకతములు, ఇక్కడి వెన్నెలతీవపొదరిండ్లు మీ గుడిసె కొంపలకు సాటిరాదా?'

ఈ ఘట్టంలో సుమారుగా ప్రతి పద్యం వెనుక వరూథిని మనస్తత్వం కనిపిస్తుంది. ఒక కోరిక మనస్సులో జ్వలించాక అది ఎంతగా మనస్సుని తొలిచేస్తుందో పెద్దన ఈ పద్యాల ద్వారా వివరిస్తాడు. ఇదే విషయం 3వ అధ్యాయంలో "కాకులు రావిపళ్ళు తిని..." (*చూ. 3.7*) అనే పద్యంలో ప్రస్తావనకు వచ్చింది.

ప్రవరుడు అప్పటికే వరూథినికి తన కథంతా చెప్పినా వరూథిని మాత్రం పట్టు విడవదు. అది అధర్మమని తెలిసి కూడా వరూథిని ప్రవరుడిని తన వశం చేసుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తుంది. ఇటువంటి వాళ్ళు నేటి సమాజంలో చాలా మంది ఉన్నారు. పరులకి సంబంధించినది ఏదైనా సరే, దాని మీద ఆశపడడం తప్పు. అలా ఆశ పడడం వల్ల ఎప్పటికైనా కష్టాలు తప్పవు, వ్యక్తిత్వాన్ని కోల్పోకతప్పదు. 'Prevention is better than Cure' అని ఆంగ్ల సూక్తి. నష్టం జరిగాక బాధ పడడం కంటే ముందే జాగ్రత్త పడడం మంచిది.

వరూథిని ఆ ప్రాంతంలో ఉన్న అందాలను వర్ణించడం వల్ల తన మనస్సులో ఉన్న కోరిక వ్యక్తమవుతోంది. మనిషిని ఆకర్షణలు ఎలా మాయలో పడేస్తాయో ఈ పద్యం ద్వారా అర్థం చేసుకోవచ్చు. మనస్సు చంచలమైంది. ఇటువంటి పరిస్థితిలో దాన్ని నిగ్రహించుకోకపోతే సమస్యలను కొనితెచ్చుకున్నట్టే.

ఇదే సందర్భంలో "నిక్కము దాపనేల ధరణీసురనందన..." అనే పద్యంలో 'నను చిత్తజు బారికి నప్పగించెదో, చొక్కి మరంద మద్యముల చూరుల బాటలు వాడు తేంట్ల సొంపెక్కినయట్టి పూవు పొదరిండ్లను కౌగిట గారవించెదో' అన్న మాటలు కూడా ఇటువంటివే. అటువంటి మాటలు వింటే ఎవరైనా మాయలో పడాల్సిందే. కానీ ప్రవరుడు ధర్మనిష్ఠ కలవాడు కాబట్టి తనని తాను నియంత్రించుకున్నాడు.

క. అనుటయుఁ బ్రవరుండిట్లను
వనజేక్షణ యిట్లు వలుక వరుసయె వ్రతులై
దినములు గడపెడు విప్రులఁ
జనునే కామింప మది విచారము వలదే. (*మను. 2: 52*)

ప్రవరుడు నిష్ఠగలవాడు కాబట్టి వరూథినిని తిరస్కరించి, ఇలా మాట్లాడడం భావ్యమా? అని ప్రశ్నిస్తాడు. యుక్తాయుక్త విచారణ చేసుకోవద్దా? అని ఆమెకున్న విచక్షణాజ్ఞానాన్ని ప్రశ్నిస్తాడు. కానీ ప్రవరుడిని పొందడమే లక్ష్యంగా పెట్టుకున్న వరూథినికి ఆ మాటలు చెవికెక్కవు. సాధారణంగా ఆ పరిస్థితిలో ఉన్న ఎవరికీ నీతి వాక్యాలు నచ్చవు. అటువంటి పరిస్థితిలో తమని తాము నిగ్రహించుకున్నవారు గొప్ప వ్యక్తిత్వం కలవారిగా చరిత్రలో నిలిచిపోతారు. పరిస్థితికి తలొగ్గి మాయలో పడ్డవారు నష్టపోతారు. వరూథిని మనస్సుని మైకం కమ్మేసింది. ఆమె ప్రవరుడిని మాయలో పడేయడానికి రకరకాలుగా ప్రయత్నిస్తుంది.

ప్రవరుడు వరూథినిలో ఉండే సంస్కారాన్ని, మంచితనాన్ని తట్టిలేపే విధంగా 'మనిషికి విచక్షణాజ్ఞానం ఉండాలి కదా!' అంటాడు. ఇలా అనడం ద్వారా పాఠకుల్లో ఉండే యుక్తాయుక్త జ్ఞానాన్ని సైతం జాగృతం చేస్తాడు పెద్దన. ఇటువంటి సమయంలోనే మనిషికి విచక్షణాజ్ఞానం అవసరమని గుర్తుచేస్తాడు.

విచక్షణాజ్ఞానం అంటే ఏది మంచి? ఏది చెడు? నిర్ణయించుకునే శక్తి. అది మనిషికి మాత్రమే భగవంతుడు ఇచ్చిన గొప్ప వరం. ఆ శక్తిని ఎప్పుడూ వినియోగించుకోవలసి ఉన్నా మనిషి అప్పుడప్పుడూ వాడడం, మొత్తానికే వాడకపోవడం వల్ల జీవితంలో ఘోరమైన తప్పులు చేస్తూ ఉంటాడు. నిజానికి ఆ విచక్షణాజ్ఞానం మనం చేసే ప్రతి పనిని ప్రశ్నిస్తుంది. మనకి ఏది మంచో ఏది చెడో స్ఫురించేలా చేస్తుంది. కానీ చాలామంది దాని మాట వినరు. తప్పులు చేస్తారు, తర్వాత కష్టాలు వచ్చాక బాధపడతారు. ముందే దాని మాట వింటే జీవితం సుఖవంతమవుతుంది. ప్రతి మనిషికీ

విచక్షణాజ్ఞానం అవసరం అంటూ ఉంటారు చాలా మంది. ఆ జ్ఞానం సహజసిద్ధంగా ప్రతి మనిషికీ ఉండేదే. అయితే దాని మాట మనిషి వింటున్నాడా లేదా అనే దాని బట్టి అతడి ప్రవర్తన ఉంటుంది. ఆ ప్రవర్తన పైనే అతడి వ్యక్తిత్వం ఆధారపడి ఉంటుంది. ఆ వ్యక్తిత్వం పైనే అతడి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.

క. అంధునకుఁ గొఱయె వెన్నెల
గంధర్వాంగనల పొందు గాదని సంసా
రాంధువునఁ బడియె దకట ది
వాంధము వెలుఁగు గని గొంది నడఁగిన భంగిన్. (*మను. 2: 56*)

ప్రవరుడు తనని తిరస్కరించగా వరూథిని ఇలా పలికింది 'గుడ్డివాడికి వెన్నెల పనికిరానట్లే మా వల్ల సంభోగ సుఖమెరుగని నీకు నా మాటలు పనికిరానివి అయ్యెను. నీవు వెలుతురు చూడనొల్లక గుడ్లగూబ చీకటి కమ్ముకున్న ఇరుకుమూలలో దాగునట్లు గంధర్వస్త్రీలమయిన మా కూటమి యొల్లక సంసారమనెడి నూతిలో పడియుండ కోరుచున్నావే. అయ్యో! ఇది తగునా?' అని వరూథిని ప్రవరుడిని ప్రశ్నించింది.

వరూథిని అజ్ఞానానికి ఈ పద్యం పరాకాష్ఠ. అందాలను ఎదురుగా పెట్టుకుని చూడలేకపోవడం అంధత్వం అని ప్రవరుడిని హేళన చేసిన వరూథిని తన జీవితం అంధకారంలో ఉందని గుర్తించలేకపోతుంది. నిజానికి అంధకారంలో ఉన్నది వరూథినే. సంసారాన్ని అంధకూపంగా వరూథిని సంబోధించింది. అది వాస్తవం కాదు. మనస్సులో జ్వలిస్తున్న కోరిక ప్రభావం చేత వరూథిని కళ్ళు మూసుకుపోవడం ఆమెకు తెలియడం లేదు. పెద్దన ఈ పద్యంలో వరూథిని మానసిక స్థితిని వర్ణించాడు. అయితే, ఎవరు అంధకారంలో ఉన్నారో పాఠకుల ఊహాశక్తికే వదిలేశాడు పెద్దన. మాయలో పడిన వాళ్ళ అంధత్వాన్ని వాళ్ళే గుర్తించలేనంత అంధత్వంలోకి వెళ్ళిపోతారు. వారేదో సరైన మార్గంలో ఉన్నట్టు లోకమంతా అంధత్వంలో ఉన్నట్టు భావిస్తారు.

ప్రవరుడిని వరూథిని అంధకూపంలో ఉండిపోక వెలుగులోకి పయనించమని చెబుతుంది. వెలుగు అంటే చైతన్యం. నిజానికి ప్రవరుడి మార్గం చైతన్యవంతమైనది, వెలుగులను ప్రసరింపజేస్తున్నది. వరూథిని మార్గం వెలుగులను ఆర్పేసే మార్గం. అందుకే మన భారతీయ సంస్కృతి ప్రకారం పుట్టిన రోజున కొవ్వొత్తులను వెలిగిస్తారు. అలా వెలిగించడం ద్వారా తన బిడ్డ అందరికీ వెలుగునివ్వాలని, చైతన్యవంతులను చేయాలని ప్రతి తల్లి ప్రతికాత్మకంగా కోరుకుంటుంది.

దీపాలు ఆర్పడం పాశ్చాత్య సంస్కృతి. వెలుగులు వెదజల్లడం భారతీయ సంస్కృతి. ఆ సంస్కృతికే ఈ రోజు ప్రపంచం పాదాక్రాంతం అయ్యింది.

అందుకే పెద్దన పైపద్యం ద్వారా జీవితం వెలుగునివ్వాలని, అంధత్వంలో కూరుకుపోకూడదని సందేశమిస్తున్నాడు. ప్రవరుడి వ్యక్తిత్వాన్ని అంత గొప్పగా పెద్దన చిత్రించడం వల్లే ఆ పాత్ర ఇప్పటికీ వెలుగులను ప్రసరిస్తూ వ్యక్తులను చైతన్యవంతులను చేస్తోంది. వ్యక్తిత్వాలను వికసింపజేస్తోంది.

క. కుశలతయే వ్రతముల నగు
నశ నాయాపీడ నింద్రియ నిరోధమున్
గృశుడవయి యాత్మ నలచుట
సశరీర స్వర్గసుఖము సమకొని యుండన్. (*మను. 2: 58*)

'ఇప్పటి పుణ్యకర్మములకు ఫలముగా శరీరం విడిచిన తర్వాత లభించవు. స్వర్గసుఖం ఇప్పుడు ఈ శరీరంతోనే లభిస్తుండగా ఉపవాసాలు చేసి శరీరాన్ని కృశింపజేసుకుని జీవాత్మను హింస పెట్టడం దేనికి?' అని ప్రవరుడిని ప్రశ్నిస్తుంది వరూథిని. అందుకు సమాధానంగా ప్రవరుడు ఈ కింది విధంగా స్పందిస్తాడు.

తే. అనినఁ బ్రవరుండు నీవన్న యర్థ మెల్ల
నిజము కాముకుడైనవానికి నకాముఁ
డిది గణించునె జలజాక్షి యెఱిఁగితేని
నగరమార్గంబుఁ జూపి పుణ్యమునఁ బొమ్ము. (*మను. 2: 59*)

'నీవన్నది కాముకుడి విషయంలో నిజమే. కానీ అకాముకుడు, విషయవాంఛలందు ఆసక్తి లేనివాడు నీవు చెప్పే మాటలను కనీసం లెక్క చేయడు. కావున నీకు తెలిస్తే మా ఇంటికి వెళ్ళే దారి చెప్పి పుణ్యం కట్టుకో' అని ప్రవరుడు వరూథిని మాటలకు బదులిచ్చాడు.

విషయవాంఛలందు ఆసక్తి ఉన్నవాడికి ప్రపంచంలో ప్రతీది వాడి ఆలోచనలకు అనుకూలంగా ఉన్నట్టే అనిపిస్తుంది. మనుషులు యజ్ఞాలు, యాగాలు, వ్రతాలు చేయడానికి కొన్ని భౌతికమైన కారణాలున్నా, అంతిమంగా వాటి వెనుక ఒక ఆధ్యాత్మిక కోణం ఉండనే ఉంది. అది ఇహపరమైన దృష్టితో చూస్తే అర్థమయ్యేది కాదు. స్వర్గ సుఖాలు అనడంలో మన ప్రాచీన గ్రంథాల

ఉద్దేశ్యం శరీర సౌఖ్యాలు అని కాదు. ఆ సుఖం వీటన్నింటికంటే అతీతమైనది. చాలా తాత్త్వికమైనది. అయితే కోరికలతో కళ్ళు మూసుకుపోయిన వారికి ఇదంతా అర్థం కాదు. అసలు ఆధ్యాత్మికత గురించి మాట్లాడే హక్కు విషయవాంఛల్లో మునిగితేలుతున్న వారికి లేదు. అటువంటివారి వ్యక్తిత్వం సైతం వికసించదు. ప్రతి మనిషి చివరికి జ్ఞాన మార్గంలో మోక్షాన్ని చేరుకోవాలి. అదే మానవుడి అంతిమ లక్ష్యం కావాలి.

మోక్షం పొందే దిశగా ప్రయాణించే మనిషికి ఏ గుణం అత్యంత అవసరమో పెద్దన ఈ కింది పద్యంలో చెబుతున్నాడు.

క. బ్రాహ్మణుఁడింద్రియ వశగతి
జిహ్మాచరణైక నిపుణ చిత్తజ నిశితా
జిహ్మగముల పాలై చెడు
బ్రహ్మానందాధిరాజ్య పదవీచ్యుతుఁడై. (*మను. 2: 60*)

'బ్రాహ్మణుడికి ఇంద్రియనిగ్రహం చాలా అవసరం. అది లేని వాడు మోక్షాన్ని పొందలేడు అని ప్రవరుడు పలికాడు. ప్రవరుడు బ్రాహ్మణుడు కనుక పెద్దన అలా అన్నాడేమో కానీ, నిజానికి ప్రతి మనిషికి ఇంద్రియనిగ్రహం అత్యంత ఆవశ్యకమైనది. అది లేకపోవడం వల్లే ఈ రోజు సమాజంలో చాలా ఘోరాలు జరుగుతున్నాయి. పెళ్ళికి ముందే శారీరక సంబంధాలు పెట్టుకోవడం (Pre-marital sex), వివాహేతర సంబంధాలు(Extra marital Relationships), మానభంగాలు వంటి సమాజంలో జరిగే ఎన్నో అత్యాచారాలకు మనుషులు ఇంద్రియనిగ్రహాన్ని కోల్పోవడమే కారణం. నేటి సమాజం ఎంతగా దిగజారిపోయిందంటే ప్రతి రోజు వార్తాపత్రిక తిరగేస్తే అన్నీ ఘోరాతి ఘోరమైన వార్తలు. 'కన్న కూతురుపై అత్యాచారం చేసి హత్య చేసిన తండ్రి, చెల్లెలిపై అన్నయ్య అఘాయిత్యం' వంటి వార్తలు రోజూ దర్శనమిస్తున్నాయి. ఇంద్రియనిగ్రహం లేక ఏ బంధం ఎటువంటిదో తెలుసుకోలేని హీనమైన దశకి మనిషి మనస్సు చేరుకుంది. నీచాతి నీచమైన వ్యక్తిత్వం మనుషుల్లో ప్రబలుతోంది. ఇటువంటి సమయంలోనే సమాజానికి తిరిగి నైతికమైన విలువలు బోధించే కావ్యాలు పాఠాలుగా రావాలి.

ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు నైతికమైన విలువలను ఒంటబట్టిస్తే వారి జీవితాలను ఆ విలువలే బాధ్యతాయుతంగా తీర్చిదిద్దుతాయి. ప్రవరుడు ఇంద్రియనిగ్రహాన్ని కోల్పోలేదు కాబట్టే

అతడి వ్యక్తిత్వం నేటికీ చిరస్థాయిగా నిలిచిపోయింది. అటువంటి వ్యక్తిత్వాన్ని విద్యార్థులకు పరిచయం చేస్తే వారి వ్యక్తిత్వం నలుగురికీ వెలుగునిస్తుంది.

శా. ఎందే డెందము కందళించు రహిచే నేకాగ్రతన్ నిర్వృతిం
జెందున్ గుంభగతప్రదీపకళికా శ్రీ దోఁప నెందెందుఁ బో
కెందేనింద్రియముల్ సుఖంబుఁ గను నా యింపే పరబ్రహ్మ 'మా
నందో బ్రహ్మ' యటన్న ప్రాఁజదువునంతర్బుద్ధి నూహింపుమా. (*మను. 2: 62*)

'ఏ విషయమున మనస్సు వికాసము చెంది తన్మయమై నిర్వాణము చెందునో, ఇంద్రియములన్నియు ఏ విషయమున లయించి సుఖమందునో అట్టి విషయము వలని యానందమే బ్రహ్మానందము. 'ఆనందో బ్రహ్మ' యను వేదం వాక్యమునకు అర్థమును యోజింపుము' అంటూ వరూథిని ప్రవరుడితో పలికింది.

'ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్' అనే వేదవాక్యాన్ని స్పృశిస్తూ రాసినది ఈ పద్యం. వరూథినీప్రవరులు ఇరువురికీ వేదవిజ్ఞానం ఉండడం గమనార్హం. ప్రవరుడికి ఆ జ్ఞానం ఉండడంలో ఆశ్చర్యం లేదు. కానీ వరూథినికి ఇంత శాస్త్రజ్ఞానం ఉండడం చాలా గొప్ప విషయం. అయితే, దేవకన్యయై ఉండి కూడా వరూథిని ఇహపరమైన ఆలోచనల్లో మునిగిపోయింది. అందుకే ఆమె మాటలు కూడా ఐహిక స్పృహతో నిండి ఉన్నాయి.

వేదంలో పేర్కొన్న 'ఆనందం' శారీరకమైన, భౌతికమైన ఆనందం కాదు. అది అంతకంటే అతీతమైనది. పైగా ఆ ఆనందం ధర్మబద్ధంగా వచ్చినది. అధర్మమైన పనులు చేయడం వల్ల కలిగే ఆనందం ఎక్కువ కాలం నిలవదు. ఆ ఆనందం అశాశ్వతం. మనిషి క్షణికావేశంలో చేసే పనుల ఫలితాలు అలానే ఉంటాయి. ధర్మబద్ధంగా పనులు చేయడం వల్ల ఒక వేళ ముందు బాధ కలిగినా, ఆ బాధ అశాశ్వతం. అంతిమంగా ఆనందం తప్పక కలుగుతుంది.

వరూథిని అలా మాట్లాడడానికి గల కారణాలను ప్రవరుడు తర్వాత "ఈ పాండిత్యము నీకు దక్క..."లో (*మను. 2: 64*) అంచనా వేస్తాడు. కోరికలతో కళ్ళు మూసుకుపోయిన వారు వేదాంత గ్రంథాలకు చెప్పుకునే అర్థాలు ఇలాగే ఉంటాయి అని ప్రవరుడు వరూథినితో పలుకుతాడు.

మ. తరుణీ రేపును మాపు హవ్యముల చేతన్ దృప్తుఁడౌ వహ్ని స
త్కరుణాదృష్టి నొసంగు సౌఖ్యము లెఱుంగన్ శక్యమే నీకు నా
కరణుల్ దర్భలు నగ్నులున్ బ్రియములైనట్లన్యముల్ గా వొడ
ల్తిరమే చెప్పకు మిట్టి తుచ్ఛసుఖముల్ మీసాలపైఁ దేనియల్. (*మను. 2: 65*)

'ఉవిదా! ప్రాతస్సాయం సమయములందు హోమద్రవ్యములచే పరితృప్తి చెందు అగ్నిదేవుడు కలిగించు సౌఖ్యములు నీవేమి ఎరుగుదువు? నాకు అగ్నులు, దర్భలు మొదలైనవి ప్రియమైనట్లు ఇతరములనైనవి కావు. శరీరము నశించిపోవునది. నీవు చెప్పే నీచసౌఖ్యములు మీసాలపై తేనె వంటివి' అని ప్రవరుడు వరూథినికి హితవు పలుకుతాడు.

వరూథిని దృష్టి ఇహపరమైనది అయితే ప్రవరుడి దృష్టి ఆధ్యాత్మికమైనది. రెండూ పరస్పర విరుద్ధమైన మార్గాలు. అవి ఎప్పుడూ సంఘర్షించుకుంటూ ఉంటాయి. ఈ సంఘర్షణ ప్రతి వ్యక్తి జీవితంలో జరిగేదే.

మనిషి జీవితం ఇష్టానికి, ధర్మానికి మధ్య జరిగే సంఘర్షణ. మన నిత్య జీవితాల్లో ఏ సంఘటన చూసుకున్నా అలాగే కనపడుతుంది. ఆ సంఘర్షణనే పెద్దన *మనుచరిత్ర*లో వరూథినీ ప్రవరాఖ్యుల సంవాదంగా చిత్రించాడు. మనిషి జీవితంలో ప్రతి సంఘటనలో ఈ సంఘర్షణ ఎదురవుతుంది. మనస్సు ఇష్టం వైపు మొగ్గు చూపితే, బుద్ధి, అనుభవాలు, ధర్మపక్షం వహిస్తాయి. ఆ క్షణం మనం తీసుకునే నిర్ణయం మన జీవితం ఎలా ఉండాలో నిర్ణయిస్తుంది. ధర్మపక్షం వహిస్తే ఆలస్యమైనా గెలుపు, ఆనందం తప్పక దక్కుతాయి. 'ధర్మో రక్షతి రక్షితః' ధర్మమే మనల్ని రక్షిస్తుంది. ఇష్టానుసారం వ్యవహరిస్తే కలిగే ఆనందం క్షణికమే. తర్వాత కష్టాలు తప్పవు.

ప్రవరుడు ధర్మపక్షాన నిలిచాడు కాబట్టే అతడు విషయవాంఛల్ని తుచ్ఛంగా కొట్టిపారేశాడు. ఈ ఇహపరమైన సుఖాలు 'మీసాలపై తేనె' వంటివని తిరస్కరించగలిగాడు. అంటే ఈ భౌతికమైన సుఖాలు అల్పమైనవని, కొంతకాలమే ఆనందాన్ని ఇచ్చేవని అతడి అభిప్రాయం. అది అక్షరాలా నిజం. ఈ సుఖాలు అశాశ్వతం. ఆధ్యాత్మికమైన ఆనందం ముందు ఈ సుఖాలు చాలా చిన్నవి.

ఇన్ని మాటలు మాట్లాడిన ప్రవరుడు వివాహం చేసుకున్నవాడే. సంసార సుఖాలు అనుభవిస్తున్నవాడే. అయితే అది ధర్మబద్ధంగా అనుభవిస్తున్నది. భౌతికమైన సుఖాలు అశాశ్వతం అనడంలో అతని ఉద్దేశ్యం వాటిని అమాంతం త్యజించమని కాదు, అవి ఒట్టివే అని తెలుసుకోమని. ఒట్టివే అని గ్రహించాలి, కానీ బాధ్యతలను విస్మరించకూడదు. ఈ సుఖాలు అశాశ్వతం అని గ్రహిస్తే

గృహస్థ మార్గంలోనే మనిషి ఏదో ఒక రోజు వీటిని విడిచి అసలైన ఆనందం కోసం అన్వేషిస్తాడు. వైరాగ్యం అనుభవపూర్వకంగా రావాలే తప్ప బలవంతంగా తెచ్చిపెట్టుకునేది కాదు. ఒక వేళ అలా తెచ్చిపెట్టుకున్నా అది ఎక్కువ కాలం నిలవదు. అనుభవపూర్వక వైరాగ్యం ఎప్పటికీ నిలిచిపోతుంది.

ప్రవరుడి ఆలోచనలు, నడవడిక ఇంత గొప్పగా ఉండబట్టే అతడి వ్యక్తిత్వం గుబాళిస్తోంది. వ్యక్తిత్వం వికసించాలంటే మనిషి ఈ భౌతికమైన సుఖాలకి బానిస కాకూడదు. అంతిమంగా పొందే ఆనందం కోసం ప్రయత్నించాలి. వ్యక్తి శక్తిగా మారేది అప్పుడే.

ఉ. చేసితి జన్నముల్ తపము చేసితినంటి దయావిహీనతన్
జేసిన పుణ్యముల్ ఫలము సెందునె పుణ్యము లెన్ని యేనియున్
జేసిన వాని సద్గతియె చేకుఱు భూత దయార్ద్ర బుద్ధికో
భూసురవర్య యింత దలపోయవు నీ చదువేల చెప్పుమా? (*మను. 2: 72*)

'ఓ భూసురోత్తమా! యజ్ఞములు, తపములు చేసితిని అంటివి. దయాస్వభావం లేనప్పుడు ఎన్ని పుణ్యాలు చేసినా ఏమి లాభం? ఎన్నో పుణ్యాలు చేసినవాడు పొందే సద్గతులు కేవలం ఒక భూతదయగలవాడు పొందగలడు. ఈ మాత్రం తెలియనిదానికి నీ చదువు ఎందుకు?' అంటూ అదే సందర్భంలో వరూథిని ప్రవరుడిని ప్రశ్నించింది.

భూతదయ మనిషికి చాలా అవసరం. ఎన్ని పుణ్యాలు చేసినా భూతదయ లేకపోతే అది వ్యర్థమే. భూతదయ అంటే తోటిజీవుల పట్ల ప్రేమను కలిగి ఉండడం. అయితే వరూథిని తన పట్ల ప్రవరుడికి భూతదయ లేదనడం సరి కాదు. ఇక్కడ ప్రవరుడికి ఉండాల్సింది భూతదయ కాదు, మనోనిగ్రహం, తిరస్కార భావం.

సాధారణంగా ప్రతి వ్యక్తికీ భూతదయ చాలా అవసరం. తోటి జీవుల పట్ల సుహృద్భావం కలిగి ఉండడం ముఖ్యం. ఆ సందేశాన్ని మాత్రం ఈ పద్యం నుంచి గ్రహించాలి. భూతదయ ప్రతి మనిషికీ ఉంటేనే అతడికి తోటి జీవుల విలువ అర్థమవుతుంది. ప్రతి జీవికి బతికే హక్కు ఉందని మనిషి గ్రహిస్తాడు. తోటి జీవుల జీవనానికి సహకరిస్తాడు. ఒక జీవికి మరొక జీవి సహకరించుకుంటేనే అందరూ బావుండేది. నిజానికి ఎన్నో జీవుల తోడ్పాటు వల్లే ఈ భూమిపై మనిషి మనుగడ సాధ్యమవుతోంది. చెట్లతో మొదలుకొని ప్రతి జీవిని మనిషి హరిస్తూ ఉంటే మనుష్య జాతి కూడా ఏదో

ఒక రోజు అంతరించిపోతుంది. అన్ని జీవుల మధ్య ఒక కుటుంబ వాతావరణం ఉన్నంతకాలం ఈ భూమిలో సమతౌల్యం దెబ్బతినదు.

వరూథినీప్రవరుల సంవాదం ముగిశాక ప్రవరుడికి ఇంక ఏ మార్గమూ తోచక చివరికి “దివిషద్వర్గము నీ ముఖంబునన...” అంటూ అగ్నిదేవుడిని ప్రార్థిస్తాడు.

ఉ. దానజపాగ్ని హోత్ర పరతంత్రుఁడ నేని భవత్పదాంబుజ
ధ్యాన రతుండనేనిఁ బరదార ధనాదులఁ గోరనేని స
న్మానముతోడ నన్ను సదనంబున నిల్పు మినుండు పశ్చిమాం
భోనిధిలోనఁ గ్రుంకకయమున్న రయంబున హవ్యవాహనా. (*మను. 2: 76*)

‘ఓ అగ్నిదేవుడా! నేను దాన జపాగ్నిహోత్రుడనయితే, నీకు అధీనుడనే అయితే, నీ పాదపద్మముల యొక్క ధ్యానమందు ఆసక్తిగలవాడినే అయితే, ఇతరుల ధనాన్ని, పరస్త్రీలను కోరనివాడినే అయితే, సూర్యుడు పడమటి సముద్రంలో గ్రుంకక ముందే నన్ను ఇంటికి చేర్చు’ అని ప్రవరుడు అగ్నిదేవుడిని ప్రార్థిస్తాడు.

అగ్నిదేవుడు అతడి మొర ఆలకించి ప్రవరుడిని ఇంటికి చేరుస్తాడు. ఇక్కడ ‘పరదారధనాదుల కోరనేని’ అన్న మాట గమనించవలసింది. అంటే పరుల దానం పట్ల కానీ, పరస్త్రీల పట్ల కానీ ఆసక్తి లేనివాడని అర్థం. ప్రవరుడు అంత గొప్పవాడు కాబట్టే అగ్నిదేవుడు అతడిని రక్షిస్తాడు. మనం కూడా మన జీవితాల్లో పరుల సొమ్ము పట్ల, పరస్త్రీల పట్ల వ్యామోహం లేకుండా ధర్మబద్ధంగా జీవిస్తే మన మంచితనమే మనల్ని కాపాడుతుంది. ఏ ధర్మానికైతే మనం కట్టుబడ్డామో అదే ధర్మం మనల్ని తప్పక రక్షిస్తుంది. ఇటువంటి గొప్ప సందేశాన్ని పెద్దన ప్రవరుడి పాత్ర ద్వారా ప్రతికాత్మకంగా మనకి అందించాడు.

మన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ, ఇతరుల ధనం పట్ల, పరస్త్రీల పట్ల వ్యామోహ పడకుండా ధర్మపక్షాన నిలుస్తూ జీవితమనే యుద్ధంలో పోరాడడమే అసలైన వ్యక్తిత్వం. అలా పోరాడితే ఆలస్యమైనా గెలుపు తథ్యం. వ్యక్తిత్వం వికాసించాలంటే అటువంటి జీవితాన్ని గడపాలి. ప్రవరుడి జీవితం అటువంటి వ్యక్తిత్వ వికాసాన్నే మనకి బోధిస్తోంది. వ్యక్తిత్వ వికాసం చెందే దిశగా ప్రవరుడు బాటలు వేశాడు. ఆ దారిలో నడిచి ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపి ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని సొంతం చేసుకోవడమే మన వంతు.

## 4.6. వరూథిని విరహం

ప్రవరుడు వరూథినిని తిరస్కరించి వెళ్ళిపోయాక వరూథిని విరహతాపంతో రగిలిపోతుంది. వరూథిని విరహాన్ని పెద్దన తృతీయాశ్వాస ఆరంభంలో వర్ణిస్తాడు. ఆ వర్ణనలను బాగా గమనిస్తే వరూథిని పాత్రను చిత్రించిన విధానం కనిపిస్తుంది. వరూథిని పాత్ర ద్వారా అటువంటి పరిస్థితిలో ఉన్నవారి మనస్తత్వం ఎలా ఉంటుందో ప్రతి పద్యంలో పెద్దన చిత్రించడం కనిపిస్తుంది. పెద్దన చేసిన వర్ణనలు ఎక్కువగా భ్రాంతి కలిగించేవిగా కనిపిస్తాయి. "తరుణి నన్య కాంత..."(*మను. 3: 10*), "ఉరుదరీ కుహర..." (*మను. 3: 11*) వంటి పద్యాలు అందుకు ఉదాహరణ. విరహంతో రగిలిపోతున్న ఒక వ్యక్తి ఆలోచనలకు ప్రతిరూపంగా ఈ పద్యాలు కనిపిస్తాయి. అటువంటి పరిస్థితిలో మనిషి ఉన్నప్పుడు అతడి మనస్సు చుట్టూ కమ్ముకునే చీకట్లను ప్రతికాత్మకంగా చిత్రించేందుకే పెద్దన భ్రాంతి కలిగించే వర్ణనలు చేసి ఉంటాడు. వరూథిని ఆలోచనలను పెద్దన "తరుణి యిదె క్రుంకుచున్నాడు..."(*మను. 3: 13*), "క్రుంకె నపరాంబు..."(*మను.3: 14*) వంటి పద్యాల్లో చిత్రించడం కనిపిస్తుంది.

వరూథిని వంటి పాత్రలు మన జీవితంలో కూడా ఎదురవుతుంటాయి. మనలో చాలా మంది చాలా సమయాల్లో వరూథినిలా ప్రవర్తిస్తూ ఉంటాం. ఇటువంటి పద్యాలు అటువంటి పాత్రల స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడడమే కాకుండా క్లిష్ట పరిస్థితుల్లో మనిషి ఎలా మాయలో పడిపోతాడో వివరిస్తాయి. ఆదర్శవంతమైన వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడానికి ఇటువంటి పద్యాలు పరోక్షంగా దోహదపడతాయి.

మ. స్ఫుట సౌగంధికరాగరక్త రుచిమైఁ బూనెన్ జపాసన్నిధి
స్ఫటికంబ ట్లుదయాద్రి గైరికశిరస్థానస్థితన్ జంద్రుఁడ
చ్చొటువాయన్ శుచియయ్యెనౌఁ బ్రకృతి నచ్ఛుండైన సన్మార్గియై
న్నటికింగూటమి వంక వచ్చు వికృతిన్ మగ్నుండుగా నేర్చునే. (*మను. 3: 24*)

'చంద్రుడు ఉదయించుచో తూర్పు కొండ శిఖరమందలి ధాతు రాగం సోకడం వల్ల జపాకుసుమం దగ్గర ఉన్న స్ఫటికమువలె ఎర్రగా బొడకట్టెను. అవ్వల అటునుండి తొలగి పైకి రాగా స్వచ్ఛరూపుడయ్యెను. స్వభావముచే నిర్మలుడైనవాడు సహవాసదోషముచే ఒక వికారము తనకు వాటిల్లిననూ వెంటనే తప్పించుకొనును కానీ అందే మునిగి ఉండిపోడు కదా' అని పద్యానికి భావం.

సహవాసం గురించి, దాని ప్రభావం గురించి పెద్దన ఈ పద్యంలో చర్చించాడు. ఒక మంచివాడికి ఒక చెడ్డవాడితో సహవాసం ఏర్పడినా మంచివాడు ఎప్పటికీ తన మంచితనాన్ని కోల్పోడు, కోల్పోకూడదు అని పెద్దన చెబుతున్నాడు. ఒక వేళ తన ప్రవర్తనలో ఆ చెడు సహవాసం వల్ల స్వల్పమైన మార్పులు వచ్చినా మంచివాడు వెంటనే సర్దుకుంటాడు.

మహమ్మద్ ప్రవక్త గురించి ఇదే విషయమై ఒక సంఘటన ప్రచారంలో ఉంది. ఒక సారి ప్రవక్త తన చేతి మీదకి ఒక తేలుని ఎక్కించుకుంటాడు. అది అతణ్ణి కాటేస్తున్నా, రక్తం వస్తున్నా సరే ప్రవక్త దాన్ని ఏమీ అనడు. అప్పుడు పక్కనే ఉన్న ఒక వ్యక్తి ఎందుకలా చేస్తున్నారు? అని ప్రశ్నిస్తే, ప్రవక్త, 'విషాన్ని కక్కాలి అనే మనస్తత్వాన్ని అది విడనాడనప్పుడు ప్రేమించాలి అనే మనస్తత్వాన్ని నేను మాత్రం ఎందుకు విడిచిపెట్టాలి?' అని జవాబిస్తాడు. అదే విధంగా ఒకరి సహవాసం వల్ల మంచివాడు ఎప్పటికీ చెడిపోకూడదు. అది అతడి వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతుంది.

తే. కలయ జగమునఁ గలయట్టి నలుపు లెల్ల
దెలుపులుగఁ జేసి నీడలు దెలుపు సేయఁ
గా వశము గామిఁ బొడము దుఃఖమునఁ బోలె
సాంద్ర చంద్రిక తుహిన బాష్పములు గురిసె. (*మను. 3: 27*)

'వెన్నెల తాను జగమునందలి నల్లని పదార్థము లెల్ల తెల్లగా చేయగలదు. కానీ, నీడలను తెలుపు చేయడం సాధ్యం కాదు కదా. ఆ దుఃఖంతో మంచు అనే చినుకులను కురిసెను'. ఇది వర్ణన పద్యమే. లోతుగా పరిశీలిస్తే ఒక గొప్ప అర్థం ఈ పద్యంలో దాగి ఉంది. ఎంత గొప్ప వాడైనా కొన్నిసార్లు ఓటమి తప్పదు అనే విషయం ఈ పద్యం ద్వారా స్పష్టమవుతోంది. చంద్రుడంతటి వాడికే ఓటమి తప్పలేదు. 'అనువుగాని చోట అధికుల మనరాదు...' అంటూ వేమన కూడా అదే విషయాన్ని చెప్పాడు.

ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవాలంటే ప్రతి మనిషి ఈ విషయాన్ని తప్పక అర్థం చేసుకోవాలి. ఏ ఒక్కరూ కూడా ప్రతి చోట విజయాన్ని సాధించలేరు. 'ఎక్కడ నెగ్గాలో కాదు ఎక్కడ తగ్గాలో తెలిసిన వాడు గొప్పోడు' అంటూ ఒక తెలుగు చలనచిత్రంలో అదే విషయాన్ని ప్రస్తావించారు. ఓటమిని అంగీకరించగలిగినవారే విజయాన్ని సంపూర్ణంగా ఆస్వాదించగలుగుతారు. ఈ ప్రపంచం మొత్తం వెతికినా ఓటమి లేనివాడు ఎక్కడా కనిపించడు.

గెలుపోటములు జీవితంలో చాలా సహజం. వాటిని మనం ఎలా తీసుకుంటున్నాం అన్నదే ముఖ్యం. గెలుపుకి పొంగిపోకుండా, ఓటమికి క్రుంగిపోకుండా రెండిటినీ సమానంగా తీసుకోగలిగితే జీవితంలో ఎంత పెద్ద ఒడుదిడుకులకైనా ఎదురొడ్డి నిలవగలిగే వ్యక్తిత్వం మన సొంతమవుతుంది.

తే. పాలఁ బుట్టిన మాత్రాన మేలిగుణము
నేఁడు నీకేల గల్గునో నీరజారి
నీటఁ బుట్టినవాఁడు కాఁడోటు వహ్ని
గాల్చుచున్నాఁడు జగమెల్లఁ గరుణ లేక. (*మను. 3: 41*)

పాలలో పుట్టినంత మాత్రాన మేలి గుణాలు సిద్ధించవు. లోకాలను దహించివేసే అగ్ని నీటికి పుట్టింది. గొప్పవారికి పుట్టినంత మాత్రాన ఎవరూ గొప్పవారైపోరు. గొప్పతనం అనేది వారసత్వంగా సిద్ధించేది కాదు. అది ప్రతి వ్యక్తి ఉన్నతమైన జీవితాన్ని సాగిస్తూ సాధించుకోవాల్సింది. బిడ్డకి తల్లిదండ్రుల బుద్ధి రావడం సహజం. అయితే ఎవరి జీవితానుభవాలు వారివి. తల్లిదండ్రులు నడుచుకున్నట్టే బిడ్డ నడుచుకోవాలని ఏమీ లేదు. బిడ్డ అంత కంటే ఉన్నతుడూ కావచ్చు, అధముడూ కావచ్చు. ఎవరి జీవితం వారిది. దీనికి మన ఆధునిక సమాజంలో ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. తల్లిదండ్రుల పేరు చెడగొట్టిన బిడ్డలు ఎంతో మంది ఉన్నారు.

ఎవరి వ్యక్తిత్వ నిర్మాణం కోసం వారే కృషి చేయాలి. తల్లిదండ్రులు చక్కటి దిశానిర్దేశం ఎప్పుడూ చేస్తారు. పిల్లలపై తల్లిదండ్రుల ప్రభావం తప్పనిసరిగా ఉంటుంది. ఎక్కువ మంది పిల్లలు తల్లిదండ్రుల్లానే ఉండాలనుకుంటారు. అందుకే తల్లిదండ్రులు కూడా వారి నడవడిక చక్కగా ఉండేలా చూసుకోవాలి. అంతవరకు వారిదే బాధ్యత. అటుపైన తామెలా ఉండాలో నిర్ణయించుకోవాల్సింది పిల్లలే. వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చి దిద్దుకోవడానికి ఎవరికి వారే కృషి చేయాలి.

## 4.7. మాయాప్రవరుడి ఆగమనం

సమయం కోసం ఎదురు చూస్తున్న గంధర్వుడు, వరూధినీ ప్రవరాఖ్యుల సంవాదం గురించి తెలుసుకుని తాను వరూధినిని పొందడానికి ఇదే సరైన సమయమని భావించి మాయాప్రవరుడి వేషంలో ప్రవేశిస్తాడు.

ఉ. ఒక్కొక్క వేళఁ బద్మముఖుఁ లొల్లమి సేయుదురొక్క వేళఁ బె
నృక్కువనాదరింతురు క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్
బక్కున వేసఅన్ జన దుపాయములన్ దగునిచ్చకంబులన్
జిక్కఁగఁ జేసి డాసి సతిచిత్తముఁ బట్టి సుఖింపఁగాఁదగున్. (*మను. 3: 69*)

ఆడవాళ్ళ మనస్తత్వం గురించి పెద్దన ఈ పద్యంలో వివరించారు. 'ఆడవాళ్లు ఒక్కొక్కప్పుడు తిరస్కరిస్తారు, ఒక్కొక్కప్పుడు మిక్కిలి మక్కువ చూపిస్తారు. స్త్రీల చిత్తములు చపలమైనవి. కావున, విసుగు చెంది విడవరాదు. ఉపాయములు చేసి, అనువైన మాటలు పలికి స్వాధీన పరుచుకోవాలి. ఆడవాళ్ళ మనస్సు ఎరిగి మసలుకోవాలి'. ఇది ఈ రోజు చాలా జాగ్రత్తగా గమనించవలసిన విషయం. ఎంతో మంది ఈ చిన్న విషయాన్ని అర్థం చేసుకోలేక, సంసారసాగరాన్ని ఈదలేక చతికిలపడిపోతున్నారు.

నేటి సమాజంలో ఎక్కువ మంది విడాకులు తీసుకోవడానికి ఇదే ముఖ్యమైన కారణం. ఆడవాళ్ళ మనస్సులు చంచలమైనవి. వారిని అర్థం చేసుకోవడం చాలా కష్టం. స్త్రీ సాక్షాత్తు ప్రకృతి స్వరూపం. అందుకే స్త్రీలు సున్నితమైన మనస్తత్వం కలిగి ఉంటారు. వారి మనస్సుని అర్థం చేసుకుని మసలుకోగలిగితే అంతకంటే గొప్ప విషయం మరొకటి లేదు. ప్రవర్తనలో చిన్న మార్పు చేసుకుంటే సరిపోయేదానికి మాట మాట పెంచుకుని విడాకుల దాకా పరిస్థితిని నెడుతున్న జంటలు ఇవాళ చాలానే ఉన్నాయి. ఎప్పుడైనా బంధాన్ని తెంచుకోవడం కష్టం కాదు. ఎన్ని కష్టాలు, అడ్డంకులు వచ్చినా కలిసి ఉండడం గొప్ప. స్త్రీ మనస్సుని అర్థం చేసుకోలేక సంసారాల్ని చెడగొట్టుకుంటోంది నేటి తరం. దాని ప్రభావం వారి దైనందిన జీవితంపై, లక్ష్యాలపై పడి, భవిష్యత్తుని చేజేతులారా నాశనం చేసుకుంటున్నారు నేటి యువత. తద్వారా, ఉన్నతమైన వ్యక్తిత్వాలను నిర్మించుకోవడంలో విఫలమవుతున్నారు.

ప్రతి మగవాడి గెలుపు వెనుక ఒక స్త్రీ ఉంటుందని ప్రసిద్ధి. అటువంటి స్త్రీ మనస్సుని అర్థం చేసుకోలేకపోతే అదే స్త్రీ మగవాడి పతనానికి కూడా కారణం కాగలదు. స్త్రీ లేని ఈ సృష్టి లేదు. స్త్రీ మనస్సుని గెలుచుకోకుండా ఏ వ్యక్తి అయినా జీవితంలో ఉన్నతమైన శిఖరాలను అధిరోహించలేడు. చివరికి ఆధ్యాత్మిక మార్గంలో పయనించేవారికైనా వైవాహిక జీవితం తాలూకా అనుభవాలు అవసరం. 'ఎంతటి వారైనా కాంత దాసులే' అంటూ ప్రసిద్ధమైన త్యాగరాజు కృతి కూడా ఉంది.

సహచరిగానే కాకపోయినా ప్రతి మగవాడి జీవితంలో ఎవరో ఒక స్త్రీ కీలకమైన పాత్ర పోషిస్తుంది. అందుకే స్త్రీల మనస్సుని అర్థం చేసుకొని జీవితంలో ముందడుగు వేయమని పెద్దన హితవు పలుకాడు.

ఉ. ఓ సరసీరుహాక్షి వినవో రతిఁ గౌఁగిట నీవు చేర్చు నిం
పాసురభర్తకైనఁ గలదా వలదంచుఁ బెనంగ నేను స
న్యాసినె యొక్కటే తహతహన్ మనసొగ్గదు కేళిపై 'ననా
శ్వాసిత దుఃఖితే మనసి సర్వమసహ్య' మన న్నెఱుంగవే. (*మను. 3: 99*)

మాయాప్రవరుడిగా వచ్చిన గంధర్వుడు వరూథిని ముందు తాను ప్రవరుడినే అనిపించుకోవడానికి మాట్లాడుతున్న మాటలివి. ఒకే పద్యంలో మనకి అసలైన ప్రవరుడికి, మాయాప్రవరుడికి ఉన్న తేడా అర్థమవుతుంది. అలాగే, ఒక కోరిక మనస్సుని కమ్మేసినప్పుడు మనిషి ఎంతగా మాయలో చిక్కుకుంటాడో, అలా మాయలో పడ్డవారిని అవతలివారు ఎలా మోసం చేస్తారో ఈ పద్యం ద్వారా పెద్దన వివరించారు.

వరూథిని మనస్సులో కోరిక రగులుతోంది కనుక మయాప్రవరుడిని చూడగానే ఆమెకి ఎటువంటి సందేహమూ కలగలేదు. ఆమె అంతటి అంధకారంలో కూరుకుపోయింది. అందుకే వరూథిని మనస్సుని అంధకారం కమ్మేసిందని పెద్దన "వెలఁది యిచ్చటి సంపెంగవిరులు..."(*మను. 3: 76*), "కొమ్మ కన్నుగవకు..." (*మను. 3: 78*) వంటి పద్యాల్లో పరోక్షంగా స్ఫురించేలా వర్ణించాడు. అటువంటి అంధకారంలో కూరుకుపోయిన మనిషిని మోసం చేయడం చాలా తేలిక. మాయాప్రవరుడు అదే చేశాడు. అతడు ఏమి మాట్లాడినా వరూథిని నమ్మేసింది. చివరికి మోసపోయింది. ఆ విషయం ఆవిడకి తెలియకపోయినా ప్రపంచానికి తెలిసిపోయింది.

'మనస్సు ఊరట లేక చింతించుచుండగా సర్వమూ అసహ్యముగానే తోచును' అన్న మాటతో సర్వం మన మనస్సులోనే ఉందనే విషయం స్పష్టమవుతోంది. మనం సంతృప్తిగా ఉన్నాం అని మనం భావిస్తే మనం హాయిగా ఉంటాం. సంతృప్తి మనస్సులో లేకపోతే ఎప్పుడూ ఏదో వెలితిగానే ఉంటుంది. అదంతా మన భావన. మన మనస్సుని మనం నియంత్రించుకోగలిగితే ప్రపంచాన్నే జయించినంత సంతోషం కలుగుతుంది. వరూథిని మనస్సుని ఆమె నియంత్రించుకోలేకపోయింది. అందుకే మోసపోయింది. ఆ పాత్ర నుంచి గ్రహించవలసింది అదే. మనిషి ఎలా ఉండకూడదో వరూథిని పాత్ర మనకి బోధిస్తుంది. ఎదుటివారి మాయలో పడి మోసపోతున్న వారికి ఈ పాత్ర ఒక గొప్ప పాఠాన్ని నేర్పిస్తుంది. మోసం చేయడం కంటే మోసపోవడం ఇంకా పెద్ద తప్పు. వ్యక్తిత్వ

నిర్మాణంలో ఇది చాలా కీలకమైన విషయం. మనోనిగ్రహం, స్వీయనియంత్రణ లేకుండా ఏ మనిషీ గొప్పవాడు కాలేడు. అవి రెండూ ఉంటే ఏ మనిషీ మోసపోడు.

క. ఐనన్ గానిమ్ము భవ
దీనతకై వ్రతము విడిచితిన్ బరులకు మే
లైనన్ జాలు శరీరం
బైన నుపేక్షింపవలయు నది యట్లుండెన్. (*మను. 3: 100*)

మయాప్రవరుడు వరూథినిని తిరస్కరించినట్టు కాసేపు నటించి, తర్వాత నెమ్మదిగా మాట మారుస్తాడు. 'ఈ శరీరం మరొకరికి ఉపయోగపడితే చాలు' అని వరూథినిని అంగీకరిస్తాడు. ఏదో వరూథినిని ఆనందపెట్టడం కోసం తాను ఒప్పుకున్నట్టు నటిస్తాడు.

మయాప్రవరుడికి వరూథినిని పొందాలని కోరిక ఉంది కాబట్టి అలా అంగీకరించాడు. చాలా మంది ఒక పని చేయడం మనకి ఇష్టమైనప్పుడు అది అధర్మమైనా సరే ఆ పని చేయడానికి వెనకాడరు. అటువంటి తప్పులు చేసిన వారిని ఉదాహరణగా తీసుకుని తమ తప్పుని సమర్థించుకునే ప్రయత్నం చేస్తుంటారు. ఎంత పెద్ద తప్పు చేసినా తమని తాము మంచివారిగా పరిగణించుకోవడం చాలా మందికి అలవాటు.

ఆధునిక కాలంలో మంచికి, చెడుకి ప్రతి మనిషి దగ్గర రకరకాల నిర్వచనాలు ఉన్నాయి. ఒకరికి తప్పు అనిపించింది మరొకరికి అనిపించకపోవచ్చు. కానీ ప్రతి మనిషి తాను పెరిగిన వాతావరణం ఆధారంగా, తన అనుభవాల ఆధారంగా మంచికి, చెడుకి ఒక నిర్వచనం, ఒక పరిధిని గీసుకుంటాడు. తనకి ఒక తప్పు చేయడం ఇష్టమైనప్పుడు మనిషి తాను మంచితనానికి నిర్వచించుకున్న పరిధిని పెంచుకుంటూ ఉంటాడు, తనని తాను మంచివాడిగా పరిగణించుకుంటూ ఉంటాడు. అదొక అజ్ఞానం. ప్రతి మనిషి ఎప్పటికప్పుడు తన తప్పులను సమర్థించుకుంటూ, ఆ తప్పులు చేయడానికి గల కారణాలను వెతుకుతూ, అటువంటి తప్పులు చేసిన వారితో తనని పోల్చుకుంటూ మనస్సుని సమాధానపరుస్తూ ఉంటాడు. అలా తాను ప్రవర్తించడానికి కారణం పరిస్థితులే అంటూ మనిషి చేతులు ఎత్తేస్తాడు. ఎవరినైనా సమాధానపరచవచ్చు. కానీ మనస్సుని సమాధానపరచడం చాలా కష్టం. అందుకే మనిషి కారణాలను వెతుకుతూ మనస్సుకి సర్దిచెప్పుకుంటూ ఉంటాడు.

మనిషి జీవితంలో జరిగే ప్రతి సంఘటన ధర్మానికి, ఇష్టానికి మధ్య జరిగే సంఘర్షణ. గంధర్వుడు చేస్తున్న పని అధర్మమైనదే. కానీ అతడికి అది చేయడం ఇష్టం. అందుకే ఏదో వరూథినికి తానేదో గొప్ప ఉపకారం చేస్తున్నట్టు, తన కోసం ఏదో త్యాగం చేస్తున్నట్టు మాట్లాడుతున్నాడు. ప్రతి మనిషికీ సహజసిద్ధంగా ఉండే విచక్షణాజ్ఞానం ఎప్పటికప్పుడు మనిషికి ఏది తప్పో, ఏది ఒప్పో చెబుతూనే ఉంటుంది. దాని మాట విన్నవాడి వ్యక్తిత్వం తప్పక వికసిస్తుంది. దాన్ని సర్దిచెప్పే ప్రయత్నం చేస్తే కష్టాలు తప్పవు.

క. వడిఁ గాఁచి కాఁచి యుండన్
గడవలనీరినుము ద్రావు కైవడిఁ బె పైఁ
బొడమెడు కోర్కులచేఁ బె
ల్లుడికిన మది భోగముక్తి కూఱట గనునే. (*మను. 3: 133*)

ఇనుము కాచగా కాచగా వేడెక్కుతుంది. హృదయం కూడా కోరికలతో ఎప్పుడూ వేడెక్కుతూ ఉంటుంది. అందుకే రెండింటినీ పోల్చాడు పెద్దన. ఇనుము వేడెక్కిన కొద్దీ ఎక్కువ నీటిని పీల్చినట్టు, హృదయం కూడా భోగాలను కోరుకుంటూ ఉంటుంది. అంటే కోరికలనేవి తగ్గేవి కావని, పెంచుకున్న కొద్దీ పెరిగేవని అర్థం. కోరికలకి ఎప్పటికప్పుడు అడ్డుకట్ట వేయకపోతే అవి ఇంకా పెరుగుతూనే ఉంటాయి తప్ప తరగవు. ప్రతి మనిషి తనని తాను నిగ్రహించుకొని కోరికలను తగ్గించుకోవాలి, సంతృప్తిగా ఉండాలి. లేకపోతే కోరికలకి అడ్డు, ఆపు ఉండదు. మనస్సు ఎప్పుడూ ఇంకా ఏదో కావలి అంటూ ఉబలాటపడుతూ ఉంటుంది. మనిషికి చచ్చేదాకా కోరికలు చావవు. అదే త్యజించడం మొదలుపెడితే మనస్సు ప్రశాంతంగా ఉంటుంది, జీవితం సుఖంగా ఉంటుంది. ఉన్నతమైన వ్యక్తిత్వం కావాలంటే మనిషికి సంతృప్తి అవసరం. కోరికలకి కళ్ళెం వేయగలిగితేనే అది సాధ్యం అవుతుంది.

ఉ. ఎవ్వఁడు మీఁదెఱుంగక యథేచ్ఛ సుఖైకరతిన్ జరింపఁగా
నవ్వల వంశహాని వ్రతహాని యశోధనహాని పుట్టుఁదా
నవ్వెడఁ గమ్మనుష్య పశు వయ్య వివేకి చెడున్ జగంబునన్
నవ్వఁగ బాలు రౌరవమునం బడఁబాలును నిందపాలునై. (*మను. 3: 135*)

'ఎవడైతే భవిష్యత్తు గురించి ఆలోచించకుండా విషయాసక్తుడై ప్రవర్తిస్తాడో అటువంటి వివేకశూన్యుడి కులానికి, వంశానికి, ఆచారానికి, ధనానికి కీర్తికి హాని కలుగుతుంది. అందరిలోనూ అతడు నవ్వులపాలు అవ్వక తప్పదు' అంటూ పెద్దన హితవు పలుకుతున్నాడు. ఈ మాటలు మాయాప్రవరుడు తాను తప్పించుకోవడానికి చెప్పినా అవి ప్రత్యక్షర సత్యాలు.

కేవలం ఈ ఒక్క పద్యంలో చెప్పింది అర్థం చేసుకొని, ఆచరించినా చాలు మనిషి గొప్ప వ్యక్తిత్వాన్ని సంపాదించుకోగలుగుతాడు. విషయవాంఛల పట్ల మనిషికి ఉండాల్సిన వైఖరి గురించి ఈ పద్యం బోధిస్తోంది. మనిషి ఎప్పుడూ ఇహపరమైన విషయాల కోసం తపన పడకుండా ధర్మబద్ధంగా సంపాదించిన ధనంతో అవసరమైన కోరికలను నేరవేర్చుకొని, మోక్షం కోసం ప్రయత్నించాలి. చతుర్విధ పురుషార్థాలు మనకి ఆ విషయాన్నే బోధిస్తాయి. పూర్తిగా విషయవాంఛల్లో మునిగి తేలే మాయాప్రవరుడు ఈ పలుకులు పలకడం ఆశ్చర్యంగా అనిపిస్తుంది. అంటే గొప్పగా మాట్లాడడం ముఖ్యం కాదు, ఆచరణ ముఖ్యం అనే విషయం మరోసారి స్పష్టమవుతోంది. వ్యక్తిత్వ వికాసానికి ఇవి ప్రాథమిక సూత్రాలు. వ్యక్తిత్వ వికాసం అనేది ఒక్కసారిగా, ఒక్కరోజులో సిద్ధించేది కాదు. అదొక నిర్విరామమైన ప్రక్రియ.

తే. అని వరూథిని నూరార్చి యచటు వాసి
పోయెఁ దనయిచ్చ గంధర్వపుంగవుండు
తప్పరాదు ఋణానుబంధంబు దెగినఁ
బ్రాణపదమైన వలపును బాసి చనదె. (*మను. 3: 140*)

ఋణానుబంధం తీరిపోతే ఎటువంటి మోహమైనా తీరిపోవాల్సిందేనని పెద్దన ఈ పద్యం ద్వారా హితబోధ చేస్తున్నాడు. దీన్ని బట్టి బంధాలు అశాశ్వతం అనే విషయం మరొకసారి స్పష్టమవుతోంది. వాటి కోసం పాకులాడడం అవివేకమని అర్థమవుతోంది. 'నేను, నా వాళ్ళు' అంటూ మనిషి తన చుట్టూ ఎన్నో గోడలు నిర్మించుకుంటూ ఉంటాడు. దీనికంతటికీ మూలం మనిషిలో ఉండే స్వార్థం. దాన్ని విడవగలిగితే, ఈ జీవితయుద్ధంలో గెలవడం చాలా తేలిక. వ్యక్తిత్వం వికసించాలంటే నేను, నాది అనే స్వార్థభావనను మనిషి విడనాడాలి. అప్పుడే వ్యక్తిగా మనిషి ఎదుగుతాడు. నిజానికి మనిషికి దేహంతో ఉండేది కూడా ఋణానుబంధమే. ఆ శరీరాన్ని విడిచేటప్పుడు, ఎంతటి బంధమైనా తెగిపోవాల్సిందే.

ఆంధ్రమహాభారతంలో యక్షుడు ధర్మరాజుని ప్రశ్నించే ఘట్టంలో యక్షుడు 'ఈ ప్రపంచంలో అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటి?' అని అడిగినప్పుడు 'రోజూ మన కళ్ళ ముందే కొన్ని వందల మంది చనిపోతున్నా, బంధాలు అశాశ్వతం అని తెలిసినా, తాను మాత్రం చావను అనుకొని డబ్బుని కూడబెడుతుంటాడు. ఇంతకంటే ఆశ్చర్యకరమైన విషయం మరొకటి ఉందా?' అంటూ ధర్మరాజు చెప్పిన సమాధానం సైతం ఇదే విషయాన్ని ధ్రువీకరిస్తుంది.

## 4.8. స్వరోచి వేట, మనోరమని రక్షించడం

స్వరోచి మహారాజు కొంతమంది కిరాతులని వెంటతీసుకుని వేటకి బయలుదేరతాడు. వేటాడి వేటాడి అలిసిపోయాక ఒక చోట విశ్రాంతి తీసుకుంటుండగా వారికి ఒక ఆర్తనాదం వినిపిస్తుంది. ఒక యువతిని ఒక రాక్షసుడు వెంబడిస్తుంటాడు. అతడి బారి నుంచి కాపాడమని స్వరోచిని ఆమె వేడుకుంటుంది. ఆమె పేరే మనోరమ.

క. ఏయెడ ననదల మొఱ వా
లాయము వినవలయు 'దుర్బలస్య బలం రా
జా' యన వినవే ధరణీ
నాయకులను నార్త రక్షణంబులె క్రతువుల్. (*మను. 4: 74*)

ఇందీవరాక్షుడు రాక్షసుడి రూపంలో మనోరమను వెంటాడుతున్నప్పుడు అక్కడికి వేటకి వచ్చిన స్వరోచిని మనోరమ ఇలా వేడుకొంది. 'ఏ దిక్కూ లేనివారికి రాజే దిక్కు. దీన సంరక్షణ యజ్ఞనిర్వహణ వంటిది. నేను దిక్కు లేని దీనురాలను. ఈ రాక్షసుడి బారి నుంచి నన్ను రక్షించు'.

ఆధునిక కాలంలో స్త్రీకి ఎదురవుతున్న సమస్యే ఇది. మనోరమని రాక్షసుడు వెంబడించినట్టు, స్త్రీలపై పురుషులు ఎన్నో అత్యాచారాలకు పాల్పడుతున్నారు. 'కూతురుపై అత్యాచారానికి పాల్పడ్డ తండ్రి' అనే వార్తను విని సైతం ప్రతిఘటించని నీచమైన స్థాయికి వ్యవస్థ దిగజారిపోయింది. స్త్రీకి రక్షణ కల్పించుకోలేని, స్త్రీని గౌరవించలేని ఒక హీనమైన వ్యవస్థలో నేడు మనం జీవిస్తున్నాం. ప్రతి ఒక్కరికీ సోదరి రూపంలోనో, తల్లి రూపంలోనో, సహచరి రూపంలోనో ఆడది ప్రేమని పంచుతూనే ఉంది. అయినా ఆడవాళ్ళపై అత్యాచారాలు ఆగడం లేదు.

ఒక స్త్రీ ఒంటరిగా కనిపిస్తే మనిషి ఎంత బాధ్యతగా వ్యవహరించాలో పెద్దన ఈ పద్యం ద్వారా చెబుతున్నాడు. దీనులను ఆదుకోవడం రాజుల బాధ్యత అని చెప్పినప్పటికీ అది ప్రతి పౌరుడి బాధ్యత.

రాజుకి అయితే అది యజ్ఞనిర్వహణ కన్నా ముఖ్యమైనది. స్త్రీని గౌరవించుకోలేకపోతే ఏ జాతికైనా అభివృద్ధి అసాధ్యం. 'I measure the progress of a community by the degree of progress which women have achieved' (*www.brainyquote.com*) అంటూ బాబాసాహెబ్ డా. బి. ఆర్. అంబేద్కర్ సైతం అదే విషయాన్ని ఉద్ఘాటించారు. స్త్రీ ఒంటరిగా ఉంటే ఆమెను రక్షించడం మన బాధ్యత, అంతే కానీ అది ఒక అవకాశంగా భావించి ఆమెపై అత్యాచారానికి పాల్పడకూడదు అని పెద్దన స్వరోచి పాత్ర ద్వారా జాతికి నీతిని బోధిస్తున్నాడు. అదే విషయాన్ని స్త్రీలపై జరిగే అత్యాచారాలను ఖండిస్తూ ఉద్యమిస్తున్న వారు నేడు 'If a woman is alone, it's not an opportunity; it's a reponsibility' అనే నినాదంగా తీసుకున్నారు. తల్లిగా, చెల్లిగా, భార్యగా మనకి జీవితాన్నిస్తున్న స్త్రీని గౌరవించుకోవడం అందరి బాధ్యత.

## 4.9. మనోరమ, కళావతి, విభావసుల వృత్తాంతం

మనోరమ స్వరోచికి తన కథను వివరిస్తుంది. ఒక తప్పు చేయడం వల్ల జీవితం ఎంతగా తలకిందులు అయిపోతుందో మనోరమ, కళావతి, విభావాసి పాత్రల ద్వారా తెలుసుకోవచ్చు.

ఉ. ఓసి దురాత్మురాల గృహమొల్లక సర్వసుఖంబులన్ నిరా
యాసమున్ దొఱంగి మిహిరాంశు మరుచ్ఛద నీరనీరస
గ్రాసము దేహధారకముగా గుహలన్ దపమాచరించుమ
మీమ్మ సరణిన్ స్పృశించి నగ నేమి ఫలం బొనఁగూడెఁ జెప్పుమా. (*మను. 4: 82*)

మనోరమ, కళావతి, విభావసి తపస్సు చేసుకుంటున్న ఒక మునికి తపోభంగం కలిగించినప్పుడు ఆ ముని ఆగ్రహించి ఇలా పలుకుతాడు. 'సంసార సుఖాలను త్యజించి వాయువునే ఆహారంగా స్వీకరించే మావంటి మునులకు తపోభంగం చేయడంలో నీకు కలిగే ఆనందం ఏమిటి?' అని ప్రశ్నించి "తిమిరంపు వయసు గుబ్బల…"(*మను. 4: 83*) అంటూ నీ వయస్సులో ఉన్నవారిని చూసుకో అని హితవు పలుకుతాడు. తపోభంగం గావించి తనకి తీవ్రమైన ఆగ్రహాన్ని తెప్పించిన మనోరమను "ముసురుకొను జరభరంబున…"(*మను. 4: 84*) ఒక రాక్షసుడి చేత వెంబడించబడతావు అని శపిస్తాడు. ఆ రాక్షసుడు తన తండ్రేనని తర్వాత కథలో తెలుస్తుంది. ఇంతకంటే దుర్భరమైన పరిస్థితి ఏ బిడ్డకైనా వస్తుందా?

మనోరమను చేసిన తప్పుకి నిందించాల్సింది పోయి తనను సమర్థించిన కళావతి, విభావాసి ఇద్దరినీ వ్యాధిగ్రస్థులు కమ్మని ముని శపిస్తాడు. తప్పు చేయడమే కాదు, ఆ తప్పుని ఖండించకుండా సమర్థిస్తే జీవితంలో ఎంతో నష్టపోతామని ఈ మూడు పాత్రల ద్వారా పెద్దన బోధిస్తున్నాడు. వ్యక్తిత్వ వికాసం అంటే ఆషామాషీ కాదు. జీవితాంతం ఉన్నతంగా, ధర్మబద్ధంగా జీవించగలగాలి. ఒక్క సారి వ్యక్తిత్వాన్ని కోల్పోతే ఇంక చేయగలిగింది ఏమీ లేదు. ఒక్క తప్పే కదా అని చేస్తూ పోతే కష్టాలు ఎదుర్కోక తప్పదు. తప్పు చిన్నదైనా. పెద్దదైనా తప్పు తప్పే.

ఆ. నీడఁ గడవఁ బాఱ నేలకు వెలిగాఁగ
నడుగు వెట్టి తిరుగ నాత్మ మొఱఁగి
యొకటిఁ దలఁప నరుల కొదవిన నొదవ దే
కరణి మృత్యుదేవిఁ గన్నుఁ బ్రామ. (*మను. 4: 106*)

క. చావుఁ దలపోసి మానవుఁ
డేవగ దుష్కీర్తి వొరయకే దినముల పొం
దై వెడలునట్లు నడవఁగ
దైవం బటమీఁద మేలు తాన ఘటించున్. (*మను. 4: 107*)

'మనిషి తన నీడను తాను తొలగించుకోగలడేమో, నేలని అంటకుండా నడవగలడేమో, మనస్సుకి ఆలోచన లేకుండా చేయగలడేమో కానీ, మృత్యువు నుంచి మాత్రం తప్పించుకోలేడు. మనిషికి ఈ విషయాన్ని గుర్తెరిగి అపకీర్తి రాకుండా చక్కగా ధర్మబద్ధంగా జీవిస్తే దేవుడు తానే స్వయంగా వారి బాగోగులు చూసుకుంటాడు' అనే గొప్ప సందేశాన్ని పై పద్యాల ద్వారా పెద్దన మనకి అందజేశాడు.

మనోరమను రక్షంచే సమయంలో తనకు సహాయంగా వచ్చిన కిరాతులందరూ భయపడి వెనకడుగు వేసిన సందర్భంలో స్వరోచి పలికిన మాటలివి. నిజమైన నాయకుడంటే అలాగే ఉండాలి. ధర్మం కోసం ఎంతకైనా తెగించగలగాలి. బతుకు తీపితో, స్వార్థంతో జీవించే మనుషులు తాము ఎప్పటికైనా మరణించక తప్పదనే విషయాని గ్రహించాలి. మరణాన్నే లెక్కజేస్తే దేశం కోసం కొన్ని వేల మంది సైనికులు ప్రాణత్యాగం చేస్తారా?

ప్రతి మనిషి ఏదో ఒక గొప్ప పని నిమిత్తమై ప్రాణం పోసుకుంటాడు. గొప్పగా బతకడం అంటే తనకోసం, తన కుటుంబం కోసం బతకడం కాదు. నలుగురి కోసం బతకడం, నలుగురూ మనల్ని చూసి గర్వించేలా బతకడం. అర్జునుడు ఆనాడు రణరంగంలో యుద్ధం చేసి ఉండకపోతే దుర్మార్గులైన కౌరవులు రాజ్యమేలేవారు. అందుకే కృష్ణుడు అర్జునుడికి కర్తవ్యబోధ చేస్తాడు. జీవితమనేదే ఒక యుద్ధం. పోరాడాలే తప్ప పాదాక్రాంతం అవ్వకూడదు. పరుల మంచి కోసం వీరోచితంగా పోరాడి ప్రాణత్యాగం చేయాలే తప్ప భయపడి ఆత్మహత్యలకు పాల్పడకూడదు. అది భారతీయతకే వ్యతిరేకం. మన సంస్కృతి, మన సాహిత్యం మనకి ఆ ధైర్యాన్ని ఎప్పుడో ఇచ్చింది, ఎల్లప్పుడూ ఇస్తుంది. వ్యక్తిగా బతకడం గొప్ప కాదు. ప్రతి వ్యక్తి తానొక శక్తిగా మారాలి. అదే అసలు సిసలైన వ్యక్తిత్వ వికాసం.

సీ. బుద్ధీంద్రియక్షోభములకుఁ బెట్టనికోట / విపదంబు రాశి దుర్వికృతి కోడ
ఖల దురాలాపమార్గణ వజ్రకవచంబు / రణమహీస్థలికి శ్రీరామరక్ష
శాత్రవ దుర్గర్వ సంస్తంభ నౌషధి / మొనయు చింతాశ్రేణి మూఁకవిప్పు
యోగాదిసంసిద్ధు లొనఁగూర్చు పెన్నిధి / తూలు నేకాకుల తోడు నీడ
తే. సకల గుణ ప్రధానంబు సకల కార్య
జాల సాఫల్య కరనైక సాధనంబు
ధైర్యగుణమట్టి ధైర్యంబు దక్కి పోరఁ
దత్తఱింతురె యకట మీతరమువారు. (*మను. 4: 108*)

స్వరోచి మనోరమను కాపాడే సందర్భంలోనే భయంతో వెనకడుగు వేసిన కిరాతులకు ధైర్యం చెబుతూ పలికిన మాటలివి.

'ధైర్యగుణం బుద్ధిని, ఇంద్రియాలను నిశ్చయపరుస్తుంది. ఆపదలను తొలగిస్తుంది. దుష్టజనులు నిందించినా వికృతిని దరిచేరనీయదు. యుద్ధభూమిలో రక్షిస్తుంది. విరోధియహంకారాన్ని తగ్గిస్తుంది. దుఃఖాన్ని దరిచేరనీయదు. కోరికలను తీరుస్తుంది. తోడులేని వాడికి సహాయం చేస్తుంది. ఏ పని చేయడానికైనా ముఖ్యమైన ఆయుధం ధైర్యమే. గుణాలన్నింటిలో ధైర్యగుణమే గొప్పది, మనిషికి అత్యంత ఆవశ్యకమైంది'.

కేవలం ధైర్యగుణంతోనే మనిషికి ఇన్ని లాభాలున్నాయి. వ్యక్తిత్వం వికసించాలంటే పైన చెప్పినవన్నీ మనిషికి అవసరం. ధైర్యగుణాన్ని అలవర్చుకుంటే ప్రతి పనిలో మనిషి విజయం

సాధించగలుగుతాడు. నిజానికి ప్రతి మనిషికీ ధైర్యగుణం ఉంటుంది. అది తెచ్చిపెట్టుకునేది కాదు. కాకపోతే అది ఎక్కువశాతం మందిలో నిద్రాణమై ఉంటుంది. దాన్ని జాగృతం చేయడమే మన పని. సకలకార్యాలను అదే సిద్ధింపజేస్తుంది.

## 4.10. ఇందీవరాక్షుడు, బ్రహ్మమిత్రుల వృత్తాంతం

ఇందీవరాక్షుడు బ్రహ్మమిత్రుడి వద్దకు వచ్చి ఆయుర్వేద విద్యను నేర్పించమని ప్రార్థిస్తాడు.

తే. మౌనివరుఁ జేరి భక్తి నమస్కరించి
చెప్పవే నాకు నీవిద్య శిష్యకోటి
తోడఁ గూడంగ నేఁ గృతార్థుండ నగుదు
ననుచుఁ బ్రార్థింప ననుఁ జూచి యపహసించి. (*మను. 5: 8*)

ఇందీవరాక్షుడు భక్తిశ్రద్ధలతో బ్రహ్మమిత్రుడి వద్దకు ఆయుర్వేద విద్యను అభ్యసించడానికి వస్తాడు. కానీ బ్రహ్మమిత్రుడు అతడిని అపహసిస్తాడు. “నటవిట గాయకగణికా...”(*మను. 5: 9*) అనే పద్యంలో నీ చెవులకి ఈ ఆయుర్వేదం రుచించదు. నీకు ఆయుర్వేదం చెప్పకపోతే నాకేమి నష్టం వాటిల్లదు అని పలికి బ్రహ్మమిత్రుడు ఇందీవరాక్షుడిని తిరస్కరిస్తాడు.

కాలాలు వేరైనా, సంస్కృతి రూపు మారూతూ ఉన్నా, అడిగిన వారికి విద్య నేర్పించడం మనిషి ప్రాథమిక బాధ్యత. జ్ఞానం ఉన్నది పంచుకోవడానికే. ఏ కారణం ఉన్నా సరే విద్యని అర్థించిన వారికి నేర్పించాల్సిందే. ఈ రకంగా చూస్తే బ్రహ్మమిత్రుడు చేసింది చాలా పెద్ద తప్పు. ఆధునిక కాలంలో కూడా. కులం పేరు చెప్పి, మతం పేరు చెప్పి కొంతమంది ఉపాధ్యాయులు పక్షపాతధోరణితో వ్యవహరిస్తున్నారు. గురువుకి అందరి పట్ల సమభావన ఉండాలి. లేకపోతే, విద్యార్థులు గురువును అనుసరిస్తారు కాబట్టి ఈ అవలక్షణాలను వారు కూడా అలవర్చుకునే ప్రమాదం లేకపోలేదు.

ఇందీవరాక్షుడు ఎంత వినయంగా ప్రార్థించినా బ్రహ్మమిత్రుడు కనికరించడు. ఇందీవరాక్షుడు బాధ పడి ఇలా పలుకుతాడు.

తే. నీవు చదివింతు వనుచు నన్నియును విడిచి
బిచ్చ మెత్తంగ రాదుగా బేలతపసి
కడవ నాడకు చాలు నీగొడవ యేల
వెజ్జదనమేలయని మది లజ్జ వొడమి. (*మను. 5: 13*)

'జ్ఞానహీనుడవగు ఓ ముని! నీవద్ద చదువుకోవడానికి వచ్చిన విద్యార్థి సర్వం పోగొట్టుకొని బిచ్చమెత్తుకోకూడదు కదా. మంచి చెడ్డ ఎరిగి మాట్లాడు. ఇంత చదువుకున్నావు. ఏం లాభం? నీ చదువు, నీ వైద్యం వృథా' అని ఇందీవరాక్షుడు మునికి హితవు పలికే ప్రయత్నం చేస్తాడు. ముని ఎంతకీ వినకపోయేసరికి రహస్యంగా విద్యను అభ్యసిస్తాడు. విషయం తెలుసుకున్న ముని ఇందీవరాక్షుడిని శపిస్తాడు. దాని ఫలితంగానే మనోరమను ఇందీవరాక్షుడు వెంబడిస్తాడు.

ఇందీవరాక్షుడు చేసింది తప్పే కావచ్చు. కానీ ఆ పరిస్థితిలోకి అతడిని నెట్టింది బ్రహ్మమిత్రుడే. ఈ కథ ద్వారా గురుశిష్యుల సంబంధాలు ఎలా ఉండాలో పెద్దన వివరిస్తున్నాడు. విద్యార్థుల ప్రవర్తనపై గురువుల ప్రభావం ఎంతగా ఉంటుందో ఈ కథను బట్టి అర్థం చేసుకోవచ్చు. అందుకే విద్యార్థుల నడవడిక బాగుండాలంటే గురువు సరిగ్గా నడుచుకోవాలి. గురువు వ్యక్తిగా ఉన్నతుడైతేనే విద్యార్థుల వ్యక్తిత్వం వికసిస్తుంది.

## 4. 11. కళావతి, విభావసులకి వ్యాధి నుంచి విముక్తి

స్వరోచికి, మనోరమకి వివాహం జరిగాక తొలిరాత్రి రోజు మనోరం అన్యమనస్కంగా ఉండడం చూసి స్వరోచి కారణం అడుగుతాడు. తన చెలికత్తెలైన కళావతి, విభావసి వ్యాధిగ్రస్థులై బాధపడుతుండగా తానెలా సంతోషంగా ఉండగలనని మనోరమ స్వరోచి వద్ద వాపోతుంది.

ఉ. అక్కట నాయెడన్ మిగుల నక్కఱ గల్గి చరించు నెచ్చెలుల్
చిక్కి మునీంద్ర శాపహతి జెందిన దుర్దమ రోగ బాధలన్
బొక్కుచునున్న వారు వనభూముల దద్దశ మాన్పవేని నా
కెక్కడి సౌఖ్యమన్నఁ దరళేక్షణఁ జూచి స్వరోచి యిట్లనున్. (*మను. 6: 10*)

తన సుఖం తాను చూసుకోకుండా మనోరమ తమ తొలిరాత్రి రోజున తన చెలికత్తెల గురించి బాధపడడం ఆశ్చర్యాన్ని కలిగించకమానదు. స్వార్థాన్ని విడనాడి పరుల క్షేమం గురించి ఆలోచించడం అంటే ఇదే. అసలు సిసలైన వ్యక్తిత్వ వికాసం అంటే ఇదే. మనోరమ స్వరోచికి జరిగిన కథ చెప్పి కళావతి, విభావసి ఇద్దరినీ వ్యాధి బారి నుంచి రక్షింపజేస్తుంది. ఇటువంటి వ్యక్తిత్వం నేటితరానికి ఆదర్శంగా నిలుస్తుంది. మనోరమ మాట విని కళావతి, విభావసి ఇద్దరినీ స్వరోచి

రక్షించడం కూడా చాలా గొప్ప విషయం. ఇద్దరిలోనూ లాభాపేక్ష లేదు. ఇద్దరిలోనూ వ్యక్తిత్వ వికాసం మూర్తీభవించింది.

## 4.12. కళావతి వృత్తాంతం

కళావతి తన కథను స్వరోచికి వివరిస్తుంది. ఒక గంధర్వుడు కళావతిపై మనసు పడతాడు. ఆ విషయమై తన తండ్రిని అడగడానికి వాళ్ళ ఇంటికి వస్తాడు. కానీ కులం పేరు చెప్పి కళావతి తండ్రి అతడిని తిరస్కరిస్తాడు.

క. మీతరమువార లేతటి
నేతరితనమునఁ దపస్విగృహకన్యకలన్
వీతభయ వృత్తి వేడిరొ
కో తముఁ దర్కింప కౌర క్రొవ్వులటంచున్. (*మను. 6: 46*)

'ఇంతకుముందెన్నడూ మీవంటి నీచజాతి వారు మావంటి సద్బ్రాహ్మణుల ఇంటికి పిల్లని ఇవ్వమని అడగడానికి రాలేదు. ఇప్పుడు మీరు అడుగుతుంటే మీకంటే దుర్మార్గులు లేరనిపిస్తోంది' అని కళావతి తండ్రి పలుకుతాడు.

మరేదైనా కారణం చేత అతడు వచ్చిన సంబంధాన్ని తిరస్కరించినా ఫర్వాలేదు కానీ, కులం పేరు చెప్పి తక్కువ చేయడం సరి కాదు. మనిషి తాను పోయేటప్పుడు కులం వెంట రాదు. చివరికి అందరూ మనుషులే. అంతా ఒక కుటుంబానికి చెందిన వారే. ఎవ్వరూ ఎక్కువ కాదు. అమ్మాయి, అబ్బాయి పరస్పరం ఇష్టపడితే మంచి చెడ్డలు సూచించి పెళ్ళి చేయాలి. సంబంధం మంచిదో కాదో చూడడం తప్పు కాదు. కానీ కులాన్ని బట్టి గుణాన్ని అంచనా వేయడం తప్పు.

కులం పేరు మీద ద్వేషం పెంచుకోవడం ఎంత అవివేకమో గంధర్వుడు "నీ వైశిష్ట్యముతిట్టులన్..." (*మను. 6: 49*) అనే పద్యంలో వివరిస్తాడు. వ్యక్తులు ఎదిగే కొద్దీ మనుషుల మధ్య ఉన్న అంతరాలు తగ్గిపోవాలి. విభేదం అనేది మొదలైతే చివరికి సొంత మనుషులు కూడా మనకి నచ్చరు. స్వార్థమే ఈ భావనకి మూలం. ద్వేషించడం అంటూ మొదలుపెడితే మనిషి తనని తప్ప అందరినీ ద్వేషించగలడు. ప్రేమించడం మొదలుపెడితే సువిశాల విశ్వాన్ని అక్కున చేర్చుకోగలడు. వ్యక్తిగా ఎదగడం అంటే నలుగురినీ కలుపుకుంటూ పోవడమే.

కళావతిని తనకిచ్చి వివాహం చేయలేదనే కోపంతో గంధర్వుడు కళావతి తండ్రిని చంపేస్తాడు. ప్రేమించడం తప్పు కాదు. అయితే తల్లిదండ్రులను ఒప్పించి వివాహం చేసుకోవాలి. అంతే కానీ, మనల్ని కని, పెంచి, పోషించిన తల్లిదండ్రులను ఎదిరించడం తప్పు. ఎక్కువశాతం మంది తల్లిదండ్రులు పిల్లల మనసుకి నచ్చిన పనులే చేస్తారు. వారికి విషయం చెప్పి ఓపికగా ఒప్పించాలే తప్ప ఒప్పుకోలేదని వ్యతిరేకించడం, చంపడం నేరం. గంధర్వుడు చేసింది క్షమించరాని నేరం. *మనుచరిత్ర* నాటి కాలానికే మన కుటుంబ వ్యవస్థ ఎంతగా దిగజారిపోయిందో ఈ పద్యం ద్వారా అర్థం అవుతోంది. కాలాలు మారుతున్నా మనుషుల స్వభావాలు, ప్రవర్తన, వ్యక్తిత్వం మారడం లేదు సరికదా వ్యతిరేక దశలో పోతున్నాయి. అవి మారనంత కాలం వ్యవస్థ మారదు.

తే. అనుచుఁ బగచాటి పోయి నాఁడర్ధ రాత్ర
సమయమున శస్త్రనిహతి మజ్జనకుఁ జంపె
నట్ల యగుఁగాక పుడమిఁ గామాంధ చిత్తుఁ
డెవ్వరి వధింపఁ డెటునేయఁ డేమి గాఁడు. (*మను. 6: 50*)

మనసులో కోరిక రగులుతున్నప్పుడు మనిషి ఎంతకైనా తెగిస్తాడని ఈ పద్యం ద్వారా మరొకసారి పెద్దన గుర్తుచేస్తున్నాడు. కళావతిని తనకి ఇవ్వలేదని ఆమె తండ్రిని గంధర్వుడు పీక కోసి అమానుషంగా చంపేశాడు. ధైర్యం ఉంటే ఒప్పించాలి కానీ, ఒక ప్రాణం తీసే హక్కు ఎవరికీ లేదు. మనిషికి ఇదే తెగింపు మంచి పనులు చేయడంలో ఉంటే సమాజం అభివృద్ధిపథంలో దూసుకుపోతుంది.

క. వందురి వగలన్ దేహము
పొందెడలఁగఁ జూచు నన్నుఁ బొడగని దివిఁ దా
నెందుల కేఁగుచునో గిరి
నందన దిగివచ్చి కరుణ నాకిట్లనియెన్. (*మను. 6: 55*)

కళావతిని చిన్నప్పుడే తల్లి కని పారేసింది. ఇప్పుడు గంధర్వుడి చేతిలో అన్నీ తానై పెంచిన తండ్రి మరణించాడు. ఇంక తన బతుకు వ్యర్థమనుకుని ఆత్మహత్య చేసుకోవడానికి కళావతి సిద్ధపడుతుంది. ఆకాశవీథిలో వెళ్తున్న పార్వతీదేవి ఆమెని ఆపి ఆత్మహత్యకి పాల్పడవద్దని హితవు పలుకుతుంది.

"అతి సౌందర్యనిశాంత..." (*మను. 6: 56*) అంటూ పార్వతీదేవి పలికిన మాటలను పెద్దన పద్యంగా మలిచాడు. గుణవతి, సౌందర్యవతి అయిన కళావతితో మరణించడం తగదని స్వరోచి మహారాజు నిన్ను వివాహం చేసుకుంటాడని పార్వతీదేవి పలుకుతుంది.

చిన్న కష్టం రాగానే ఈ తరానికి రెండే మార్గాలు కనిపిస్తున్నాయి. ఒకటి చంపడం లేదా చావడం. రెండూ తప్పే. జీవితంలో ఏదైనా సరే బతికి సాధించుకోవాలి. మనం ప్రశాంతంగా బతుకుతూ నలుగురినీ బతకనివ్వాలి. దీన్నే ఆంగ్లంలో 'To live and let live' అన్నారు. హత్య, ఆత్మహత్య రెండూ ఎటువంటి సమస్యకైనా పరిష్కారం కావు. జీవితంలో పోరాడడానికి కావలసిన ధైర్యాన్ని భారతీయ సంస్కృతి, సాహిత్యం ఎప్పుడూ మనకి అందిస్తూనే ఉన్నాయి. ప్రేరణ ఎప్పుడూ ఉంది. పోరాడడమే మన వంతు.

## 4.13. హంస, చక్రవాక పక్షుల సంభాషణ

స్వరోచి తన ముగ్గురు భార్యలతో ఒక సరస్సులో విహరిస్తూ ఉండగా, వారిని చూసి అక్కడే ఉన్న చక్రవాకపక్షి ఒక హంసతో పలికిన మాటలివి.

చ. పలువురయందు నొక్కనికి బ్రాఁతియు నొక్కని యందుఁ జూడ స
గ్గలమగు ప్రేమ పల్వురకుఁ గల్గుట యద్భుతమట్లు గాన ని
వ్వెలదులయందుఁ గూర్మి పస వీనికి నేమియు లేదు దీనియం
దలవడఁ గల్గ దీజలరుహాక్షులకున్ బ్రియ మెవ్విధంబునన్. (*మను. 6: 70*)

'ఒకడికి చాలామంది సుందరులయందు, ఒక స్త్రీకి చాలా మంది పురుషుల పట్ల ప్రేమ ఉండడం కల్ల' అని పలుకుతుంది. హంసకి, చక్రవాక పక్షికి ఈ విషయమై చిన్న వాగ్వాదం జరుగుతుంది.

నిజానికి ఈ వాగ్వాదం ప్రతి మనిషి లోపల జరిగేదే. ఆ మాటలు విన్న స్వరోచికి వైరాగ్యం కలుగుతుంది. ఒకనాటి కాలంలో బహుభార్యత్వం ఉంది. కానీ ఇప్పుడు అటువంటి వ్యవస్థ ఏమీ లేదు. అయితే, ఇది ప్రతి మనిషి తనకు తానుగా ఆలోచించుకోవాల్సిన విషయం. కేవలం ఒక్కరి పట్ల అంకిత భావం కలిగి ఉండడమా? లేక ఎక్కువమందిపై మనసు పడడమా? బాగా ఆలోచిస్తే ఒక్కరి పట్ల తదేకమైన ప్రేమను కలిగి ఉండడమే ఆదర్శంగా కనిపిస్తుంది. పెద్దన కూడా ప్రవరుడి పాత్ర

ద్వారా అదే విషయాన్ని బలపరిచాడు. స్వరోచిని వనదేవత లేడి రూపంలో కలిసినప్పుడు కూడా ఇటువంటి భావనేనే "అన్యసతుల యందు నాసక్తుడగువాని..." అనే పద్యంలో పెద్దన బలపరిచాడు. ఒకే భార్యకు అంకితమై ఉండడమే నిజమైన ప్రేమ అని పెద్దన కావ్యం మొత్తంలో చాలా చోట్ల చెప్పడం కనిపిస్తుంది. అది సమాజం పట్ల అతడికున్న బాధ్యతను, ప్రేమను తెలియజేస్తుంది. పెద్దన గొప్ప వ్యక్తిత్వం కలవాడు కాబట్టే, చాలా బాధ్యతగా *మనుచరిత్ర*ని రచించాడు.

## 4.14. హరిణాల సంభాషణ

మరొక సందర్భంలో స్వరోచి తన భార్యలతో విహరిస్తుండగా అతడికి వనంలో లేళ్ళు కనిపిస్తాయి. అవి ఇలా మాట్లాడుకుంటూ ఉంటాయి.

శా. హూంకారం బొనరించి వేతలఁ గుఁడో హో నేను స్వారోచినే
పంకేజాక్షుల తోడ నెల్లపుడు దర్పస్ఫూర్తిఁ గ్రీడింప ల
జ్జాంకూరం బడఁగించినారు తలపోయన్ నాకు రోఁతయ్యె మీ
రింకన్ బోయివరింపుఁ డొక్కరునిభోగేచ్ఛన్ నివారించితిన్. (*మను. 6: 79*)

మగ లేడిని ఆడ లేళ్ళు విసిగిస్తుండగా మగ లేడి, ' కలకాలం స్త్రీలతో రమించడానికి నేనేమైనా స్వరోచినా? మీరు లజ్జను త్యజించారు. మీ ప్రవర్తన చూస్తుంటే నాకు అసహ్యం కలుగుతోంది. కావాలంటే మీరు మరొక మృగాన్ని చూసుకోండి' అని పలికి ఆడలేళ్ళను అక్కడ నుంచి వెళ్ళిపోమంటుంది.

స్వరోచి మనస్సుపై ఈ దృశ్యం ఒక బలమైన ముద్రను వేస్తుంది. ఇంతకుముందు హంస, చక్రవాక పక్షుల సంభాషణ విన్నప్పుడు స్వరోచికి కలిగిన వైరాగ్యం ఈ సంఘటన తర్వాత ఇంకా బలపడుతుంది. చాలా మంది జీవితాల్లో ఇటువంటి సంఘటనలు ఎదురవుతూ ఉంటాయి. అవి ఎందుకు జరుగుతాయో, మనకి పరోక్షంగా ఎందుకు అటువంటి మాటలు గుచ్చుకుంటాయో అర్థం కాదు. ఏది ఏమైనా ఇటువంటి సంఘటనలు మనిషికి తన బాధ్యతలని గుర్తుచేస్తాయి. ఎప్పుడూ ఇహపరమైన విషయాల్లో మునిగిపోకూడదనే విషయాన్ని జ్ఞప్తికి తెస్తాయి. మన జీవితాన్ని మళ్ళీ సక్రమమైన మార్గంలో తిరిగి నడిపించుకోవడానికి ఇటువంటి సంఘటనలు ఉపయోగపడతాయి. అటువంటి సంఘటనలు ఎన్ని జరిగినా మనిషి మారకపోతే అతడిని ఇంకెవ్వరూ కాపాడలేరు. బాధ్యతలను విస్మరించకుండా ఉన్నవాడే ఉన్నతుడు కాగలడు.

## 4.15. స్వారోచిష మనువు పరిపాలన

స్వారోచిష మనువు ఏ విధంగా ప్రజలను పాలించాడో పెద్దన ఈ కింది విధంగా వర్ణించాడు.

సీ. వానలు సరవితో వర్షించె సస్యముల్ / వేళ్ళఁ గొల్చుగ విఱ్ఱవీఁగి పండె
నారోగ్యపుత్రపౌ త్రైశ్వర్య వంతులై / బ్రదికిరి నూఱేండ్లుఁ బంచజనులు
పూవుఁ బోఁడులు పతిదేవతలై రగ్ని / భయతస్కర వ్యాధి భయము లడఁగె
ఫలపయః కుసుమాది బహు పదార్థంబులు / రసగంధ సామగ్రి నెసక మెసఁగె

తే. నీత్యుపద్రవ మృత్యు రాహిత్య యుక్తి
ధరఁ బ్రజావృద్ధి తామరతంప మయ్యె
న్యాయపథమున స్వారోచిషాఖ్య మనువు
శ్రీలఁ బెంపొంది పాలించు కాలమునకు. (*మను. 6: 121*)

'స్వారోచిష మనువు పరిపాలనలో వర్షాలు విశేషంగా కురిసేవి. పంటలు బాగా పండేవి. ప్రజలు సంతానవంతులై సిరి సంపదలతో నూరేళ్ళు హాయిగా జీవించేవారు. అగ్ని వల్ల, దొంగల వల్ల భయం ఉండేది కాదు. వ్యాధులు లేవు. పళ్ళు, పుష్పాలు, పాలు పుష్కలంగా దొరికేవి. అకాల మరణాలు లేవు. బంధాలు, బంధుత్వాలు వృద్ధి చెందేవి'.

సాధారణంగా ప్రతి కావ్యంలో ఆరంభంలో, మధ్యలో, ముగింపులో శుభసూచకాలైన మాటలు కనిపిస్తాయి. ఇది భారతీయ సంప్రదాయంలో ఉండే గొప్పతనం. అదే కావ్యసంప్రదాయంగా మారింది కూడా. మన సంస్కృతి ఎప్పుడూ మంచినే కోరుకుంటుంది. మన సంస్కృతిలో చివరికి మంచే జయిస్తుంది. మంచితనమే చిరకాలం నిలిచిపోతుందని చెప్పడం దాని ఉద్దేశ్యం.

స్వారోచిష మనువు పాలనను చూసి నేటి నాయకులు చాలా నేర్చుకోవాలి. అంతమంది ప్రజల ఆనందానికి కారణమైన స్వారోచిష మనువు వ్యక్తిత్వాన్ని ఈనాటి నాయకులు ఆదర్శంగా తీసుకోవాలి. పంటలు బాగా పండాలంటే వానలు బాగా కురవాలి. వానలు బాగా కురవాలి అంటే ప్రకృతిలో సమతౌల్యం ఉండాలి. చెట్లు బాగా పెరగాలి. ఇవన్నీ ఒకదానిపై  ఒకటి ఆధారపడేవి. అన్నింటినీ మించి నాయకుల మనస్సు నిష్కల్మషంగా ఉండాలి. నాయకుడు ఎల్లప్పుడూ నలుగురి మంచి కోసం పాటుపడాలి. ఆదర్శవంతమైన పాలన చేయాలి. మరీ ముఖ్యంగా ప్రతి చెడుకీ

మూలమైన స్వార్థాన్ని విడనాడాలి. ప్రతి మనిషి తోటి జీవులని ప్రేమిస్తూ నిస్వార్థంగా, ధర్మబద్ధంగా జీవించాలి. వ్యక్తిత్వాన్ని వికసింపజేసుకోవాలి. సువిశాల విశ్వాన్ని అక్కున చేర్చుకోవాలి.

*మనుచరిత్ర*ని పెద్దన వ్యక్తిత్వ వికాసం కోసం రాసి ఉండకపోవచ్చు. కానీ వ్యక్తిత్వ వికాసం ఆ కావ్యంలో ఒక అంతర్లీనమైన భాగంగా కనిపిస్తుంది. పెద్దన వ్యక్తిత్వం చాలా గొప్పది. కథని మూలం నుంచి తీసుకున్నా, స్వకపోల కల్పనలు ఎన్నైనా చేసి పూర్తి స్వతంత్ర కావ్యంగా *మనుచరిత్ర*ను రచించవచ్చు. కానీ పెద్దన తన కావ్యం సమాజానికి ఎటువంటి చెడు సంకేతాలు ఇవ్వకుండా జాగ్రత్త పడ్డాడు. తన పెద్దరికాన్ని నిలబెట్టుకున్నాడు. పైపైన చదివే వారికి ఈ కావ్యం సరిగ్గా అర్థం కాదు. ఎంత బాగా ఒక రచన చేసినా అది కొందరికి నచ్చదు. అయితే ఎక్కువమందికి ఆమోదయోగ్యంగా రచన ఉండడం ముఖ్యం.

*మనుచరిత్ర* ఒక కాలంలో వెలువడిన రచనే అయినా, కాలం గడుస్తున్న కొద్దీ దాని ప్రయోజనాలు మరింతగా బయట పడుతూ ఉన్నాయి. ఒకే కోణంలో *మనుచరిత్ర*ను చూస్తే అది కేవలం ప్రబంధ లక్షణాలు అన్నీ కలిగిన ఒక సంపూర్ణమైన ప్రబంధంగా కనిపించవచ్చు. ఒక చిన్న కథకు అద్భుతమైన వర్ణనలు జోడించి ఆవిష్కరించిన కావ్యంగా మాత్రమే *మనుచరిత్ర* భాసించవచ్చు. అయితే, మనుచరిత్రను ఒక భిన్నమైన దృష్టితో చూసినప్పుడు నేడు వ్యక్తిత్వ వికాసం పేరిట వేలకి వేలు తీసుకుంటూ బోధిస్తున్న పాఠాలు *మనుచరిత్ర*లో ఏనాడో చెప్పినట్టు స్పష్టమవుతుంది. అదే వ్యక్తిత్వ వికాసాన్ని మరింత భిన్నమైన కోణంలో *మనుచరిత్ర* ఆనాడే ఆవిష్కరించింది. అనితరసాధ్యమైన పాత్ర చిత్రణతో కళ్ళకి కట్టినట్టు పెద్దన *మనుచరిత్ర*ను వ్యక్తిత్వ వికాసాన్ని అంతర్లీనంగా బోధించే కావ్యంగా తీర్చిదిద్దాడు.

*మనుచరిత్ర*లో ఎన్నో వర్ణనలు ఉన్నాయి. వాటిని కేవలం వర్ణనలుగా భావించడం సమంజసం కాదు. పాత్రల మనోభావాలను, ప్రవర్తనను చిత్రించే క్రమంలో, పాఠకులకు వాటిని వ్యక్తీకరించే క్రమంలో ప్రతీకాత్మకంగా పెద్దన ఎక్కువ శాతం వర్ణనలను చేశాడు. *మనుచరిత్ర*ను వర్ణనాత్మక కావ్యంగా తీర్చిదిద్దడం పెద్దన ఉద్దేశ్యం కాదు. సందేశాత్మక కావ్యంగా చిత్రీకరించడం ఆయన ఉద్దేశ్యం, లక్ష్యం. ఆ లక్ష్యం దిశగా కావ్యాన్ని నిర్మించడానికి పెద్దన పడ్డ తపన ప్రతి పద్యంలోనూ కనిపిస్తుంది. వ్యక్తిత్వ వికాసం *మనుచరిత్ర*లో అంతర్లీనంగా ధ్వనిస్తుంది.

# ముగింపు

మనిషి జీవితం ఇష్టానికి, ధర్మానికి మధ్య జరిగే సంఘర్షణ. ప్రతి వ్యక్తి జీవితంలో జరిగే ప్రతి సంఘటనలో మనిషికి ఇటువంటి పరిస్థితి ఎదురవుతుంది. ఆయా పరిస్థితులు ఎదురయినప్పుడు మనిషి ఎటువైపు మొగ్గు చూపుతాడు అనేది అతడి భవిష్యత్తు ఎలా ఉండబోతోందో నిర్ణయిస్తుంది. ఎప్పుడు ధర్మబద్ధమైన నిర్ణయాన్ని మనిషి తీసుకుంటాడో అప్పుడు అతడి జీవితం గాడిలో పడుతుంది. మనస్సు ఇష్టం వైపు మనిషిని మళ్ళిస్తుంటే బుద్ధి, అనుభవాలు ధర్మం వైపు నడిపిస్తాయి. అయితే అంతిమ నిర్ణయం ఆ వ్యక్తిదే. తాత్త్విక దృష్టితో ఆలోచిస్తే ఆ మనస్సు ఎవరు? బుద్ధి ఎవరు? అనుభవాలు ఎవరివి? నిర్ణయం తీసుకునేది ఎవరు? అన్నీ మనమే. అంటే ఇదంతా మనలో జరిగే సంఘర్షణ. ఇష్టానికి, ధర్మానికి మధ్య జరిగే సంఘర్షణ. ప్రతి మనిషి ఈ విషయాన్ని జీవితంలో ఏదో ఒక సమయంలో తెలుసుకుంటాడు.

అల్లసాని పెద్దన రచించిన *మనుచరిత్ర* మనిషిలో జరిగే ఈ సంఘర్షణకి అద్దం పడుతుంది. ఇష్టానికి ప్రాధాన్యతని ఇచ్చిన వారి జీవితాలు ఎలా ఉంటాయో, ధర్మాన్ని గౌరవించి, నమ్ముకున్న వారి జీవితాలు ఎలా ఉంటాయో *మనుచరిత్ర*లో అల్లసాని పెద్దన వివిధ పాత్రల ద్వారా కళ్ళకి కటినట్టు చూపించారు. ఒకరకంగా చెప్పాలంటే *మనుచరిత్ర*లో ప్రతి పాత్ర మనిషిలో జరిగే ఒక్కొక్క సంఘర్షణకి ప్రతిరూపం. రకరకాల వ్యక్తిత్వాలు కలిగిన పాత్రలు ఈ కావ్యంలో సంఘర్షించుకుంటాయి. అటువంటి సంఘర్షణల సమాహారమే *మనుచరిత్ర*. ఆ సంఘర్షణల నుంచే వ్యక్తిత్వ వికాసం జనిస్తుంది.

మనుచరిత్రలో ఉన్న వ్యక్తిత్వ వికాస అంశాలను స్పృశించి, ఆవిష్కరించే క్రమంలో 'మనుచరిత్ర : వ్యక్తిత్వ వికాసం' అనే ఈ పరిశోధన వ్యాసాన్ని నాలుగు అధ్యాయాలుగా విభజించడం జరిగింది.

1. మనుచరిత్ర : ప్రత్యేకత
2. వ్యక్తిత్వ వికాసం : సైద్ధాంతిక నేపథ్యం
3. ప్రాచీన తెలుగు సాహిత్యం: వ్యక్తిత్వ వికాసం

4. మనుచరిత్ర : వ్యక్తిత్వ వికాసం

మొదటి అధ్యాయంలో ఈ పరిశోధనకి మూలమైన *మనుచరిత్ర* కావ్య పరిచయం, కవి పరిచయం, *మనుచరిత్ర* కథాసంగ్రహం, పెద్దన *మనుచరిత్ర*కి మూలమైన మారన *మార్కండేయ పురాణా*నికీ, పెద్దన *మనుచరిత్ర*కీ ఉన్న వ్యత్యాసం, వ్యక్తిత్వ వికాస కోణంలో చూసినప్పుడు మిగిలిన కావ్యాల కంటే *మనుచరిత్ర*లో ఉన్న విశేషాంశాల గురించి, *మనుచరిత్ర*లోని పాత్రాల్లో ఉన్న వ్యక్తిత్వ వికాస సంబంధిత విషయాల గురించి చర్చించడం జరిగింది.

రెండవ అధ్యాయంలో వ్యక్తిత్వ వికాసానికి ఉన్న సైద్ధాంతిక నేపథ్యం గురించి, వ్యక్తిత్వ వికాసంపై పాశ్చాత్యులు, భారతీయ తత్త్వవేత్తల అభిప్రాయాల గురించి, సంస్కృత సాహిత్యంలో వ్యక్తిత్వ వికాసాన్ని బోధిస్తున్న కొన్ని శ్లోకాల గురించి చర్చించడం జరిగింది.

మూడవ అధ్యాయంలో ప్రాచీన తెలుగు సాహిత్యంలో కొన్ని పద్యాలను ఉదాహరించి, వాటిలో వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే అంశాల గురించి చర్చించడం జరిగింది.

నాలుగవ అధ్యాయం ఈ పరిశోధనకి హృదయం. అల్లసాని పెద్దన రచించిన *మనుచరిత్ర*లో ఉన్న సాహిత్యం ఆధారంగా వ్యక్తిత్వ వికాసానికి ఆ కావ్యం ఏ విధంగా దోహదపడుతుందో ఋజువు చేయడం జరిగింది. ఈ అధ్యాయం అల్లసాని పెద్దన *మనుచరిత్ర*ని ఆధునిక జీవితానికి అన్వయించి, వ్యక్తిత్వం వికసించే దిశగా ఈ కావ్యం ఉపయోగపడుతుందని ఋజువు చేస్తుంది.

సమాజం ఆధునికీకరింపబడుతున్న కొద్దీ, మానవ సంబంధాలు దిగజారిపోతున్నాయి. మనుషులు రాను రాను మరింత స్వార్థపరులైపోతున్నారు. 'వసుధైక కుటుంబ' భావన ఏ ఒక్కరిలోనూ కనిపించడం లేదు. ఉన్నతమైన వ్యక్తిత్వం అంటే కేవలం విజయాలు సాధించడమే అనుకుంటున్నారు. నలుగురి మంచి కోరుకోవడమనే ధ్యాసే మనుషులకు లేకుండా పోయింది.

ప్రాచీన తెలుగు సాహిత్యం, ముఖ్యంగా ప్రబంధాలు ఈ తరుణంలో చాలా ఉపయోగపడతాయి. ప్రబంధాలు అన్నీ శృంగారపూరితాలు అని కొట్టిపారేస్తే వాటిలో నిక్షిప్తమై ఉన్న విలువలు భవిష్యత్తరాలకి అందే అవకాశం ఉండదు. ఆధునిక సమాజం ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు ప్రాచీన తెలుగు సాహిత్యంలో పరిష్కారాలు ఉన్నాయి. చిన్న సమస్య రాగానే

కుంగిపోతున్న యువతరానికి ముఖ్యంగా *మనుచరిత్ర* వంటి కావ్యాలు గొప్ప మనోధైర్యాన్ని అందిస్తాయి. వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయి.

*మనుచరిత్ర* వంటి కావ్యాలను వ్యక్తిత్వ వికాస కోణంలో, సామాజిక దృష్టితో పరిశీలించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా ఈ పరిశోధన వ్యాసంలో కొంత ప్రయత్నం జరిగింది. ఎంత పరిశోధించినా *మనుచరిత్ర* వంటి కావ్యాల్లో ఏవో కొత్త విషయాలు బయటపడుతూనే ఉంటాయి. కాలం మారుతున్న కొద్దీ అన్వయించుకునే విధానం మారాలే తప్ప, మన ప్రాచీన ప్రబంధాలు ప్రతి తరానికి ఏదో ఒక సందేశాన్ని ఇస్తూనే ఉంటాయి. అందుకే, ప్రాచీన తెలుగు సాహిత్యంపై, ముఖ్యంగా ప్రబంధాలపై ఇటువంటి కోణంలో మరిన్ని పరిశోధనలు జరగాలి. సిద్ధాంతాలకు చిక్కని, సాంకేతికతకు అందని, పాశ్చాత్యులకు కొరుకుడుపడని ఎన్నో లోతైన విషయాలను ప్రాచీన తెలుగు సాహిత్యం స్పృశించింది. అసాధ్యం అనుకున్న సమస్యలకి పరిష్కారాలను సూచించింది. ప్రాచీన సాహిత్యం ఆ కాలానిదే అయినా ఏ కాలానికైనా దిశానిర్దేశం చేయగలిగే సత్తా ఆ సాహిత్యానికి ఉంది. మనుషులు స్వార్థానికి బానిసలై వ్యక్తిత్వాలను కోల్పోతున్న ఈ తరుణంలో ప్రబంధాలపై ఇటువంటి పరిశోధనలు మరిన్ని జరగాలి. అప్పుడే వాటిలో ఉన్న విలువలు ఆవిష్కృతమవుతాయి. ఆ విలువలే తరతరాలకు తరగని ఆస్తి.

భారతీయ జీవన విధానం, భారతీయ తత్త్వశాస్త్రం, భారతీయ సాహిత్యం వ్యక్తిత్వ వికాసానికి ఎల్లప్పుడూ దోహదపడతాయి. మనం చేయవలసినదల్లా ఆరిపోతున్న ఆ జ్ఞానజ్యోతిని సంరక్షించి, ఆ వెలుగుని జాతిని జాగృతం చేసేందుకు వినియోగించడమే.

# ఉపయుక్త గ్రంథ సూచి

1. ఆదిశంకరాచార్యులు. 1993. ***వేదాంత డిండిమస్తోత్రం*** (శంకర గ్రంథరత్నావళి, ఒకటవ సంపుటం). తెనాలి: సాధన గ్రంథ మండలి.

2. కాళిదాసు. 1976. ***శ్రీ కాళిదాసకృత కుమారసంభవం***. చెన్నై: వావిళ్ళ రామస్వామిశాస్త్రులు & సన్స్.

3. గోపీచంద్, త్రిపురనేని. 2012. ***తత్త్వవేత్తలు*** (గోపీచంద్ రచనాసర్వస్వం, పదవ సంపుటం). విజయవాడ: అలకనంద ప్రచురణలు.

4. ***గైర్వాణీ విలాసః***. 2007. హైదరాబాదు: బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్.

5. గంగాప్రసాద్, మల్లెగోడ. 2011. ***పోతన గజేంద్రమోక్షం – వ్యక్తిత్వ వికాసం***. (హైదరాబాదు విశ్వవిద్యాలయానికి ఎం. ఫిల్. పట్టం కోసం సమర్పించిన పరిశోధనవ్యాసం).

6. తమ్మయ్య, సారంగు. 1914. ***వైజయంతీవిలాసము***. చెన్నై: వావిళ్ళ రామస్వామిశాస్త్రులు & సన్స్.

7. తిక్కన. 2000. ***శ్రీమదాంధ్ర మహాభారతము***. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

8. దామోదరనాయుడు, గార్లపాటి. 2012. ***మనుచరిత్ర – మనచరిత్ర***. హైదరాబాదు: తెలుగు అకాడమి.

9. దుర్గయ్య, పల్లా. 1980. ***పెద్దన కవితావైభవం***. హైదరాబాదు: యువభారతి ప్రచురణలు.

10. నన్నయభట్టారకుడు. 2000. ***శ్రీమదాంధ్ర మహాభారతము***. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

11. నళినీమోహన్ రావు, మహీధర. 1980. **భామినీవిలాసం** (అనువాదం). హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

12. నాగయ్య, జి. 2009. ***తెలుగు సాహిత్య సమీక్ష*** (2వ సంపుటం). తిరుపతి: నవ్యపరిశోధక ప్రచురణలు.

13. నిత్యానందరావు, వెలుదండ. 2013. ***విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన***. హైదరాబాదు: శ్రీమతి వి. గీతారాణీ పబ్లికేషన్స్.

14. పెద్దన, అల్లసాని. 2001. ***మనుచరిత్రము.*** చెన్నై: వావిళ్ళ రామస్వామిశాస్త్రులు & సన్స్.

15. పోతన, బమ్మెర. 2000. **శ్రీమదాంధ్రమహాభాగవతము** ( 1 & 2 సంపుటాలు). హైదరాబాదు: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

16. ప్రసాదరావు, వై. ఎఫ్. డబ్ల్యు(సంపాదకులు). 2012. ***విద్యామనోవిజ్ఞానశాస్త్ర ఆధారాలు***. హైదరాబాదు: తెలుగు అకాడమి.

17. ***మనోవిజ్ఞాన పరిచయము***. 1977. హైదరాబాదు: తెలుగు అకాడమి.

18. యాదగిరి, కె (ప్రధాన సంపాదకులు). 2014. ***ప్రాచీన సాహిత్య మంజూషిక***. హైదరాబాదు: తెలుగు అకాడమి.

19. రాజన్న శాస్త్రి, కె. 1988. ***ధ్వని – మనుచరిత్ర***. హైదరాబాదు: రచయిత స్వీయ ప్రచురణ.

20. లక్ష్మణకవి, ఏనుగు. 2013. ***భర్తృహరి సుభాషిత రత్నావళి***. విజయవాడ: జె. పి. పబ్లికేషన్స్.

21. వెంకటనాగశ్రీరామ శర్మ, గుళ్ళపల్లి. 2010. ***చమత్కార చంద్రిక*** (సంకలనం). తణుకు: రచయిత స్వీయ ప్రచురణ.

22. శ్రీకృష్ణదేవరాయలు. 2006. ***ఆముక్తమాల్యద***. హైదరాబాదు: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

23. శ్రీనాథుడు. 1953. ***కాశీఖండం***. చెన్నై: వావిళ్ళ రామస్వామిశాస్త్రులు & సన్స్.

24. శ్రీనివాసాచార్యులు, రొంపిచర్ల. 2000. ***ముక్తాకలాపం*** (సంకలనం). కొవ్వూరు: రచయిత స్వీయ ప్రచురణ.

25. సత్యనారాయణ, విశ్వనాథ. 1978. ***కావ్య పరిమళము***. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

26. సుజాతారెడ్డి, ముదిగంటి. 1981. ***మను, వసు చరిత్రల తులనాత్మక పరిశీలనము***. హైదరాబాదు: రచయిత్రి స్వీయ ప్రచురణ.

27. సుప్రసన్నాచార్య, కోవెల. 2012. ***ప్రబంధ మణిమేఖల***. హైదరాబాదు: తెలుగు అకాడమి.

28. సుబ్రహ్మణ్యం, జి. వి. (సంపాదకులు). 1984. ***శ్రీ మారన మార్కండేయ పురాణము***. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఆకాడమి.